# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటి - 1

గేయ కావ్యాలు : భాగం - 2



పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాదు

# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటి-1

## గేయ కావ్యాలు (భాగం - 2)

బొమ్మ, భీమన్న పాటలతోట, పాటలలో అంబేడ్కరు, అకాండ తాండవం

ప్రధాన సంపాదకులు

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

సంపాదకులు

డా॥ కె. సంజీవరావు (శిఖామణి)

సహాయ సంపాదకులు

శ్రీమతి బి. విజయేందిర

శ్రీ గనుమల జ్ఞానేశ్వర్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్

Boyi Bhimanna Samagra Sahityam
Volume - 1 (Geyakaavyaalu - Part -2)
*Padmabhushan Dr. Boyi Bhimanna Sahitya Peetham*
Potti Sreeramulu Telugu University
Hyderabad - 500 004

బోయి భీమన్న సమగ్ర సాహిత్యం
సంపుటి-1 (గేయ కావ్యాలు భాగం-2)

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ : 1975
మలి ముద్రణ : సెప్టెంబరు, 2009
ప్రతులు : 1000

ISBN : 81-860-73-195-8

మూల్యం : రూ॥ 135/-

ముఖచిత్ర రచన: ఆర్. మురళి

ప్రతులకు:
డైరెక్టర్, ప్రచురణల విభాగం
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి,
హైదరాబాద్ - 500 004

*ముద్రణ:*
పరిత ఇంప్రెషన్స్
అజామాబాద్, హైదరాబాద్ - 500 044.

క్రింద మళ్ళీ బలవంతుడే రాజు ! సైన్యాలు, యుద్ధాలు, తిరుగుబాట్లు, కుట్రలు, విప్లవాలు ! ఎందులో అయినా, గెల్చేది బలవంతుడే. గెలిచిన వాడి ముఠా వాళ్లకే ప్రత్యేక సౌకర్యాలూ, సౌఖ్యాలూ ! అది మానవ ప్రవృత్తి.

అందుకే – మానవ ప్రవృత్తిని మార్చాలంటే, అతడిలోని రసాస్వాదన శక్తిని పెంచాలి. సౌందర్యోపాసకుణ్ని చెయ్యాలి. లలిత కళలే అందుకు మంచి సాధనాలు. కవిత్వం కాంతా సమ్మితంగా వుండాలని మన పెద్ద లందుకే అన్నారు.

రాజులు, రాణులు, చతుర్విధ నాయకులు, నవరసాలు, అష్టాదశ వర్ణనలు వగైరాలన్నీ ఆయా దేశ కాల ప్రజల జీవిత విధానాల కనుగుణంగా ఎంచుకోబడినట్టివి. ఈనాడు మనం వాటిలో పనికి వచ్చే వాటిని అట్టే పెట్టుకోవచ్చు. అక్కరలేని వాటిని వదిలెయ్యవచ్చు. కొత్త వాటిని సేకరించవచ్చు. సృష్టించవచ్చు. కాని – మానవుడు కోరేది ఆనాడూ, ఈనాడూ, ఏనాడూ కూడ రాగమూ, భోగమూ అనే సత్యాన్ని మాత్రం విస్మరించగూడదు.

ఈ రోగ భోగాలకు ప్రాతిపదిక తిండి కాదా అంటే – అవును ! అది ప్రతి జీవ జంతువుకూ ప్రాతిపదికే ! మానవుడి వద్దకు వచ్చేటప్పటికి – ఈ రాగభోగాల కోసం – ముఖ్యంగా రాగం కోసం – తిండిని కూడ, భోగాన్ని కూడ త్యాగం చేసెయ్య గలడు ! ఈ పరమ సత్యం ఆనాటి రామాయణ భారత చరిత్రలలోనే కాదు – ఈనాడు కులాంతర ప్రేమాను రాగాలు నిరోధించబడి నప్పుడెల్లా జరుగుతున్న యుగళ ఆత్మహత్యల చరిత్రలలో కూడ చెంప చరిచి సాక్షాత్కరిస్తున్నది !

## గుత్త పెత్తనాలు

కుల మేమిటో, మత మేమిటో, ఆర్థిక స్థాయి ఏమిటో, పెళ్లయిందో లేదో, తన ఆత్మార్పణ అంగీకారమో కాదో – ఇన్ని ఆలోచనలు, వితర్కాలు ప్రేమించే హృదయంలో పుట్టవు. ప్రేమించిన తర్వాత వీటితో అవసరం లేదు. సమాజం కల్పిస్తున్న సమస్యలివి.

కుల, మత, వర్గ, జాతి తేడాలు లేని సమానత్వాన్ని సాధించడం, సర్వ మానవులకూ ఆహారాది ప్రాథమిక అవసరాలను అందించడం – ఈ రెండు బాధ్యతలూ రాజకీయ రంగానికి చెందినట్టివి. దుర్మార్గాన్నీ, స్వార్థాన్నీ అదుపులో వుంచే బాధ్యత కూడా రాజకీయ రంగానిదే. ధన ధాన్య వస్తు వాహనాలపై బలవంతులు గుత్తాధికారం సాధించుకొన్నట్టే – మత, నైతిక, దైవ, దేవాలయాలపై తెలివిమంతులు గుత్తాధికారం

సాధించుకొన్నారు. మొదటి తరహా వారి భౌతిక దోపిడీకీ, రెండవ తరహా వారి ఆధ్యాత్మిక దోపిడీకీ గురి అవుతున్న వాళ్లంతా అమాయకులైన ప్రజలే. ప్రజల భౌతిక, ఆత్మిక వికాసానికి, పురోభివృద్ధికి ధన స్వాము లెంతటి శత్రువులో మత స్వాములు కూడ అంతటి శత్రువులే. వీటన్నిటినీ సరిదిద్దు కోవలసిన బాధ్యత కూడ రాజకీయ రంగానిదే.

మానవ జీవితాన్ని నడిపించే శక్తులు రెండు. ఒకటి సంఘపరమైన రాజకీయం. రెండోది హృదయగతమైన రాగం. భౌతికమైన కష్టసుఖాలకూ, ఐశ్వర్య దారిద్ర్యాలకూ రాజకీయం హేతువైతే – ఆనందానికి ఏకైక నిలయం రాగం. రాగ మధురం శృంగారం కనుక, శృంగార రస స్పృష్టం కాని కవిత ఆనందాన్ని ఇవ్వజాలదు.

## సుకృతాలు - వికృతాలు

మనం గోళ్ళను, వెంట్రుకలను కత్తిరించి పారేసినా శరీరానికి బాధ కలగదు. అవి మృతపదార్థాలు. అలానే – శరీర మంతా మృతపదార్థ మైనప్పుడు, దానిని త్రోసిపారేస్తుంది ఆత్మ. కత్తిరించి పారేసిన గోరు ఏమై పోయిందో శరీరం పట్టించుకోనట్టే, మృతి చెందిన శరీరం ఏమైపోయిందో ఆత్మ పట్టించుకోదు.

అయితే – ఈ ఆత్మ అనేది ఏమిటి ? జననానికి ముందూ, మరణానికి వెనకా దాని స్థితి ఏమిటి ? ఎవరికీ తెలియదు. అందరివీ ఊహలు !

వెలగడానికి ముందూ, ఆరిపోయిన తర్వాతా వెలుగు స్థితి ఏమిటి ? అదే ఆత్మస్థితి ! సముద్రంలో వర్షబిందువు లాగే ఆనందంలో లయమైపోతుంది. ఈ సత్యాన్ని తెలియచెప్ప డానికీ, తెలుసుకోడానికీ మతాలూ, దేవుళ్లూ, గురువులూ, పాదపూజలూ అక్కరలేదు. అవ్యాజమైన అనురాగం చాలు. ఇది నా సిద్ధాంతం. దీనినే రసాద్వైతం అన్నాను.

వివాహాపేక్ష గల ప్రేమలూ, లాభదృష్టి గల స్నేహాలూ ఒకే తరహాకు చెందినట్టివి. వాటిలో రక్షణ, గౌరవం, సుఖజీవితం, అభివృద్ధి మొదలైన స్వార్థాలు అంతర్గతమై వుంటై. అట్టి స్వార్థాలతో నిమిత్తం లేకుండా – కేవల రాగబద్ధాలైన వివాహాలు అదృష్టవంతులవి. అయితే – ఎంత రాగబద్ధ వివాహాలైనా, ఆ తర్వాత కాల గమనంలో, అసూయా ద్వేష దుఃఖాదులకు బలైపోయే ప్రమాదం వుంది. వైవాహిక, శారీరక, ప్రయోజనాత్మక సంబంధా లేవీ లేని ప్రేమకు అట్టి ప్రమాదం లేదు. అది అక్షరం. స్థిరం.

నిన్ను ఎవరు ప్రేమించినా, ప్రేమించకపోయినా – నీవు మాత్రం ప్రేమించ గలిగితే, అదే ఆనంద బ్రహ్మ.

మనిషిని ప్రేమించలేని వాళ్లు, ప్రేమించడానికి భయపడే వాళ్లు, ప్రేమించడం నిషేధించబడిన వాళ్లు - ప్రేమించే ప్రవృత్తి చావక - దేవుణ్ని ప్రేమిస్తారు. మధుర భక్తి పేరుతో కృష్ణుణ్ని ప్రేమిస్తారు. రాధాకృష్ణ ప్రేమకు ఈనాడింత ప్రచారం రావడానికి కారణం మానవ ప్రేమ వైఫల్యమే ! ఈనాడు జీవితం నిండా రాజకీయాలే. వ్యాపారాలే. బ్రతుకు తెరువు పద్ధతుల అన్వేషణలే. అవ్యాజ ప్రేమకు తావు తక్కువై పోతున్నది.

ఎన్ని ఇబ్బందులకైనా నిలబడి, స్థిరమైన హృదయంతో ప్రేమించగల ఆత్మలే ప్రకృతి లోని సుకృతాలు-పువ్వులు, పరిమళాలు, పండ్లు తేనెలు, రుచులు, రంగులు! తద్విరుద్ధాలే వికృతాలు - ముళ్లు, మురికి, చీడలు, పీడలు, దుర్వాసనలు, దుఃఖాలు! ఈ వైరగుణాను భూతుల సంపుటీకృత సముద్భూత వీచీ కల్లోలినే ఈ మంచి చెడ్డల ప్రకృతి !

## నా సమస్తం సరస్వతే

ఇలా నేనెంతో వ్రాశాను, వ్రాస్తున్నాను, వ్రాస్తాను. నా యావజ్జీవితమూ, జీవిత కృషీ, సమస్తమూ ఆ శివశక్తే.

శివ, శక్తి అనే పదాలు పాతవే అయినా - వాటి అర్థం నాకు అరుణోదయంలా, నిత్య నూతనంగా కనిపిస్తుంది. అది ఏ మతానికీ, వర్గానికీ, దేశానికీ చెందింది కాదు. అదొక నిత్య నిరంతర సత్యధార.

శివు డంటే నా అనుభవంలో శుద్ధ శూన్యం. శూన్యం నుంచి ఏదీ పుట్టదనేది నిజం కాదు. శక్తి పుడుతుంది. శూన్యశక్తే శివశక్తి.

నవ విద్రుమాభ, శరదిందు శుభ్ర, తమాల నీల అయి - సృష్టిస్థితి లయలను పాలిస్తున్న ఆ శక్తే నా సరస్వతి. కష్టసుఖాలు జీవిత నాణ్యానికి బొమ్మ బొరుసులు. వెలుగు నీడలు. అభేద్యాలు. అందులో ఏది ఏ క్షణంలో నన్ను వరించి వచ్చినా - దాన్ని సరస్వతీ వరప్రసాదం గానే స్వీకరిస్తూ వుంటాను నేను.

ఇదంతా ఏదో వేదాంతం అనుకోవద్దు. పచ్చి జీవిత సత్యం.

ఏ జీవితాని కైనా వేదాంతం వ్రేళ్లే. అయినా - ఆనంద రసప్రదాయకమైన పుష్పఫలాలకే ప్రాధాన్యం ఇవ్వాలి కవి. వ్రేళ్లను ఉపేక్షించకూడదు కూడ. అందుకే - కవి ఋషి.

నా పట్ల సరస్వతి ఎక్కువ దయాళువు, ఎక్కువ ప్రేమమయి. నా కష్టసుఖాలు, కలిమి లేములు, రాగ ద్వేషాలు, గౌరవ తిరస్కారాలు అన్నీ ఆమే, ఆమెవే!

మొన్న ఈ మధ్య, బెంగుళూరులో అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు జరిగినప్పుడు – కన్నడ సాహిత్య పరిషత్తు వారు నాకొక సన్మానం చేసి, అనేక కానుకలతో పాటు చందన సరస్వతిని బహూకరించారు.

ఆ బొమ్మను చూస్తూ, ఆనందంతో–

ఓ వాసంతిక నంచు, నీ విరహ భా
వోత్తప్త నంచున్, భవ
జీవో జీవన నంచు, నీ కమృత మి
చ్చే చాంద్రి నంచున్, త్వదో
జో విశ్వేశ్వరి నంచు, వచ్చి – ఎ వెవో
శోభల్ వరించున్ ననున్ !
నావౌ ఈ సిరు లెల్ల నీవె కదటే
నా తల్లి ! వాగీశ్వరీ !

అని పాడుకొంటూ, ఆ వాగీశ్వరిలో సమస్త సృష్టికీ మూల మాత అయిన యోగ దేవినే దర్శించి–

నావౌ ఈ సిరులెల్ల నీవె కదటే
నా తల్లి యోగీశ్వరీ !

అంటూ తన్మయమ్మై పోయాను.

నిజానికి – ఈ సమస్తమూ, మానవ మేధా శక్తికి తెలియగలిగిన సమస్త విజ్ఞానమూ కూడ, ఈ కుండలినీ జీవ దేవి విశ్వరూప విన్యాసమే కదా !

నిను తెచ్చుకోలేక
నీ బొమ్మ తెచ్చుకొని
ఆరాధించే మనో మోహన రాగ మాధుర్యం ఇదే.

ఈ ప్రకృతి శక్తుల, సౌందర్యాల ఆరాధనకూ, మత భక్తి విశ్వాసాలకూ సంబంధం లేదు. ప్రకృతి శక్తుల ఆరాధన శారీరక మానసిక ప్రాభవాన్ని వికసింపజేస్తుంది. మత భక్తి విశ్వాసాలు అట్టిదాన్ని మొద్దుబార్చి, ఆర్పివేస్తాయి.

ప్రకృతి, మతం – ఇవి పరస్పర విరుద్ధాలు. ''ప్రకృతిని ఆరాధించు, మతాన్ని నిర్మూలించు'' అని నేను ప్రబోధిస్తున్న దందుకే. ఆరాధించడం అంటే అధీనం చేసుకొని అనుభవించడం.

# సారస్వత మూర్తి

ఈ కావ్యాన్ని అంకితం తీసుకొంటున్న శ్రీ బాపురెడ్డి సాక్షాత్తు సరస్వతీ మండల వాసి. మొత్తం భారతదేశంలో సరస్వతీ క్షేత్రాలు రెండే వున్నై. ఒకటి కాశ్మీరు దేశంలో, రెండోది మన తెలుగుదేశంలో.

తెలంగాణం వైపున గోదావరి తీరంలో, వాసర క్షేత్రంలో వుంది ఈ సరస్వతి. బహుశా – బమ్మెర పోతరాజు "క్షోణితలమ్మునన్ నుదురు సోకగ మ్రొక్కి నుతింం"చిన సైకత శ్రోణి వాణి, శారద చంద్ర చంద్రికా చారు మూర్తి భారతి, బ్రాహ్మి ఈమే కావచ్చు. బాపురెడ్డి స్వగ్రామం కరీంనగరం జిల్లాలో, సిరిసిల్ల తాలూకాలోని సిరికొండ. సుప్రసిద్ధ రాజరాజేశ్వర క్షేత్రమైన వేములవాడకు 10 కిలోమీటర్ల లోపలే వున్నదిది. తండ్రి కృష్ణారెడ్డి, తల్లి రామలక్ష్మి, అన్న జగ్గారెడ్డి, అక్కలు వెంకటమ్మ, ఆండాళమ్మ, చెల్లెండ్రు వజ్రాబాయి, అమృతాబాయి.

తల్లిదండ్రుల, అన్నవదినెల, అక్కచెల్లెండ్ర ఆబాల్య ప్రేమ వాత్సల్య సమనురాగ రంజిత కౌముదీ మూర్తిగా ప్రవర్ధమానుడైన అట్టి ఏ యువకుడు సార్వజనిక ప్రేమతో విశ్వశ్రేయో వేదీ, విశాల మానవతా వాదీ కాకుండా వుండగలడు ?

ఒక పేద రైతు బిడ్డగా పుట్టి, విద్యా సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ఎంతో కష్టపడి చదువుకొని, అటు సహజ కవితా కల్యాణ సిద్ధుడూ, ఇటు సమున్నతాధికార పదవీ నిర్వహణ ప్రసిద్ధుడూ అయి – దేశం లోని వివిధ రాష్ట్రాలూ, లోకం లోని వివిధ దేశాలూ పర్యటించి – తను అనుభవాలను, అనుభూతులను పరిపాలనా కార్యనిర్వహణ ద్వారానూ, సృజనాత్మక రచనల ద్వారానూ దక్షతతో ప్రజల కందజేస్తున్న ఈ సారస్వత మూర్తి ఈ కావ్యకృతి భర్త కావడం నా అదృష్టం. ఆయనకు మరొకసారి నా హృదయపూర్వక ధన్యవాదాలు సమర్పించు కొంటున్నాను.

# కవితను చదవాలా ? పాడాలా ?

"కవితను చదవాలి గాని, పాడడ మేమిటి !" అనే వాళ్లున్నారు. తెలుగు విషయంలో ఈ వాదన సరైంది కాదు. కవిత వచనంలో వున్నప్పుడు చదవడం తప్పదు. కాని, అది గేయం లోనో, పద్యం లోనో వున్నప్పుడు పాడడమే మంచిది. అయితే శ్రోతలకు అర్థమయ్యే టట్టు (అర్థం చెపుతూ కూడ) రాగ యుక్తంగా అనాలి. అప్పుడట్టి కవితకు తావి అబ్బి గుబాళిస్తుంది.

తెలుగులో పద్యం ఒక ప్రత్యేక ప్రక్రియ. పద్యాన్ని అర్థవంతంగా పాడడం ఒక కళ. ఈ కళా ప్రక్రియ ప్రస్తుతం క్షీణదశలో వుంది. దీని సముద్ధరణ కోసం ఒక ''పద్య కళాశాల''ను నెలకొల్పాలని నాకెంత కాలం గానో వుంది. ''మీ అధ్యక్షతలో ఒక కవితా కళాశాలను నెల కొల్పుదాం'' అని పూజ్యులు శ్రీ ఎం.ఆర్.అప్పారావుగారు నాతో అంటూ వుంటారు. అది నెరవేరే దెప్పటికో

మొన్న అనంతపురంలో నేను ఈ బొమ్మ నుంచే పాడాను. యువ హృదయాల హర్షా మోదాలలో మునిగి తేలాను.

''మీ బొమ్మలో ఆధ్యాత్మిక శోభ వుంది'' అన్నాడొక చక్కని కుర్రవాడు ముందుకు వచ్చి. ''ఏం చదువుతున్నావు ?'' అన్నాను. ''ఎం.ఎ. ద్వితీయ'' అన్నాడు. ఆశ్చర్యపడి, ఆనందపడ్డాను ! ఆయన శ్రీ పి.చంద్రశేఖర రెడ్డి. అలాంటివాడే మరో యువకుడు శ్రీ బి. నారాయణస్వామి. వీరందరూ రాగవైశాఖి కావ్య రసాస్వాదన తత్పరులట !

ఒకసారి కాకినాడలో కలెక్టరు మాలకొండయ్యగారు ముఖ్య అతిథిగా, మిత్రులు శ్రీ వాడ్రేవు నారాయణమూర్తి గారు ఏర్పాటు చేసిన ''సాహితీ రాత్రి'' ఉత్సవంలో నేను కూడ పాల్గొనడం జరిగింది. అందులో నేను పాడిన కవిత ఈ బొమ్మ నుంచే. అప్పుడు ఆనంద పరవశులై, నాపై ప్రశంసల వర్షం కురిపించిన అనేక మందిలో శ్రీ జె.ఎమ్.గిర్‌గ్లానీ గారు ఒకరు. వీరందరూ నా పట్ల అనురాగ పూర్ణులు.

## పునరుజ్జీవం

''ఏ పరంజ్యోతినో వెల్గి, ఈ ప్రపంచ
విధులు నెరవేర్చుచున్న దివ్వెలము మనము,
దీపికా! నిన్ను నన్నొక్క వాపి ముంచు
అంధకారముపై దండయాత్ర మనది!''

ఇది 20 సంవత్సరాల క్రితం ప్రకటించబడ్డ నా ''దీపసభ'' కావ్యం లోని ప్రారంభ పద్యం. ఆ కావ్యం మొత్తం మానవుని అజ్ఞానాంధకారంపై నా కవితా మహేశ్వరి జరిపిన దండయాత్రే!

దీపసభ కావ్యం వెలువడినదాది పరోక్షంగాను, ఆంధ్రప్రదేశ్ అవతరణ నాటి నుంచి ప్రత్యక్షంగాను నా కవితలను మెచ్చుకొంటూ, నన్ను సర్వదా ఆశీర్వదిస్తూ, నాకు అండదండలుగా నిలిచివున్న వారిలో ఇద్దరు ప్రముఖులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు, ఆచార్య దివాకర్ల వెంకటావధాని గారు ఈ ఇద్దరి అధ్యక్షత లోను కూడ నేను ఎన్నోసార్లు బొమ్మలోని గేయాలను పాడివున్నాను. పెదపులివర్రులో బొమ్మకావ్య గానాన్ని మెచ్చిన వారిలో డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు కూడా ఒకరు. వీరందరికీ నా నమోవాకాలు.

నేను కొన్ని సంవత్సరాలుగా పనీ పాటా లేకుండా భాగ్యనగరం వీధుల్లో తిరుగుతుంటే - కనీసం తెలుగు భాషారంగంలో అయినా ఇతని అనుభవాన్ని ఉపయోగించుకొందాం అన్న ఆలోచనే రాజ్య రథసారథులకు కలగలేదు.

సాహితీ సృష్టి నా జీవ ధర్మం కనుక, నిత్యసారస్వత యోగంలో మునిగిపోయి వుండి, నేను కూడా ఏదీ పట్టించుకోలేదు.

నాటికి నేడు – ఎనిమిది నిండు సంవత్సరాల తర్వాత – అభ్యుదయ ధర్మజ్యోతి ధర్మన స్కుల్లైన విద్యామంత్రి మాన్య శ్రీ ఎమ్.వి. కృష్ణారావు గారు అవ్యాజశ్రేయోభికాంక్షతో, నాకు తెలియకుండానే తెలుగు అకాడమీతో సంబంధం కల్పించి, నన్ను మళ్ళీ లౌకికంగా పునరుజ్జీవింపజేశారు. ఈ బొమ్మ అచ్చులో వుండగా జరిగిన అద్భుత సంఘటన ఇది. అందుకే, ఈ సందర్భంలో వారికి నా మనఃపూర్వక కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

నా కవితా కృషిలో అనేక విధాల ప్రోత్సహిస్తున్న మరికొందరి మిత్రులకు ముఖ్యంగా డా॥ కొలకలూరి ఇనాక్, శ్రీ పి. చెల్లారావు, ఈలపాట రఘురామయ్య, శ్రీసాక పేములు ఐ.ఏ.ఎస్. శ్రీ డి. రామకృష్ణయ్య ఐ.ఏ.ఎస్. శ్రీ. సి. పావనమూర్తి ఎమ్.ఏ. శ్రీ బి. రామమోహనరావు, బి.ఇ., ఎమ్.ఎస్.ఇ. (లండన్), శ్రీ ఎమ్.ఎన్. భూషి, డా॥ జి. ఆంజనేయులు ఎమ్.డి, శ్రీ ఎన్.వి.ఎస్. ప్రసాదరావు (ఆకాశవాణి), శ్రీ పాలగుమ్మి విశ్వనాథం (ఆకాశవాణి) డా॥ కొత్తపల్లి వీరభద్రరావు, శ్రీ వి.నారాయణరావు ఐ.ఏ.ఎస్ శ్రీ ఎమ్.ఎల్. నరసింహరావు మున్నగు వారికి నేను సర్వదా నతశిరస్కుణ్ని.

కావ్య ముద్రణకు వాడిన కాగితం కన్సెషను రేటుకు ఇండియా గవర్నమెంటువారు లభింపజేసినట్టిది. కాగితం కనపడని, కనపడినా నాలాంటి స్తబ్ధుడికి అందుబాటులో లేని ఈ రోజుల్లో ఇట్టి సదుపాయం కల్పించిన ప్రభుత్వం వారికి ఎంతో కృతజ్ఞుణ్ని.

ఇదీ బొమ్మ చరిత్ర. ప్రచురణ కాక పూర్వపు చరిత్ర. ఇప్పుడు దీన్ని సహృదయుల చేతుల్లో పెడుతున్నాను. ఆదరంతో స్వీకరించవలసిందిగా అర్థిస్తున్నాను.

– బోయి భీమన్న

❋ ❋ ❋

# బొమ్మ

## పూజల్లో



నిను తెచ్చుకో లేక
నీ బొమ్మ తెచ్చుకొని,
పూజలో నెలకొల్పి
పూజారి నైనాను !

కనిపించునా నాదు వేదన ?
నీకు
వినిపించునా నా నివేదన ?

2

మరు మల్లె పూలతో
మందార మధువుతో
దేవివౌ నీ మెట్టు
దేవాలయము నైతి !

కళకు గజ్జెలు కట్టితి !
కవి తేండు
కళను సిగలో ముడిచితి !

### 3

ఎదుట బొమ్మవు నీవు
ఎడద కొమ్మవు నీవు
కొమ్మ కొమ్మను విరియు
కోకిలా రవ మీవు !

చైత్ర లీలా సమైంద్రి !
బొమ్మ
శారదానంద చాంద్రి !



### 4

భీమన్న

రమ్యాక్ష రాంతః పు
రాలు నీ చరణాలు,
ఎచట సోకిన అచటె
ఇందూదయాలు !

శోభా నిలయ పూర్ణ సుందరి !
బొమ్మ
సుందర శివానంద లహరి !



## 5

విత్తనమ్మున మొక్క
మొక్కలో విత్తనము,
ఈ రెంటికిని నడుమ
ఎంత జీవన గాథ !

ప్రతి జీవలతయు నీదు గుడి !
పర
బ్రహ్మయే విత్తనాల మడి !

## 6

మొక్క నాటిన నాడె
మొగ్గ తొడుగునె తీగ ?
నా కోర్కె తీగ ఏ
నాటిదో, వాటిదో !

పరిపుల్లముగ పూచి నిన్ను
నే డేని
పరిపూర్ణు చేయదా నన్ను !

7

పద బంధ వర్గాలు
పరతత్వ దుర్గాలు
గాలించి, సాహితీ
కళలోనే నిను గాంచి

వలచి మొక్కితి నీ పదాలకు,
నిన్ను
పిలుచుకొంటిని నా వనాలకు !



8

ఏ ముఖము చూచినా
నీ ముఖము వలె నుండు,
ఏ కంఠమును విన్న
నీ కంఠ మట్లుండు-

నీ అందములె పూచెను !
జగ మెల్ల
నీ కద్దమై నిల్చెను !

## 9



వేలాది వదనాల
వెర్రి చూపులు చూచి,
వెక్కిరింతలు పొంది
వెదకి నిను కనుగొంటి !

అపరోక్ష సాక్షాత్కృతి !
నీవె
అదయ వైతే, ఏమిటి గతి ?

## 10

చీకటనగా నేమి ?
క్షితి నీడయే కాదె ?
నీడ వెలుపల ద్యుమణి
నిత్య మగుపించదే ?

ఏము నేలనో ఇంత గ్లాని !
నా వెనుక
ఎంత వెలుగున్నదో గాని !

## 11

ఎద లోనె నీ వుండ
ఎదుట చీకటి యేమి ?
బోర్లించు మాత్రాన
బొమ్మ యేమై పోవు ?

మొగ్గ తొడిగిన మావిగున్న
ఫల మేమి
సిగ్గు వడి కాయకున్న ?



## 12

ఇవె పూలు, ఇదె పత్రి
ఇవె పాలు, ఇవె పండ్లు
ఇదె దీప, మిదె ధూప
మిదె పాట, ఇదె ఆట-

ఆపాదమస్తకము నేను
నీ ముందుల
అర్చనా ద్రవ్య మైనాను !

## 13



ఇచ్చు నట్టిది కలిమి
పుచ్చుకొనునది లేమి,
ఏదైన ఇచ్చి పో
యెడిది ఈశ్వరత !

ఇచ్చుకొందువ ? పుచ్చుకొందువ ?
ప్రేమలో
ఇది యేమి లేదు పొమ్మందువ ?

## 14

నీ బొమ్మె ఈ బొమ్మ
నే బ్రహ్మ గానిమ్మ !
నాల్కపై ని న్నుంచి
నవ రసా లొల్కింతు !

ఉరముపై నిల్పు కొందు-
నిన్ను నా
శిరము పై తాల్చుకొందు !

## 15



నను లోలునిగ జేయు
నవ లోక రాగాలు
లోకాలనే యేలు
నీకు చిరునవ్వులే !

బొమ్మ కొమ్మగ మారు క్షణము
నా బ్రతుకు
గుమ్మాన వచ్చు తోరణము !

## 16

రమ్మంటినా నేను?
రా నంటివా నీవు?
మూగ వోయిన దేదొ
తీగ తెగినటు వీణ !

చెయి జారిపోయిన దుషస్సు !
ఇవు డెంత
చేయువలెనో తపస్సు !

## 17



ప్రత్యక్షమును చేరి
ప్రతి బింబమును కోరి
ప్రత్యక్ష మగు మంచు
ప్రార్థింతు నే తిరిగి !

వెర్రి వా డను కొందురో !
నా చుట్టు
వేదాలు నిర్మింతురో !

## 18

ప్రౌఢ రాధకు చాల
బాల కృష్ణుడ నేను,
పరమ కృష్ణ పదాల
బాల రాధిక వీవు

ఆ రాధ ఈ రాధ నడుమ
నేను ని
త్యానంద రస మత్త జడిమ !

## 19

యాత్రికుడ నీ కాల
యమునా ప్రతీరాన-
రుతుకాంత, రుక్కాంత
ఇరు వంకల గమింప !

సంగీత సారస్వతాలు
నాకు నీ
సజల కజ్జల వీక్షణాలు !

❋ ❋ ❋



# బొమ్మ



## పూవుల్లో

నా కోర్కె లెగిరి సీ
తా కోక చిలుకలై
మెత్తగా ప్రతి పూవు
చిత్తాన కాలూను !

తిరియే పోద మనుకొన్నవి !
    మరి క్రొత్త
భారాలు నింపుకొను చున్నవి !

**2**

నీ యడుగు జాడలే
నా యెడదపై తోచి,
నీ పాద పారాణి
నా పెదవిపై మాచి

ఎన్ని ఊహలు చేయునో !
    ఈ జగము
ఎన్ని మాయలు పూయునో !

## 3



రాస వేదిక నుంచి
రాగమై ప్రవహించి
నీ పరమ మధు లహరి
నా పెదవి నించెనే !

రాధ నారాధించి నానే,
నిన్ను
రస మూర్తిగా పొంది నానే !

## 4

కొసరి నే గొన్న ఒ
క్కొక ముద్దు మెరిసి, ము
ద్ద గులాబులై, విభా
తము నిండ విరిసినవి !

ఏ దేవతల పూజ యేని
మన ముద్దు
లేదేని కొనసాగ దవని ?



5

ఏవో సౌందర్యాలు
ఏవో మాధుర్యాలు
క్షణము క్షణమును దూసు
కొని పోవు నా గుండె:

భ్రమర మాత్రుడ నైతిని !
నీ పాద
పద్మ బందీ నైతిని !

6

పాత పువ్వుల లోని
పరిమళము కొత్తదే,
కొత్త మొగ్గల లోని
కోరికయు పాతదే !

ప్రాత క్రొత్తల నడుమ నీవు
నా చుట్టు
ప్రాత లతగ పూచినావు !

7



చుక్కలలో జాబిల్లి
సుఖ మీయదే తొగకు ?
కురుల గూర్చిన మల్లె
మురిపించదే మనసు ?

ఎందున్న నేమి ఆనందము ?
బ్రతుకు
మందిరాలకు మోసుకొందము !

8

నిన్ను గూర్చిన తీయ
ని తలంపు లే రోజు
రోజాల గుత్తులై
రాజిల్లు నా తోట !

ఏ పూర్ణిమల వాలి విచ్చునో !
నడుమ
ఏ గుండెలను తేలి వచ్చునో !

## 9



ప్రత్యక్షముగ ఎదుట
ప్రతి లతను కల నిన్ను
పట్టు కొనగా దూర
భారాలు పోనేల !

బృందలకు పైన మేల ?
నందనము
లందుకొను యత్న మేల ?

## 10

నెల పువ్వు పూచె, వె
న్నెల తావి వీచె-
నవ నవేహాలు లేచి
నర్తింప సాగె-

రాధ పోలిక లేల ఇలకు ?
బ్రతు కెల్ల
రాగ కాలము కాదె మనకు ?

## 11

పాల వెన్నెల పరుపు
పై, మల్లె పూలపై
అస్సు రుస్సురు తీరి
డస్సి యున్నది ప్రకృతి !

పరవశతలో నున్నది !
వన మెల్ల
పడక గదిగా నున్నది !



## 12

విలువ లెరుగని తమసి
కొలువులో నిల్చి,
బ్రతుకునే ఒక అగరు
వత్తిగా కాల్చి-

నుసి మాత్రమై మిగిలి నాడు
శశి రేల
రస సూత్రమున కట్టినాడు !



## 13

గడ్డి పువు కానిమ్ము
కలువయే కానిమ్ము
పరితృప్తి ఒక్కటే
ఫలము జీవన లతకు !

ప్రణయమే ఫల రసమ్ము !
  రస పాన
రమణమే మధు వశమ్ము !

## 14

ఇన్ని రంగులు పూచి
ఎన్నో రుచు లూరి,
అరుణ బింబము చిదిపి
అమృత మందించి,

నీకు వెన్నెల వోణి కొన్నది !
  నిశి నాకు
నీవె వన్నెల రాణి వన్నది !

## 15



వీణయే పలికెనో
వేణువే పిలిచెనో
తల లూచి కదలు నవె
తారా గణాలు !

ఉన్మనస్కత విరిసెను !
మన చుట్టు
ఉద్యానములె వెలసెను !

## 16

పంచ బాణుని పంచ
బాణాల పదును నీ
పెదవిపై ఒరసి, నా
ఎద మీద దండెత్తె !

పద్మ వ్యూహము వన్నెను !
నా ధృతిని
పంచత్వ మొందించెను !



17

ప్రతి రోజు నీ పూజ
పల్లవించే మల్లె
నిను దెత్తునని చెప్పి
కను గీటి పోయెనే !

ఎంత మధు వొలికించెనే !
నా చేత
ఎంత కల గనిపించెనే !

18

భావనా సదనాల
ప్రాప్తించిన సుఖాలు
తెర తీసి ఈ నేల
దిగి రావు కాబోలు !

పూల పల్లకి పంపుకోనా ?
అనురాగ
పుష్పకమె నిర్మించి తేనా ?

## 19



ఎంత చక్కని రేయి
ఎన్ని చుక్కల రేయి
పాల వెన్నెల కడలి
ఓల లాడే రేయి !

ఊహ రెక్కలు పెంచెను !
నన్ను నీ
స్నేహ స్మృతుల దించెను !

❋ ❋ ❋

# బొమ్మ

## రంగుల్లో



శిల్పినే నేను, నా
శిల్పమే నీవు !
నిమిష నిమిషము మారు
నీ కళల తీరు !

ఎప్పుడే నుడి నుందువో ?
నను మరచి
ఎప్పుడే గుడి నుందువో !

2

రాతి దొక బొమ్మ, నవ
నీత మొక బొమ్మ,
నలుపు తెలుపుల కన్ను
కలుపు నొక బొమ్మ !

బొమ్మ కొక అందమే, చానా !
అన్ని
బొమ్మలకు నీవే నమూనా !



3

ఆ రూపె, ఆ యేపె,
ఆ లేత చిరునవ్వె,
నల్ల కలువలు విరిసి
నను పిల్చు చూపదే !

కొమ్మగా నున్న నీవు
ఎంత లో
బొమ్మగా మారినావు !

4

రాగ రంజిత మైన
రమ్య భంగిమ నీది,
ఎల్ల లేవైన జా
బిల్లి వెన్నెలె కాయు ?

అందాల రాణి వా నాడు !
నా కలము
చిందులకు పాణి వీ నాడు !

## 5



చిత్ర రంభల గంటి
శిల్పోర్వశుల గంటి
ఊహా జగత్కళా
మోహినుల గంటి-

నా మనో హంసి వీవు !
నిను మించి
ఏ మాధురులును లేవు !

## 6

కవికి లేఖిని, చిత్ర
కారునికి కుంచె,
సాధనా లీ రీతి
శత సహస్రాలు !

రంగులును రేఖలును కావు
నీ రూప
రచనమే అందాల ప్రోవు !

## 7

రాతి నాతిగ జేసె
రాము డని యందురే-
రాయి కా దది అహ
ల్యా దేవి కాని !

అసలైన రాతినే నిల్పి
సృష్టించు
ఆనంద దేవిగా శిల్పి !



## 8

తన కళా రుచు లజం
తా శిల్ప మెరుగునే ?
ఎరుగునే వంశి తన
హృదయ నాద బ్రహ్మ ?

ఆనంద పారవశ్యమున
అందరును
అందాల బొమ్మలే లలన !



## 9

ప్రతి జీవి తన భవి
ష్యతుకు తానే శిల్పి,
కలమొ, గళమో, కొయ్యో,
కడ కింత తడిమున్నొ

చేత గొని రాని వాడు
లోకాన
చేతమే లేని మోడు !

## 10

గీసికొను చుంటి వి
క్కిరి బిక్కిరిగ నేదో-
అడ్డు గీతలు తుడిచి
అందాలు కూర్తు వని !

కురు లార బోసుకొని నీవు
ఎంతకును
కుంచెనే పట్టు కున్నావు !

## 11



ఏది నీ నిజ రూపు?
ఏది నీ పేరు?
చిత్తమే నీ రూపు
చెలిమి నీ పేరు !

ఏ రూపుతో నిన్ను నిలుపుదు ?
లోకాని
కే పేరుతో నిన్ను తెలుపుదు ?

## 12

సర్వం సహా సర్వ
సౌందర్య రుచు లెల్ల
ఏడు రంగుల లోనె
ఇముడు ననుకొంటి !

సకల జీవన కళాభ !
నీ శోభ
శతవర్ణ సంపత్ ప్రభ !

## 13



అదొక తెల్ల గులాబి
ఇదొక ఎఱ్ఱ గులాబి
మేఘ నీలిమ నుండి
మెఱ్మి బంగరు తీగ !

వర్ణాల పట్టింపు లేల ?
నిన్ను
వన్నెలన్నియు కొల్చు, బాల !

## 14

చైత్రమే కానిమ్ము
శ్రావణమె కానిమ్ము
తేనో, వానో కాక
తెరపి యే మున్నదే ?

కొత్త రంగులు కలుపుము !
లోకాన
కొత్త గుండెలు నిలుపుము !

## 15



కాల చక్రపు బాట
గండ్లు పడె నేమోను !
ఇరుసు విరిగే టట్లు
ఎత్తి కుదవేసేను !

ఎక్కడివో ఈ ఎగుడు దిగుడులు ,
ఏ చిలిపి
చెక్కినవో ఈ క్రింద మీదులు !

## 16

ఎందు కీ బొమ్మ, నా
కేల కన్నుల చెమ్మ ?
ఆభాసమున కింత
ఆత్మార్పణ మ్మేలో !

ఆత్మ గల నిను వీడుకొంటి !
పట్టి
అజ్ఞానమును వేడు చుంటి !

## 17



నిన్ను నే నెరుగనే ?
నీ మనసు తెలియనే ?
వరద హస్తము నుండి
విరహ వేదన గొంటి !

మూర్ఖతకు పోటీలు పడిన
నాదె
మొదటి బహుమతి సుమ్ము, సుమన !

## 18

వెంటబడు కొలది ప
ర్వెత్తు తత్వము నాది,
కవ్వించినదె కాని
కన్నెత్త వీవు !

ముచ్చటకు నిను నన్ను చేసి
బ్రహ్మ
ముసలి వాడైనాడు గాసి !

## 19

ఆరాధకుడ నేను
ఆశ పో నివ్వనే,
హాలాహలము మ్రింగి
అమృతమ్ము పంచెదను !

విశ్వాలు పెకలింతును !
నీ కొరకు
విలయాలు పుకిలింతును !



❋ ❋ ❋

# బొమ్మ

## రుతువుల్లో



వెండి తెరపై వోలె
గుండె పొరపై వ్రాలి
మధుర స్మృతు లవేవొ
మారాము చేసేను-

ఎన్ని మధువులు తీసినాము !
ఆనాడు
ఎన్ని ఎదలకు మోసినాము !

**2**

ఉదయమే నే లేచి
ఎదుటనే నిను చూచి
ఉష వంచు, ప్రేమ పీ
యూష వంచు, తృష తీర

ప్రాణాంజలి ఘటించి నాను !
అదె నాకు
పరమ విషమట మయ్యెను !

**3**

అదె కమల, అదె కనక,
అదె సూర్య, అదె చంద్ర-
దేవతలె ఈ తోట
పూవులై పూచిరే !

నీ దర్శనము చేతురు !
ఉమ రమలె
నీ పూజ గొని పోదురు !



**4**

కలకాల మెందుకో
కాల స్రవంతి-
ముందుకే పరువెత్తు,
క్రిందికే దూకు !

క్రింద కలదో పైని లేనిది !
ఏదైన
ముందు కలదో వెనుక పోనిది !

5



ఏ విభాతమ్మున నీ
హృదయ పద్మము నుండి
వెలికి నను త్రోసి వ
ర్వెత్తి పోయెనొ కాని-

ఎన్ని పువ్వుల పైనొ నిలుచు !
నా మనసు
ఎన్ని రుతు రమలనో కొలుచు !

6

పూర్ణేందు రంగాన
పుంస్కోకిలము పాడ
ఆరు రుతువులు నాట్య
మాడు పురులను విప్పి !

విశ్వ సుందర వాటిక !
నీ ప్రేమ
విలసత్కళా పేటిక !

## 7

నెమ్మి విప్పిన పురులు
తమ్మి తావుల సిరులు
చెలు వొందు నీ కురుల
చెలు వంపు టిరులలో

కుంద మాలగ నిల్పు కొంటి !
నా కుందు
ఇందు బాలగ మల్పు కొంటి !



## 8

ఏ ఋతువు కా ఋతువె
ఏ బ్రతుకు కా బ్రతుకె
దేని గతి దానిదే-
దేని రతి దానిదే-

మధు బాలె పాడవలెనా ?
మై మరువ
మామిళ్ళె పూయ వలెనా ?

## 9



నీ పోల్కి నదిగొ రా
ధా పూర్ణిమ వెలారు !
కన్ను చెదరగ నవిగొ
వెన్న ముద్దలు చుట్టు !

చిన్ని కృష్ణుని వోలె నేను
రో లెక్కి
చిట్టి చేతులు చాతును !

## 10

ప్రియ వసంతము వెంట
విరహ గ్రీష్మ మిదేలొ?
మధుర జీవన మెల్ల
మండి పోయెడు నిట్లు!

ఎట్టి వర్షము లైన కురిసి
చేరునా
ఏ సరసి జలము లా సరసి?

## 11

విప్రయోగపు టెండ
విప్రలంభపు బండ
విచ్చు కత్తులు నూరు
పిచ్చి వాడను నేను !

బొమ్మనే కరిగించ లేను !
ప్రేమ రా
జ్యమ్ము నెటు పాలించ గలను ?



## 12

మబ్బు చూలాలు నా
మనసు కని పెట్టే, నా
ప్రణయ వనముల నిన్ను
ప్రసవించి పోయెనే !

వర్ష డోలల క్షణ ప్రభవు !
నాకు
వైశాఖ నిత్య పూర్ణిమవు !

## 13



గాలి వానల లోన
పూల నేలల లోన
ముద్దగా తడిసి పూ
మొగ్గలై పోయి-

అచ్చరల బిలిచేము క్రిందికి !
వలపు
నిచ్చెనలు వేసేము నింగికి !

## 14

నింగిలో ఒక నీలి
నీడ తోచం గానే
శిరముపై ఎదో చిన్ని
చినుకు రాలం గానె

మే తీవె విద్యాధరి !
నా హృదయ
మే వరద గోదావరి !

## 15

*నీలి మబ్బుల దిండ్ల*
*నెమ్మోము దాచుకొని*
*కన్నీరె పో పాల*
*మున్నీ రనగ వగచు-*

*ఎవరి కొరకో చందమామ !*
*నీ వంటి*
*దెవ రొకో ఆ సార్వభౌమ !*



## 16

*శారదమ్మె, చంద్ర*
*పారదమ్మె రేయి*
*అన్న రాశికి వోలె*
*ఆవిర్భ వించెనే !*

*వరిచేల యొడి నించెనే !*
*మనకు కొ*
*బ్బరి పూల పొడి వంచెనే !*

## 17



నీ పొందు కోరు క
న్నీటి బిందువులలో
తల క్రిందులుగ తోచు
ధరణి జీవన మెల్ల !

నిగ్రహము పోయెనో నాకు !
ప్రకృతి యే
నెగెటు వేమో అసలు నీకు !

## 18

మధుర శారద పూర్ణి
మల పూర్ణ కుంభాల
అమృత ధారలు తీసి
అర్చింతు నే నిన్ను !

శూన్య మాసము లేదు మనకు !
అను రాగ
సుభగ మెల్లను వలపు టెదకు !

## 19

రుతు చక్ర మిది దోష
యుత మౌను కంటివే ?
ఒక వైపునకె దొర్లు
టకు బిగించిరి దీని !

కడ యేని లేని దీ బాట !
ఎంత
కాల మని దీనితో ఆట ?



## 20

దేవి నవరాత్రులో
దీప సంక్రాంతులో
రుతువు రుతువున లేవె
మితి లేని పండగలు ?

నవ రుచులు తే నున్నదో !
బొమ్మ
శివ రాత్రి కా నున్నదో !

## 21



ఆపవే రథము రవి
అస్తమించక ముందె !
మార్చవే చక్రాలు
మనసైన గతి బోవ !

శిశిర హేమంతాల మీదుగ
తిరిగి
చేరు కొందము అనంతుని సిగ !

❋ ❋ ❋

# బొమ్మ

## బీచీలో

చెలువ, నీ హృదయమే
క్షీర సాగరమే !
ఒడ్డుపై కూర్చుండి
ఊహింతు నమృతమ్ము !

దాని కది మథన మగునా ?
వచ్చి
త్రావు మని పెదవి నిడునా ?



2

రవి జారి పడియె అవ
రాత్రి చీకటి డొంక,
ముళ్లు గ్రుచ్చుక నెత్రు
టేళ్ళు ప్రవహించెనే !

నా గుండె వలె నుండెనే !
సంధ్య
రాగ చింతల మండెనే !

## 3



రో జెల్ల కృషి చేసి
రాజు మేడకు మోసి
విసుగెత్తి, పూ సజ్జ
విసి రేసి, రవి గ్రుంక-

అంగన లనే పూలు పూచి
ప్రగతి
శృంగార మొలికింది బీచి !

## 4

ప్రత్యూషమున సర్వ
పరితోషములు పుట్టే,
శిశిర తిమిరము కేసి
శిథిలమై పోనేలా !

తమమె విప్లవ రథమ్ము !
ప్రతి వసం
తమును విప్లవ భవమ్ము !

5

సతతత మిటు కొట్టుకొను
జాబిల్లి గని పొంగు
ఎవరి స్వాంతమొ కాని
ఈ మహా సాగరము !

నిను జూచి నను జూచుకొంటి !
నా లోనే
నింగినే పండించు కొంటి !



6

ఎవటివో ఈ అలలు
ఎవరివో ఆ కలలు
హోరు హోరున నేలొ
ఒడ్డుపై పడి చిట్లు !

ఏ గుండె లుబుకునో ఇట్లు !
ఎవరికై
ఎక్కి వచ్చునొ ఇన్ని మెట్లు !

7

ఆకాశ గంగమ్మ
అధరాలు చుంబించి
మనము చూశా మన్న
మానసముతో క్రుంగి

చిరు సిగ్గు తెరల నే తెంచు !
    కడలి నీ
చరణాలపై చేతు లుంచు !



8

అంధకారము తరచి
అమృత రాగము గ్రోలి,
కాలపాశము బట్టి
కల్ప వల్లరి జేసి

అల్లరికి పూను కొంటి !
    పాల్కడలి
ఉల్లమును గెల్చుకొంటి !

9

జలరాశి అది, రెండు
సెల యేరులము మనము
బీచి దాకా వచ్చి
బిడియ పడ నేలనే ?

వాకలై నిలిచి పోలేము లే !
అలల
ఏకమై కలిసి పోగలము లే !



10

మించు తారలు పైని
మంచు చీకటి చుట్టు
పాదాల కడ పక్ష
పాత మెరుగని కడలి !

ప్రక్క నీవే కథలో చెప్ప
మన కన్న
పార్వతీశ్వరు లేమి గొప్ప ?

## 11



కేలు కేలు గ్రహించి
క్రీ గంట చూపుంచి,
అందెలను ముద్దాడి
అలలు తాండవ మాడ

ఎంత తన్మయ మైతిమి !
తీరాన
ఎంత దూరము పోతిమి !

## 12

ఈ తీర మంతు లే
నిది, దీని పొడవు నా
ఎన్నెన్నొ తీర్థాలు !
ఎన్నొ వాగర్థాలు !

నత్త గుల్లల జోలి యేల ?
మనకు
చిత్త సంపద లేదె చాల ?

## 13

కిల కిలా కులికి, వె
న్నెల నవ్వు లొలికి,
అటు తూలి, ఇటు వాలి
ఆడుకొను కెరటాలె

దోసిళ్ళ బడబాగ్ను లెత్తు !
విరసాన
దుష్ట ఝుంఝుల ముంచి మొత్తు !



## 14

తీరాన కల్లంత
దూరాన త్రుళ్ళింత,
ఏ పడవ దీపమో
ఏ బడబి రూపమో !

అర చేత ప్రాణాల మనము,
ఆ రేయి
అది తేలు నందాక చనము !

## 15



అంతంత మాత్రాలు
అలల బ్రతుకులు; దేవి !
దూర మన్నది లేదు
దుఃఖ మన్నది లేదు,

ఉప్పొంగి జీవించుము !
క్షణ మేని
ఉపరి మధువులు గ్రోలుము !

## 16

తడి ఇసుకతో ఎన్ని
గుడులు కట్టితిమో,
చిరు పీతలకు ఎన్ని
చిరు తిండ్లు పెట్టితిమొ !

జ్ఞప్తి యున్నది బీచికి !
నీ పేరె
జపియించు నీ నాటికి !

## 17

ఆ రోజు లవి, ఎంత
ఆనంద బృందలో!
కల లయ్యె ఈ నాడు
సెల లయ్యె కందోవలు!

పాల్కడలి కా నున్న దా!
ఇక, బొమ్మ
పవళింప రా నున్న దా!



## 18

ఉడుత పిల్లకు వోలె
ఉరుకు నీ సెలయేరు,
వరదయై నీ యెడకు
వారాది కట్టునో!

ఎద సీతగా నున్న ది!
నాకు బ్రతు
కెదు రీతగా నున్న ది!

## 19



దయ్య మది తన నీడ
దైవము మనసు నీడ,
నీ డేదో లేక మన
లేడు మానవుడు-

నీడ లేనిది మన ప్రమేయం,
నీడ ల
న్నిటి కిదే పరమాశ్రయం !

## 20

తల నిండ పూలు, పూ
వుల నిండ వెన్నెలలు,
షట్పదము లా చుట్టు
అష్ట పదులను పాడ

నృత్య జీవన యామిని-
బొమ్మ సా
హిత్య తేజ స్స్వామిని !

**21**

ఆపాద శిర మనే
కానేక సుమ సమా
రక్తాధర సుధాభి
షిక్త మధురిమ మేను !

రసరాగ సర్వస్వ మేను
నీ పాద
రశ్మికై శిర మొగ్గినాను !

❋ ❋ ❋



# బొమ్మ

## నాదంలో



నా ఒడిని నిన్ను గొని
నీ ఒడిని వీణ నిడి
వెఱ్ఱి పాటలు కొన్ని
విసురుదా మను కొంటి !

ముందు కడు గిడ దయ్యెను !
    వీణ
మూగవోయిన దయ్యెను !

**2**

పెదవిపై వాగ్దేవి
పదవిలో శ్రీదేవి
ఆ కొన్న లోకాని
కన్న పూర్ణా దేవి

ఎవ్వ రని వెదకి నాను,
    నీ యందె
ఎల్లరను కాంచి నాను !

3

వీణయో, వేణువో
వాణియో - సాక్షాత్తు
నాద మే దైన స్పం
దన లేక కల్గునా ?

ఎవరి హృదయ స్పందనము ఇది !
నన్ను
ఇంత మత్తున లేపు తున్నది !



4

అరుణ చేలము తాల్చి
తరుణ సంధ్యవె నీవు,
కాల రాత్రము నుండి
కదలింపవా నన్ను ?

తాకిననె వికసించు మ్రాకు ?
నీ గాలి
సోకి నదె మధువేళ నాకు !



## 5

ఇది వీణ కాదు, నా
హృదయమేనే, చెలీ !
తెచ్చి నీ ముందుంచి
వచ్చి కూర్చున్నాను !

స్పందించు నా జీవ నాడి !
దశ దిశల
చిందించు నీ గుండె వేడి !

## 6

మూగ వీణను నేను
రాగ తాళము లీవు,
నన్ను నిన్నును గూర్ప
నట రాజు రానేల ?

అందెలను గట్టు నేల ?
మన ముందు
చిందులను ద్రొక్క నేల ?

7

కోటి విద్యలు కూటి
కొఱకైన అగు గాక,
కూడున్న వాడె పో
కోవిందు డగు గాక !

ప్రేమ ఒక విద్య కాదు కద !
పార్వతీ
ప్రియుడైన బిచ్చగాడె కద !

8

ఒక ప్రక్క భారమై
ఒక ప్రక్క తేలికై
ఒరిగింది భూ నౌక
తిరగబడి పోవు నో

భువికి సమముగ ప్రగతి పంచి
పాడవా
భూపాల మేళవించి !



## 9

బాధతో, బెంగతో
బ్రతుకు భారాలతో
చింతతో, వంతతో
చితికిపోయే నరుని

ధన్యాసిలో కరగ నిమ్ము !
నీ కేసి
ధన్యోస్మిగా పెరగ నిమ్ము !



## 10

నిరంతాం ధకార మీ
నర లోక, మొక అడవి
ప్రతివాడు దీనిలో
పరమార్థు, డేకాకి !

ప్రతి మొరయు దేవగాంధారి !
సాను భూ
తితో బ్రతుకు మీటు మొకసారి !

## 11

పేరు తెలియని నోట
ఊరు తెలియని బాట
ఏ పాటొ వినిపించు,
ఏ తోటొ కనిపించు !

ఆ భేరి పాడుకొను వాడు
ఆ భోగి
యే, భీరు వెన్నటికి కాడు !



## 12

తొలకరించని కోసె
తూటి పూలును సున్న,
పుండరీకము లెట్లు
పూజలకు లభియించు ?

మృగ తృష్ణతో పోరు చుంటి !
నీ నుండి
మేఘరంజని కోరుకొంటి !

## 13



మించు తీగవు నీవు
మంచు కొండను నేను,
ఏలనే మన ముందు
ఇంత తీరని తృష్ణ !

కారుణ్య మొలికింపుము
ఇంటింట
కల్యాణి పాడింపుము !

## 14

తీగపై నీ వ్రేలు
రాగ రంజిత కాగ,
రాగ రేఖల నుండి
రేగు నా ప్రగతి ?

పరమాత్మలే పుట్టునో !
శంకరా
భరణాలె బుస కొట్టునో !

## 15

నవ రసమ్ముల లోన
శివ రూప మే దనగ,
శృంగార మన్నంత
సిగ్గు పడి పో నేల ?

లలిత మేళనమే హరప్రియ,
నిను నన్ను
కలుపు నదె నాదక్రియ !



## 16

మానసము పైని హం
సలు బారులై ఆడు,
రెక్కలకు నీ పమిటె
రెప రెపలు నేర్పునో !

శివరంజని యె రవించు !
ఒడ లెల్ల
సింధు భైరవి రహించు !

## 17



నిన్ను నా యొడి జేర్చి
నీ కేలు మెదుపుదును,
వీణ నీ యొడి జేర్చి
విశ్వాలె కదుపుమా !

ఒకరి ఒడిలో ఒకరము
మనము
ఉదయ రవి చంద్రికలము !

## 18

నీ పాటతో జగము
రాపాడి, తోపాడి,
బ్రహ్మాది లోకాల
బ్రతుకులే మారి-

భళ్లు మని తెల్లవార వలె !
నిర్దుఃఖ
భద్రమై సృష్టి విరియ వలె !

## 19



సంగీత మే తలవు
సాహిత్యమే వలవు,
శృంగార రసము తో
సేవింతు నిను దేవి !

అమృత మోహన కళా రేఖ !
ఇది నీకు
అక్ష రాక్షర ప్రేమ లేఖ !

## 20

రుషి నైతి నీ కోస
మే తపము చేసి, నే
కవి నైతి రుషి నోట,
కవి నోట పాడుదును !

కవిత రుషిత సమస్త మెల్లను
నీ పాద
కమల ద్వయముగ భాసిల్లును !

## 21



విశ్వగానము లోన
వీణయే విలయింప,
స్నపితాంగకముల పై
స్వర్ణాంబరము నేల ?

సహజ సుందర కళా ఖేల !
నీ లీల
సహవాస వాసనా శీల !

## 22

అదె నీవు, అదె నేను
అదె రేయి, అదె హాయి !
కోటి జన్మల కైన
కొత్త లే మున్నాయి ?

నిను నేను, నను నీవు మీటి
మనము
నిల్చు నదె ఆనంద వాటి !

## 23

నేను కరగిన నీవు
నీవు కరగిన నేను,
ఇర్వురము కరగి పో
యిన మీద ఎవ్వరము !

స్నేహమున రంగరించి
నను గొమ్మ
మోహనకు మేళవించి !

❋ ❋ ❋



Grams: "TELVERS"

Phone: Off: 040-23234815
Tele Fax : 040-23236911
E-mail: info@teluguuniversity.ac.in

# పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
# POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య అనుమాండ్ల భూమయ్య
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ - 500 004

## డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం - కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠాన్ని తేది 19-09-06న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు ప్రకటించారు. వెంటనే దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్య పీఠం వెంటనే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసింది.

1. డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని (పద్యం, గేయం-వచనకవిత్వం, నాటకం, వచనం) సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
3. డా॥ భీమన్న రచనలపై వివిధ ప్రదేశాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
4. (ఎ) భీమన్న రచనలపై విస్తృత పరిశోధనలు చేయడం.

   (బి) భీమన్న రచనలపైన వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.
5. భీమన్న జీవితం-రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేయడం.

6. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటా లుగా ముద్రించడం.

7. భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.

8. భీమన్న నాటకోత్సవాల్ని నిర్వహించడం.

9. డా॥ భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి పూర్తి చేస్తోంది. ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న రచనలపై విస్తృత పరిశోధనలు చేయించటానికి లబ్ధప్రతిష్ఠులైన సాహితీ వేత్తలను ఎంపికచేసి ఒక్కొక్కరికి, ఒక్కొక్క గ్రంథాన్ని అప్పగించటం జరిగింది. డా॥ భీమన్న రచనలను ఇంగ్లీషులోకి అనువదించడానికి ప్రసిద్ధులైన అనువాదకులకు అప్పగించి పూర్తిచేయటం జరిగింది.

బోయి భీమన్న గారి గేయకావ్యాలను సేకరించి, రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్నాం. ఇందులో మొదటి సంపుటం, భాగం-1లో 'రాఖీలు' గేయకావ్యం మాత్రం పొందుపరచడం జరిగింది. భాగం-2లో బొమ్మ, పాటలతోట, అకాండ తాండవం, పాటలలో అంబేడ్కర్ కావ్యాలను ప్రచురిస్తున్నాము. తెలుగు వారి భాషా, సాహిత్యం, సంస్కృతి రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలుకల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నానికి మీరందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఒకసారికి ముద్రణ (**2008**) హక్కులు ఇచ్చిన '**బోయి భీమన్న సాహితీనిధి**', హైదరాబాద్ వారికి ధన్యవాదాలు. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం ఉంటుందని ఆశిస్తున్నాను.

(అనుమాండ్ల భూమయ్య)

డా. కె. సంజీవరావు (శిఖామణి) సంపాదకీయం

కన్వీనర్
డా॥ బోయిభీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

"పాదబద్ధో 2 క్షరసమః తంత్రీలయ సమన్వితమ్
శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవత్ నాన్యథా"

క్రౌంచ పక్షి వధను చూసి కలత చెందిన ఆదికవి నోటి నుండి అప్రయత్నంగా వెలువడిన మాటలు పాదబద్ధంగాను సమానమైన అక్షరాలతోనూ తీగ నుండి వెలువడి లయబద్ధమైన ధ్వనిని కలిగి ఉన్నాయట. ఇది శోకం నుండి పుట్టిన శ్లోకం తప్ప మరొకటి కాదు అని దీనర్థం. దీనిని బట్టి ఛందస్సు, లయ, సంగీతం అనేవి మానవ ప్రకృతిలోని అంతర్భాగాలని, అవి ఆయా సందర్భ విశేషాలను బట్టి బయటపడతాయని భావించవచ్చు. పల్లె పట్టులోని జానపద స్త్రీల రోదనల్లో రగడ ఛందో విశేషాలున్నాయని జానపద పరిశోధకులు ఏనాడో గుర్తించారు.

డా॥ బోయిభీమన్న గారు సృష్టించిన వైవిధ్యమైన అనేక సాహిత్య ప్రక్రియల్లో గేయ సాహిత్యం కూడ ఒకటి. చిన్నప్పుడు పొలంలో వరినాట్లు వేస్తున్నప్పుడు అమ్మ పాడిన జానపద పాటలు, వేదాంతి అయిన నాన్న శిష్యబృందాలతో జరిపే గోష్ఠుల్లో పాడే వేదాంత, తత్వ గేయాలు 'భీమకవి'లోని అంతర్లీనంగా ఉన్న 'లయ'కారున్ని వెలికితీసాయి. దీనికి తోడు చిన్ననాడే ఇంటి దగ్గర 'అన్నంనీడి యతిరాజు' అనే బైరాగి ఏక్‌తారా మీటుకుంటు పాడిన తత్వాలు భీమన్నలో ఒక పాటలతోటకు పాదుచేసాయి. ఏ రచన చేసినా సందర్భాన్ని బట్టి పాటనో పద్యాన్నో ఆ రచనలో పొదగడం ఆయన సృజనశీలంలోని వైశిష్ట్యం. పాలేరు వంటి విషయ గంభీర రచనల్లోను దీన్ని గుర్తించవచ్చు. 1951లో వెలువడిన 'రాగోదయం'లోనూ, 1971లో వెలువడిన 'రాభీలు'లోను కొన్ని పాటలు చేర్చడం జరిగింది. భీమన్న లలిత గీతం 'చూచేకొలది సుందరము' ఆకాశవాణిలో ఈ మాసపు పాటగా డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు ఆలాపించడం ఆయన పాటలకున్న ప్రాచుర్యాన్ని తెలుపుతుంది.

ఈ గేయకావ్యాలు భాగం 2లో మొత్తం నాలుగు గ్రంథాలున్నాయి. అవి బొమ్మ, భీమన్న పాటలతోట, పాటలలో అంబేద్కర్, ఆకాండతాండవము. బొమ్మ గేయకావ్య రచన 1952లో ప్రారంభించబడినప్పటికి 1975లో మొదటిసారిగా అచ్చయింది. ఈ మధ్యకాలంలో అది అనేక సొబగులు అద్దుకుంటూ అనేక వేదికల మీద ఆకాశవాణిలోను గానం చేయబడింది. తను ప్రేమించిన అమ్మాయి బొమ్మ (ఫొటో)ను సేకరించి, ఆరాధించి, సౌందర్యోపాసకునిగా, కవిగా, వేదాంతిగా మారిన నాయకుడు చివరకు విశ్వచైతన్యాన్ని దర్శించడం ఇందులోని ఇతివృత్తం. మాత్రాఛందస్సులో సాగిన ఈ రచనల్లో భీమన్న తొలిసారిగా రసాద్వైతాన్ని ప్రతిపాదించారు. సర్వశ్రీ డా॥ బెజవాడ గోపాలరెడ్డి, డా॥ సి. నారాయణ రెడ్డి, అరిపిరాల విశ్వం, శశాంక వంటి వారితో పాటు ఎందరో అభిమానులను

భీమన్నకు సాధించిపెట్టింది ఈ బొమ్మ గేయ కావ్యం.

'భీమన్న పాటల తోట' 1991లో అచ్చయింది. 'మానవ జీవితంలోని యవ్వన ప్రౌఢ దశలను మాత్రమే ప్రధానంగా ఈ తోటలోకి స్వీకరించాను' అంటూ ఈ పాటల్ని 'బాహ్యాంతర జీవన స్పందనలు'గా కవిగారు అభివర్ణించడం విశేషం. పాటలలో అంబేద్కర్ 1992లో వెలువడింది. డా॥ బి.ఆర్. అంబేద్కర్ శతజయంతి సందర్భంగా భారత ప్రభుత్వం సామాజిక న్యాయ సంవత్సరంగా ప్రకటించింది. ఆ సందర్భంగా 'అంబేద్కర నీవు అవతరించిన నూరు వత్సరాలకు వచ్చె నవకాంతి' అన్న పాట వ్రాశారు. ఆ తర్వాత అంబేద్కర్ మీద వ్రాసిన గేయాలు అన్ని కలిపి ఈ సంపుటిగా రూపుదిద్దుకుంది. దీనికి వ్రాసిన విలువైన పీఠికలో 'జిన్నా ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతం కంటే అంబేద్కర్ ప్రతిపాదించిన త్రిజాతి సిద్ధాంతం అమలు జరిగివుంటే దేశంలోని దళితులు ఈ దుస్థితిలో ఉండేవారు కాదని అభిప్రాయపడ్డారు. భీమన్న వ్రాసిన 'జయ జయ అంబేద్కరా! జయ దళిత జన స్వరా! జయ మానవ మందారా! జయ భారత భాస్కరా!' గేయం దళితుల జాతీయ గీతం పేరుగాంచినది.

ఆకాండతాండవం 1996లో అచ్చయింది. లయకారుడైన పరమశివుని నృత్యలాస్యవిలాసం అది. తెలుగులో పుట్టపర్తి నారాయణాచార్యుల శివతాండవం, తనికెళ్ల భరణి ఆటగదరా శివా రచనలు ప్రసిద్ధం. నాదం - బిందువు - కళ, ఆకాశం - మేఘం - వర్షం, బీజం - ఫలం - రసం ఈత్రిపుటి కలసిన రసభాండం ఈ కావ్యం అని భీమన్నగారు స్వయంగా చెప్పుకున్నారు. 'నీ నిరంతర నృత్తములే ఈ / నిఖిలజగ దితివృత్తములుగా / తాండవింపుమఖండగతిని అ / కాండ తాండవ రాగమతిని' అని పరమశివుని పదనర్తనములే ఈ జగతికి ఇతివృత్తములుగా కవి భావించాడు. భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలలో ఇతర సంపుటాలను ఆదరించినట్టే ఈ గేయ కావ్య సంపుటిని పాఠకలోకం ఆదరిస్తుందని నమ్ముతున్నాను.

బోయిభీమన్నగారి మొత్తం కావ్యాల్ని సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతీ భీమన్నగారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మిత్రులు శ్రీ గనుమల జ్ఞానేశ్వర్, డా॥ బోయి నాగవర్మగారు అందించారు. భీమన్నగారి కావ్యాలు నిర్దుష్టంగా, అందంగా రావడానికి సహకరించిన సహాయ సంపాదకులు శ్రీమతి విజయేందిర, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్‌లకు కృతజ్ఞతలు.


ఈ సంపుటిని గ్రంథ ముద్రణకు వీలుగా శుద్ధ ప్రతిని తయారు చేయించిన పీఠం పూర్వ కన్వీనర్ ఆచార్య కె. ఆనందన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ముఖచిత్ర రచన చేసిన ఆర్. మురళిగారికి, అందంగా ముద్రించిన చరిత ప్రింటర్, వారికి ... అందరికీ కృతజ్ఞతలు.

హైదరాబాద్
09-09-09

(కె. సంజీవరావు)

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | బొమ్మ | 1-100 |
| 2. | భీమన్న పాటలతోట | 101-305 |
| 3. | పాటలలో అంబేడ్కరు | 306-462 |
| 4. | అకాండ తాండవం | 463-566 |


బోయి భీమన్న

# బొమ్మ

(గేయ కావ్యం)

పూజల్లో
పూవుల్లో
రంగుల్లో
రుతువుల్లో
బీచీలో
నాదంలో
వేదంలో

బోయి భీమన్న

అంకితం
బాపురెడ్డికి

సిరికొండ కడుపులో
విరుదీపమై వెలసి
గోల్కొండ గుండెలో
మేల్కవితగా విరిసి

సకలాంధ్ర కెవరు అక్షర ప్రభ !
ఆ బాపు రె
డ్డికి అగుత బొమ్మ అక్షయ శుభ !

భాగ్మతీ – కులి కుతు
బ్షా యుగళ మే యుషో
భూమిలో గళ మెత్తి
భూపాల పాడిరో

సకల కల్యాణ రాజేశ్వరి
శ్రీ బాపు రె
డ్డికి అగుత సంతత శుభంకరి !

పితలు చిన్నపుడు, ముస
లి తనమ్ములో సుతలు,
అందరూ నా కిపుడు–
ఎందరో నా కెపుడు–

సకల సంపత్ కళల ప్రాపు
మా బాపు రె
డ్డికి అగుత సురగోపు వేపు !

– భీమన్న

# దర్పణం

బొమ్మ అంటే ఫొటో.

నాయకుడు లజ్జాళువు. నాయిక గంభీర. ఇద్దరూ ఎంతగానో ప్రేమించు కొంటారు. కలిసి తిరుగుతారు. కష్టసుఖాలు, భావాలు, అనుభూతులు పంచు కొంటారు. అయితే–

పరస్పరం తమ ప్రేమను మాత్రం వెల్లడించుకోలేరు.

చివరకు అతడు ధైర్యం చేసి, ఒకనాడు, ఆమె ఫోటో ఒకటి కావాలని అడుగుతాడు.

ఆమె సంతోషంతో తన ఆల్బం తెచ్చి అతడి ముందు ఉంచుతుంది.

అతడు వణుకుతున్న చేతులతో అందులో నుంచి తనకు నచ్చిన ఫొటోను ఒకదాన్ని తీసుకొని, ఇంటికి వచ్చేస్తాడు.

ఆ క్షణం నుంచీ అతడు ఆ బొమ్మను (ఫొటోను) ఆరాధించడం ప్రారంభిస్తాడు.

ఆ ఆరాధనే ఈ బొమ్మ కావ్యం.

అసలు నాయికకు చెప్పుకోలేని తన ప్రేమను అతడు ఈ బొమ్మకు చెప్పుకుంటాడు. ఆమెతో కలిసి తిరిగినప్పటి మాధుర్యాలను ఎన్నిటినో నెమరుకు తెచ్చుకొని, విరహంలో మునిగిపోతాడు.

ఆమె ఆరాధన అతణ్ని క్రమంగా సౌందర్యారాధకుడుగా, కవిగా, వేదాంతిగా మార్చి వేస్తుంది. ఆ బొమ్మ ఒక ప్రతీక కాగా – దాని ద్వారా అతడు విశ్వచైతన్య శక్తినే దర్శించి, తన్మయు డవుతాడు.

రాగం భోగానికీ, భోగం త్యాగానికీ, త్యాగం యోగానికీ మార్గదర్శక మవుతూ వుంటై. ఈ శృంగార కావ్యంలో చివరకు చైతన్య మూలకమ్మైన యోగశక్తినే ధర్శించవచ్చు – సహృదయులైన అనుభవజ్ఞులు.

ఇది మాత్రా ఛందస్సులో నడిచిన గేయ కావ్యం. ఒకొక్క గేయంలో ఏడు చరణా లుంటై. సాధారణంగా ఈ చరణాలు అయిదేసి మాత్రల అంగలతో నడుస్తై. వీటిని ఆనందంగా పాడుకోడానికి ఏ రాగమ్మైనా పనికొస్తుంది. అందులో మోహన గాని, హిందోళ గాని, సింధుభైరవి గాని ఎక్కువ అనుకూలంగా వుంటాయను కొంటాను.

# స్వయం వరణం

ఈ బొమ్మ కావ్యాన్ని నేను 1952లో వ్రాశాను. తరువాత, తోచినప్పుడెల్లా మెరుగులు దిద్దుతూ వచ్చాను. అంటే – ఈ బొమ్మ వ్రాత ప్రతికి నేటికి ఇరవై రెండు సంవత్సరాలు నిండా యన్నమాట ! నవనవోన్మేష ప్రజ్ఞాప్రఫుల్ల సౌందర్య కూడ అయిందన్న మాట !

పెసరట్లు, ఇడ్లీలు వంటివి వేడివేడిగా భోక్తల కందాలి. చాల రకాల కవితలు వ్రాసిన వెంటనే పత్రికల కెక్కాలి. లేక, మార్కెట్లోకి వెళ్ళాలి. నా కవిత దేనికీ అలాంటి అదృష్టం పట్టలేదు. నా కవితలన్నీ – పూర్వయుగాల రాజకుమార్తెలలా – మెజారిటీ తీరిన తర్వాత స్వయంవరాలు చేసుకొన్నట్టివే.

అందులో ఈ బొమ్మ అగ్రగణ్య !

మొట్టమొదట ఈ బొమ్మను అచ్చు కిద్దామన్నవాడు మిత్రుడు శ్రీ జె.బాపురెడ్డి. అది 1962. అప్పటి కాయన విశాఖపట్నంలో డిప్యూటీ కలక్టరు. అయితే – అప్పుడు బొమ్మకు బదులు నా ఆంగ్ల కవితల సంపుటి The Seventh Season అచ్చయింది !

1965లో బాపురెడ్డే చేసిన మరో ప్రయత్నంలో, బొమ్మకు బదులు రాగ వైశాఖి అచ్చయింది.

ఓహో, రాగ వైశాఖి !

అందమైన తెలుగు వచన రచనకు ఒరవడి – రాగ వైశాఖి ! మానవ సుఖశాంతులకు ఆదర్శం – రాగవైశాఖి !

రాగవైశాఖిని–

''చదువని వా డజ్ఞుండగు,
చదివిన సదసద్వివేక చతురత కల్గున్,
చదువగ వలయును జనులకు !''

అన్నాడొక మిత్రుడు.

అప్పటి నుంచీ – నిజానికి, నా తొలి గద్య కవితల సంపుటి అయిన ''అనాది కొస నుంచి అనంతత్వం లోకి'' అచ్చవడం దగ్గర నుంచీ – ఇప్పటి వరకు కూడ, నా ప్రతి గ్రంథ ముద్రణ లోను బాపురెడ్డి వరద హస్తం వుంటూనే వుంది. బొమ్మ మాత్రం వెనకబడిపోతూనే వచ్చింది !

బహుశా – ఈ వెనకబడ్డతనం వల్లనే నేమో – నాకు బొమ్మంటే చాల ప్రీతి. ఈ ఇరవై రెండు సంవత్సరాలలోను కొన్ని వందలసార్లు నేను దీన్ని సాహితీ సభల్లో కావ్యగానం చేశాను. సర్వప్రజా సౌహార్ద సన్మానాలు అందుకున్నాను ! ఆనందించాను.

## ప్రజ్ఞాని బాపురెడ్డి

ఈ కావ్యం అంటే నాకెంత ఇష్టమో – అంతకంటె ఎన్నో రెట్లు ఇష్టుడు, హితుడు నాకు బాపురెడ్డి.

వ్యక్తి – శక్తి మంతుడూ, చైతన్యవంతుడూ, సహృదయుడూ, దయాళువూ అయి వున్నప్పుడు – అతడు ఔన్నత్యపు శ్రేణిపై పైకి పోయే కొలదీ అతడి దృక్పథం విశాలతరం అవుతూ వుంటుంది. హృదయం అమృతపూర మవుతూ వుంటుంది.

దీపం ఒక్క గదికే వెలుగిస్తుంది. అది వీధి లోకివస్తే ఆరిపోతుంది. వీధి దీపానికి ఇంటి దీపాని కంటె నిగ్రహశక్తి ఎక్కువగా వుండవలసి వుంది. నిజమైన జీవకాంతి ఎంత ఎత్తుకు వెళితే, సూర్యుడు లా, అంత ఎక్కువ పరిధికి వెలుగు చూపుతుంది.

అలాంటి సహృదయ సూర్యుడు బాపురెడ్డి.

''తమ కార్యంబు పరిత్యజించియు పరార్థ ప్రాపకుల్ సజ్జనుల్'' అన్న భర్తృహరి సూక్తికి లక్ష్యప్రాయుడు బాపురెడ్డి. ఆయనకు ఈ కృతిని అంకితం ఇచ్చి, నేను ధన్యుణ్ని అవుతున్నాను – విష్ణువుకు లక్ష్మి నిచ్చిన క్షీరసాగరుడిలా!

ఆధునిక కవితకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పుచ్చుకొన్న ''బాపురెడ్డి గేయాలు'' కవితా సంపుటిని 1967లో నాకు అంకిత మిచ్చాడు బాపురెడ్డి. ఆయన నా పట్ల ప్రదర్శిస్తూ వస్తున్న అతిలోక సమౌదార్య దివ్యతలో అదొక ప్రకరణం. ఆయన నాకిచ్చిన కృతి లోని ప్రతి గేయమూ ఒక ప్రత్యేక రసధుని. అది నవరస పూర్ణ కుంభం.

ఇప్పుడు నే నాయన కిస్తున్న ''బొమ్మ'' ఏక రస పరిపూర్ణ శృంగార మధుర. నా ''అకాండ తాండవం'' శివాద్వైతమైతే, ఈ ''బొమ్మ'' రసాద్వైతం.

## అయాచిత ప్రశంసలు

ధనికులు, పేదలు అనే తేడా లేకుండా అందరికీ అన్నం అవసర మైనట్టే, ఆనందం కూడా అవసర మైనట్టిది. ధనికులు ఆనందాన్ని మార్కెట్లో కొనుక్కోగలరు. పేదలు తమకు కావలసిన ఆనందాన్ని తమ గుడిసెల్లోనే పండించుకోవలసి వుంది.

అందువల్ల – ఆనందం కలిగించే శృంగార రచనలు ధనికుల కంటె పేదలకే ఎక్కువ ఇష్టం. ఎక్కువ అవసరం. జానపద సాహిత్యాన్ని పరిశీలిస్తే ఈ సత్యం కనిపిస్తుంది. ఈ బొమ్మ కూడ రసమయి అయిందందుకే.

నా గ్రంథాలకు పీఠికలు నేనే వ్రాసుకోవటం నా అలవాటు. ''దీపసభ''కు నిడదవోలు వారు, ''కావ్యకుసుమాల''కు కప్పగంతుల వారూ, కురుగంటి వారూ పూర్వం పీఠికలు వ్రాసి వున్నారు. వారు నా కత్యంత పూజ్యపాదులు.

ఇప్పుడు నేనే పీఠికలు వ్రాసుకొంటూ వుండడం వల్ల, ఆ పీఠికలలో నా లక్ష్యాలను, సిద్ధాంతాలను, భావాలను వ్యక్తం చేయగలుగుతున్నానే తప్ప – నా గురించి ఇతరుల అభి ప్రాయా లేమిటో ఇవ్వలేకపోతున్నాను. ఈ మధ్య నాకు వచ్చిన వ్యక్తిగత లేఖలలో కొన్నిటి నుంచి – నా గురించి అయాచితంగా ప్రకటించబడ్డ కొన్ని భావాలను ఇక్కడ పొందుపరచడం ద్వారా ఆ లోపాన్ని తీర్చుకొంటున్నాను. అడిగి వ్రాయించుకొనే ప్రశంసల కంటె అయాచితంగా వెలువడే భావాలు ఎక్కువ విలువైనవి కదా!

## బ్రహ్మ వాక్కులు

1974 ఫిబ్రవరిలో, మద్రాసు లోని వాణీమహల్‌లో, పద్మభూషణ బిరుద ప్రాప్తి సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ బి.ఎన్.రెడ్డిగారికి జరిగిన సన్మాన సభలో నేను కావ్యగానం చేసినప్పుడు – ఆనంద పరవశులైన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు ఆ వెంటనే నాకు బొట్టు పెట్టి, పూలు పోసి, శాలువ కప్పి సన్మానం చేశారు. ఒక అరగంట సేపు నన్ను గురించి ప్రసంగించారు. పరమ శక్తిమంతమైన పదజాలంతో, మధువును మించి మత్తుగొలిపే మంచి మంచి ప్రశంసలతో ముంచి ఆకాశాని కెత్తేశారు.

నాపట్ల వారికి కల వాత్సల్యం గోలోకం లోని పాలకడలి నుంచి రెడీగా ప్రవహించి వచ్చిన అమృతగంగా స్రవంతే అయిందా క్షణం. ఆనాడు నేను చేసిన కావ్యగానం ఈ బొమ్మ కావ్యం నుంచే!

గోపాలరెడ్డిగారి ప్రశంసా సుధా ధారా భారానికి తట్టుకోలేక కుంచించుకు పోయిన నేను ఆ విషయం వారికి లేఖా రూపంగా తెలుపుకోగా – రెండు మూడు రోజుల లోనే నాకు వారు జవాబిస్తూ అన్నారు –

"On return from Madras this morning, I have seen your kind letter. It touched me deeply.

I really felt that way. Your contribution to modern poetry is something unique. There is something new in what you say. There is a lot of lyrical element in some of your poems. That appeals to me.

You are humble, you are mild and you don't say ill of others. There are the qualities I admire. ........"

ఇవి వారు ఆంగ్లంలో స్వదస్తూరీతో వ్రాసిన లేఖ లోని వాక్యాలు. ఈ ప్రశంస బొమ్మకు చెందవలసి నట్టిదే. (ఈ వాక్యాలను తెలుగులోకి అనువదించాలా అని చాలా ఆలోచించాను. అక్కర లేదనిపించింది !)

## సాహిత్య శక్తి

1962 లో ఈ కావ్యాన్ని అచ్చు కిద్దామనుకొన్నప్పుడు, డాక్టర్ అరిపిరాల విశ్వం గారు ఒక చక్కని ప్రశంసను వ్రాసిచ్చారు. అది ఏమైపోయిందో – నా పాత కాగితాల పాతరలలో ఎంత వెతికినా దొరకలేదు. అదిక్కడ ప్రత్యక్షంగా లేకపోయినా, ఆయన హృదయం నుంచి వచ్చినట్టిది కనుక – భావ రూపంలో అనుసరించి వుంటూనే వుంటుంది. డాక్టర్ విశ్వంగారు ఆధునిక సాహిత్య కీకారణ్యంలో ఆశ్రమవాసి అయిన బ్రహ్మర్షి. ఆయన కవి కనుక ఋషి. బ్రహ్మర్షి అంటే The Omni Scientist.

సృష్టి రహస్యం తెలిసి, ఆ సృష్టి సమస్తానికీ తానే తండ్రి నన్న మమకారంతో, సర్వ భూతాలూ తన ఆత్మరూపాలే అన్న సమదృష్టి కలిగి, స్వపర భేదం లేకుండా విశ్వశ్రేయం కోసం నిరంతరం కృషి చేసేవాడు బ్రహ్మజ్ఞాని.

ఏదో ఒక జాతి కోసం, ఏదో ఒక మతం కోసం, ఏదో ఒక సిద్ధాంతం కోసం నినాదాలిచ్చే వాళ్లు, పోరాటాలు జరిపే వాళ్లు – వాళ్లెంత గొప్పవాళ్లైనా – పట్టి కుక్షింభరులే! పొట్ట కోసం తంటాలు పడేవాళ్లే! సంఘసేవకుడైనా, శాసన సభ్యుడైనా, సచివోత్తముడైనా, సర్వశాసన నియంత అయినా – సర్వ మానవ, సర్వజీవన సమతను పాటించని వాడెవడైనా సరే – వాడు పట్టి పామరుడే !

పదవి, అధికారం, శాసకత్వం, తెలివితేటలు, సర్వవిద్యా సనాథత్వం – అన్నీ ఎందుకు ? తన కిష్టమైన భోజనంతో, భోగంతో ఆరోజు గడిచేటందుకేగా ?

"ఈ పూట నీ కిష్టమైన భోజనం పెడతాం. నీవు కోరిన భోగం నీ గదికి అందిస్తాం" అనండి ! ఎంతటి వాడైనా మీ వంక ఆశతో చూస్తాడు. హామీ ఇవ్వండి ! మీ పాదసేవ చేస్తాడు. మాంసం ఎరచూపి, ఈ మానవ సింహాల చేత ఎలాంటి గడ్డినైనా తినిపించవచ్చు. ఈ సత్యాన్ని మనం నేటి ప్రజాస్వామిక రాజకీయ సర్కస్‌లో నిత్యం చూస్తూనే వున్నాం.

ఇంతకూ – ఇక్కడ నేను చెప్పవచ్చిం దేమిటంటే – తక్కిన జీవసృష్టితో పోల్చి చూస్తే – మానవ సృష్టి అనుకొంటున్నంత ఉత్తమమైంది కాదని !

సింహానికి పంజాలాంటిదే మనిషికి మెదడు ! సింహం తన పంజాతో విజాతి జంతువుల్ని వేటాడుతుంది. మనిషి తన మెదడుతో స్వజాతి జంతువుల్నే వేటాడతాడు !

ఇక్కడొక మినహాయింపు వుంది. మెదడుతో సమానంగా, ఇంకా ఎక్కువగా కూడ, హృదయం వికసించిన ఋషులు మానవులలో వున్నారు. అట్టివాళ్లు మౌనంగా ఆశీర్వదించినా – అదే పదివేల పురుష సూక్తాల పెట్టు !

## బాల వాక్కులు

''ఆరోజు కవి సమ్మేళనలో మీరు చెప్పిన రసాద్వైతం నాకు చాల నచ్చింది. నాకూ అలాంటి భావమేదో ఉన్నా, అది ఇలా వ్యక్తం కాదు. అది అవ్యక్తం మాత్రమే.

ఈ వ్యక్తావ్యక్త భావాలతో మేమెక్కడ కవి సమ్మేళనాలు జరిగినా, అమృతం లభించి నట్టు హాజరవుతూ వుంటాము. కాని ఏవేవో అవ్యక్త భావ ప్రచురాలైన కళాఖండాలే తప్ప – సుస్పష్టమైన భావాలతో, ఎంతెంతో ఆలోచనల్ని రేకెత్తించే కవితలు చాల తక్కువగా మాత్రమే మాకు లభిస్తాయి. ఈ మధ్య ఆ తక్కువ కూడ లేకుండా పోయాయి. అట్టి స్థితిలో మీ ''బొమ్మ'', ''మారని వాడు'' కూడ మమ్మల్ని కదిలించి వేశాయి....''

ఏడాది క్రితం, పెదపులివర్రు గ్రామంలో, డాక్టర్ ఎన్.వి.కృష్ణారావుగారు ఏర్పాటు చేసిన కవిసమ్మేళనలో నేను చేసిన కావ్యగానాన్ని ప్రశంసిస్తూ కుమారి ఝాన్సీ లక్ష్మి వ్రాసిన లేఖలో ఒక భాగం ఇది. అదే సభలో ఉండి, బొమ్మను మెచ్చుకొన్న అనేకమందిలో మరొక కుమారి ఉమాదేవి ఇలా వ్రాస్తున్నది:

'మే మెవరిమో గుర్తుచేసుకోవాలి కదా ముందు ! పెదపులివర్రులో మీ ''బొమ్మ'' కవితారస వాహినిలో మునిగి మిమ్మల్ని ప్రశంసించకుండా ఉండలేక పోయామే – వారిలో ఒకరిని నేను...

....బొమ్మలో విశ్వజనీనమైన అలౌకికానందం, ఆర్ద్రత, అర్పణ, ఆరాధన, అనురాగం ఉండి – ఆ రోజు నా హృదయంలో శాశ్వత స్థానం సంపాదించుకొంది. ఆత్మార్పణలో ఉండే ఆనందం అనుభవం లోకి రావాలే కాని, అది అనిర్వచనీయము – అనంతము. బొమ్మ ప్రచురణ కాగానే మాకు తప్పక పంపుతారని ఆశిస్తాను. బొమ్మ నా దృష్టిలో సజీవ చిత్రమే అనిపిస్తుంది.''

## ఆదర్శ మానవత

ఉమాదేవే మరో లేఖలో "...మొన్న శశాంక గారి శ్రద్ధాంజలిలో మీ కవితా హృదయం ఆవేదన విన్నాను (రేడియోలో). వెంటనే బొమ్మ గుర్తు కొచ్చింది. పెదపులివర్రులో మీరు చదివినప్పుడు నా హృదయం నాకే తెలియని అనిర్వచనీయమైన బాధతో కదిలింది. ఎంకి పాటల్లో, కృష్ణశాస్త్రి గేయాలలో, శ్రీశ్రీ కవిత్వంలో, ఠాగూరు గీతాలలో, చలం మాటల్లో, కాళిదాసు మేఘ సందేశంలో, Shakespear Tragedies లో ఇదే విశ్వజనీనమైన అనుభూతి దాగుంది. ఆ అనుభూతి ఒక్కొక్కరికి ఒక్కొక్క రకం. నాకు ఆ ఉత్తమ సాహిత్యాన్ని చదివినప్పుడు హృదయమంతా తియ్యని బాధతో, అశాంతితో నిండిపోతుంది. ఉష్ణం ఉష్ణేన శీతలం అన్నట్టు, ఈ జిజ్ఞాస ఉత్తమ సాహిత్య సాహచర్యంతోనే ఉపశమించేది. బొమ్మ కోసం ఎంతో ఆత్రతతో ఎదురుచూచే సాధకురాల్ని నేను..."

ఇంతగా ఆరాధించే ప్రౌఢ బ్రహ్మలూ, బాల సరస్వతులూ దొరికినప్పుడు, నిజంగా బొమ్మ దేవతే అయి కూర్చోదా!

ఈ బొమ్మ కావ్యాన్ని విని, ఎంతో మెచ్చుకొన్న మిత్రులలో శశాంక ఒకరు. ఆయన శాశ్వత శశాంక మూర్తే అయిపోయారు. ఇక్కడ ఆయనను ఉమాదేవి స్మరించడం ఎంతో ఉచితంగా వుంది.

బాధలు ఎన్నో విధాలు. అందులో మధుర బాధే కవిత.

ఈ లేఖల లోని కొన్ని వాక్యాలను నా బొమ్మ పీఠికలో వాడుకోడానికి అనుమతించ వలసిందిగా కోరగా, ఉమాదేవి ఇలా వ్రాసింది:

"....బాల వాక్కే బ్రహ్మ వాక్కన్నట్టు, మీరు మా భావాలను ఆదరించారు. మీ సహృదయతకు ధన్యవాదాలు.

బొమ్మకు ఉగాది శుభాకాంక్షలు. ఈ సంవత్సరం అది తప్పక సరస హృదయ సామ్రాజ్ఞీత్వాన్ని పొందాలి. మీ లక్ష్యాన్ని, రసాద్వైతాన్ని బొమ్మ సాధించ గలదు."

'నిను తెచ్చుకోలేక
నీ బొమ్మ తెచ్చుకొని
పూజలో నెలకొల్పి
పూజారి నైనాను'

ఇది క్షుభిత హృదయాలకు, నిరాశా తప్త హృదయులకు ఉపశమనం. ''పూజా ద్రవ్య లేశమైనాను'' అనడం – ఆత్మార్పణలోని ఆనందం, శాంతి, ఔన్నత్యం ! నువ్వు నాకేమిచ్చా వనే ప్రశ్న లేదు. నేను నీకేమివ్వ గలుగుతున్నాననే దయాంతఃకరణే ఆత్మార్పణం.

''మీ అంతరంగ మధనంలోని చేదును మీరు మ్రింగి, సమాజానికి పంచి పెట్టిన అమృతమే బొమ్మ సృష్టి. నా సాహసాన్ని మన్నించగలరనుకుంటాను.''

''శరీరానికి మధువు
హృదయానికి ప్రేమ
ఆత్మకు కవిత
ఆనంద హేతువు''

లన్నారు మీరు. ఈ మూడింటిలో మొదటి దొక్కటే దొరకేది. మిగతా రెండూ మృగ్యాలే. అందుకేనేమో మానవుడు ఆ లోటును పూర్తి చేసుకోడానికి ఆత్మనూ, హృదయాన్నీ మధువుతో జోకొట్టటానికి అలవాటు పడ్డాడు.

''ఆత్మకు నచ్చిన కవిత బొమ్మలో వుంది. బొమ్మ కళ్లతో లోకాన్ని చూస్తుంది. మనస్సులో ఆలోచింప చేస్తుంది. ఆత్మలో తిష్ఠ వేస్తుంది....''

ఉమాదేవి బాల వాక్కు బ్రహ్మ వాక్కే అయింది. లేకపోతే – ఇన్నేళ్లుగా మూలపడి వున్న బొమ్మ ఇప్పు డెలా వెలుగులోకి వచ్చింది !

కొత్తగా యథాలాపంగా, ఒక మహాసభలో, ఏదో పది నిమిషాల కావ్యగానాన్ని మాత్రం విని, జ్ఞాపకం పెట్టుకొని, మననం చేసుకొని, ఆనందంతో తమ భావాలను అందమైన భాషలో, ఏ తత్కవికి తెలపగల శ్రోతలు ఎంతమంది వుంటారు ? చాలమందే వుండవచ్చు. వారి ఆనందం కవికి అయాచితంగా లభించే అమృతం. నాకు లభించిన అట్టి అమృతాన్ని పాఠకులందరికీ పంచిపెట్టడం నా ధర్మం కనుక – ఉమాదేవి ఈ బొమ్మకు సమర్పించిన ఈ మధుర ప్రశంసా పుష్పాలను ఈ పీఠికా ప్రాంగణంలో వుంచుతున్నాను.

## పోల్చడం – పోల్చుకోవడం

నన్ను ఎవరితోనూ పోల్చడం నా కిష్టం వుండదు. జీవిత విధానంలో ఆహార విహారాలలో, అభిరుచులలో, అలవాట్లలో, శైలిలో, సాధనలో ఎవరి వ్యక్తిత్వం వారిది. ఎంత ఆకారసామ్యం వున్నా – లోకంలో ఒకరిలా మరొకరుండరు కద ?

ఇద్దరు పూర్వ కవులను గురించిన ఒక పండిత చర్చలో "ఎవరి కవిత్వం గొప్పది ?" అనే ప్రశ్న వచ్చినప్పుడు – ఆ సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు తగవు తీరుస్తూ, "రసాల మంచిదా, రసగుల్లా మంచిదా అంటే దేని కదే మంచిది. దేని రుచి దానిది, దేని గొప్ప దానిది. రసాస్వాదన చెయ్యక, రగడ దేనికి ?" అన్నారు.

అయినా – లోకంలో పోల్చడాలు తప్పవు. పోలికలు లేకుండా పండితులు మాట్లాడ లేరు. పోల్చడానికేమీ లేకపోతే – కనీసం –

"ఈ మన కవిగారు కోనసీమ కొబ్బరి తోటల్ని బహురుచిగా వర్ణించారు. ఆనాడు నన్నయ్యగారు కూడ – అక్కడి వాడే కనుక, ఆ కొబ్బరి పచ్చళ్ళ రుచిని చూడకుండా వుండి వుండడు..." అంటూ ఏ అవధానిగారో అనకుండా వుండ లేరు !

పండితుల్నే అనడం ఎందుకు ? పోల్చడం (ఉపమ) లేకపోతే – ఏ రచయిత కవిగా చెలామణి కాగలడు ? ఏ రాజకీయ పార్టీ ఎన్నికలలో అభ్యర్థులను నిలప గలదు? ఏ కన్నె, కన్నడు పెళ్లి చూపులు చూచుకోగలరు ? ఏ అధికారి ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగలడు ?

నాకు వచ్చే లేఖలలో, ఒక రెండింటిలో ఈ పోలికలకు సంబంధించి కల కొన్ని వాక్యా లను ఇక్కడ ఉదాహరిస్తున్నాను–

"మీ రాగ వైశాఖి అప్పుడప్పుడు చదువుచున్నాను. ఆనందించుచున్నాను. I think it is the book of the decade. ఎన్నెన్ని భావాలు ! ఎంత నిశితమైన భాష! 'చలం'ను మించిన భాష, భావాలు నాకు కనబడుచున్నవి. నా అభివాదములు తెలుప సంతోషమగుచున్నది....." అన్నారు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు.

"రేడియోలో 'రావయ్యా ఒకసారి' అనే మీ గేయం విని ఈ లేఖ వ్రాస్తున్నాను ... ఈ గేయం హృదయాన్ని కదిలించి మీకు జాబు వ్రాసేటట్టు చేసింది. ఈ మధ్య నేను వింటున్న మీ గేయములు సులలిత లలిత పద యుక్తములు, మృదుమధుర భావ విలసిత ములు.... మీరు మహాకవులు. నాకొక్క సందేహమున్నది... ఈ గేయాలు మీరెప్పుడు వ్రాసినవి ? నేననుకోవడం ఇలా 27–35 సంవత్సరముల లోపు వ్రాయగలుగుతారని. ఆ పరిణతి చెందిన హృదయం జీవితాంతం నిలిచిపోవటం ఒక వరమే. ఉమర్ ఖయ్యాం అలాంటి అదృష్టవంతుడు. మీరిప్పుడిలా వ్రాయగల్గు తున్నారంటే – మీరు ఈశ్వరుని కంఠ హారంలో ప్రేమగా అమర్చుకొన్న పూవు కాగలరు.

"ఏది ఏమైనా – మీరొక భిన్న మార్గా న్నవలంబించారు. చలం వచన రూపంలో (మ్యూజింగ్సు, ప్రేమలేఖలు) చెప్పిన దాన్ని మీరొక్క గేయంలో అందంగా మలిచారు..." అంటూ వ్రాసింది కుమారి ఉమాదేవి.

నా కంటె అన్ని విధాలా చాల పెద్దవారు, చాల పిన్నవారు కూడ నా రచనలను ఎంత నిశితంగా పరిశీలిస్తున్నారో – నా మీద ఎంతటి వాత్సల్యాన్నీ, ప్రేమనూ వర్షిస్తున్నారో చూపడానికే నన్ను గురించి వచ్చిన ఈ రెండు అభిప్రాయాలను ఇక్కడ ఇచ్చాను. ఆనంద హృదయాల నుంచి స్వేచ్ఛగా వెలువడే ఇలాంటి భావాలే ఉత్తమ శ్రేయస్కరాలు. ఇలాంటివి వందల కొలదీ వున్నై. నిజంగా నేను అదృష్టవంతుణ్ని.

పొల్చడం నా కిష్టం లేకపోయినా, పోల్చుకోవడం నిజంగా ఆనంద రసాద్వై తానికి పరాకాష్ఠ!

## అందరికీ కైమోడ్పులు

బొమ్మను నేను సృష్టించడానికి మూల భూతాలైన శక్తులు, ఉపశక్తులు ఎన్నో వున్నై. ఇది పాతికేళ్ళపాటి చరిత్ర. ఏ ఒక్కనాడో చేసి ముగించిన శిల్పం కాదిది. నాటి నుంచి నేటి దాకా దీనిని తీర్చి దిద్దుతూనే వున్నాను. నా కవితా సరస్వతిని మురిపించి మెరిపించే ప్రతి అందంతోనూ దీన్ని అలంకరిస్తూనే వున్నాను. అనేకమైన రాగమధుర సౌందర్యాలు దీని ప్రతి అక్షరంలోను నిక్షిప్తం చేయబడివున్నై. రస హృదయులైన ప్రతివారూ ఈ బొమ్మలో తమ రాగాత్మను దర్శించుకోగలరు. అట్టి వారందరికీ నేను శ్రద్ధాంజలిని.

కావ్యంలో భావానికి, కనీసం గేయానికి ఒక చిత్రం చొప్పున గీయించి, ముద్రించాలనుకొన్నాను. ఉచితంగా బొమ్మలు వేసి ఇవ్వగల ఉత్తమ చిత్ర శిల్పులు నా మిత్రులలో చాలామందే వున్నా – చవగ్గా బ్లాకు లెవరు చేసి పెడతారు? అందుకని, ఎనిమిది చిత్రాలు మాత్రం గీయించి, వాటినే పుస్తకమంతా తిప్పాను. ఈ చిత్రాలను గీసి పెట్టినవారు ప్రఖ్యాత చిత్రకారులు శ్రీ కొండపల్లి శేషగిరిరావుగారు వారు సంప్రదాయ చిత్రశిల్పంలో అద్వితీయ ప్రతిభాప్రాభవులు. వారికీ, ముఖచిత్రం రచించిన ఉత్తమ కవులూ, ఉదాత్తచిత్ర శిల్పులూ అయిన శ్రీ బలరామాచారి గారికీ వినమిత శిరస్కుణ్ని.

దీని రచనలో, ప్రతి రచనలో, ముద్రణలో అనేక విధాల తోడ్పడిన అనేక మంది మిత్రులకు, ముఖ్యంగా శివసత్య, శ్యామ సుందర్, మాచరాజా, మిత్తల్ మున్నగు వారికీ – ఉభయ జన సాహితీ బ్రహ్మలైన శ్రీ చర్ల గణపతిశాస్త్రి, శ్రీ లింగం మాలకొండయ్య గార్లకూ అమిత కృతజ్ఞుణ్ని.

నేను చేసే ప్రతి రచననూ సిరా ఆరక ముందే వేడి వేడిగా చదివేస్తూ, వాటిపై తన అభిప్రాయాన్ని వాడి వాడిగా చెప్పేస్తూ, మళ్లీ మళ్లీ ఆలోచింపజేస్తూ రచన లోని ప్రతి మాటనూ, ప్రతి అక్షరాన్నీ కూడా పరిశోధించి, అందులో నుంచి నాకే ఆశ్చర్యం కలిగించే అనేక నిగూఢార్థాల్ని (పెడర్థాల్ని కూడ) తీసి నా ముందు పడ్డించి మింగిస్తూ, కమనీయమైన వాటిని కంఠగతం చేసుకొంటూ, కమ్మగా పాడుకొంటూ అచ్చుకో, ఆకాశవాణికో ఇవ్వాలనుకొన్నప్పుడెల్లా శుద్ధ ప్రతులు తీసిపెడుతూ నా సాహితీ వ్యవసాయంలో అక్షరాలా అనుక్షణ సాహిత్యం వహిస్తున్న మా హైమావతికి కూడా ఈ సందర్భంలో థాంక్స్ చెప్పకుండా ఉండలేక పోతున్నాను.

## జీవితం దుఃఖమయమా?

మొన్న నేను ఈ పీఠిక ముగించుకొంటూ వుండగా శ్రీ బాపురెడ్డి మా ఇంటికి వచ్చి, పుస్తకాల గదిలో ఏవేవో పుస్తకాలతో మంతనాలు సలుపుతూ, ఉన్నట్టుండి, "ఓహో, ఈ పరమయోగుల సిద్ధాంతాన్ని మీరు కాదనడం బాగుందే" అన్నాడు నాకు వినిపించేలా.

నాకు అర్థం కాలేదు !

ఎవరి ఏ సిద్ధాంతాన్ని నేను ఎప్పుడు ఎక్కడ కాదన్నాను ?

ఆయన తన చేతిలోని Yoga in daily life అనే పుస్తకాన్ని చూపాడు. అందులో మొదటి పేజీలోని మొదటి వాక్యాలు ఇవి: "Is human life on earth a matter, fundamentally, of misery and sorrow? This is a problem which seems to have engaged the minds of the Indian thinkers since ancient times. The answer to this question, as most of them appear to believe, is in the affirmative"

ఈ వాక్యాల క్రింద గీతలుంచి, మార్జినులో "No" అని వ్రాసివున్నాను నేను. అది ఎప్పటిదో పాత పుస్తకం. అది బాపురెడ్డి చేతపడడం, ఆ వాక్యాలూ, నా వ్యాఖ్యా ఆయన కంటపడడం కేవలం కాకతాళీయం. ఈ పీఠికకు ఇది నాకు అతికినట్టు ఉపయోగపడింది ! ఇది కాకతాళీయమే నేమో !

"దుఃఖమయము జీవిత మని
దుర్బోధలు చేసి రటే !"

అనే గేయం ఒకటి నా ''రాభీ''ల గేయ సంపుటిలో వుంది. మానవ జీవితం సహజంగా దుఃఖమయమూ, యాతనా భూయిష్ఠమూనా ? ''అవును'' అని చెప్పి అజ్ఞానులూ, అప్రతిభులూ అయిన జన సమూహాన్ని తమ వలలో వేసుకొన్నారు – ఇందులో లాభసాటి బేరాన్ని గుర్తించిన తెలివి కలవాళ్లు ! ఈ తెలివి కలవాళ్లే మత గురువులు, భూతవైద్యులు, ప్రవక్తలు, బాబాలు, పీఠాధిపతులు వగైరా !

నిజంగా మానవ జీవితం దుఃఖమయమూ, యాతనా మయమూ, పాప మయమూ అయితే – ప్రతి ఒక్కడూ చావంటే భయపడతాడేం ? సంతోషంతో చచ్చిపోడేం ? తొంభై నిండిన తొక్కు వేదాంతి కూడ జబ్బు చేస్తే మందు తాగు తాడేం ? మతబోధకుడు కూడ పదే పదే పిల్లల్ని కంటూ, తాను పాప మంటున్న దానికే పాలుపోసి పెంచుతాడేం ?

ఒక్క మానవుడే కాదు – పుట్టిన ఏ జీవీ చావును కోరుకోదు. కారణం? చావు తర్వాత ఏముందో తెలియదు. స్వర్గం, నరకం, దైవసాన్నిధ్యం, మోక్షం వంటి వన్నీ వట్టి ఊహలు. బ్రతికి వున్న వాళ్లు చేస్తున్న ఊహలు ! చచ్చిపోయిన వాళ్ళ స్వానుభవాలు కావు !

జీవితం ఒక యాతనా కాదు, దుఃఖమూ కాదు, పాపమూ కాదు. అదొక నైజస్థితి ! సుఖదుఃఖాలు వగైరా అన్నీ తత్‌జీవన గమనంలోని ఆటు పోటులే ! ముందుకు సాగిపోవడం జీవిత ధర్మం. ఎవరెన్ని చెప్పినా, ఎవరెన్ని చేసినా అది సాగిపోతూనే వుంది. ఆ చెప్పేవాళ్లూ, చేసేవాళ్లూ – వాళ్లు ఎంత తెలివైన పండితులైనా, ఎంత బలమైన నియంతలైనా – కూడ ప్రధాన ప్రవాహంలో అలలే. స్వతంత్రులు కారు.

వెలుగు చీకట్లు కలిసే బ్రతకడం పూర్ణ జీవితం. వెలుగు చరం. చీకటి స్థిరం. చీకటి నిర్గుణం. వెలుగుకు అనేక గుణాలు, అనేక రంగులు, అనేక అవస్థలు. అందుకే – చీకటి నుంచి పుట్టి చీకటిలో లయించి పోయేదే అయినా, వెలుగు అంటే అంత మోజు !

## శృంగార స్పర్శ

''మీ రన్నట్టు, శృంగారం పాలు ఏమాత్రమైనా కలిస్తేనే తప్ప, రచనకు రుచి రానట్టుంది'' అన్నాడు బాపురెడ్డి, నాకు తన కొత్త కవితను ఒకదాన్ని వినిపిస్తూ.

శృంగారమే రసం, రసవంత మయినట్టిదే కవిత్వం. ఇది కదా నాసిద్ధాంతం!

రాజకీయ, సాంఘిక విమర్శలు, నీతులు, ఉద్బోధలు ఏ రచనలకైనా వస్తువులు కావచ్చు. అట్టి రచనల లక్ష్యం రాజకీయ, సాంఘిక ప్రయోజనాలే.

రెచ్చగొట్టే రచన ఎంత గొప్పదైనా, అది రాజకీయ ఉపన్యాసమే కాగలదు. ఉపన్యాసం పద్యంలోను, గేయంలోను కూడ వుండవచ్చు. అది కవిత మాత్రం కాజాలదు. మన ప్రాచీన శాస్త్రాలన్నీ శ్లోకాలలోనే వున్నై. కాని వాటిని మనం కావ్యా లనడం లేదు. శాస్త్ర, దేశ, జీవిత, ఉద్యమ చరిత్రలు పద్యాలలో వ్రాసినంత మాత్రం చేత – అది కవిత్వం కాజాలదు.

కవిత్వ లక్షణం రెచ్చగొట్టడం కాదు, ఊరించడం. కవిత యుద్ధరంగం కాదు, ఉద్యాన వనం. టెర్రరిజం కాదు, బాలయోగిత !

దంత నఖక్షతాదుల వల్ల రక్తధారలు ప్రవహించినా, అది రసమే. కత్తుల, తుపాకీ గుండ్ల వల్ల ఒక్క నెత్తురు బొట్టూ రాకపోయినా, అది రాజకీయమే.

''ఇది భీమన్న ఆధునిక రససిద్ధాంతం'' అన్నాడు బాపురెడ్డి. ''భీమన్న క్షత రక్త సిద్ధాంతం'' అన్నాడు మళ్ళీ !

రసంగా మారే గుణం గల ఆహారం తీసుకొంటేనే అది జీర్ణ మవుతుంది. కత్తులూ, సీసపు గుళ్ళూ మింగితే ఏమవుద్ది ? శరీర పోషణలో కాల్షియం లోపిస్తే, సున్నం ముద్దలు మింగుతామా ?

## ఆహారం - ఆనందం

రసం ఎంత ఎక్కువగా వుంటే జీవం అంత పుష్కలంగా వుంటుంది. జీవ పౌష్కల్యమే సౌందర్యం. యౌవనంలో వున్న సౌందర్యం ఆ ముందూ, ఆ వెనకా లేకపోవడానికి అదే కారణం.

మనిషికి అనేక సమస్య లున్నై. ఒక్క మనిషికే కాదు, ప్రతి జీవికీ వున్నై. అందులో అతి ప్రధానమైన సమస్య తిండి సంపాదన. జీవ సంఖ్య పెరిగే కొలదీ, తిండి దొరికే అవకాశం తగ్గిపోతూ, దాని సంపాదనలో పోటీ ఏర్పడుతూ వుంది. పోటీలో బలం కలవాడు ఎక్కువ సంపాదించుకోవడం సహజం. సంపాదించుకొన్న ఆహారం అన్యాక్రాంతం కాకుండా అనేక ఉపాయాలను అవలంబించడమూ సహజమే. అట్టి సహజ ప్రవృత్తి నుంచి మానవుణ్ణి మార్చడం అంత సులభమేమీ కాదు.

నీతులు, ధర్మ బోధలు, పాప పుణ్య భయాలు, సామ దాన భేదోపాయాలు అన్నీ విఫలమై పోయిన తర్వాతనే చివరకు దండోపాయం స్వీకరించ బడింది. దండోపాయం

# బొమ్మ

## వేదంలో



నా చేత నీ బొమ్మ
నవ కావ్య మాయె నే !
కావ్య మాధురి కైన
కనికరించగ లేవె ?

రస రమ్య భావ బంధురము !
ఈ మధువు
రస హృదయ రాగ సింధురము !

**2**

రక్తాలు చింద, నా
రక్తి రాగాలు – నీ
పాద పద్మ రజాన
పాటలను రచియింప-

చిత్తజుని హేతి వన్నారు !
నా గుండె
చీల్చుకొని పోతి వన్నారు !

3

స్వర లహరి ఆనంద
సాగరములో వోల
నేను నీ యెద లోన
నిస్తంద్రుడనై పోన ?

ఏ రాగ భోగాల కేని
నీ కొలువె
క్షీరాబ్ధి యౌ కదే, రాణి ?



4

మానవునితో పాటు
మానసములో మూర్తి
అనుభవాలను పంచు
కొన లేని దీ బ్రతుకు !

కమనీయ సమయాలను
నీవు నా
కడ లేక చింతింతును !



5

అమృత స్వరూప మో
ఆత్మే నీదై యుండ
తమి యేలనో వట్టి
తనువుకై అనుకోకు !

మాలలో సూత్ర మొక్కటియె
కాని-
మల్లె మొగ్గలు దేని కదియె !

6

ఆత్మ దారము పొడవు
నా - ఎదల వగడాలు
వదులుగా గుచ్చి - ఈ
గదులు కట్టి రెవారో !

గది నుండి గది కింత దూరము !
మనసు
గడప దాటుట కింత పైనము !

7

పుట్టి నప్పటి నుంచి
గిట్టు తెరువును బట్టి
ముందు కనుకొని సాగు
మంద భాగ్యుడు జీవి !

మతిమాలి వర్వులిడు నేలో !
శాశ్వత
స్థితి యేదొ కనగోర దేలో !



8

ముద్దు లొలికే కలువ
మొగ్గ కౌగిలి చేర
ముసలి చంద్రుడు కూడ
పసి బాలుడౌ కాదె ?

హాని వృద్ధుల మాట కేమి
రస లుబ్ధు
డే నిత్య జీవన స్వామి !



## 9

స్మృతియె జీవనము, వి
స్మృతియె మృత్యువు కదా ?
స్మృతి లేని దే సుఖ
స్థితి యైన నెందులకు ?

నేను నేనుగ నుండ లేనా ?
నిను కూడి
నిర్నిద్ర భద్రు కాలేనా ?

## 10

ఆశ లన్నీ మరిగి
ఆవిరై పోయెనే !
తలపు లొరసుక, తమకు
తామె చిచ్చిడు కొనెను !

ఎంత చండ ప్రభాకరము ?
నీ ప్రభుత
ఎడ లేని రాగ పంజరము !

## 11

అభ్యుదయ మని చెప్పి
ఆహ్వాన మంపి-
కడలేని బాటలో
నడిపింతు వెన్నాళ్లు ?

అందమే కాదు నా చుట్టు,
ఎంతెంతో
ఆర్తియును మిన్ను ముట్టు !



## 12

కలలు, కమ్మదనాలు
కళలు, కల్యాణాలు
ఎన్నైన కడుపు నిం
డిన మీదనే కాదె?

ఎన్ని ఆకటి కళ్ళొ చీల్చు !
గుండెలను
ఎన్నెన్నొ కన్నీళ్ళు పీల్చు !

## 13

ఉవిదరో, కాలాహి
ఒడ లెల్ల పడగలే !
పడగ నీడల నిట్లు
బ్రతుకు నెల్ల జగాలు !

అభయ హస్తము లేని స్రష్ట
వీధిలో
అనద కంటెను చాల భ్రష్ట !



## 14

మనసు చీకటి లోన
మసలు నీ నీడ-
తెల్ల త్రాముగ లేచు !
మల్లె దండగ తోచు !

నాగ స్వరము పట్టు వలెనో !
నిను పట్టు
రాగ స్ఫురణ చాలునో !

## 15

సౌఖ్య చందన వృక్ష
శాఖలను చుట్టు కొని
కష్టాల నాగు లెవొ
కస్సు మను, బుస్సు మను !

సాహసే లక్ష్మి యౌను కద ?
వైశాఖ
చర్చలకు చందనము వలద ?



## 16

మానవము ఒక దివ్య
మహిత మందారమా ?
కానె కా, దది చిన్న
తేనె మామిడి గున్న !

నూరు పువ్వులు, వేయి పండ్లు-
దాని
దారి పొడవున లక్ష ముండ్లు !

## 17



ఏ పడగ విచ్చినా
నీ పాద కమలమే,
ఏ ముల్లు గిచ్చినా
నీ మృదు నఖక్షతమె-

ధీ దేవివే, వయస్య !
నీ ప్రోల
కా దేదియును సమస్య !

## 18

బ్రతుకు తెరు వెదో ఒకటి
ప్రతి జీవికిని వలయు,
మానవుని వైశిష్ట్య
మానంద వరణమే !

నిశ్శ్రేయ సానంద పూర్ణం
నీ పొందు
నిశ్శేష పూర్ణ లబ్ధం !

## 19

లక్ష్య మానంద, మది
లక్ష రీతుల నుండు,
ప్రణయార్ద్ర మైనదే
పరమార్థమౌ కదే !

రస రాజ్యమున కీవ రాణివి !
నా రాగ
రమతకే నీవు నిశ్రేణివి !



## 20

వెలుగు నీడల నడుమ
విరహ మి ట్లెన్నాళ్ళు ?
ఇద్దరినో, అద్దరినో
ఇద్దరము మనలేమె ?

నన్నటకో, నిన్నిటకో చేర్పద ?
బొమ్మ
నవ రసాద్వైత నౌక కద ?



## 21

దివ్య లోకము నుంచి
దిగి రమ్ము నా కేసి,
అవ్యక్తమును త్రోసి
అరుదెంతు నీ కేసి !

ఆ నడుమ కలుసుకొని మనము
నవ నూత్న
మానవము నిర్మింతము !

## 22

ఎవరి దీ బొమ్మ ? నా
ఈవ్వదే నేమొ !
నిను నేనె కల్పించు
కొని, వెంట వడితినో !

పొర మాత్రమౌ గాక తేడా-
ఆ చిన్న
పొరపొచ్చెమే లోక పీడ !

## 23

నేనే జగత్తు, నీ
వే నా మహత్తు !
బొమ్మె లేకున్న ఈ
భోగ మెచటిది నాకు ?

నేతి నే తను చేగి యేగి
నిన్ను
నేటి కిట కలిసి నా నాగి !



## 24

వేదాల కటు నుంచి
నాదమై ప్రసరించి,
రస బిందువున నిట్లు
ప్రతి బింబ మైనావు !

పసిడి తామర పూల పల్లకి ?
నీ పూజ
పరమా మృతానంద పల్లకి !

## 25



నా బ్రతుకు తోట చి
న్నది, పూలు బహు కొద్ది,
కొద్ది యైనను గాని
ముద్దు లొలికించేను-

ప్రతి ముద్దు నిన్నె ప్రసుమించు
కే ల్మోగిచి
ప్రతి రుతువు నిన్నె ప్రచురించు !

## 26

అష్టాంగ సుందరీ !
ఆనంద షోడశీ !
వెలుగు నీడల విశ్వ
నలినీ వినోదినీ !

అనమాన సుఖ దాయకులము
మనమె
రస వేద రుషి వాటికలము !


## 27



నేను నీ దరి జేర
నీవుగా విరిసేను-
నీవు నా దరి జేర
నేనుగా వెలిగేవు !

ప్రత్యేకతలె శుభాక్షతలై
జీవి కై
శ్వర్యమై, ఇక మనెద మొకటై !

❋ ❋ ❋



## అంకితం

# గజలు గాంధర్వ మురళీకృష్ణ గారికి

గాన సరస్వతి మురళీ కృష్ణ!
గజలు గాంధర్వ మురళీ కృష్ణ!
నీ కళ కిదె మా అభివాదం,
లోక శ్రోతల జయ నాదం ॥

ఉరుదూ మధు రస కోశం పిండి
ఉల్లములకు ఉల్లాసం పంచి
మానవతకు దివ్యత పూయించే
మధుర గాయకా, మురళీ కృష్ణ ॥

సత్య సుందర శివం నీ చరిత
సాధు మందిరం నీ వదాన్యత!
అందుకొమ్ము నా పాటల తోట
అలరింపుము నీ తీయని నోట ॥

– భీమన్న

## స్పందన

"ఇలు తిరుగు, తిరుగు తిరుగు
ఎక్కడికా పరుగు?
అందున్నది మిరప చేను
అణగును నీ పొగరు!"

పుట్టి నెలైనా కాని కోడె దూడ అందకుండా పరుగులు పెడుతున్నప్పుడు దానిని మరలించడానికి వెంట పరిగెడుతూ నేను చిన్నప్పుడు పాడుకొన్న ఇలాంటి పాటలు కొన్ని ఇప్పుడు నాకు లీలగా జ్ఞాపకం వస్తున్నై.

చిత్రమైన సంగతి ఏమిటంటే, ఇంత వరకూ జ్ఞాపకానికి రాని నా బాల్యం లోని అనేక సంగతులు ఇప్పుడు ఈ ఎనభయ్యో పడిలో జ్ఞాపకం వస్తూ వుండడం. కొన్ని సంగతులు స్వప్నాలలో కనిపిస్తూ వుంటే, మరికొన్ని సంగతులు ఆలోచనల అంచులపై హంసల్లా వ్రాలి పోతూ వుంటున్నై. చాలా స్పష్టంగా వుంటున్నై కూడా. చిత్రాతి చిత్రమైన అనుభూతులకు లోనవుతూ వున్నాను నేనిప్పుడు.

నేను ఆరేండ్ల పిల్లవాడిగా వున్నప్పటి నుంచీ పదహారేండ్ల విద్యార్థి దశ వరకూ కూడా, ఒక పదేండ్ల పాటు ఉదయ సాయం వేళల్లో పశువుల్ని కాశాను. వ్యవసాయపు పనులు చేశాను. అరకలు దున్నాను. కుప్పలు నూర్చాను. నా వయస్సు పశుల కాపరులతో కలసి ఆటలు ఆడాను. పాటలు పాడాను.

"పొండువులు పొండవులు తుమ్మెదా, పంచ
పాండవు లోయమ్మ తుమ్మెదా"

వంటి జానపద పాటలను ఎన్నిటినో నేను మొదటిసారి విన్నది మా అమ్మ వరినాట్లు వేస్తూ పాడినప్పుడు. పని చేస్తున్నప్పుడు పొలాలలోనూ, తీరికగా వున్నప్పుడు ఇంట్లోనూ అలాంటి జానపద గేయాలను మా అమ్మ ఎన్నో పాడేది. మా నాన్న ఇంటి వద్ద వున్నప్పుడూ, తన శిష్యులతో గోష్ఠులు జరుపుతున్నప్పుడూ, వేదాంత గేయాలెన్నో పాడుతూ వుండేవాడు.

మా ఇంటి సమీపం లోనే ఏకతారపై పాడుకొంటూ భిక్షాటన ద్వారా మనుగడ సాగించే ఒక వ్యక్తి వుండే వాడు. వాళ్ళ ఇంటి పేరు అన్నంనీడి. ఆయన పేరు యతిరాజు. అందరూ ఆయనను కవీశ్ అనేవాళ్ళు. ఆయన అన్న తిరుపళ్లెం. నన్ను వాళ్లు తమ్ముడూ అని పిలిచేవాళ్లు. కవీశ్‌కు వచ్చినన్ని జానపద గేయాలు, కథలు మరెవరికీ రావేమో! తీరిక సమయాల్లో నేనెప్పుడూ ఆయన వెంటనే వుంటూ వుండేవాడ్ని.

ఏవేవో గాలిపాటలు నాకు నేనే అల్లుకొంటూ పాడుకొంటూ ఉండడం తప్ప, అప్పటికే ప్రచారంలో వున్న జానపద గేయాలను పట్టుకొని పాడుకోవాలన్న ఆలోచనే ఆనాడు నాకు కలగలేదు. కలిగివుంటే ఎన్నో వేల తూర్పు గోదావరి జానపదాల్ని సేకరించి వుండేవాడ్ని.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే నేను పుట్టిన, చిన్నప్పుడు పెరిగిన వాతావరణమూ, పరిసరాలూ, పరిస్థితులూ కూడా సంగీత సాహిత్య రసనాదంతో ఎలా పిక్కటిల్లుతూ వుండేవో చెప్పడానికి.

సంగీతం లేకుండా సృష్టి లేదు. సాహిత్యం లేకుండా మానవ జీవితం లేదు. సంగీత సాహిత్య గుణీభూత శక్తి సరస్వతి.

విశ్వం లోని గ్రహ తారాదులు మొదలుకొని జీవిలోని ప్రాణాపాన ప్రవర్తన వరకూ సృష్టి సమస్తమూ ఒక లయలో చలిస్తూ వున్నట్టిదే. మానవుడిలోని హృదయ స్పందన అదే. స్పందన లయబద్ధ మైనట్టిది. లయబద్ధమైన ప్రతీదీ స్వరబద్ధ మైనట్టిది. అది బైటికి పాటగా వెలువడవచ్చు. లోపలనే మౌన రాగంగా వుండిపోవచ్చు. వీణ పలుకుతున్నప్పటి కంటె మౌనంగా వుండిపోయినప్పుడే ఎక్కువ శ్రావ్య సుందరం.

మానవ జీవితం బాల్యంలో క్రీడాసక్త మైనట్టిది. యవ్వనంలో ప్రణయాసక్త మైనట్టిది. ప్రౌఢ వయస్సులో కర్తవ్యాసక్త మైనట్టిది. మానవ జీవితం అంటే ఈ మూడు అవస్థలే. వృద్ధాప్యాన్ని నేను మానవ జీవితంలో ఒక భాగంగా పరిగణించడం లేదు. వృద్ధాప్యం వయస్సుకు సంబంధించినట్టిది కాదు. వయస్సేదైనా, కర్తవ్య నిర్వహణాసక్తిని, కర్మాచరణ సముత్సాహాన్ని కోల్పోయిన తరువాత మానవ జీవితం బ్రతికి వున్నా లేనట్టే లెక్క.

మానవ జీవితంలోని ప్రధానమైన ఈ మూడు అవస్థలలోను కూడా మానవుడు తన్మయుడై ఏ రంగంలో పనిచేస్తున్నప్పటికీ సంగీత సాహిత్యాల శక్తితోనే జీవిస్తాడు.

తెలిసి పాడుకోవచ్చు, తెలియకుండానే అంతఃచేతనలో మౌనంగా స్పందిస్తూ వుండవచ్చు.

అటువంటి బాహ్యాభ్యంతర జీవ స్పందనలే ఈ పాటలు.

ఏ జీవితంలోనైనా పని చేయించేవీ, ముందుకు నడిపించేవీ సంగీత సాహిత్యాలలోని స్పందనలే. పాటలే.

నేను చాలా కాలంగా వ్రాసుకొంటూ, నాలో నేనే పాడుకొంటూ వచ్చిన పాటలు కొన్ని 1951లో రాగోదయం గేయాలుగానూ, 1971లో రాభీలుగానూ ప్రకటించి వున్నాను. రాభీలు సంపుటిలో సుమారు నాలుగు వందల పాటలున్నై. రాభీలు తర్వాత ఈనాటి వరకూ వ్రాస్తూ వచ్చిన విడివిడి పాట లన్నిటినీ కలిపి ఇప్పుడు ఈ పాటల తోటగా ప్రకటిస్తున్నాను.

నిజానికి – వచన, గద్య, పద్య, నాటక ప్రక్రియలలో నేను ఏ రచన చేసినా వాటిలో మధ్య మధ్య సందర్భాన్ని బట్టి గేయాలు వుంటూనే వుంటై. దీప సభ పద్య కావ్యం. దానిలో గేయాలున్నై. రాగ వైశాఖి వచన కావ్యం. దాని నిండా పద్యాలూ, పాటలూ వున్నై. పాలేరు, కూలిరాజు, రాగ వాశిష్ఠం, వాల్మీకి, బాలయోగి, ప్రగతి నాటకాలు. వాటి నిండా పద్యాలూ, పాటలూ వున్నై. బొమ్మ గేయకావ్యం, పైరుపాట, మానవుని మరొక మజిలీ గేయ నాటకాలు. ఈ విధంగా నా ఇతర రచనలలో వందల కొలదీ గేయాలున్నై.

అలా కాక, నేను అప్పుడప్పుడు అనేక సందర్భాలలో విడివిడిగా వ్రాసిన గేయాలను మాత్రమే ప్రత్యేక సంపుటాలుగా వెలువరించాను. అందులో ఈ ''పాటల తోట'' ఒకటి.

తెలుగు శ్రోతలకు నా రాభీల లోని గేయాలన్నీ మొత్తం మీద పరిచయాలే. ఆకాశవాణిలో, దూరదర్శన్‌లో, సంగీత సమ్మేళనాలలో, సభా వేదికల మీద అనేక మంది గాయక గాయనీమణులు రాభీలను పాడారు. పాడుతూనే వున్నారు. ఈ ''పాటల తోట'' కూడా అదేవిధంగా సంగీత సాహిత్య ప్రియుల్ని అలరించగలదనే నా విశ్వాసం.

ఇక ఈ పాటల తోట గురించి –

మానవ జీవితంలోని యవ్వన, ప్రౌఢ దశలను మాత్రమే ప్రధానంగా ఈ తోటలోకి స్వీకరించాను. స్త్రీ పురుష జంటలను ఆలంబనగా చేసుకొన్నాను. సాధారణంగా పురుషుడు బాహ్య ప్రపంచానికీ, స్త్రీ గృహ వాతావరణానికీ అంకితమై పనిచేయడం సహజం. బాహ్య ప్రపంచంలో పనిచేసే స్త్రీలూ, గృహ వాతావరణం లోనే వుండిపోయే పురుషులూ చాలా మందే వుండవచ్చు. నేను స్వభావ ధర్మాన్ని మాత్రమే ఇక్కడ పేర్కొన్నాను. కాఠిన్యానికి, రౌద్రానికి, ఉగ్రతకు పురుషశక్తి సంకేతం, తద్విరుద్ధమైన మార్దవానికి స్త్రీ శక్తి సంకేతం. ఇవి ఎండా, వెన్నెలా వంటి శక్తులు. కర్తవ్య నిర్వహణ బాధ్యత ఇరుపక్షాలకూ సమానమే. ఈ పాటల తోటలో విహరించే జంటలు అలాంటివి.

ఇందులో నాయికను మాధురి అన్నాను. నాయకుణ్ణి మహాబాహు అన్నాను. ఎవరి కిష్టమైన పేర్లను వారు పెట్టుకోవచ్చు. నా అభ్యంతరమేమీ లేదు.

కర్తవ్య నిర్వహణ కోసం బాహ్య ప్రపంచంలోకి వెళ్లిన ప్రియుణ్ణి ఇంటనున్న ప్రియురాలు తలచుకొంటూ వుంటుంది. అతడి క్షేమాన్నీ, విజయాన్నీ కోరుకొంటూ వుంటుంది. అతడు తన కార్య రంగంలో తీరిక దొరికినప్పుడెల్లా ప్రియురాలిని గురించి ఆలోచిస్తూ వుంటాడు. ఆమె ప్రేమ భావాలపై విశ్రాంతి పొందుతుంటాడు. శ్రమలో ఖర్చయ్యే శక్తిని విశ్రాంతిలో తిరిగి పొందుతూ వుంటాడు.

వారి ఇరువురి మనస్సులూ నిరంతరం కలిసే వుంటై. వివిధ కర్తవ్యాలను గురించి ఉద్బోధలు చేస్తూ, హెచ్చరికలు పలుకుతూ, ఓదార్పులు పొందుతూ వుంటై. పాటలలో మధ్య మధ్య స్త్రీ కంఠమూ, పురుష కంఠమూ కూడా వినిపిస్తూ వుండడానికి అదే కారణం.

ఈ తోటలో పాటలు ఒక క్రమంలో అమర్చబడి లేవు. మామిడి చెట్టు పక్కనే మల్లె పొద వుండవచ్చు. కొబ్బరి చెట్టును లవంగలత అల్లుకోవచ్చు. విరుద్ధ రసభావాలు గల పాటలు పక్క పక్కనే వుండవచ్చు. గృహోద్యానాల వలెనే గృహ జీవితాలలో కూడా నానాత్వంలో ఏకత్వాన్ని గుర్తించి వర్తించక తప్పదు. ఇందులో ఏ పాట కాపాటే సర్వ స్వతంత్రం కనుక, వివిధ రసాల పాత్రలు ఒకేచోట వున్నప్పటికీ వాటిని విడివిడిగా

ఎలా ఆస్వాదించి ఆనందిస్తామో, అలానే ఈ పాటలను కూడా ఆస్వాదించి ఆనందించవలసిందిగా సహృదయుల్ని కోరుతున్నాను.

## గేయాలు - గాయకులూ

గానయోగ్య మైనట్టివి గేయాలు. గేయాలు అంటే పాటలు. పాడబడేవి పాటలు. పద్యాలను కూడా రాగయుక్తంగా పాడవచ్చు. అయితే పద్యాలను పాడేటప్పుడు తాళం అక్కరలేదు. గేయాలను పాడేటప్పుడు తాళం అవసరం అవుతుంది.

తాళం వేసుకొంటూ ఒక రిథమ్ (లయ)లో గేయాలను పాడవలసి వుంటుంది. గేయాలకు గానమే ప్రధానం. సాహిత్యం ప్రధానం కాదు. ఎటువంటి మాటలకైనా స్వర కల్పన చేసి పాట కచేరీలు చేయవచ్చు. ఈనాడు మనకు అనేక రంగాలలో వినబడుతున్న పాటలు చాల వరకు ఇలాంటివే. వాటిలో సాహిత్యం వుండడం లేదు సరికదా ఔచిత్యం కూడ వుండడం లేదు. సినీమాలలో, రేడియోలలో, టి.వి.లలో పాటకచేరీలలో ఎవరెవరో వ్రాసిన ఏవేవో పాటలను మనం నిత్యమూ వింటున్నామంటే అందుకు కారణం ఆయా గాయకుల గాత్ర మాధుర్యమూ, స్వర విన్యాసమూ మాత్రమే. సాహిత్యంలోని అకవితను కంటగించుకొంటూనే గానంలోని శ్రావ్యతకు చెవి ఒగ్గవలసి వస్తున్నది.

కవిత అంటే రసవంతమైన ఒక భావం. ఏదో ఒక రసవద్భావం హృదయంగా, దాని చుట్టూ ఏదో ఒక లయలో, ఏదో ఒక ఆకృతిలో అల్లబడిన అందమైన శరీరమే పాట. సాధారణంగా నా పాటలన్నీ ఇలాంటివే. మాత్రా ఛందస్సులో, తాళ బద్ధంగా, భావానికి తగిన రాగంలో నాలో నేను పాడుకొంటూ వ్రాసుకొన్నట్టివే. కొత్తవాళ్ళు కూడ నా పాటలను చదవడం మొదలుపెట్టినప్పుడు, వారిలో ఏ మాత్రం సంగీత కళ వున్నా వారి గాత్రంలో స్వర గతులు నృత్యం చేస్తాయి.

అలాంటి నా పాటలను చాలమందే పాడారు. ఇప్పటికీ పాడుతున్నారు. ఇక ముందు కూడా పాడుతూనే వుండగలరనే విశ్వాసం నాకుంది. అయితే పాడవలసినంత విరివిగా పాడడం లేదనే అసంతృప్తి కూడా నాలో వుంది.

ఎవరైనా ఒక కవి ఒక పాటను వ్రాసినప్పుడు, అది గానరూపంలో ప్రజలకు అందాలంటే, అట్టి కవి స్వయంగా గాయకుడై వుండాలి. లేకపోతే అతని సన్నిహిత మిత్రులు గాయకులై వుండాలి. అంత మాత్రమే చాలదు. అట్టి గాయకులకు ప్రసార, ప్రచార సాధనాలు అందుబాటులో వుండాలి. అట్టి సౌకర్యం నాకు లేదు. భవిష్యత్తులో కలుగుతుందనే ఆశ వుంది.

నేను వ్రాసిన పాటలన్నీ నా హృదయ స్పందనలే. అందులో సహజ భావావేశాలు, తాత్కాలిక ప్రయోజనాలు కూడ వుండవచ్చు. మొత్తం మీద అన్నీ కూడ అందంగా పాడుకోతగ్గవే. కులమత దృక్కోణాల నుంచి కాక, సరస్వతి ఏ హృదయంలో వున్నా అది సరస్వతే అనే సాత్విక, తాత్విక దృష్టితో స్వీకరించగల రసజ్ఞులూ, కళాస్రష్టలూ మాత్రం లభించాలి.

ప్రస్తుతం నా సారస్వతాశ్రమం చాల చిన్నది. అయినా దాని ప్రసార పరిధి విశ్వవిశాల మైనట్టిది. ఈ మహావైశాల్యంలో ఏ క్షణంలో అయినా ఎలాంటి మార్పయినా రావచ్చు. భవిష్యత్తు ఎప్పుడూ ఉజ్వలమైనట్టిదే.

పాటలు పాడేవాళ్ళు, గాయనీ గాయకులు ఎవరైనా సరే సాహిత్యాన్ని విస్మరించ కూడదనే నా ఉద్దేశ్యం. స్వచ్ఛమైన సంగీతానికి సాహిత్యం అవసరం లేకపోవచ్చు. సంగీతం దానంతట అదే చెవుల ద్వారా గుండెను తాకి మైకం తెప్పించగలదు. అయితే అది మనస్సును కూడా రంజించాలంటే సంగీతానికి ఆధారభూతమైన సాహిత్యం కూడా అర్థం కావాలి. ప్రస్తుతం తెలుగులో ఈ పరిస్థితి అయోమయంగా వుంటున్నది. పాటలు పాడేవాళ్ళు పాటలలోని సాహిత్యాన్ని కూడ స్పష్టంగా పలకవలసి వుంది. సాహిత్యం భావస్ఫోరకంగా వుండాలి. అనౌచిత్య దుష్టం కాకూడదు.

కొన్ని పాటలు - వివరాలు

నేను వ్రాసే పాటలూ, పద్యాలూ, కావ్యాలూ, వచన కవితలూ కూడా శృంగార రస ప్రధానంగా వుంటై. నిజానికి రసం అంటేనే శృంగారం. అది ప్రధానంగా మధురంగా వుంటుంది. అది వివిధ దశలలో, వివిధ రుచులలో కూడా వుండవచ్చు. తియ్యగా వుండేదే కాదు - చేదుగా, వగరుగా, కారంగా, వెగటుగా, కమ్మగా, పుల్లగా, ఉప్పగా వుండేవి కూడా రసాలే. తక్కిన రుచులన్నీ మాధుర్యంలో భాగా లైనట్టే, రసాలన్నీ కూడా శృంగారంలో భాగాలే. శృంగారంలో భాగంగా వివిధ రసాలనూ పోషించే తత్వం నాది.

ఏభై ఏళ్ళ క్రితం నేను వ్రాసిన 'పాలేరు' నాటకంలో కూడ ఇదే పద్ధతి వుంది. దానిని ప్రజలు ప్రజాసాహిత్యం గానూ, దళిత సాహిత్యం గానూ, అమాయకులైన కార్మిక వర్గానికి సంబంధించి విప్లవాత్మక సాహిత్యంగానూ స్వీకరించి, విశేషంగా ప్రదర్శనలిచ్చి ప్రయోజనం పొందడం జరిగింది.

నేను నా సహజ ధోరణిలో సాహిత్యాన్ని సృష్టించుకొంటూ పోతున్నప్పుడు పాలేరు వంటి రచనలనే కొనసాగించవలసిందిగా ప్రజలు నన్ను కోరసాగారు. అందుకు సమాధానంగా ఆనాడే నేను వ్రాసిన ఒక గేయం ఈ సంపుటిలోని మొదటి పాట "తోటలలో పూలె కాని" అనేది. మొదటి అఖిల భారత తెలుగు రచయితల సభల సందర్భంలో ప్రకటించబడ్డ ఈ గేయాన్ని ఆ సభలలో పాల్గొన్న డా. భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు నా భుజం తట్టి అభినందించారు. ఒక 30, 40 ఏళ్ళుగా అలా పాత కాగితాలలో పడి వుంటున్న ఈ గేయాన్ని ఇపుడు ఈ సంపుటిలో మొదటి పాటగా చేర్చాను.

ఈ విధంగానే ఈ సంపుటిలో 167 పాటలలో ప్రతి పాటకూ ఒక చరిత్ర వుంది. ఆయా పాటలను నిశితంగా పరిశీలిస్తే వాటి వాటి చరిత్రలు తమంతట తామే ఆవిష్కృతమవుతాయి. ఈ అన్నిటి గురించీ నే నిక్కడ విడివిడిగా చెప్పే అవకాశం లేదు. కనుక ఒక ఏడెనిమిది అంశాలను గురించి మాత్రం ఇక్కడ చెప్పి తక్కిన వాటిని పాఠకుల ఊహలకు వదిలేస్తున్నాను.

"ఇటు తిరుగు, తిరుగు తిరుగు" (71వ పాట) అనేది నా చిన్నప్పుడు పశువుల్ని కాస్తూ పాడుకొన్న పాట. అంటే 70 ఏళ్ళ నాటిదన్న మాట. అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది. దానిని కూడా ఈ సంపుటిలో చేర్చాను. నేను ఈ మధ్యకాలంలో మరచిపోయిన నా చిన్నప్పటి అనేక విషయాలు ఇప్పుడు స్పష్టంగా జ్ఞాపకం వస్తున్నై. ఈ మధ్య ఇదొక కొత్త అనుభవం నాకు.

"ఎవరాపగలరురా" (74వ పాట) అనే పాట తరచుగా ఆకాశవాణిలో వస్తూ వుండడాన్ని అందరూ వింటున్నట్టిదే. చాల కాలం క్రితం ఆకాశవాణిలో లలిత సంగీత నిర్వాహకులుగా వుండిన పాలగుమ్మి విశ్వనాథంగారు స్వయంగా మా ఇంటికి వచ్చి ప్రత్యేకంగా వ్రాయించుకెళ్ళిన పాట అది. యువకులకు గుండె ధైర్యం ఇచ్చే పాట ఇది.

అంబేడ్కరు శతజయంతి ఉత్సవాలకు (సాంఘిక న్యాయ సంవత్సరానికి) మీ కానుక ఏమిటి అంటూ డా. బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి, మిత్రులు గనుమల జ్ఞానేశ్వర్ అడిగినప్పుడు నాకు కలిగిన భావాన్ని పురస్కరించుకొని, అంబేడ్కరుకు సంబంధించిన పాటలు కొన్ని వ్రాసి ఈ సంపుటిలో చేర్చాను (94 నుంచి 104 వరకు). ఈ పదే కాక ఈ వర్గానికి చెందిన పాటలు ఇంకా కొన్ని ఈ సంపుటిలో వున్నై.

దేశ భక్తిని, జాతి శక్తిని ఉద్బోధిస్తూ వ్రాసిన పాటలు కూడా చాలా వున్నై. శాంతి సౌఖ్యా లనేవి బలం ద్వారా సంపాదించుకోవలసినట్టివి. బలహీనులకూ, భీరువులకూ శాంతి సౌఖ్యాలు లభించవు. బలవంతుల పడగనీడల్లో బలహీనులెప్పుడూ భయం భయంగా బ్రతకవలసినట్టి వాళ్ళే. జాతినీ, దేశాన్నీ రక్షించుకోవాలంటే ఆ దేశానికీ, జాతికీ చెందిన స్త్రీ పురుషులందరూ కూడ ధైర్య సాహసాలను, బలదర్పాలను ప్రదర్శించవలసే వుంటుంది. పిరికి జాతికి బ్రతుకు లేదు. ఈ భావాలను లయబద్ధం చేసి గానయోగ్యాలుగా మలచిన పాటలు ఇందులో చాలా వున్నై.

దేవుడికి సంబంధించి పరస్పర విరుద్ధ భావాలను వెల్లడించే పాటలు కూడా ఇందులో కొన్ని వున్నై. ఇక్కడ దైవానికి సంబంధించి నా తాత్విక దృక్పథాన్ని పాఠకులు కొంచెమైనా అవగాహన చేసుకోవలసి వుంది. "మోక్షం నా జన్మహక్కు" అనే కావ్యంలోనూ, "ఇదిగో ఇదీ భగవద్గీత" అనే భీమన్న భాష్య గ్రంథంలోనూ నా తాత్విక దృక్పథం సంపూర్ణంగా విశదీకరించి వున్నాను. నా తాత్విక సిద్ధాంతం సారాంశం ఒక్క మాటలో చెప్పాలంటే - "దేవుడు లేడు, పరమాత్మ వుంది" అనేది.

మనిషిలోని మనస్సే పరమాత్మ. అది ఆయా మనుషుల మౌలిక స్వభావాలను బట్టి ఆయా రూపాలు ధరిస్తూ వుంటుంది. కాగా, ఏ మనిషి కామనిషే పరమాత్మ స్వరూపుడు. పరమాత్మనే దైవం అంటున్నాం అనుకొంటే, ప్రతి మానవుడు దైవస్వరూపుడే అవుతాడు. ఎన్ని మనస్తత్వాల మానవులుంటే అన్ని స్వభావ స్వరూపాలలోనూ దైవం కనిపిస్తాడు. అందుకే దేవుడొక్కడు కాదనీ, మతాని కొక దేవుడు, మనిషి కొక్క దేవుడు వుండడం సహజమనీ నేను ప్రకటించాను.

"దైవంతో భుజం కలిపి పనిచెయ్యి" (109), "నీ మనసే నీ దైవం" (110), "లోకానికి దేవు డొకడు కాదురా" (158) వంటి పాటలలో వ్యక్తమైన భావాలకు ఆధారం ఈ నా తాత్విక చింతనే.

"రావే శ్రీవాణి" (43), "నవ చైతన్య ఝరి" (116), "శక్తికి వందనం" (117) వంటి శక్తి ఆరాధన గేయాలు కూడా అటువంటివే.

ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా వున్నప్పుడు పేదల కోసం, దళితుల కోసం 20 అంశాల కార్యక్రమాన్ని అమలు పరచడమే కాక, బ్యాంకులను జాతీయం చేసి క్రింది వర్గాల ఆర్థికాభివృద్ధికి ఎంతో ప్రోత్సాహం ఇవ్వడం ప్రారంభమైంది. సోషలిస్టు తరహా సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకొన్నామంటూ భారత్‌లో అధికార పక్షాలు పదే పదే ప్రకటిస్తూ వున్నప్పటికీ, అందుకు ప్రయత్నం జరిగింది ఇందిరాగాంధీ పరిపాలన లోనే. అది కూడా బ్యాంకులను జాతీయం చేసిన ఆ ఒక్క సందర్భం లోనే. అందుకు స్పందించిన నేను అందుకు అనుగుణమైన పాటలను ఆ కాలంలో వ్రాయడం జరిగింది. అట్టి పాటలలో కొన్నిటిని కూడా ఈ సంపుటిలో చేర్చడం జరిగింది.

## తోటమాలీ, ఉత్తిష్ఠ

తోటమాలీ ఉత్తిష్ఠ అంటూ నేనొక కవిత వ్రాశాను. అది వచన కవితే అయినా పాడుకోవడానికి అనువుగా మాత్రా ఛందస్సులో నడిచింది. ఆ కవిత వ్రాసిన తరువాతనే ఈ గేయ సంపుటికి పాటల తోట అనే పేరు పెట్టడం జరిగింది.

ఈ మానవ లోకం అంతా ఒక తోట. అందులో నలుపు, తెలుపు, పసుపు మొదలైన రంగులలో అనేక వృక్షాలు, లతలు, గుల్మాలు, ముళ్ళ మొక్కలు, చీడ పురుగులు ఎన్నో ఎన్నో. చెట్లపై శుక పిక శారికాది పక్షులు, తుమ్మెదలు, ఉడతలు ఎన్నో ఎన్నో. ప్రాణికోటికి ఆనందం కలిగించే ఈ తోట నిత్యనూతనంగా, సర్వసుందరంగా వుండాలంటే అందుకు బాధ్యుడైన తోటమాలి అవాంఛితాలైన ముళ్ళ మొక్కలను, చీడ పురుగులను, విషసర్పాలను తొలగించి వేస్తూ తోటను పరిశుద్ధంగా వుంచవలసి వుంది.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం'' అంటే ఇదే.

ఈనాటి ప్రపంచంలో మానవుడు మానవత నుంచి పతితుడు కావడానికీ, మానవ సమాజం దుర్మార్గ దూషితం కావడానికీ ఈ గీతా సూత్రం పాటించబడక పోవడమే కారణం. శిష్టులూ, సాధువులూ క్రియాహీనులు కావడంతో పాటు దుష్టులూ, స్వార్థపరులూ, క్రియా రంగంలో Activist లుగా విజృంభించడం వల్ల మానవ సమాజం క్షణక్షణం భయాందోళనలతో బ్రతకవలసి వస్తూ వుంది. ఈ దుస్థితికి నేను సూచించే పరిష్కారం సమాజం నుంచి ఆతతాయులను ఎప్పటి కప్పుడు తొలగించుకొంటూ వుండాలనే గీతా సూత్రాన్ని అమలు పరచాలనడమే.

ఈ నా భావాలన్నీ ఈపాటల తోటలో కనిపిస్తాయి.

అవును, ఇదొక తోట!
పరిధి లేని పెందోట!

నానా పత్ర ప్రసూన ఫలరసాలతో
నానా శుక పికాదిక స్వర కల్పనలతో
బృందావన బృంద గానముల తోట!
సకల వృక్ష సహ జీవన వృందోట ॥

సర్వ భూతములకు "సమోహం'' అంటూ
"బీజం మాం'' సర్వభూతముల కంటూ
భగవద్గీతే బ్రహ్మ క్రీడ జరుపు తోట!
అందరికీ పరమానందం పంచు తోట ॥

తోటలోని ఒక్కొక్క చెట్టూ ఒక్కొక్క జాతిది,
అన్ని జాతులూ కలిసి బ్రతుకుతున్న తోట!
దేని స్వభావం దానిదె అయినా–
అన్ని స్వభావాలూ ఒకే భావమైన తోట ॥

తియ్యటి దానిమ్మ, పుల్లటి నిమ్మ
కమ్మని కొబ్బరి, చేదు వేప
రుచులన్నీ ప్రక్క ప్రక్క బ్రతికే తోట!
కాకులు, కోకిలలు గొంతు కలిపే తోట ॥

ఏదీ పట్టించుకోని తేనెటీగ
అన్ని రసాలనూ ఆస్వాదిస్తూ
మానవతా హృదయ వికాసం కోసం
మధు కోశాలను నిర్మిస్తున్న తోట ॥

తోట మాలికీ తోట
ఆత్మవత్ సర్వ వృక్షాణి!
తోట నిర్వచనం క్రిందకు రాని పురుగులను
తుప్పలనూ నిర్మూలించక తప్పదు ॥

తోట నెల్ల సమదృష్టితో
సంరక్షించుట కోసం
సమ్మానించుట కోసం
తోటమాలీ! ఉత్తిష్ఠ ॥

# మతమూ కాదు, దేవుడూ కాదు

ఈనాడు మన దేశంలో కానీ, ప్రపంచం మొత్తం మీద కానీ మానవుల మధ్య ఏర్పడుతున్న కొట్లాటలకు, హత్యలకు, యుద్ధాలకు, మారణ హోమాలకు తాత్కాలిక కారణా లెన్ని వుంటున్నా ప్రధాన కారణాలు రెండుగా కనిపిస్తున్నె - మత భేదం, జాతి భేదం. నిజానికి ఈ రెండూ కూడ పైపై బురఖాలే. వాటి మరుగున వుంటున్న దొకటే - బ్రతుకు తెరువు సమస్య. ఎలా బ్రతకడం అనేది. బ్రతకడం కోసం పోరాడాలి. పోరాటంలో బలం గలవాడే గెలుస్తాడు. గెలిచినవాడిదే రాజ్యం. ఈ ఒక్క ప్రకృతి సత్యమే మతం ముసుగునూ, జాతి (Ethnic) ముసుగునూ సందర్భాన్ని బట్టి ధరిస్తూ వుంది. ఈ విషయంలో దేవుడికీ, దైవభక్తికీ ప్రమేయమే లేదు.

ఇక్కడొక్క వాస్తవాన్ని వివరించవలసి వుంది.

దైవానికీ, దైవభక్తికీ కూడ భాగవతంలోని గజేంద్రుడు సరియైన ప్రతీక. గజేంద్రుడికి దైవం గురించి కానీ, భక్తి గురించి కానీ తెలియదు. అతడికి కావలసింది మొసలి నుంచి విముక్తి. అందుకు తన శక్తి కొలదీ పోరాడాడు. ఫలితం లేకపోయింది. అప్పుడు మరొక రెవరైనా తనకు తోడ్పడితే బాగుండు ననుకొన్నాడు. తన స్వశక్తి చాలదు. ఇక మీద పనికిరాదు. ఏదో ఒక బాహ్యశక్తి సహాయం అవసరం. అట్టి శక్తి మొసలిని చంపగలదై ఉండాలి. అట్టి శక్తి ఎక్కడైనా వున్నదా? ఈ సృష్టికి మూలకారణమైన, ఈ విశ్వాన్ని పరిపాలిస్తున్న "అఖిల వ్యాపార పారీణత" గల పరమశక్తి ఒకటి లేదా? అనే ప్రశ్న అతడి మనస్సులో ఉదయించింది. అదే ప్రశ్నను మనస్సు పదేపదే మననం చేసుకొంది. ఆ మననం అలలు అలలుగా విశ్వాంతరాళాన్ని గాలించింది. తత్ఫలితంగా "విశ్వమయుడు విభుడు విష్ణుండు, జిష్ణుండు" గజేంద్రుడికి సహాయపడగల ఆయుధాలతో అవతరించి తోడ్పడగలిగింది.

అవతరించడం అంటే ఒక చోట (వాయు గుండంలా) కేంద్రీకృతం కావడం. మనస్సు కోరుకుంటున్న రూపంలో శక్తి మెటీరియలైజ్ కావడం.

అందుకే మతకలహాలుగా చెప్పబడుతున్నట్టి వాటిలో మతమూ లేదు, దేవుడూ లేడు, దైవభక్తీ లేదు. అందులో వుంటున్నది ఒకటే ఒకటి – ఆయా మత సమాజాలకు చెందిన స్వార్థ బుద్ధి, పరాక్రమణేచ్ఛ మాత్రమే. ఈ వాస్తవాన్ని విప్పి చెప్పే పాటలు ఈ తోటలో వున్నె.

లోక శాంతికి అవసరం నీతులూ, సూక్తులూ వల్లించడం కాదు. ధైర్య సాహసాలతో దుష్ట శక్తుల్ని ఎదిరించి గెలవడమే.

మతమూ, దేవుడూ వ్యక్తిగతాలు. సాముహికాలు కాదు. ఈ సత్యాన్ని నేను ''మోక్షం నా జన్మహక్కు'' అనే కావ్యంలో విపులంగా చర్చించి వున్నాను.

## సాంఘిక న్యాయం

నేను ఈ పీఠిక వ్రాస్తున్న సమయం లోనే ఆకాశవాణిలో ఒక కవిత చదవ వలసి వచ్చింది. ఇది సాంఘిక న్యాయ సంవత్సరం కదా! అదే వ్రాసి చదివాను. చదవడం కాదు, పాడాను. అది పాట కనుక, ఈ క్రింద ఇస్తున్నాను.

అంబేడ్కరా, నీవు అవతరించిన నూరు
వత్సరాలకు వచ్చె నవకాంతి!
ఏమిటా కాంతి? ఏ మా నవోదయం?
అందర కొకే న్యాయమన్న జ్ఞానోదయం!

న్యాయ మననేమి? మానవులందరును సమా
నముగ బ్రతికే జన్మహక్కు!
జన్మ హక్కన నేమి? శాంతి సౌఖ్యము లంద
రకు పంచి ఇడు వేద బుక్కు!

దేశమున కొక జాతి, జాతి కొకటే నీతి,
నీతి అందరి కొక్కటే;
ఒకడి కొక నీతి, మరి యొకడికి మరొక నీతి
తగదన్న మేధావి మేటీ!

ఏక భారత పూర్ణ జాతిని అ
నేక వర్ణాలుగా చీల్చి
వర్ణమున కొక న్యాయమని, న్యాయమును కూడ
ప్రయ్యలుగ జేసి రానాటి దుశ్శాసకులు!

నవ్య భారత రాజ్య రాజ్యాంగమును వ్రాసి,
న్యాయ దేవత నుద్ధరించిన సువీరా!
సాంఘిక న్యాయమే న్యాయమని చెప్పి,
విశ్వ శ్రేయసుడవైన అంబేద్కరా!

కుల మతమ్ముల భేదములు వద్దు, దేశ పౌ
రుల కెల్ల న్యాయ మొకటే అంటివి!
అందర కొకే న్యాయ ముమలు పరచుటె బాధ
లన్నిటికి దివ్యౌషధ మ్మంటివి!

దళితులకు, బడుగు వర్గాలకే కాదు
మహిళలకు కూడ న్యాయము పంచి ఇచ్చితివి!
ఆధునిక ధర్మ స్వరూపా! నవ భార
తాభ్యుదయ జాతి ప్రదీపా!

కుల కలహాలతో సతమత మవుతున్న ఈ దేశం, మత కలహాలకు కూడా గుర్త్రై చస్తూ వుంది చిరకాలంగా. ఈ కలహాలకు కారణం మతమూ కాదు, దేవుడూ కాదు. సాంఘిక న్యాయంలో చూపబడుతున్న పక్షపాతం. ఈ వాస్తవాన్ని గుర్తించిన డా. అంబేడ్కరు ఆనాటి దేశ విభజన కాలంలోను, స్వతంత్ర భారత రాజ్యాంగ ప్రతిష్ఠాపన

సమయంలోను కూడ శాశ్వత శాంతికి రెండు పరిష్కార మార్గాలను సూచించాడు. అధికార దాహంతో మండిపోతున్న ఆనాటి నాయకులు అంబేడ్కరును లక్ష్యపెట్టలేదు.

అంబేడ్కరు సూచించిన రెండు మార్గాలలోను ఒకటి - కుల మత భేదాలు లేకుండా దేశ పౌరులందరికీ ఒకే సాంఘిక న్యాయాన్ని వర్తింపజేయడం. నలభై సంవత్సరాలకు పూర్వమే చెప్పాడాయన ఈ మాట.

ఈ దేశానికి పట్టిన కుల మత కలహాల పీడకు కామన్ సివిల్ కోడ్ అమలు ఒక్కటే పరిష్కారం. అందుకే ఈ పాటను ఇక్కడ ఇస్తున్నాను.

ప్రపంచ మానవు లందరూ సుహృద్భావంతో సహజీవనం చెయ్యడం నా కవితా లక్ష్యం. అందుకు సర్వతోముఖ సమానత్వం అవసరం.

## అంకితం గురించి

నాకు చిన్నప్పటి నుంచీ ఆకాశాన్ని చూస్తూ చుక్కల్ని లెక్కపెట్టడం అలవాటు. నేను పుట్టిన వూరు మామిడికుదురు గరువు ఆ కాలంలో ఒక చిన్న అడవిలా ఉండేది. విద్యుద్దీపాలు లేని కాలమది. రాత్రి వేళల్లో చెట్ల నీడల్లో వెల్లకిలా పడుకొని ఆకాశంలోకి చూస్తూ వుంటే - రకరకాల రంగుల, సైజుల నక్షత్రాలతోనూ, గ్రహాలతోనూ ఉజ్వలంగా వెలిగిపోతూ కనిపించే ఆకాశాన్ని, దాని సౌందర్యాన్ని వర్ణించడం ఎవరి తరమూ కాదు. ఆ సుదూర తీరాల్లోకి సశరీరంగా పోయి ప్రతి తారనూ పలకరించాలని వుండేది నాకప్పుడు.

సూర్యుడు పగటికీ, చంద్రుడు రాత్రికీ అధినేతలు. చంద్రబింబాన్ని స్త్రీ రూపంలో వూహిస్తే, ప్రకృతి పురుష తత్వం ఆ రోజుల్లోనే నాకు లీలగా కనిపించేది. పాలవెల్లిని చూసినప్పుడు ఒక అపూర్వమైన అనుభూతి కలుగుతూ వుండేది. పాలవెల్లిని (Milky way) పాలపుంత అని కూడా అంటారు. ఇది శ్రవణ నక్షత్ర ప్రాంతం లోని విష్ణుపాదాల నుంచి పుట్టి ఆర్ద్రానక్షత్ర ప్రాంతంలోని శివుని శిరస్సుపై పడుతున్నట్లు వుంటుంది. ఇది ఆకాశగంగ. దీనిని పాలవెల్లి అనడం బాగానే వుంది. దీనిని పాలపుంత అని ఎందు కంటున్నారో అప్పుడు నాకు అర్థమయ్యేది కాదు.

మామిడికుదురు గరువు మీద పేద కూలీలైన హరిజనులు చాలా మంది గవర్న మెంటు పుంతలలో వుంటూ వుండే వాళ్ళు. మేం వుండేది కూడా అక్కడే. భూమి

మీద మేం వుంటున్న పుంతకీ ఆకాశంలో పాలపుంతకీ సంబంధం ఏమైనా వున్నదా? పేరుతో పోలిక వున్నది కదా! సంబంధం కూడా వుండే వుండాలి. ఈ ఆలోచన వచ్చినప్పుడు నేను చాలా ఉద్రిక్తుణ్ని అయ్యాను.

పాలపుంతలోని కోట్లాది నక్షత్రాల లాగే భారతదేశంలో పుంతల్లో బ్రతుకుతున్న కోట్లాది దళితులు కూడా అద్భుతమైన తేజో వైభవాలు కలవాళ్ళే అనిపించి నేను నిజంగా వివశుణ్ణే అయ్యాను. పాలపుంతలోని వివిధ తారలను గుర్తించడానికి ప్రయత్నం చేసినట్టే ఈ భూమి మీద పుంతల్లో బ్రతికే కోట్లాది దళితులలో ప్రతిభావంతులనూ, వ్యుత్పన్నులనూ, తేజోవంతు లనూ, కళాస్రష్టలనూ గుర్తించడానికి ప్రయత్నం చెయ్యడం నాకు అప్పటి నుంచే అలవాట యింది.

అప్పటివరకూ కనిపించని ఒక్కొక్క తార ఆకస్మికంగా ఉజ్వలంగా వెలిగిపోతూ దర్శనమిస్తూ వుండడం ఖగోళ పరిశీలకులకు అపూర్వమేమీ కాదు. అయితే అటువంటి తార ఆకస్మికంగా ఒక రోజున దర్శన మిచ్చినట్టు కనిపించినా అది ఎంతోకాలంగా, పుట్టినప్పటి నుంచీ కూడా ఎదుగుతూ వచ్చినట్టిదే. మన దృక్పథం లోకి వచ్చినప్పటి నుంచే అది మనకు కనిపిస్తుంది. దానిని మనం గుర్తిస్తాం. ఆ విధంగా నాకు ఒక ఢిల్లీ గాన సభలో సన్మానం అందుకొంటూ కనిపించిన ఉజ్వల గాయక తార గజల్ గాంధర్వ డి.మురళీకృష్ణ IAS గారు. ఆయన అంతకు ముందు ఎంతోకాలంగా వివిధ ఉద్యోగ పదవులలో మా మధ్యనే వుంటున్నా, నాకు కన్నులు జిగేలుమనేటట్లు కనిపించిందా సందర్భంలోనే.

ఏ తార అయినా పుట్టగానే ప్రకాశిస్తుంది. ప్రకాశిస్తూ పుడుతుంది. కవుల, కళాస్రష్టల విషయంలో ఈ వాస్తవం మరీ స్పష్టంగా కనిపిస్తుంది.

మురళీకృష్ణగారి జన్మస్థలం తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ తాలూకా లోని పత్తిగొంది గ్రామం. అది చిన్న గ్రామం. అది ఫ్రెంచి యానాంకు చాలా దగ్గరలో వుంది. ఫ్రెంచి యానాం పేరు ఇక్కడ ఎందుకు చెపుతున్నానంటే అక్కడ నాకు కూడా చాలామంది బంధుమిత్రులున్నారు. ''దున్నా'' ఇంటి పేరుగల ఒక ప్రముఖ కుటుంబంతో నాకు మంచి పరిచయం వుంది. ఫ్రాన్సు దేశంతో ఆ కుటుంబానికి గొప్ప వ్యాపార సంబంధాలుండేవి. వ్యాపారంలో ఆనాడే (యాభై సంవత్సరాల క్రితం) లక్షలు గడించి, ఆ జిల్లా హరిజనులలో అత్యధిక ధనవంతులుగా కీర్తి గడించిన కుటుంబ

మది. ఆ కుటుంబంలోని, అప్పటికే నా కంటే చాలా పెద్దవాడైన దున్నా కమలనాభం గారితోనూ, ఈలి వాడపల్లి మున్నగు వారితోనూ జిల్లాలో చాలా చోట్ల తిరిగి హరిజన పేటల్లో ప్రచారాలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే వాళ్ళం. యానాంలోని ఈ దున్నా కుటుంబం కూడా చాలా కాలం క్రితం పత్తిగొంది నుంచి యానాంకు మారిందేనట.

ఆ ప్రాంతంలో దున్నా వారి వంశం సుప్రసిద్ధ మైనట్టిది. హరిజనులలో భూస్వాములూ, ధనవంతులూ చాలా తక్కువ మంది వుంటారు. అందులో దున్నా వంశం ఒకటి. పేరెన్నికగన్న భూస్వాములు, గొప్ప వ్యవసాయదారులు, బహుశా భూమిని దున్నడం అనే క్రియ నుంచే దున్నే, దున్నా అనే క్రియా విశేషణాలు పుట్టా యనవచ్చు. దున్నే కుటుంబం కాబట్టి ఆ కుటుంబానికి దున్నా అనేది ఇంటి పేరుగా వచ్చి వుంటుంది.

మురళీ కృష్ణగారి తండ్రి ధనరాజు గారు. తల్లి మంగమ్మగారు. ధనరాజు గారు ఆ ప్రాంతంలో సుప్రసిద్ధులు. ఆ చుట్టు ప్రక్కల చాలా గ్రామాలకు ఆయన పెద్దగానూ, సలహాదారుగానూ, వ్యవహరించేవారు. నాటకాలలో నటించే వారు. శ్రావ్యంగా పాడేవారు. వైద్యం చేసేవారు. ఆ జిల్లాలోనూ, ఇతర ప్రాంతాల లోనూ కూడా పచ్చకామెర్ల వ్యాధికి ధనరాజు గారి వైద్యాన్ని మించిన వైద్యం మరొకటి వుండేది కాదు. ఎంతగా ముదిరిపోయిన పచ్చకామెర్లనైనా ఆకు పసరుతో మూడు పూటల్లో తగ్గించే వారట. సంగీతం వలెనే ఈ వైద్యం కూడా మురళీకృష్ణ గారికి వారసత్వంగా వచ్చినట్లుంది.

పువ్వు పుట్టగానే పరిమళించక పోవచ్చు. తార పుట్టగానే ప్రకాశిస్తుంది. ప్రకాశిస్తూ పుడుతుంది. మురళీకృష్ణ గారు ప్రకాశిస్తూ పుట్టిన సంగీత తార. గాయకద్యుమణి. పాడుకొంటూ పై కెదిగిన వాడు. బాల్యంలో, విద్యార్థి దశలో, ఉద్యోగ రంగంలో, అధికార పరిధిలో సంగీత సరస్వతి తోడుగా, గాత్రలక్ష్మి బాసటగా క్రమ వికాసం పొందుతూ వచ్చిన వాడు. 1986లో ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో రాష్ట్రపతి జైల్‌సింగ్ గారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని అద్భుతంగా గజళ్ళు పాడి అపూర్వ సన్మానాన్ని అందుకొన్నప్పుడే మనలో ఇంత గొప్ప కళాకారుడున్న సంగతి నాకు తెలిసినప్పటికీ,

సంగీత కళాకారుడిగా ఆయన గురించి అంతకు చాలా ముందే లోకానికి తెలుసు. 1972లోనే మురళీ కృష్ణగారు హర్యానా ప్రభుత్వం నుంచి ఉత్తమ గాయక అవార్డును గెలుచుకొని వున్నారు.

మురళీకృష్ణగారు 1972 ఐ.ఎ.ఎస్. బ్యాచ్‌కి చెందిన వారు. ఆనాటి నుంచే పదవితో పాటు సంగీత ప్రస్థానం కూడా అభ్యుదయ వేగాన్ని అందుకొంది. గజళ్ళు పాడడంలో భారతదేశంలో ఉర్దూ భాషేతరులలో ఇంతటి వాడు లేడు అనే ఉన్నతోన్నత స్థితికి అందుకొంది.

గజల్ అనేది ఒక కవితా ప్రక్రియ. ఒక ప్రణయ గేయం. ఎన్ని నడకలు నడిచినా, ఎన్ని పోకడలు పోయినా పాట రూపంలో వుండి విప్రలంభ శృంగారంలో పర్యవసించే కవితను గజల్ అనవచ్చు. ఈ గజలు పుట్టిందీ, పెరిగిందీ ఉర్దూ భాషలోనే. మురళీ కృష్ణ గారు పుట్టిందీ, పెరిగిందీ తెలుగు భాషలో, తెలుగు సంగీతంలో. తెలుగువాడైన మురళీకృష్ణను ఉర్దూ గజలు గాంధర్వ రీతిలో వరించడం అద్భుతమూ, అపూర్వమూ. అందుకే ఈయన పట్ల 'గజల్ గాంధర్వ' బిరుదం సార్థక్యం సంతరించుకొన్నది.

మురళీకృష్ణగారు గజళ్ళను ఎంతో సహజ శ్రావ్యంగా పాడుతారు. రేడియోలో, దూరదర్శన్‌లో, ప్రత్యేక గాన సభలలో ఈయన గజళ్ళు ఈనాడు జిగేలు మంటూ గుబాళిస్తున్నై. ఎన్నో కాసెట్లు తయారయినై. ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలలో ఈయన గజళ్ళు పాడి అందువల్ల వచ్చిన ధనాన్ని వివిధ సంస్థలకు విరాళంగా ఇవ్వడం జరిగింది. బొంబాయి లోని రవీంద్ర నాట్య మందిరంలో రెండు గంటల పాటు సాగిన ఈయన గజల్ గానానికి మెచ్చి ఉపరాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మగారు సమర్పించిన పదివేల రూపాయలను మురళీ కృష్ణగారు ఆంధ్రప్రదేశ్ వరద నివారణ నిధికి ఇచ్చివేశారు. అలానే ప్రధాన మంత్రి సహాయ నిధికీ, ముఖ్యమంత్రి సహాయ నిధికీ తన గజల్ కచేరీల ద్వారా ఒక లక్ష రూపాయలకు పైగా సేకరించి అందచేశారు.

ఒకసారి ఈయన గజల్సు పాడి సేకరించిన యాభై వేల రూపాయలనూ వృత్తి కళాకారుల గృహ నిర్మాణ పథకానికి అందచేయడం నేను స్వయంగా చూశాను. ఆ సభలో నేను కూడా పాల్గొన్నాను. ఆ సభలోనే "ఉర్దూ గజళ్ళు మన తెలుగు గజ్జలు" అని నేను ఇచ్చిన నిర్వచనం ఆడియెన్సులో హర్షామోదాలను కలిగించింది.

మురళీకృష్ణగారి గురించి ఇలా ఎంతైనా వ్రాయవచ్చు. ఆయన పాడే గజల్సును గురించి ఒక పరిశోధక గ్రంథాన్నే నిర్మించవచ్చు. ఇక్కడ నేను చెప్పదల్చుకొన్నది అంతటి ఉత్తమోత్తమ గాయకుడికి ఈ నా పాటల తోటను అంకితం ఇవ్వడం ద్వారా గర్వపడు తున్నాననేది.

“తెలుగులో కూడా ఎన్నో గజల్సు వున్నై కదా! ఇప్పుడు మీరు పాడుతున్న బాణీలోనే తెలుగు గజల్సును కూడా పాడండి.” ఇది చాలా మంది తెలుగు సహృదయులు మురళీకృష్ణ గారికి తెలియచేస్తున్న కోరిక. ఈ కోరికను మురళీ కృష్ణ గారు తీరుస్తారనే నేను కూడా ఆశిస్తున్నాను.

9-2-1991 – భీమన్న

# ఎందరో బ్రాహ్మీ మూర్తులు

గేయ కావ్య సంపుటిని ముద్రించడంలో నాకు అనేక ముఖాలుగా ప్రోత్సహించిన వారూ, తోడ్పడిన వారూ చాలామందే వున్నారు. వారందరికీ నేను కృతజ్ఞతలు చెప్పుకోవలసి వుంది.

నా పాటలను పాడడమే కాక వీటి ముద్రణకు అనేక విధాలుగా తోడ్పడిన గజల్ గాంధర్వ మురళీకృష్ణ గారికి కృతజ్ఞతాపూర్వకంగా ఈ గ్రంథాన్ని అంకితం ఇస్తున్నాను. గాన సరస్వతికి గేయ కృతిని సమర్పించు కోవడం ఇది.

రాగోదయం లోని గేయాలను తొలిసారిగా ఆకాశవాణిలో పాడిన గాయకులు, మిత్రులు షేక్ మహబూబ్‌గారు. అది 40 ఏళ్ళ నాటి సంగతి. అప్పటికి మేం ఒకరి కొకరం అపరిచితులం. అదే వరుసలో మల్లిక్‌గారు, బాలసరస్వతిగారు, శాంతకుమారి గారు కూడా పాడారు. తరువాత తరువాత రాభీలలోని గేయాలను పాడినవారు చాలామందే ఉన్నారు. వారిలో చాలామందిని రాభీలు గ్రంథ పీఠికలో చూడవచ్చు.

పుంభావ సంగీత సరస్వతిగా అఖిలభారత జనతకు ఆనందం కలిగిస్తున్న పద్మశ్రీ డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు రాభీలలోని "చూచేకొలదీ సుందరము"అనే పాటను పాడగా అది ఆకాశవాణిలో ఈ మాసపు పాటగా తెలుగుతల్లిని అలరించింది. సుప్రసిద్ధ గాయకులు డా॥ అశోక్ కోనాడగారు, లోకనాథ శర్మగారు, కె.బి.కె. మోహనరాజుగారు, పి.వి. చలపతిరావుగారు, మహాభాష్యం చిత్తరంజన్‌గారు, ఓగిరాల నరసింహమూర్తిగారు, విజయలక్ష్మి శర్మగారు, పాలపర్తి మధుసూదనరావు గారు, డి. ప్రసాదరావుగారు, పి. సాయిబాబాగారు, బొజ్జా కృష్ణశాస్త్రి గారు మున్నగు సంగీత సారస్వతులకూ – ఇంకా ఇప్పుడు పాడుతున్నవారికీ, ఇకముందు పాడబోయే వారికీ కూడా నేను కృతజ్ఞుడ్ని.

నా సాహిత్యానికి నిత్య సౌహార్ద పోషకులుగా వుంటున్న డా॥ బెజవాడ గోపాలరెడ్డి గారికీ, డా॥ బాపురెడ్డిగారికీ, జస్టిస్ పున్నయ్యగారికీ, వాసిరెడ్డి సీతాదేవిగారికీ, డా॥ ఉండేల మాలకొండారెడ్డిగారికి, దరువూరి వీరయ్యగారికీ, జె. అమ్ములయ్యగారికీ,

వేదయ్య గారికీ, ఎమ్. నిత్యానందరావుగారికీ, ఎమ్.ఎస్.భూషిగారికీ, డా॥ఆపదరావు గారికీ, సూర్య విశ్వనాథ్ గారికీ, జొన్నకూటి నాగేశ్వరరావుగారికీ, గనుమల జ్ఞానేశ్వర్ గారికీ, ఆచార్య పేర్వారం జగన్నాథం గారికీ, ఆచార్య కొలకలూరి ఇనాక్ గారికీ, కె. నాగయ్య గారికీ, జె.బి. రాజుగారికీ, నీతిపూడి భాస్కరరావుగారికీ, రామదాసు గారికీ, దేవి శెట్టిరావు గారికీ, స్వర్ణ వేమయ్యగారికీ, గోపాల చక్రవర్తిగారికీ, డా॥ కొండవీటి వెంకటకవి గారికీ, డా॥ వేటూరి ఆనందమూర్తిగారికీ, నిమ్మల అర్జునగౌడ్ గారికీ, ఇలా వ్రాసే కొలదీ ఎన్నో పేర్లు వస్తూనే వున్నై. వీరందరికీ కూడా నా అభివందనాలు.

ముఖచిత్రం చిత్రించిన సూర్య విశ్వనాథ్‌గారికీ, చక్కగా ముద్రించిన పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ అధిపతి శ్రీనివాస్ గారికీ నా ప్రత్యేక నమస్సులు.

ఇక ఈ తోటలో ప్రవేశించండి. ఆనందించండి.

9.1.1991

– భీమన్న

# 1

# తోటలలో పూలె కాని

తోటలలో పూలె కాని
తుప్పలు కనిపించవా?
కొలకులలో మీను లేన
జలగలు కనిపించవా?
    కనిపించక కాదు–
    నా కను అందుకు కాదు!

కోకిల గానమె కాని
కాకి గోల వినిపించద?
తుమ్మెద పాటే కాని
చిమ్మట రొద వినిపించద?
    వినిపించక కాదు–
    నా వీనులు అందుకు కాదు!

స్వాదువైనదే కాని
శ్రావ్యమైనదే కాని
హృద్యమైనదే కాని
ఇతర మేది నిను తాకద?
        నను తాకక కాదు-
        నా తను వందుకు కాదు!

నా భవిష్యత్ అంధకారం
నా పథం బహు సర్ప ఘోరం,
అమృతం కోరనిచో, నా
యాత్ర కింక ఫల మేమీ?
        బాధ లేక కాదు-
        నా బ్రతు కందుకు కాదు!

## 2

## ఇది నా తోట

ఇది నా తోట
ఇది నీ బాట,
నీ కొరకె ఈ పూల బాట
నీ కొరకె ఈ పండ్ల తోట ॥

తోటలో బాట-
బాటలో పాట
ఎలమి పాటలె వెలుగు బాట
చెలిమి పాటలె బ్రతుకు తోట ॥

పూల రంగుల వ్రాలి
పూ దేనె రుచి దేలి
పరిమళ స్నపితలై
భ్రమరాలు పాడుకొను ॥

బాట కిరు ప్రక్కల
తోటలో దశ దిశల
సరస ఫలముల గ్రోలి
శ్రావ్య గానము లీను ॥

## 3
## లయ బద్ధం

లయ బద్ధం జీవితం,
లయ విన్యాసం విశ్వం!
సమ హిత సుస్పందనమే
సామరస్య సందేశం!

కనుక నీకు నా వినతి
గాన రూప సరస్వతి,
శృంగారము, విషాదమో
ఏదైనను రస వర్ణమె!

నా ఆత్మ నివేదన మిది
నీ ఆత్మను కలియు నది,
సర్వాత్ముడ వీవు కదా
సంకల్పమె చర్య నీకు!

# 4

# ఏవో ఏవో నాదాలు

ఏవో ఏవో నాదాలు
ఎన్నో ఎన్నో రాగాలు
హృదయ వీణపై విరిసేను, నా
హృదయ వేణుపై మెరిసేను ॥

సరిగమ వరకూ పలికించి
పరభృతి నేదో పరికించి
పంచమమున వనపాలన చేసి
ప్రజల యెదల దైవత్వము నించి ॥

మావి చివుళ్ళలో మాధవత
వెదురు పొదలలో విశ్వమోహనత
రాగరుచులు, వియోగ వేదనలు
నవరస కలశానంద భంగిమల ॥

భాగ్య నగరమో, బడుగు పల్లెయో
ఋతువు లన్నిటికి రూపమొక్కటే-
కనపడునా అని, వినపడునా అని
మత్తిల్లిన ఆత్మను మేల్కొలిపే ॥

# 5
## నిజమేనా

నిజమేనా? ఇది
నిజమేనా?

వీణ మీద గల సరిగములే
వాణి వరకు మెట్లవునా?
ఏడు మెట్ల ఆ పైని నేను నీ
ఈడూ, జోడూ కాగలనా?

సరిగమ నను నీ సరస కెత్తునా?
నిదపమ నిను నా దరికి చేర్చునా?
నీవూ నేనూ నాద సూత్రమున
జీవ పాత్ర ధారుల మేనా?

ఈ విశ్వము సర్వము మన లీలా
హేలా రంగమె అవునా?
నీ నా కలయికె నవోదయ రా
గానురాగ రుచులవునా?

మనిషో, మృగమో, ద్రుమో, రాయో
మధు రసమున కరిగేదేనా?
గీతములో, సంగీతములో నా
రాత కలిసిపోయేనా?

## 6

## ఎక్కడి నుంచో

ఎక్కడి నుంచో ఏదో
వినిపిస్తున్నది
మమతలతో మనసు నింపి
మరపిస్తున్నది

మావి కొమ్మ, మల్లె కొమ్మ
వేప కొమ్మ, విప్ప కొమ్మ
ఏ కొమ్మను చూచినా
ఎద గొమ్మంటున్నది

వేయి పూలు ముడుచుకొని
ప్రాయ మెల్ల పెదవి గొని
జగమే మధు మోహినియై
సావధాన మైనది

పిక రవమో, శుక రవమో
వేణువులా వున్నది
ఈ వివికిన చిరుడెందం
బృందావన మైనది

## 7

## ఆడుచు పాడుచు

ఆడుచు పాడుచు జీవిత మంతా,
ఆనందంగా గడపాలంటే
        అస్త్ర శస్త్ర విద్యలు నేర్వాలి
        అదురు బెదురు లేకుండాలి !

నీ సుఖ శాంతుల, నీ ఆత్మీయుల
నిన్ను నీవు రక్షించు కోవాలి,
        దుష్టుల శిక్షించాలి
        శిష్టుల రక్షించాలి !

కలం పట్టి నడిపించే చేత
కత్తి పట్ట గలగాలి,
        రౌడీలదె రాజ్యం కాదంటూ
        రాజసాలు గర్జించాలి !

# 8

## రాణి ఈగగా

రాణి పదవితో నను భూషింప
తేనెటీగవై తిరిగే స్వామీ !
పూల తోటలకు శుభమేనా?
పూలు స్వాగతము లోసగేనా?

స్వార్థమె బ్రతుకై బ్రతికే సీతా
కోక చిలుకలూ, కొదమ తుమ్మెదలు
కర్షకు నిను గని కార్పణ్యముతో
బాధించెదరో, భయమగు, స్వామీ !

శ్రమ దొంగలతో, జన హింసలతో
క్రుగ్గుచున్నదీ మానవ లోకం !
విజయ మగుత నీ విశ్వజనీనత!
సఫల మగుత నీ సౌమనస్యత !

# 9

## సృష్టి సమస్తం

సృష్టి సమస్తం ఉద్యాన వనం
జీవేశ్వరుడే తోటమాలి!

చంద్ర గ్రహ తారాదులు
సుందర పుష్ప ఫలాలు,
సురభిళ రస మధురాలు
శుక పిక శారీరాలు!

జాతిని సంరక్షిస్తూ
సమరం చేస్తున్నా,
గ్రహ తారా కాంతులలో
విహరిస్తున్నా–

మానవ హృదయం ప్రియాసక్తం,
మానవ లక్ష్యం రసాద్వైతం!

## 10
## ఋతువు లన్నిటి

ఋతువు లన్నిటి లోని రుగ్మతలు తొలగించి
శోభలను సమకూర్చి సుందరముగా తీర్చి
ఏకైక రమణీయ సాకి నైనాను
నీ కోసమే ఇందు నిలిచి వున్నాను !

శ్రావణ శ్రీలక్ష్మితో ఫాల్గుణము దాక
అత్తింట కులుకు కోకిలను మచ్చిక చేసి
నా గుండె వీణపై నర్తనము చేయిస్తు
నీ కోసమే ఇందు నిలిచి వున్నాను !

ఏ ఋతువులో నీవు ఏ సీమ నుందువో,
ఏ రీతి నుందువో, ఏ ప్రీతి నుందువో
నీదైన అనుభూతి ప్రతి అణువు నే నగుచు
నీ కోసమే ఇందు నిలిచి వున్నాను !

# 11
## విశ్వ మానవుడి కోసం

విశ్వ మానవుడి కోసం వీరుడి వైతివి నీవు
నీ కోసం నే నిందే నిలబడిపోతిని!

ఎంత దూర ముందుంటివో
అంత దగ్గరగ నుంటిని,
నీ విజయ పరంపరలకు
తావు లొసగు చుంటిని!

నీ వచ్చే సమయానికి
నీరాజనమై యుంటిని,
కోరికతో నీ కోసం
కుసుమాంజలినై యుంటిని!

విశ్వనరుని ఉదయానికి
విద్యున్మతినై వెల్గితి,
శ్రేయో జన రాజ్యానికి
సింహాసన మేర్పరచితి!

## 12
## హిమాలయాలను

హిమాలయాలను అధిరోహించేవు
విమానాలపై అమృతం చల్లేవు,
మానస హంసలు విహరింప
మానవ శక్తులు వికసింప!

ఉత్తర దక్షిణ లోకే గీతమై
పూర్వాపరములు పులకింప,
తెలుపు నలుపు లోక దివసమౌ గతి
లోక మొకే లయలో గమింప!

అలుపు వలదు నీ వ్యవసాయమున
అంతు లేదు నీ ఆదాయమున,
నిమిష నిమిషమును నిను రంజించే
ఆత్మ ఇదే నీ అందుబాటులో!

# 13
## ఈ క్షణంలో నీవు

ఈ క్షణము లోన నీవే దారి నేగేవొ,
ఈ నిమిష మందు నీవే నీడ నాగేవొ,
ఎట నుంటివో గాని, ఇటు చూడు మొకసారి!
నీ కనుల నొకసారి నా కేసి మలుపుమా!

నీ కనుల నొకసారి నాకేసి మలుపుమా,
నా బ్రతుకు నిశలోకి నవకాంతి బరపుమా!
ఎంత ఒంటరి తనము నెంత చీకటి నైన
భరియించి, ప్రియతమా! బ్రతికేను నీ కొరకు!

ఏ దూర తీరాన, ఏ యుద్ధ రంగాన
ఏ మబ్బు మలలపై, ఏ కడలి అలలలో
విధి నిర్వహణ లోన వేసారు చుంటివో!
అందుకో నా శక్తి! పుంజుకో నవశక్తి!

## 14
## నీ నుండి వీడ్కోలు

నీ నుండి నేనో, నా నుండి నీవో
వీడ్కోలు గైకొన్న వేళ తడిసిన కనులు
నా కనులు నిత్య వర్షా కృషీ క్షేత్రాలు!
నీ కనులు కావలయు నిర్మలాభ్యుదయాలు!

ఇందె నే నాగిపోయితిని నీ కోర్కెపై
ఇందు నే నుపవసించెదను నీ తృప్తికై,
ఇందు నే ధ్యానింతు, ఇందు నే ప్రార్థింతు
అందందు నిన్ను విజయశ్రీ వరింప!

ఎందు నీవుందువో అందు నేనుందులే
మన మధ్య లేదు అణు మాత్ర దూరము కూడ!
నీ ఊపిరిని నేను, నా ఊపిరివి నీవు
మన ఊపిరే విశ్వమునకు ప్రాణమ్ము!

# 15
## గంగి గోవుల వోలె

గంగి గోవుల వోలె కనిపించునవి యెల్ల
గోవులే అనుకోకుమా!
గో గోపకుల నడుమ గోముఖ వ్యాఘ్రాలు
కొల్లలుగ ఉన్నవి సుమా!

మనిషి రూపాలలో కనిపించు వారెల్ల
మనుషులే అనుకోకుమా!
మనిషి నెత్తురు రుచులు మరిగినట్టి మృగాలు
మన పంక్తినే ఉన్నవి సుమా!

నీవు పెంచిన పిల్లులే పులులుగా ఎదిగి
నిను మ్రింగ వచ్చును సుమా!
శ్రమ దొంగ లున్నారు, జాగ్రత్త ప్రియతమా!
సంసిద్ధముగ కదులుమా!

## 16

## ఏ అన్యాయము

ఏ అన్యాయము నెదిరించెదవో
ఏ దుఃఖితులను ఓదార్చెదవో
కన్నుల వెలుగై కదలుదులే ! నీ
కత్తికి పదునై పొదలుదులే !

జంక బోకు, ఒంటరి ననుకోకు
జంట నుంటి నే సర్వవేళల!
ధర్మ మేవ జయతే, స్వామీ!
కర్మ యోగ మదియేను సుమీ!

మానవుడే సుమి మకుటము సృష్టికి
మానవ హింసను మన్నించకుమా!
దయ చూపకు ఏ దౌష్ట్యము పైనీ,
పెరగ నీకు మే దురహంకారము!

# 17
## న్యాయ ధర్మ పథాలు

న్యాయ ధర్మ పథాలు నగ్జలిజ మైతే
నాది కూడా నగ్జలిజమే!
ప్రేమ శృంగారాలు కృష్ణ మత మైతే
నా మతము కూడా అదే అదే!

సోషలిజమో అంచు భాషించు వారెంద
రెందరో మిలియనీ ర్లీనాడు,
రంతి దేవుని వంటి రాజు లెందరొ దళిత
దీనులను మన్నించి రానాడు!

గతము, ప్రకృతము, భావికాల మను తేడాలు
లేవోయి మానవుని త్రోవలో,
బలము పాలించు, దుర్బలము దాస్యము చేయు
లేవోయి పద్ధతుల భేదాలు!

# 18

## నీది యుద్ధ పథమ్ము

నీది యుద్ధ పథమ్ము, నాది శాంతి పథమ్ము
నీవు నేనును తోడు నీడలం!
దుష్ట శిక్షణ నీది, శిష్ట రక్షణ నాది
మన మైత్రియే ప్రగతి మార్గం!

రోజెల్ల దుష్ట నిర్మూలనములో అలసి
ఇల్లు చేరే నీకు ఇదె స్వాగతం!
విషము చింతలు వీడి విశ్రాంతి తీసుకో,
నీ కొరకె నా నిత్య నీరాజనం!

కలుపు తీయని చేను కలగూర గంపయై
ఆశించిన ఫలమ్ము నందీయదు,
ప్రగతి విధ్వంసకుల ప్రతిఘటించగ లేని
జాతి అభ్యుదయమ్ము సాధించదు!

# 19

## ఏక కుటుంబం

ఏక కుటుంబం ఈ లోకం,
అన్ని దేశములు అందు సభ్యులే!

మావి గుబురులో మసలే కోకిల
మన బొప్పాయీ వనము చేరినది!
పచ్చని బొప్పాయి పండ్లను తినుచు
నిన్నే జ్ఞప్తికి తెచ్చినదోయీ!

ఏది కోకిలము? ఏది కాకము?
మధు మాసమున సమాన మందరును;
రాగ ద్వేషము లవి మనుజులకే,
తేడా లవి ప్రకృతికి లేవోయీ!

రాభణుడేనా రాక్షస రాజు?
విభీషణుడు కాదా?
జాతి వంశ మర్యాదలు కాదోయ్!
స్వగుణములే గణ్యము లోయ్!

# 20

## మానవ హక్కుల బాధ్యత

మానవ హక్కుల బాధ్యత మనసా వహించు,
శ్రేయో రాజ్యపు రక్షణ శిరసా వహించు!

ప్రియతమ! వేరే ధర్మం
పృథ్విని లేదోయి!
ధర్మం కోసం నీవు
త్యాగం చెయ్‌వోయి!

మత హక్కులె రాజ్యమేలు
మాయా లోకం నేటిది,
మాయకు లోబడ కోయీ!
మనుజుని కాపాడ వోయీ!

హేతు బద్ధములు కాని
ఏ క్రియలను నమ్మకు!
క్రియా శీలిగా లోక
ప్రియముగ ప్రగమించు!

# 21
## రాక్షసులంటే

రాక్షసు లంటే ఎప్పుడు లేరు?
రాక్షసు లంటే ఎక్కడ లేరు?
సర్వ దేశముల, సర్వ కాలముల
జన హింసకు లున్నారోయి!

ముళ్ళ డొంకలను త్రోసి రాజని
పూల మొక్క లెదగాలోయి!
దుర్మార్గాలను నిరోధించక
సన్మార్గా లేర్పడ వోయి!

ఏ పర్వతముల, ఏ కారడవుల
కాలి బాటకై కష్టించెదవో!
గిరి మల్లికనై, తరి తేనియనై
సేవ చేతునా? సేద దీర్తునా?

## 22

## నీ మానసములోన

నీ మానసము లోన నే రాజ హంసనై
ఈదాడు కోర్కెయే కాదోయి-
ఆకాశమున కెగిరి, అన్ని దిక్కుల మనసు
అలరించు కోర్కెయును కలదోయి!

హిమ వన్మణీ ముకుట హేమకాంతులు విశ్వ
ముల నెల్ల మేల్కొలుప వలె నోయి!
భారతీ భూపాల పాద రాగ పరాగ
పరములై ప్రాణాలు విరియాలోయ్!

మంచి చెడు లెల్లపుడు మనిషితోనే వుండు
పాలు నీరును కలిసి బ్రతికేనోయ్!
వెలుగు చీకటి రెండు విద్యా మహాదేవి
ముఖ శిఖ ద్యుతులుగా మురిసేనోయ్!

# 23
## పాపమనీ పుణ్యమనీ

పాప మనీ పుణ్య మనీ వల్లించకు సూక్తులు,
పైరవీల దొరలనే వరిస్తాయి పదవులు!

పదవులు గల వారి వెంట
పడతై సన్మానాలు,
సన్మానాల వార్తలే
సమ కాలీన చరిత్రలు!

ఆత్మ రక్షణే కర్త
వ్యం ఏ ప్రాణి కైన,
ఆత్మ రక్షణం మొదటిది
ఆదర్శం తర్వాతది!

అసూయలూ, విజయాలూ
అనుసరించి వుంటాయి,
ధర్మక్షేత్రం బెపుడూ
కురుక్షేత్రమే నోయి!

## 24
## శిష్టులనీ దుష్టులనీ

శిష్టులనీ, దుష్టులనీ సృష్టినెవరు లేరు,
నర సమాజ నియమావళి నడిపించును పోరు!

సత్వ రజ స్తమస్సులు సహజ గుణాలు,
ప్రకోపించనపుడు తప్ప ప్రమాదాలు కావు!

ఇంట గలుగు పాడి గోవు ఎంత సాధు వైనను
కోపము కలిగింతు మేని కొమ్ములతో కుమ్మును!

మంచిని మచ్చికతో సాధించవచ్చు నోయీ!
సామదానముల పిదపే శస్త్రము గొనుమోయీ!

# 25
## కాలాధీనం

కాలాధీనం కాదె సమస్తం?
కాల కర్మ సంయోగమె ఘటనం!
పెరిగే జీవన బీజాణువుతో
ఒరిసే కాలపు నెరసే సృజనం!

కాలమె పురుషుడు, కర్మయె ప్రకృతి,
ప్రకృతి పురుష సంపర్కమె జగతి!
కాలమె దైవం, కర్మయె జీవం,
జీవేశ్వర సంస్కృతియే ప్రగతి!

కాలము పరిపక్వము గాకుండ
చెట్టు పూయదు, చీకటి పోదు,
అదను కోసమై ఎదురు చూచుట
కాలయాపనం కానే కాదు!

## 26
## ఫలితంతో

ఫలితంతో పని లేదోయ్,
పని చేయుట నీ ధర్మం!
పనే జీవి వ్యక్తిత్వం,
పనే వ్యక్తి అస్తిత్వం!

నీతులనీ, జాతులనీ
నిస్వార్థపు సేవలనీ
రాతలు వల్లించకోయ్!
చేతలలో చూపవోయ్!

స్వప్రయోజనం ఏదో కోరి
సన్యాసం స్వీకరించ కోయీ!
మాయ లేళ్ళు, మాయ మునులు లక్షల కంటే
న్యాయ శీలి ఒక్కడైన చాలోయీ!

# 27

## అధికారం

అధికారం చేతికి వచ్చిన తరి
ఆత్మీయుల మరచి పోకుమా!
అధికారం బుస కొట్టిన వేళ
ఆత్మ రక్ష ఆత్మీయుడె సుమా!

పదవీ పీఠం చుట్టూ ఫణి ఫణాల మణులు,
మణు లన్నీ నీ వనుకొని మరచిపోకు ఒడలు!
నీవు త్రోసి రాజన్న అమాయకుడే
నిన్ను త్రోసి రాజనగల నాయకుడౌ!

చేతిలోని బెల్లానికి చీమలు చేరు
తీయదనం బెల్లానిది, చేయిది కాదోయ్,
చీమల మెప్పుల కోసం
చేతిని ఖండించుకోకు!

## 28

## జ్ఞాన మధువుల

జ్ఞాన మధువుల కోసమై ఏ
కాన లందు చరింతువో,
విరియుదును కాలానుగుణ సుం
దరముగా అందందు నేను!

గాన లహరుల సుఖముకై ఏ
దోసెలన్ విహరింతువో,
పలుకుదును నీ హృదయ వీణా
వల్లరుల నందందు నేను!

ధ్యాన యోగ సమాధికై ఏ
కోన లందు వసింతువో,
ఉందు నీతో జీవిత సదా
నందమై అందందు నేను!

# 29

## బంజరు నేలలు

బంజరు నేలలు దున్నేము
బంగరు పంటలు పండించేము,
ఆతతాయి మూకలు దండెత్తి
అపహరించుకొని పోయేరు!

జాతి సేవలో సరిహద్దులలో
పోరు సల్పు మన వీరుల కోసం
కూడబెట్టిన సమస్తం దుష్టులు
కొల్లగొట్టుకొని పోయేరు!

బస్సులు, బిల్డింగులు, బ్రిడ్జీలు
పగలగొట్టి పారేసేరు!
మానవతుల నవమానించేరు
మాంగల్యాల్ త్రెంచుక పోయేరు!

అవసర మైనపు డెల్లా
అవతరింతు నన్నావు!
ఏదయ్యా నీ వాగ్దానం?
ఎపుడయ్యా నీ అవతారం?

## 30

## నీతులెన్నో

నీతు లెన్నో చెప్పుతారు, ఋషుల
వ్రాతలను ఉదహరిస్తారు!
చెప్పేవి నీతులు, చేసేవి ఘాతలు,
ఒడిలోకి తీసుకొని కడుపుపై కొడతారు!

ప్రజ లమాయకు లన్న వాస్తవం తెలిసి
ప్రవచనమ్ముల తోడ మోసగిస్తారు,
కామందు కొక నీతి కార్మికుడి కొక నీతి
కాదోయి మిత్రమా!
కదలుమా సముద్రమై!

సాధ్యాలు కాని సూక్తులు చెప్పి పండితులు
సామాన్యులను బెదరగొడతారు!
తాము మాత్రం పరుల శ్రమ శక్తి గుంజుకొని
కామ క్రీడల మున్గి తేలేరు!

# 31

## సమోహమని

సమోహ మని పరమాత్మే
చాటించిన తరువాత
ఎక్కువ తక్కువ లెంచుట
ఈశ్వర ధిక్కారమె కద?

గీతా పారాయణాలు
గీతోపన్యాసాలు
త్రిశుద్ధిగా లేనప్పుడు
స్థిత ప్రజ్ఞ డెటు లగుదువు?

స్థిత ప్రజ్ఞుడవు గాక
స్థితి నీ కెట నున్నది?
స్థితి గతులను వీడిన జా
తికి బ్రతుకే మున్నది?

## 32

## ఒకడె దేవుడంటాయి

ఒకడె దేవుడంటాయి ఎల్ల మతాలు, ఆ
ఒక్క డెవరి వాడో ఎలా చెప్పడం?

దేవు డొక్కడే – మా ఎల్లయ్య
దేవు డొక్కడే – మా పుల్లయ్య
కల్లగాక పోవచ్చు ఒక్కడనే మాట,
ఎల్లయ్యో, పుల్లయ్యో ఎలా తేల్చడం?

మనుషుల కక్కర లేదోయ్ దేవుడు, తమ
మత విశ్వాసాలే తమ జీవుడు!
మంచిగ నా మాట విను
మత ప్రమేయం మాను!

మతాలు చెప్పే దేవుడు లేడోయీ,
మనసే మనిషికి దైవం నిజమోయీ,
ఉమ్మడి రక్షణ కోసం
ఉద్భవించినది మతం!

# 33
## తానె దేవుడ

తానె దేవుడ నన్న వాడొక
డేని మిత్తిని గెల్చెనా?
ప్రకృతె తానై వున్న దేవుడు
పాప పుణ్యము లెరుగునా?

సృష్టి నెవడో చేయలేదని
స్పష్ట పరచదె కృష్ణగీత?
బీజ మొక పరమాత్మ, సర్వము
తనకు తానే ప్రవర్తించు!

కానిచో, కాడెవడు దేవుడు!
ఐనచో, ప్రతివాడు దేవుడె!
ఎంత గొప్ప ప్రవాహమైనా
వాలు తప్పిన వార్ధి చేరదు!

# 34

## సహస్ర దళ పద్మం

సహస్ర దళ పద్మంపై
సౌరభమే మనస్సు,
        మనో మధుర విన్యాసమె
        మానవ తేజస్సు!

పద్మం వికసించు కొలది
పరిమళం వ్యాపించు,
        వేగం పెరిగే కొలదీ
        విశ్వం వ్యాకోచించు!

మనో వేగమే నోయ్ ఈ
మహో మహస్సు,
        మంచి మనసె పురుషోత్తమ
        మహ దోజస్సు!

# 35
## పండగలే లేకుంటే

పండగలే లేకుంటే
బ్రతుకంతా నీరసం,
నిస్తేజం, నిర్జీవం
నిర్మానుష్యం!

ఏదో ఒక పేరు మీద ఏదో ఒక పండగ,
వీథిలోని పది మందీ వినోదించు పండగ!

పండగలకు లేదోయి స్వపర భేద భావం!
కలిసి వినోదించడమే కాలానికి కళ్యాం!

ఇష్ట దైవమో, ప్రియతమొ,
శిష్ట నాయకుడొ ఎవరో-

ప్రేరణ ఎవరైనా
ప్రేమే పండగ నిండుగ!
సహకారం, సహజీవం
సామరస్యమే పండగ!

## 36
## మనసు నిలిచి

మనసు నిలిచి రమించుటే
మహిమకు బీజం,
మహిమ పెరిగి విరిసినదే
మానవ విజయ పతాకం!

కామలోభ మోహాదులు
కాదయ్యా జీవితం,
మనో నిగ్రహమే మాన
వ నిరంతర పరమ సుఖం!

రసాస్వాద రతమై ప్రే
రణ కల్గి చరించు మనసె
సృజనాత్మక మగు నోయీ!
సుందర తర మగు నోయీ!

# 37
## ప్రతి ఫలము

ప్రతి ఫలము ఆశించకుండా
పరుల కుపకృతి చేయుమా!
ప్రతి ఫలం ఆశింతు వేని
భంగ పడుదువు సుమా!

ఉపకారం పొందిన వాడే
అపకారం చేయుగ వచ్చు,
పరిచయమే లేని వాడు
ప్రాణ దాత కావచ్చు!

మానవుని కర్తవ్య మేమి?
మహికి వెలుగును చూపుట!
క్షణిక సుఖముల కాశ పడక
సర్వ శ్రేయము గోరుట!

# 38
## ధనం, పదవి

ధనం, పదవి, అధికారం
దానవ లక్ష్యములు,
    మూగుదు రీ క్షుద్ర లక్ష్య
    ముల చుట్టూ సామాన్యులు!

చక్కెర పలుకుల చుట్టూ
చేరును చీమలు,
    వగరైనను ఎల మామిడి
    చిగురులె తిను కోకిలలు!

అల్ప భోగముల కోసం
ఆరాటం పడకుమా!
    అమలిన మానవ సమాజ
    మాశయముగ నడువుమా!

# 39

## నీ సమస్యలు

నీ సమస్యలు, దురదృష్టాలు, కష్టాలు
నీ అధైర్యము తోడివే యౌను తెలుసుకో!
సర్వ సంసిద్ధతయె సాహసం,
సాహసే లక్ష్మి అనునదె లోక సత్యం!

ఇచ్చుటకు నీవు సంసిద్ధుడవు కానిచో
పుచ్చుకొనుటకు లేదు అర్హత!
ప్రాణ మివ్వక లేదు విజయం!
హృదయ మివ్వక లేదు ప్రణయం!

జగములో లేదే సమస్య, ప్రకృతితో
సహజీవనము నేర్చుకో!
ఇతర జీవులకు లేని సమస్యలు – మనిషి
కేల వచ్చెనొ తెలుసుకో!

# 40

## నల్లకలువలవే

నల్ల కలువ లవే
తెల్ల తామరలు అవే
సతీ శివుల జంటల వలె
సరసి నిండ అవే !!

చల్లని జాబిల్లిని తమ
జడ ముడిలో ముడుచుకొని
అరగన్నుల మైకములో
అరుణోదయ తల్పముపై !!

రేబవళ్ళ సహధర్మం
చంద్ర సూర్య సహవాసం,
మనిషికి సహజీవన మిడు
మానవతా దీపాలై !!

మహితాత్ముల మనసుల వలె
మంచి నెల్ల సేకరించి,
మహి కొసగు మధు వ్రతాల
మధుర హాస రుచులవే !!

# 41

## ఇదే ఇదే జీవితము

ఇదే ఇదే జీవితము
ఇదేనోయి మన జీవితము,
కష్ట సుఖాల కమలా కరము
కన్నీటి సరోవరము !!

చీకటిలో ఎవరెవరో మనము
వేకువలో అనురక్తులము,
పగలంతా పని పాటులము
రగిలే నెత్తురు శ్రమికులము !!

వికసించును కలువలు, కమలములు
ఒకే సరసిలో ప్రక్క ప్రక్కగా
కలువ మొగ్గవో, కమల కళికవో
కళాకాంతులే బ్రతుకోయీ !!

నీ స్వభావ మేదో అదె నీవు,
నిను నీవే నియమించుకోవలె!
అంకుశమ్మైనా, కుంకుమమ్మైనా
ఆనందమె ఆదర్శమోయీ !!

# 42

## నీవు వినా

నీవు వినా
ఎవ్వరు తేగలరు ఇక
ఈ తోటకు నవోదయం ?

కోకిల పాడగ రాగానే
కాకులు తరుముకు పోతుంటే
ఎంత కాలమీ మ్రోడులు
ఇగురించక సహియించు ?

చీకటి ఒకటే అయితే
సూర్యుడు ఒకడే చాలడా?
ఎంద రెంద రే మాన్యులైన మా
యీ శూన్యము వెలిగించ గలరే ?

ఓహో, జన లక్ష్మీ!
అభ్యుదయోదయ రశ్మీ!
సర్వజన శ్రేయో ల
క్ష్యంగా భువి వికసించగ !!

ముళ్ళ పొదల పొదుగులలో
పూదేనెలు పిదికేవు,
పక్షపాతములు లేని
పరమాభయ నయ పాణివి !!

# 43

## రావే శుకవాణి

రావే శుకవాణి, రావే మధుపాణి!
రావే అలివేణి, రావే రావే!

మది లోన నీ ఊహ కదలాడెనే
ఎద నేవౌ రాగాలు రొద చేసెనే,
శ్రమ తీరి కోరికలు సభ గూడెనే
ప్రాణాలు నీ దారి ప్రణమిల్లెనే !!

నిన్ను గాక తలపను నే నెవరినీ
నిన్ను దాటి చూడలేను దేనినీ,
గుండెకు నీ గోరొక్కటి తాకనీ
కోటి వీణ లొకే సారి మ్రోగనీ !!

# 44

## స్వాగత మోయీ

స్వాగత మోయీ వసంతా!
సరస వసంతా, స్వామి వసంతా !!

సుందర సురభిళ సరస వసంతా
సుమనో వికస న్నిఖిల దిగంతా
సారాసార సమాన రసోదయ
సర్వ శ్రేయో భాస్వంతా !!

రాగ మధుర మధు జీవన తేజా
రావోయీ, ఋతు రాజా!
శరదాదులు నీ సచివులు, మంత్రులు
జన సేవా పరతంత్రులుగా !!

ఎండలు మాడ్చి, వరదలు ముంచి
గుండెలు పగిలిన కువల యేందిర
అశ్రు జలధిలో స్నానమాడి, నీ
అడుగుల మడుగై పరచుకొన్న దదే !!

నీ వున్నపుడే కంతు జయంతులు
నీ తోడిదె సౌభాగ్యము లెల్ల
అణు వణువున నిను నింపుకొని
అమృతాత్మను విరియించుకొన !!

# 45
## ఎన్నో సమస్యలు

ఎన్నో సమస్యలు
అన్నీ సమస్యలు !!

ఎదుగుతున్న పిల్లలతో
ఎదగని రాబడులు,
అక్షరాల ఖరీదులు
అక్షర లక్షలు !!

కరువు భత్యం మొక రూక - దాని
ధర పది రూపాయలు
పది కిలోల బియ్యంలో - తొ
మ్మిది కిలోల రాళ్ళు !!

పట్టిపోయి రోడ్ల మీద
వదిలేసిన బర్రెలు
ప్రజాస్వామికం నిండా
అజాగళ స్తనాలు !!

కూటికి, గుడ్డకు, కొంపకు
గుడ్డ లేని గొడుగులు
వోట్లేమో కోట్లు
కోట్లుంటే సీట్లు !!

అందరమొకటే అంటూ
అంటరాని ధర్మాలు
కుంట పొలం ధర్మానికి
కురుక్షేత్ర యుద్ధాలు !!

ఒళ్ళెరగని లారీలు
కళ్ళు లేని కార్లు
నిశాచరులు రాజులు
నిశానీలు తారలు !!

మతులు లేని మాన్యాలు
గతులు లేని గ్రామాలు
పదవికి జీతాలు
ఫైలుకు లంచాలు !!

# 46

## ప్రకృతి శక్తి

ప్రకృతి హృదయ సౌందర్యం
పార మెరుగనిది,
పురుష బుద్ధి నైశిత్యం
పరిమితి లేనిది !

ఎద లోనిది మెత్తదనం
మెదడు లోది కరకు దనం,
చంద్ర సూర్య కళాలయం
శక్తికి నిలయం !

చిలికే కొలదీ ఊరే
జీవన రస తత్వం,
ఊదే కొలదీ రగిలే
ఓజో జవ సత్వం !

హృదయం, బుద్ధీ కలిసినదే
ఉదయోదయ పూర్ణ జీవితం,
అదే అర్ధ నారీశ్వర
హావ భావ రూపకం !

# 47

## ఎవరే సర్వజ్ఞులు

ఎవరే సర్వజ్ఞులు ?
ఎందుకు దిగులు ?

పరిగెత్తే రైలుబండి
పట్టా లెరుగున ?
కాలుతున్న కరెంటుకు
కాంతి తెలుసున ?

రాత్రి పగలు తేడాలు
రవి కగుపించున ?
పరిమళమో, చెడుకంపో
పవనుడు గుర్తించున ?

మండే ఆకటి మంట
మంచి చెడ్డ గమనించున ?
పదవీ బధిరాంధత్వము
ప్రాణి విలువ లెక్కించున ?

తన కర్తవ్యమె తానై
కొనసాగును ప్రకృతి,
అజ్ఞానమె తన ఆస్తిగ
అంతరించు మనిషి !

# 48

## ఇంతటిదా

ఇంతటిదా నీ వైభవము !
ఎంతటిదో నా భాగ్యము !

మోహిత సంధ్యారాగ చుంబిత
భువి దివులా? అవి పెదవులు!
అందముగా అపుడపుడే విచ్చిన
కెం దామర పూరేకలు !

కమలాలయమున వెలిగించిన శ్రీ
కర దీపములా ? అవి కనులు !
తారా తోరణ పరమాలంకృత
ద్వార దేశ దర్శక మణులు!

విభాత కాంతుల వెనుకకు మళ్ళిన
విశ్వ తమస్సుల ? అవి కురులు !
అనంతత్వ తీర క్షేత్రాలకు
అమృతం మోసే వీచికలు !

నందన బృందా పూర్ణ కలశముల ?
సుందర హేమ శ్రీలతలా ?
నా కభిముఖముగ, నా కౌగిటిలో
నవ మాసపు సన్మానములు !

# 49

## అలరించాలే కాని

అలరించాలే కానీ – నీవు నను
అలరించాలే కానీ –
పొగ మంచునై పో,
అగరు దీపమై
నీ చుట్టూ వె
న్నెలలు కాయనా ?

కారాకునై పో,
కరగి పోయి నీ
పదములపై నవ
పద్మము కానా ?

చిరు మబ్బునై పో,
మెరుపు తీగనై
నీ ఎద గుడిలో
నిలిచి వెలుగనా ?

నిరు పేదనై పో,
పరమ శివుడనై
పూర్ణ దేహ మిడి
పూజ చేయనా ?

# 50
## నీవేదో చెపుతున్నావు

నీ – వేదో చెపుతున్నావు,
నే – నే వినలేకున్నాను !

నీ – పెదవుల కదలికలో
నీ – కన్నుల కవళికలో
మా – టల కందని, పా
టల పొందని దేదో ॥

ఈ – విరిసే ప్రతి పూవూ
ఈ – మెరిసే ప్రతి మెరుపూ
నిను – అనుకరించి, నను
కనికరించ గల దేదో ॥

నా – బాటలోన అడుగడుగున
నవ – మంజీర శ్రుతి రతుల
ఆ – నంద మిడుచు, ముం
దుకు నడిపించే దేదో ॥

హ్రీం – కారముగా నిను వెడలి
శ్రీం – కారముగా నను చేరి
నిను – నను అనుసంధిం
చే దేదో ॥

# 51

## ఎక్కడివీ మువ్వలు

ఎక్కడివీ మువ్వల గలగలలు ?
మువ్వల గలగలలు
రవ్వల రవరవలు ॥

ఏ మువ్వల గజ్జెలు
ముందడుగులు వేస్తున్నవో,
ఏ రవ్వల మొలత్రాడు
గారాము చేస్తున్నదో ॥

ఎటు నుంచి ?
ఎటు పొంచి ?
ఇటు తూరుపు నుంచి
అటు పడమర నుంచి
నానా దిక్కుల నుంచీ
నా కేసే వస్తున్నవి ॥

పై నుంచా ? ఆ
పై నందన వని నుంచా ?
క్రింది నుంచా ?
బృంద నుంచా ?

నా హృదయ స్పందనలే
నవ వాద్య బృందముగా
నా చుట్టూ, నను తట్టే
నవ ధాన్య నృత్యాలు,
నవ లక్ష్యాలకు నన్ను
నడిపించే తత్వాలు ॥

# 52

## ఎందుకు నాపై

ఎందుకు నాపై ఇంత దయ ?
ఏ పని చేసితి నని ?
ఏ ఫల మొసగితి నని? ॥

బతుకమ్మవు కనుక
బోనాలు పెట్టితిని,
చదువుల తల్లివి కనుక
సాగిల బడితిని – ॥

వట్టి చేతులతో వచ్చి
వరా లడిగితిని,
మట్టిగ పుట్టీ – నీ
మట్టెల సైనా
ముట్టుకో లేనైతిని ॥

దొరలకు కాల్మొక్కి
దొమ్మరిగా బతికి
చావలేక – నీ
చాటున దాగిన – నిరు
పేదను – చిరు
బాధను ॥

# 53

## క్షేమమే కదా

క్షేమమే కదా ?
క్షేమమే కదా, చెలీ ?

మాట్లాడక చూస్తావు
మౌనంగా పోతావు,
మరచిపో లేదు కదా
మన పూర్వపు చెలిమి కథ?

నన్ను నీవు విడిచిపోయి నప్పటిదే
జ్ఞప్తి యున్నదా నా ఈ భంగిమ?
శిథిలమైన దనుకోకు
హృదయ మున్న దిట తాకు ॥

గుడి శిథిలం కావచ్చు
గుండె రాయి కావచ్చు,
పలకరించవా నిన్నీ ప్రతిమలు ?
పరమాత్మకు రూప కల్పనలు ?

ఎంత కాలమైనదో
ఈ దారికి నీవు వచ్చి !
మరల వత్తువో, రావో
మన సిదిగో తీసుకుపో ॥

(రామప్ప గుడి మీది శిల్ప కన్య నన్ను చూచి - 22-9-1979)

# 54

## ఎవరవు నీవు

ఎవరవు నీవు
ఇంత దండ వేశావు !

ఎక్కడివీ పూలు
ఎన్ని పరిమళాలు !
ఇన్ని రంగుల రకాలను
ఎలా సేకరించావు !

ఎన్ని పొదలు వెదికావో
ఎన్ని ఎదలు కదిపావో
ఎన్నాళ్ళుగ నా కోసం
ఈ దండను కూర్చావో !

ఏ మోహన రాగంతో
ఈ మొగ్గలు పుడికావో,
ఏ దేవ గాంధారిని
నా దారికి మలిచావో !

దండ లోన మునిగి నేను
తన్మయమ్మై యుండి పోయి
తేరుకొనే లోగానే
పారిపోతి వే దారికొ !

# 55

## నిన్ను చూడాలని

నిన్ను చూడాలనీ
నిన్ను కూడాలనీ
ఎన్నో గాలి మేడలు
ఎన్నో క్రీ నీడలు ॥

ఎన్ని వసంతోదయ మధు రోహాలు
హేమంత నిశీథాలై పోయె,
ఎన్ని సుప్రభాతాలు
ఇంకి క్రుంకి పోయె ॥

ఎన్ని ఎన్ని జన్మల అన్వేషణ
ఎంత ఎంత రూప కళా కల్పన
యుగ యుగాల మొగ మొగాల
ఊర్పుల నిట్టూర్పులలో ॥

ఇంత దూరమా నీ వాసం
ఇంత కాలమా నీ కోసం !
పౌర మాత్రపు అసమానత
తర తరాల దాసత్వమ ?

## 56

## తాకనా ఒకసారి

తాకనా ఒకసారి
తన్మయత నొంద
అరుణోదయాలు నీ
చరణార విందాలు ?

ఉదయ రవి చంద్రికా
ఉద్యాన రాధికా
మోవి మకరందాలు
ముద్ద మందారాలు ?

ఆమోదమున గ్రోలి
ఆస్వాదమున తేలి
అందాల రుచులతో
ఆనంద కందమ్మై ॥

పైరు పుప్పొడు లలదు
పారాణి పాదాలు
తారకా మాలికల
జీరాడు కురులు ॥

# 57

## అవిటిదిరా లోకం

అవిటిదిరా లోకం
ఈ లోకం –
అంద మెంత వున్నా – అది
అసంపూర్ణ మేరా ॥

ఏ కష్టం ఏ నష్టం వచ్చినా
నీ కొక్కడికే అనుకోకురా,
నీ కంటే ఘను డెవడూ
లోకంలో లేడురా ॥

కంటికి నచ్చే దంతా
ఒంటికి మంచిది కాదు,
మనసును పిలిచే దంతా
మనుగడ పెంచేది కాదు ॥

ఆశ తోడ బ్రతకరా
ఆశే అమృతమురా
స్వయం నిర్ణయమే
సత్యం సుందరం శివం ॥

# 58
# దానమె ధర్మమురా

దానమె ధర్మమురా,
సమతా
ధర్మమే దానము రా !

తల్లీ, తండ్రీ, భార్యా, బిడ్డా
తరతరాల సౌభాగ్యమురా !
సాధూ, జంగం, బీదా, బిక్కీ
సంసారంలో చితుకులురా ॥

వేసట లేక, విశ్రమించక
విద్యా, ధనమూ కూర్చరా!
పదిలముగా సిరి విరియా లంటే
పాత్ర దానమే మార్గం రా ॥

నీకూ, నాకూ, ఎవ్వరికైనా
నిండిన కడుపే పండగరా !
మండే కడుపులు నిండిన మీదట
పండిన పంటే సంపదరా ॥

# 59

## మండాలిరా

మండాలిరా భోగి మంట,
ప్రతి ఇంట
వండాలిరా పిండి వంట !

చలి తీరగా
ఆకలి తీరగా
దొంగ దోమల నెత్తు
దోపిడీలు నశింప ॥

చీకటుల బొగ్గు నుగ్గై సడలగా
వాకిళుల ముగ్గు మొగ్గలు తొడగగా
పీడ పీడలు కాలి
చిత్తాలు విరియగా ॥

భోగి పిడకలు పేర్చి
త్యాగాగ్ని ముట్టించి,
జాతి శ్రేయో గీతి
జంగాలు పాడగా,
మౌఢ్యాలు మసి మసిగ
జాడ్యాలు నుసి నుసిగ ॥

పాత బూజులు దులిపి
కొత్త గాదెలు నిలిపి,
తరుణోదయము తెల్పు
కర దీప రుచులతో ॥

# 60
## అదే ప్రభల తీర్థం

అదే ప్రభల తీర్థం,
ఆనందానికి పరమార్థం ॥

పల్లె పల్లెకు ఒకొక్క ప్రభ
ప్రభకు ప్రభకు ఒక శోభ,
గ్రామాభ్యుద యోదయ రథోత్సవం
ప్రగ తీందిర కల్యాణ మంటపం ॥

ఆదిత్యుడు మన కేసి తిరిగి, కరు
ణా దయేక్షణలు బరపిన సుదినం,
ప్రజల మనో రథముల కేదారం
ప్రాతను రాల్చిన కొత్త తరం ॥

జడ భరతులు తమ జడతను వీడి
స్వప్రకాశమును గొన్న ముహూర్తం,
ఉత్సాహానికి, ఉత్తేజానికి
ఓజస్సుకు భాండాగారం ॥

## 61

# ఇటు పూలు - అటు పూలు

ఇటు పూలు, అటు పూలు
ఎటు చూచినా పూలు !
ఎన్నెన్ని పూలు, ఎ
న్నెన్ని అందాలు !
ఒక్క పూవైన అందేనా ? నాకు
ఒక అందమైన దక్కేనా ?

చేయి చాచే కొలది
చెంత కేగే కొలది
అంది నట్టె నటించి
అపహసించే పూలు !
మందార పూ మొగ్గలో, ఇవి నాకు
మాయ మిణుగురు పుర్వులో !

పూవు లందే టంత
పొడు గెదగ కుంటినో !
కలువలకు తగిన వె
న్నెల కాయనో నేను !
దివి అందకుండ అలయించు, నన్ను
భువి కూడ వెలిగ నుంచు !

## 62

## కూడా రాదురా

కూడా రాదురా, ఏదీ
కూడా రాదురా !
        కూడ బెట్టే
        మూఢ నరుడా !

తాత తండ్రుల ఆస్తి తింటూ
రోత బ్రతుకు బ్రతికేవాడా !
        సొంత కష్టం లేకపోతే
        పుంతరా నీ మానవత్వం ॥

స్వంత పిల్లల సుఖము కోసం
సాటి పిల్లల కడుపు కొట్టే
        కూడ బెట్టే లంచగొండీ !
        కోట గట్టే చెత్తకుండీ ॥

పరోపకారం పుణ్యంరా
పర పీడన పాపంరా,
        పుణ్య మొక్కటే పరమార్థం, మడి
        మాన్యాలన్నీ వ్యర్థంరా ॥

## 63

## దున్నలు దున్నలు

దున్నలు, దున్నలు, దున్నలు
ధూళీ దూగర దున్నలు !
దుంగ ల్లాంటి దున్నలు
దొంగ ల్లాంటి దున్నలు ॥

ఏ పనీ పాటు లేని దున్నలు
ఇతరుల పొలాలు మేసే దున్నలు,
మేసినంత మేసేసి, మిగిలిన
మేత నెల్ల తొక్కేసే దున్నలు ॥

మహిషుని సేనల లోని దున్నలు
మనుషుల రూపం గొన్న దున్నలు,
చిరునవ్వులు నవ్వగల దున్నలు
నర మాంసం రుచి మరగిన దున్నలు ॥

మహిష మర్దనికె లంచ మీయగల
మాయా భక్తులు దున్నలు,
తోకలతో తమ పాపపు బురదను
లోకంపై చిమ్మే దున్నలు ॥

## 64

## మారే వాడే

మారే వాడే మానవుడు,
మారని వాడు మహేశ్వరుడు !

ఋతువు ఋతువుకూ మారే పువ్వుల
క్రతువు క్రతువుకూ ఊరే ఫలముల
మధువు లెల్ల, రుచు లెల్ల సమస్తం
మానవుడే, మారేవాడే ॥

జాతులు, మతములు, రంగులు కల ఈ
జగతి నెచటొ పుట్టే మానవుడు,
దేశ కాల పాత్రాను గుణముగా
స్థితిని దిద్దుకొను వాడె మానవుడు ॥

లక్ష్యా లంటూ, లక్షణ లంటూ
లక్ష బరువులను నెత్తి బెట్టుకొని
రంగు మారుతూ, రాస్తా మారుతు
రింగులు తిరిగే మానవుడు ॥

## 65
## ఎక్కడి కోయీ

ఎక్కడి కోయీ పయనం ?
ఏమిటి నీ వయనం ?
ఎక్కడి నుంచి పైనమైతివో
ఏ దిశ కేసి పోవుచుంటివో
అవగాహన కలదా ? నీ కడ
ఆదర్శము కలదా ?

దీక్షా దీక్షితమైన పైనమా ?
దిక్కు తోచని పలాయనమా ?
ఆగి గణించి, ఆలోచించి
సాగిస్తున్న పురో గమనమా ?

బొంగరమా ? రంగుల రాట్నమ ?
భూవలయమ నీ వెక్కిన రథము?
చవుక ధరల షాపుల వరకా ?
ధ్రువ తారను దాటే ప్రయత్నమా ?

# 66

## స్వరాజ్య రథం

అది గదిగో – అది గదిగో !
అది గదిగో స్వరాజ్య రథం
సాగి వచ్చె నోయీ !
ఆత్మావని వికసింప
హారతీ గదోయి !

ఎంద రెందరో మహాత్ములు
ఎందరొ యువ సింహాలు
ప్రాణాలను ధారవోసి
పండించిన మనోరథం !

శతాబ్దాల జన కాంక్షలు సుమించీ
దశాబ్దాల త్యాగశ్రమ ఫలించీ
ఆగస్టు తొమ్మిది జ్వలించి
ఆగస్టు పదిహేన్ జయించి ॥

పేదరికపు చీకట్లను చెరిగేస్తూ
కుల తత్వపు విషధూమం విరిచేస్తూ
అస్పృశ్యత రూపుమాపి
అభ్యుదయం వెలయిస్తూ ॥

సర్వ సమైక్య సుకేతన శోభలు భువి నిండ
సమ సమాజ నిర్మాణ ప్రణాళికలు పండ
విశ్వ శాంతి సంక్షేమం
విశ్వయోగ శుభ ధామం ॥

# 67

## మనిషంటే అతడే

అతడే ! అతడే ! మనిషి !
మని షంటే ? మనీషి !
తన వాడని, ఇతరు డనీ
తరతమ భేదం చూపక
ఇలలో ప్రతి జీవినీ
ఈశ్వరాంశగా చూచే ॥

శక్తి కొలది శ్రమ చేసీ
భుక్తి మించి జమ చేసీ
జాతి కెల్ల పంచీ, తన
జన్మ ఋణం తీర్చుకొనే ॥

చెడుగును తొలగించుకొనుచు
చెలిమిని పండించుకొనుచు
అభ్యుదయ కృషీవలుడై
అలపు లేక పని చేసే ॥

చీకట్లో దీపంలా
లోకంలో మను వాడు,
సమతా ధర్మం కేసి
జాతిని నడిపే వాడు ॥

# 68

## పునాది

తోట నాటినా
కోట కట్టినా
నారు పరువు నెంచాలోయ్ ! పు
నాది బిగువు చూడాలోయ్ !

యుగ యుగాల, మొగ
మొగాల తావులు –
తండ్రి, తాత, ము
త్తాతల తీవులు–
తోట నిండ విరియాలోయ్ !
కోట నుండి కురియాలోయ్ !

వాల్మీకులె నవ కోకిలలై
వ్యాసులే కృషీ వలులై
సమ సమాజ లక్ష్యం సిద్ధించి
జాతి జాతె మధుమాసం కాగా
విజయ గీతములు పాడాలోయ్ !
విశ్వ మానవత ఆడాలోయ్ !

# 69

## ఊళ్లు ఊళ్లే లేచి

ఊళ్ళు ఊళ్ళే లేచి గమ్మున
లేళ్ళ వలె పరిగెత్తు చున్నవి !
వేద నాదం విరిసెనో,
విజయ శంఖం మొరసెనో !

కనులు తెరచిన రెండు కరములు
కలము పట్టెను, హలము పట్టెను !
అసమ తమసిని తుంచునో,
అభ్యుదయమును పెంచునో !

నాగు బాముల బోలు వాగుల
భోగముల నరికట్టి నిల్పెను –
బాల కృష్ణుల పదములో,
ప్రజల ప్రాభవ పదవులో !

రాళ్ళు, రుప్పలు నరికి – బంజరు
బీళ్ళు దున్ని ముఖాలు కడిగిరి !
వసుధ గుండియ పండెనో
పసిడి కంచము నిండెనో !

## 70
## కోరుకో, కోరుకో

కోరుకో, కోరుకో !
కోరుకొని- గమ్యం చేరుకో !

వెదురు పొదల జనించినా
వేణువుగా మొరయా లని,
ములు కంపే లభించినా
గులాబివై విరియాలని ॥

పల్లె కోన మల్లె వైన
వాణి వేణి నుండాలని,
చీకటిలో చితుకు వైన
జీవాగ్నిగ మండాలని ॥

నల్ల రంగు పులిమి నిన్ను
నట్టడవుల పూడ్చినా,
సహజ తేజమున లేచి
జాతికి వెలు గివ్వా లని ॥

# 71

## ఇటు తిరుగు

ఇటు తిరుగు, తిరుగు తిరుగు !
ఎక్కడికా పరుగు ?
అందున్నది మిరప చేను
అణగును నీ పొగరు ॥

పుట్టి నెలైనా కాదు
పొట్టి గిత్త వైనావే !
బడికేగే పిల్లలను
పడ దన్నుకు పోతావే ॥

పాలు కొంచెమే పితికి
పసి కూనకు వదిలేము,
మా కేసే బుసకొడుతూ
మంకు తనం చూపేవే ॥

(చిన్నప్పుడు పసువుల్ని కాసిన కాలంలో, పొగరుపోతు గిత్తదూడను గురించి పాడుకొన్న పాట)

# 72

## ఎన్ని మాయలు

ఎన్ని మాయలు నేర్చినా
ఎన్ని మహిమలు చూపినా
ఎన్ని పదవు లలంకరించిన
ఎన్ని భోగము లనుభవించిన
మానవత లేకున్న వాడు
మనిషి కాదన్నా !

చచ్చిన వాడి కళ్ళు
చార డంతేసి కాదన్నా !
చచ్చిన తదుపరి దుష్టుడు
సాధు వెట్లు కాగల డన్నా?
చావు బ్రతుకులకు తేడా చూపక
సత్యమునే పలు కన్నా !

దుష్టుల పొగిడే దుర్బలులే మన
దుఃఖాలకు కారకు లన్నా !
ఎప్పటి కప్పుడు ముళ్ళ మొక్కలను
ఏరి పారవెయ్ వలె నన్నా !
మానవ జీవిత ముద్యానం వలె
మధురం కావలె నన్నా !

# 73

## మంచితనం కాదురా

మంచి తనం కాదు రా, మానవుడా !
మగవాడి తనం ప్రధానం రా !
మంచిని కాపాడాలి, మానవతను పెంచాలి
కుటి లాత్ముల దండించే గుండె బలం కావాలి ॥

మంచితనం మానవులకు సహజ గుణం రా
మంచి తనం లేకుండా మనిషే లేడు రా,
నీ సుఖ శాంతులు నీతోనే నిలవా లంటే
నిలుపుకొనే శక్తి నీకు వుండాలి రా !

స్వార్థమే ప్రధానం ఏ ప్రాణికి నైనా
ఆత్మ రక్షణయే ప్రథమ కర్తవ్యం,
పూలనైన తిని వేయును మేకలు, పంట
చేలనైన ముంచి వేయు వరదలు !

# 74

## ఎవరాప గలరురా?

ఎవరాప గలరు రా ?
నవ యువకుడా నిన్ను ?

చదువున్నా - లేకున్నా -
శ్రమ శక్తి నీకున్న
చీకట్లు చీల్చుకొని
శ్రీ చరణముల విరియ ॥

ధనమున్నా - లేకున్నా -
ధైర్యమే నీకున్న
ముళ్ళ డొంకలు నరికి
పూల తోటలు పెంచ ॥

పని వున్నా - లేకున్నా -
పట్టుదల నీకున్న
ప్రతి అడుగు నేలపై
ప్రగతి సౌధము నిలుప ॥

తెరువున్నా - లేకున్నా -
ధీ శక్తి నీకున్న
దివి కోటలే కొట్టి
భువికి స్వర్గము దింప ॥

# 75

## ఎవడురా

ఎవడురా ఈ జాతి నేత ?
ఎవడబ్బ సొమ్మురా ఈ వేద గీత ?

ఈ వేల ఎకరాలు
ఎవడు కొన్నాడు ?
ఈ రాజ భవనాలు
ఎవడు కట్టాడు ?
తన తాత కొన్నాడ?
తన కొడుకు కట్టాడ?

వ్యవసాయమూ తనదె
వ్యాపారమూ తనదె
ఉద్యోగమూ తనదె
ఉన్నదంతా తనదె

ప్రజలు బ్రతికే దెట్లు ?
ప్రతిభ విరిసే దెట్లు ?

ప్రజలెల్ల సొంత బిడ్డలుగా
శ్రమ జీవు లెల్ల సైన్యముగా
ఐశ్వర్య పథకాల
అభ్యుదయ పథములో
జై హిందుగా సాగు
సర్వోదయుడు గాక ॥

వాల్మీకి నిజ తపస్సూ
వ్యాసుడి ప్రజా మహస్సూ
జీర్ణించుకొన్న సం
పూర్ణ పురుషుడు కాక ॥

# 76

## కదలాలిరా

కదలాలిరా, కదలాలిరా
నవ మానవత కేసి నడవాలిరా !

చీకటులు సడలెరా
వాకిళులు విరిసెరా
ప్రగతి పొలముల నిలిచి
పనిదేవి పిలిచెరా ॥

రాలు రప్పలె లేచి
రథము లారోహించె,
విశ్వ చేతనుడవే
వెనకబడి పోదువా ?

హరిజనుడ, గిరిజనుడ
అజ లేని బహుజనుడ,
భారతేందిర సుకృత
బహుమాన పుత్రుడా ॥

నీ కృషియె నీ బలము
నీ చెమటె నీ ధనము
నీ బాగె దేశ సం
క్షేమమ్మురా ॥

# 77

## నీవు కూడ మానవుడవు

నీవు కూడ మానవుడవురా !
నీలో పౌరుష మున్నదిరా !

ఎపుడో చావక తప్పనప్పుడు
ఇపుడే చచ్చిన లోటేమిటిరా ?
జీవించుట దైవీయ మందువో
స్వేచ్ఛగ జీవించగ వలె గదరా !

దొరలకు భూములు, దొరలకు మేడలు,
దొరలకె అధికారములా !
దొర లెవ్వరురా? దొరకని దొంగలు !
దొరికే నౌకరి నీకెందుకురా ?

రైతోడా, కూలోడా, మనిషిగ
బ్రతికే మార్గం ఒకటేరా !
చావు భయం విడనాడరా ! నీ
జీవిత మపుడే మధురం రా !

# 78

## నిరాశ యేలా?

నిరాశ యేలా, యువకుడ, నీకు
జరా మరణములు లేవురా !
    నిత్య నిరంతర జీవన గంగ
    నిలిచి పోలేదురా !

దేశ కాలములు కుడి ఎడమైనా
జాతి వర్గములు తల క్రిందైనా
    స్థిరమైనది నీ యువశక్తే రా !
    స్థితి నొసగే దొక నవశక్తే రా !

పని యేదైనా పరమాత్మరా,
పని తనమే బ్రహ్మైక్యమురా !
    చేతనైన పని చేసుక బ్రతికే
    జీవుడె దేవుడు రా !

నిస్పృహ యేలా, నీరస మేలా ?
నీకంటే బలవంతు డెవడు రా ?
    నిను నీ వెరిగి పెరగరా !
    నీతిని జాతిని పెంచరా !

## 79

## భయపడకు

భయ పడకోయీ, అ
భ్యుదయం నీదే నోయీ !

దొంగకు ఆశ్రయ మివ్వకు,
దోచు నతడు నీ ఇల్లే !
నేర మెందు కనబడినా
నిలబెట్టుము ప్రజల ముందు !

చీకటి కొట్లు పగిల్చి
సిరు లందరికీ పంచు !
పరువుగ బ్రతికే కొరకు
ప్రాణ భయం త్యజించు !

తిమిర వ్యాపారంలో
దిన మణులు లభించ వని
ప్రతి మనిషికి బోధించు
ప్రగతి పథం చూపించు !

బాల్యం నుంచీ శిక్షణ
భారతీయతకు రక్షణ !
ఏక నీతిపై జాతిని
ఈశ్వరతకు నడిపించు !

## 80

# ముందుకు పోవలసిన

ముందుకు పోవలసిన మానవుడా !
ఎందుకురా బండబారి పడి వున్నావు ?

మత కర్తలు, మత భర్తలు
మనసు కలచి వేశారా ?
కలచిన చెరువు చేపనై
గట్టున పడి కుమిలేవా ?

మనిషి గుణం మానవత్వ మేరా,
మనిషి లక్షణం మన సుండడ మేరా !

హృదయం నిర్మల మైతే
అదే మానవత్వం రా !
మానవత్వ మున్నప్పుడు
మత మక్కర లేదురా !

సందేహా లన్ని విడిచి పదరా,
ముందు కేగుటే సృష్టి ధర్మంరా !

గత కాలపు నమ్మకాలు
శతాబ్దాల మనుగడలు
సంస్కరించుకోలేవా ?
శక్తి పుంజుకోలేవా ?

# 81

## మేలుకోవోయి

మేలుకోవోయి !
మనిషీ !
మేలుకోవోయి !

మేలు కొన్నది భరత జనత
కోలు కొన్నది సర్వ సమత
ఎల్ల లోకము మేలు మేలన
తెల్ల వారినదోయి, మనిషీ !

మధ్య యుగముల అంధకారము
మన్ను గలిసెను, మిన్ను తెలిసెను,
వేద కాలపు వెలుగు మనది,
విశ్వ మానవ మైనదోయి !

కూడు గుడ్డల లేమి లేదిక
కుల మతమ్ముల జోలి లేదిక
కష్టపడు ప్రతివాడు తమ్ముల
కిష్టుడై ఉదయించు నేడు !

# 82
## ఎంత ప్రజ్ఞ

ఎంత ప్రజ్ఞ వున్నా
ఎంత ప్రతిభ వున్నా
పైరవీలు లేకుండా
పదవులు రావన్నా !

ఎవరైతే నేమీ అనుకోనే
ఎవరి కైతే నేమీ అనుకోనే
విశ్వాత్మకుడు – పైర
వీలు చేయలే డన్నా !

ఏ సంపదలైనా తన
కే కావలసిన వాడికి
ఆకలి తీరుట సున్నా,
ఆనందం మన్నా !

## 83

## పై వాళ్లకు

పై వాళ్ళకు కాల్మొక్కుతు
పైరవీలు చేసుకొంటు
గౌరవాలు పొందేవా
గంగిరెద్దు గంగన్నా !

అయ్య గారికీ దండం పెట్టు
అమ్మ గారికీ దండం పెట్టు
అయ్యగారి చేతి వరహా పట్టు
అమ్మగారి చేతి వణ్ణం పట్టు !

ఆబోతుల నడవి పాలు చేసి
ధురంధరుల దుక్కి టెద్దు జేసి
సోమరి గిత్తల బట్టి
షోకు చేసి ఆడిస్తూ
గౌరవాలు పొందేవా
గంగిరెద్దు గంగన్నా !

# 84
## ఎక్కడున్నది లోపం

ఎవరయ్యా మీరు ?
ఎందు కలా వున్నారు ?

ఆక లాక లంటున్నారా ?
అదునున అరకలు కట్టారా ?
వరదల నిలిపీ, వాగుల మలిపీ
వసుధా దేవిని కొలిచారా ?

నిలువ నీడ లేదంటారా ?
నీడ కొరకు యత్నించారా ?
ఎట కోరిన అట స్వాగత మిచ్చే
ఇళ్ళు వాకిళ్ళు చూశారా ?

దిక్కు మొక్కు లేదంటారా ?
దేశాత్మను గుర్తించారా ?
ప్రగతీందిర మీ కోసం తెచ్చిన
ప్రాభవాలు గమనించారా ?

# 85
# ప్రగతి ధర్మం

ఇదే ప్రగతి ధర్మం !
తదితరం పట్టి మర్మం !

ధర్మ పథంలో పురోగమించు
ధర్మం కోసం పరాక్రమించు
ధర్మ విజయమే సాధించు
ధర్మ రాజ్యమే స్థాపించు ॥

మనిషిని సుఖ పెట్టేదే ధర్మం
మాయ చేసేది మర్మం,
కష్టార్జిత వైభవమే ధర్మం
కాని దెల్ల మాయా మర్మం ॥

తిండి కొరకు పొలదిండివి కాకు,
గుండెలు బండలు కానీకు,
సమ సమాజ సాధనకై సాగు
జన సంక్షేమము కదె వేగు !

# 86

## కలిస్తే గెలుస్తాం

కలిస్తే – గెలుస్తాం,
గెలిస్తే – నిలుస్తాం !

గడ్డి పోచలమె అయినా
మద గజముల బంధిస్తాం,
చలి చీమల మైన గాని
సర్పాలను పట్టేస్తాం !

చిరు బిందువులమె అయినా
క్షీరాబ్ధిగ జీవిస్తాం,
మడులు బడులు వేరైనా
మాతృ పూజ నొకటౌతాం !

శక్తి కొలది శ్రమ పడతాం
శ్రమ శక్తులు పండిస్తాం,
విజయోత్సవ సేనలమై
విశ్వమెల్ల నిండేస్తాం !

# 87

## తొలకరించె

తొలకరించె నండీ ! ఆశలు
మొలక లెత్త రండీ !

వేసవి ఎండల గుండెలె యెండీ
విరస వైర విషమాగ్నుల మండీ
విసిగి గసిగి వేసారిన రైతులు
విశ్వ మాన వోద్యోగులు కండీ !

దీర్ఘ దాస్య కర్మములు గతించె
మూర్ఖ వర్గ భేదములు నశించె,
సారథియై విజయేందిర నిల్చె
అందర మిక విజయులమే నండీ !

తర తరాల త్యాగాల చెమటతో
నర నరాల ధార్మిక రక్తంతో
చివికి చేవ దేరిన మన బ్రతుకుల
భువికి ప్రగతులే పండగ లెండీ !

# 88

## పథం - రథం

కుదిరిందిర పథం,
కదిలిందిర రథం !
సమ సమాజ నిర్మాణం
శాంతి ధర్మ సంస్థాపన
ధ్యేయ మొకటి కుదిరింది
దేశ జనత కదిలింది !

చేతి నిండ పని కనిపించిందిరా
చిత్తానికి శాంతి లభించిందిరా
కూడు గుడ్డ కలిగింది
కొంప గోడు దొరికింది
రేపటి గతి యేమి టనే
శాపం తీరిందిరా !

జడత వీడి జనం మేలుకొందిరా
జవ సత్త్వ బలాలు పెంచుకొందిరా !
దున్నే వాడికి భూమి
చదివే వాడికి సీటు
ఎక్కువ తక్కువ లేక
ఎల్లరకును సమ ఫలితం !

## 89
## తీరాలి నా కోరిక

తీరాలి, నా కోరిక
తీరాలి !
    మారాలి, నరలోకం
    మారాలి !

మ న్నె దిగీ, మిన్ను దిగీ
మేళన చెందాలి !
    దివీ, భువీ మేళవించి
    నవ నరు డుదయించాలి ॥

దేశం ఏదైనా
ఆశలు ఏవైనా
    జగదేక కుటుంబంగా
    జను లంతా బ్రతకాలి ॥

పైకానికి, పైరవీకి
పలుకుబడి నశించాలి !
శక్తికి, సామర్థ్యానికి
స్వాగతం లభించాలి ॥

కింది వాని తలదొక్కే
పై వానికి కాల్మొక్కే
నక్కగాళ్ళు తొలగాలి !
బక్కవాళ్ళు గెలవాలి ॥

## 90

## విన్నావటే

విన్నావటే ?
బోటీ, మన తోటలో ఇ
దేదో ఒక కొత్త పాట ?

తోట పాతదైనా ఈ
పాటెంతో కొత్తది !
స్వరం సనాతనమైనా
సరళి నేటి జనతది !

ఎన్నెన్ని మహా యుగాలు
ఇందు వచ్చి పోలేదు ?
ఇందిరా మహోదయ మిం
టింట సుప్రభాత మాయె !

చీకటి చింతలు కరిగి
చిగురించిన ఆశలతో
ప్రతి నవయువ కంఠంలో
ప్రగతి వీర శంఖ ధ్వని !

# 91

## ఇంకా ఎంత దూరం

ఇంకా ఎంత దూరం ?
ఎంతకు తరగదు మార్గం !

ఆలస్యం కాలేదు
కాల మాగి పోలేదు
గమన లోపమా లేదు
గమ్య మొకటి కనరాదు !

కొండ లెక్కునపుడు – ఇం
కొంచమె అనిపించు !
కొండలు దిగునపుడు
కోసే లే – దనిపించు !

క్షణం క్షణం భయం భయం
శతాయుష్క మీ పైనం,
భయం లేదు, ప్రియతమా !
భద్రతయే జీవగుణం – సుమా !

# 92

## ఆగకుండ

ఆగకుండ పోనేలా ?
ఆశించిన ప్రియతమా !
    బహు కాల నిరీక్షణకు
    బాష్ప కణమె ఫలమా ?

క్షణ మైనను నిల్తు వని
సాదరముగ పల్కుదు వని
    విన దలచిన మాట కొరకు
    వేచియున్న నను గనక ॥

తిరిగి చూడు మొకసారి
మరల వద్దులే దారి,
    నీకు లక్ష్య మేదైనా
    నాకు లక్ష్యమొక నీవే ॥

# 93
## ధర్మ హాని

ధర్మ హాని కలిగి నపుడె
దర్శన మిస్తావా ?
ప్రస్తుత మిట గల దంతా
పరమ ధర్మ మేనా ?

నీ ప్రియ దేశం లోనే
నీ గుడి గుమ్మం లోనే
నీ యనుంగు బిడ్డలకు
నిలువ నీడ వుంటున్నద ?

వద్దయ్యా, రాజకీయ
వాగ్దానం, మిత్రమా !
నిత్యాత్మవు నీవైతే
నిరతము మాతో నుండుము !

## 94

### అక్షరాలు

అక్షరాలు తేవయ్యా – మాలో
అభిమానము వెలిగించుమయా !
దళిత జనోద్ధారక అంబేడ్కర
ధర్మజ్యోతివి నీవయ్యా !

ఏండ్ల కొలది బీండ్లై మా బ్రతుకులు
ఎదురు చూచుచున్నవి నీ కోసం,
దివ్యములౌ నీ హితబోధలతో
ధీ శ్రీ పంటలు పండించుమయా !

చదువుకొండి, సంఘటితులు కండి
స్వామ్యమ్ములకై పోరాడండి
లేవండీ అని ప్రతి నిత్యము మము
లేపే జీవన కోకిల వయ్యా !

# 95
## సాంఘిక న్యాయం

సాంఘిక న్యాయం కావాలి
సములై యెల్లరు మెలగాలి,
తోటలోని ప్రతి మానవ వృక్షం
తోడు నీడగా యెదగాలి !

ఆర్థిక దాస్యం తొలగాలి
అందరు స్వేచ్ఛగ బ్రతకాలి,
అధికారంలో ఆధిక్యతలో
అందరికీ హక్కుండాలి ॥

భారత జనతోద్ధారణకై
విశ్వ ప్రజా సమైక్యతకై
అంబేద్కరు చేసిన ఉద్బోధలు
ఆమని పూలై విరియాలి ॥

# 96

## నీవు చేయని

నీవు చేయని త్యాగమే దయ్యా ?
అంబేడ్కరయ్యా !
నీవు వ్రాయని జ్ఞానమే దయ్యా ?

అంటరాని తనమ్ము బాపుడు
అగ్ర అంత్య విభేద ముడుపుడు
కుల వ్యవస్థను రూపుమాపుడు
కూర్మితో జీవించు డంటూ ॥

తెల్ల దొరలకు నచ్చ జెప్పి
తెచ్చితివి ప్రత్యేక హక్కులు
హిందు సంఘ సమైక్య మెంచి
ఎర్రవాడకు ధారబోస్తివి ॥

ధర్మ వీరము బోధ చేసి
దళితులకు గమ్యమును చూపి
సర్వ సమతా రాజ్య రముకై
శక్తియుక్తులు పిండి పోసి ॥

# 97

## అంబేడ్కరా నీవు

అంబేడ్కరా, నీవు
అవతరించక పోతె
ఈ మూగజీవాలు
ఏ నీడ చేరేను ?

అంబేడ్కరా, నీవు
అవతరించక పోతె
మంటి పెల్లల మేము
మణులు కాగలిగేమ ?

అంబేడ్కరా, నీవు
అవతరించక పోతె
ఎద్దులము మే మెట్లు
పెద్ద పులు లయ్యేము ?

అంబేడ్కరా, నీవు
అవతరించక పోతె
మము మేము తెలుసుకొని
మనుషులై బ్రతికేమ ?

# 98

## డప్పు కొడుతూ

డప్పు కొడుతూ, డాలు పడుతూ
నిప్పు గుండం తొక్కు కొంటూ
చిందు లేసీ, శిలువ మోసీ
చేర వస్తున్నాం ! బాబా !
చేర వస్తున్నాం !

సాంఘిక న్యాయం కోసం
సంపదలో సమ భాగం కోసం
రాజకీయ అధికారం కోసం
రాజీలేని పోరు సల్పుతూ ॥

ఊరి వెలుపలి, పూరి గుడిసెల
మారుమూలల బ్రతుకు లీడ్చే
బీద బిక్కుల మెల్ల కలిసి
భీమ సేనగ మోహరించి
సాగి వస్తున్నాం, బాబా !
జయము తెస్తున్నాం !

# 99
## ఎన్ని చదువులు

ఎన్ని చదువులు చదివినావు,
అంబేడ్కరా, నీవు
ఎన్ని రచనలు చేసినావు ॥

ఇలలోన గల చదువు
లెల్ల చదివావు
ఎల్లెడల మానవుని
హితమె కనినావు ॥

దళితు లని, ద్రవిడు లని
ఆర్యులు అనార్యు లని
ముక్తాలు లేవు అన్నావు, నరుల
రక్తాలు పోల్చి చూపావు ॥

మనిషి మనిషికి నడుమ
మత భేద మేమిరా ?
మూఢ విశ్వాసాలు
వీడరా అన్నావు ॥

# 100
## దళిత భారత

దళిత భారత జనావళి కేనా ?
ధాత్రి లోని దళితుల కందరకూ
మార్గదర్శకుడ వీవయ్యా !
మాన్యశ్రీ అంబేడ్కరా !

ఎక్కడ సాంఘిక న్యాయం లోపించెనో
ఎక్కడ ఆర్థిక దాస్యం తెగించెనో
అక్కడ నీ నామమె తారక మంత్రం !
అక్కడ నీ విధానమే నిదానం !

దళితులు పూర్వం - దుష్టుల
దాడికి బెదిరి పోయేరు,
ఇపుడు నీ పతాక కింద
ఎదిరించే యోధులైరి !

# 101

## నీ నామము

నీ – నామము
నిఖిల జనోద్ధారకము ॥

పతిత జనావళిని – పై
పై కెత్తే యంత్రము,
దరిద్ర నారాయణులకు
తారక మంత్రము ॥

అసమత్వం తొలగించే
ఆకలి నిర్మూలించే
సాహస కరవాలము,
సమైక్యతా పటాలము ॥

జాతి దాస్య తమో హరా !
జ్ఞానాంకుర సుధాకరా !
బహు జన సంక్షేమ కరా !
భారత భాస్కరా ॥

# 102

## ఊరూరా

ఊరూరా నీ విగ్రహాలే !
నోరారా నీ కీర్తి గానాలే !
నీ ఉద్యమ గీతాలే
నీ త్యాగ నినాదాలే ॥

గుండ్ర బల్ల ప్రతిఘటనము
కొలను నీటి పోరాటము
దీన జనుల హక్కులకై
దీక్షా నిర్దేశంతో ॥

పరమోత్తమ సంవిధానముతో
భరత మాత కలంకారముగా
ఘన పరిశోధన పాండితితో – దళిత
జన సాహితి కాకృతిగా ॥

పట్టణాల నిండా, మా
పల్లెల నిండా
వీధి వీధి నింటింటా
విశ్వైక్యం బోధిస్తూ ॥

# 103

## కూడు గుడ్డ కొంప

కూడు గుడ్డ కొంప - ఈ
మూడే మా కోరికలు,
ఇవి కూడా తీరకుంటె
ఎట్లా చచ్చేది రా ?

హృదయం తెలిపే పాటి
చదువైనా రాకుండా
తల నొప్పిని తొలగించే
తైల మైన లేకుండా
హీనంగా దీనంగా
ఎట్లా చచ్చేదిరా ?

రక్తం పీల్చుక పోయే
రౌడీ నెదిరించలేక
పేవుమెంటుపై కుమిలే
జీవిని పైకెత్తలేక
ఏ విలువకు నోచుకోక
ఎట్లా చచ్చేది రా ?

# 104

## సంఘంలో

సంఘంలో దుష్టులు ఉన్నంత కాలం - దాని
శాఖల్లో కూడా ఉంటారు
కాలుష్యం నదిలో ఉన్నంత కాలం - దాని
కాలువలకు కూడా అది పారును !

సస్యానికి తెగులు పట్టకుండ - దాని
సంరక్షణ బాధ్యత రైతుది,
రైతే బాధ్యతా రహితుడైతే - జాతి
రాతే తలక్రిందు లౌతది !

ఆతతాయులను క్షమించ కోయీ !
అవినీతికి బలి కాకోయీ !
రాజకీయ రంభల కోసం నీ
తేజ మార్పు కోకోయీ !

# 105

## నీవు వెళ్లిన కేసి

నీవు వెళ్ళిన కేసి ఏ అలికిడైనా
నీ విషయమేమొ అని నిలిచి చూసేను !

నీవుండు దిశ నుంచి ఏ తావి వీచినా
నిను గూర్చి వినగోరి నిలిచి పోయేను !

నీ ఉద్యమము లోన ఏ వెలుగు తోచినా
నీ విజయమే అంచు నింగి కెదిగేను !

ఎట నుంచి, ఎటు నుంచి నా మనసు త్రుళ్ళినా
నీవు వచ్చే వంచు నెమ్మి నయ్యేను !

## 106
## ఎవరవోయీ

ఎవరవోయీ – అనగలేను
నీవు నా
హృదయమే – గుర్తించినాను !

ఉదయమే లేచి నా
వదనమే తిలకింప,
నుదుటిపై కొదమ తు
మ్మెద రెక్క లల్లార్చు !

దినకృత్యముల లోన
మునిగి వివశత నుండ,
అలపు వాపుచు నుండు
మలయ మారుత మూర్తి !

పక్కపై వాలి, దీ
పము తీసి కనుమూయ–
నవ దీప దీవులకు
నను లేపుకొని పోవు ॥

# 107

## పాటలుగా

పాటలుగా జగేలు మనుచున్నవి! నా
మాటల కిదే చరమ తేజమా ?
        పరి సమాప్తి ముందు భగ్గు భగ్గు మనే
        కరుణ బాష్ప దీప ధూపమా ?

రస కవితలు పలికాను, రాభీలను పాడాను
బ్రతుకంతా నీ కోసం పాడుతూనె వున్నాను !
        వింటున్నావా ప్రియతమా ?
        కంటున్నావా నన్ను కలనైనా ?

ఎక్కడ తిరిగేవో ! ఎందుకు పోరాడేవో !
ఒక్కడివైనా గాని, పెక్కుర ఆశలు నీవు !
        గైకొనుమా, నా పాటల కల్యాణోజస్సును !
        లోకాలకు పంచుమా, రసైక నవోషస్సును !

# 108

## నీ వీణను

నీ వీణను నేను
నా వాణివి నీవు
వీణది సుస్థిర పీఠం,
వాణిది విశ్వ విహారం !

ప్రజాభ్యుదయ కృషిలో నీ
విజయమె నా కోరిక !
త్రిస్థాయికి పెరిగి, లో
క స్థాయిని పెంచు మిక !

నీ గుండెను నేనుండి
రాగ లతలు మీటేను,
నా మానస వనమాలీ !
నవ మల్లెలు నాటుకో !

# 109
## దైవంతో

దైవంతో భుజం కలిపి పని చెయ్యి
తాళం తప్పని గతిలో అడుగెయ్యి!
లయ విన్యాసం రా ఈ లోకము
లయ తప్పని వరకే మన పైనము ॥

నీ కృషిలో, నీ కర్తవ్యంలో
నిత్యం దైవం సమ భాగస్వామి,
సగ భాగం తనకిచ్చెయ్ ఫలితంలో
సద్భావమె పురోగామి సుమి ॥

అడుగడుగున అనుక్షణం
అతడు నీకు జతగాడు,
మంచి చెడ్డ లన్నిట నీ
మనసే తానైన వాడు ॥

## 110
## నీ మనసే

నీ మనసే నీ దైవం
నీ ప్రజ్ఞే నీ ప్రగతి,
నీవే నీ జీవిత నిర్మాతవు
నీవే నీ సుఖ శాంతుల కర్తవు !

ఫల వృక్షం పెంచేవా
ఫలము లారగించేవు,
ముళ్ళ మొక్క నాటేవా
ముళ్ళు గిచ్చి వగచేవు !

నీకు నీవె దాసోహం
నీకు నీవె అభయంకరం,
నీ పరిశ్రమే నీ సౌభాగ్యం
నీవే నీకు సమస్తం !

# 111

## మధు దేవా

మధు దేవా, మాధవా !
మధుపాయీ ! మధు ప్రియా !

చైత్రీ హృదయావనా, పై
శాఖీ ప్రియ మోహనా !
నీ విహార విశ్వాలే
నా వినోద నృత్యాలు !

మామిడి తోటల నీడలు
మామిడి గుబురుల పాటలు
మామిడి పండ్ల రసాలు
మానవ సుఖ లక్ష్యాలు !

మనిషి రూపమున నీవు
మనసు రూపమున నేను,
బ్రతుకంతా నిత్యోదయ
పర మారామము నాకు !

# 112

## భక్తి కంటే

భక్తి కంటే లేదు ముక్తి, దేశ
భక్తి కంటే లేదు శక్తి !
భక్తి లక్ష్యము ముక్తి
ముక్తి లక్ష్యము శక్తి
శక్తి లక్ష్యము రక్తి
రక్తి లక్ష్యము వ్యక్తి ॥

వ్యక్తి భద్రత ముఖ్య మన్నా ! దేశ
శక్తి కతడే మూల మన్నా !
స్వేచ్ఛ కల్గిన వ్యక్తి
సృష్టినే నడిపించు !
కలిసి నడిచే జనత
కాలమునె నియమించు ॥

వ్యక్తి బలమును పెంచుకో, దేశ
శక్తి బలమును పెంచుకో !
వ్యక్తి బలమే సృష్టి
బలముగా తెలుసుకో !
దేశ బలమే, జీవి
తాశగా మసులుకో ॥

# 113

## శక్తీందిర

ఎవరోయీ
ఎవరోయీ
ఈ ఆర్ష మహా జాతికి
ఇంత శోభ తెచ్చినది ॥

మహిషుని శిక్షించిన దొక
మహా శక్తి మహిళ,
నరకుని గెల్చిన దొక నవ
నారీమణి వీర ॥

ఒక సతి ఆత్మార్పణతో
ఉడిగె నొక నియంతృత్వం,
ఒక రతి ఆక్రందనతో
ఉజ్జీవించెను సృష్టి !

ప్రగతికి, ప్రతి పథకానికి
ప్రాణమైన ధీ మందిర !
నాటికి నేటికి జీవిత
నాడియౌ సుధీందిర !

# 114

## వరదాయని వాణీ

వర దాయని, వాణీ ! నీ
వర మొక టిటు రానీ !

అందమైన అమ్మాయిల
అమృత మధుర కంఠాలలో
కల్యాణిగ విరిసి నేను
కలకాలము పాడనీ ॥

మల్లె పూవొ, మందారము
తరుణి జడో, వరుని మెడో,
ప్రణయ రుచిగ నిత్యము నను
పరిమళించనీ ॥

నవ ఋతువుల చెన్ను చిలికి
నవ రంగుల వెన్న తీసి
ఆ తారార్కముగ నిన్ను
ఆరాధించనీ ॥

# 115
## శక్త్యై నమః

శక్త్యై నమః, సర
స్వత్యై నమః !
సర్వ జనా సక్తి పరా
శక్త్యై నమః !

ఓంకార ద్రుత నాద నినాదం వేదం
ఒడలు వంచి పనిచేసిన స్వేదం సాదం,
మిన్ను దిగీ, మ న్నెదిగీ మనిషైన యుక్తి
మనిషీ మనిషీ కలిసే మధువైన శక్తి !

ఆంబా రవ మభ్యసించినట్టి ప్రతీ వ్యాఘ్రం
ఆలమందలకు తానే ఏలిక యగునే !
బలహీనుల కేదమ్మా, రక్షణ రేఖ ?
బహు జనులకు తేవమ్మా, ప్రగతి మయూఖ !

హ్రీంకా రోజ్వల విహాయస విభూతీ !
ఇలా జీవ జీవ జీవన జ్యోతీ !
బీద జనుల దోచి తినే బకులను త్రుంప
భీమాస్త్రం కావమ్మా, పృథివి సుఖింప !

సర్వులకును కూడు, నీడ సమకూరాలి
సమ సమాజ నిర్మాణం సాధించాలి
కృషికీ, శ్రమకూ, ప్రతిభకూ పూజ లభించాలి
శ్రీమంతంబై లోకం పురోగమించాలి !

# 116

## నవ చైతన్య ఝరీ

నవ చైతన్య ఝరీ ! గౌరీ !
నవ జీవన శుభ శంకరీ ॥

చీకటి కమ్మిన లోకము లోకి
వేకువ తెచ్చే ఉషోధరీ !
నరనారీ సమతకు ప్రతీకవై
నవతను నడిపే ఈశ్వరీ ॥

దిక్కు తెలియని, దిక్కే లేని
దీనుల పాలిటి దీప జ్యోతీ !
నిన్నే నమ్మిన నీతిమంతులకు
నిత్య నిరంతర కర హేతీ ॥

నీ బొమ్మల కొలువే జగమెల్ల
నీ బొమ్మలమే మేమెల్ల,
తిలక ముంచి, తాంబూల మొసగి, మా
కలలకు రూపం దిద్దే తల్లీ ॥

ప్రతి సుఖమును నీ వొసగే పండే
ప్రతి నిమిషము నీ పండుగే,
అందుకొమ్ము మా బ్రతుకెల్లా నీ
అడుగుల కడ ఆరతి పళ్ళెముగా ॥

# 117

## శక్తికి వందనం

వందనం, వందనం
శక్తికి వందనం,
　　శక్తికి, నవశక్తికి, జన
　　శక్తికి వందనం !

నిదుర మాని నేర్చుకొనే
చదువు శక్తికి
ఒడలు వంచి పని చేసే
ఓర్పు శక్తికి

ఫలసాయం జాతికెల్ల
పంచి ఇడే శ్రమ శక్తికి
　　వందనం, వందనం
　　శక్తికి వందనం!

ఆశాలతలు ఫలించే
భూ శక్తికి వందనం !
కళల కాంతుల ప్రశాంతుల
జల శక్తికి వందనం !

ఋతు శక్తికి, పవన ధర్మ
ఋుక్శక్తికి వందనం !
వందనం, వందనం !
శక్తికి వందనం !

మన భారత తత్వజ్ఞుల
మానవతా శక్తికి,
వసుధైక కుటుంబ సూత్ర
వైజ్ఞానిక శక్తికి,
సర్వ జన శ్రేయ స్సమ
సామాజిక శుభ శక్తికి !
వందనం, వందనం !
శక్తికి వందనం !

# 118

## రావమ్మా ప్రగతి

రావమ్మా ప్రగతీ !
తేవమ్మా సుగతి !

హేలగ మా తెలుగు పంట
చేలలోన లక్ష్మిగా,
లీలగ మా తెలుగు కళా
శాలలలో వాణిగా ॥

కృష్ణవేణి, మంజీర,
గోదావరి, వంశధార
శతానేక నవ జీవన
జనావనీ ! సుధావనీ ॥

అందాలకు వివిధ రసా
నందాలకు నిలయ మిది,
ప్రేయము ఈ తెలుగు, మా
శ్రేయము నీ వెలుగు ॥

కృషి రూపా, మానవతా
ధృతి దీపా ! రావమ్మా !
యువశక్తుల నవ దీక్షకు
ఉత్తేజము నీవమ్మా ॥

# 119

## జయ జననీ

జయ జననీ, జయ జననీ
జయ భారత జననీ !
జయ భారత జననీ, జయ
జయ అమృతావనీ !

జయ జయ కన్యాకుమారి
సంసేవిత చరణ పుటా !
జయ హిమాలయాగ్ర జటా
వియ దుజ్వల మణి మకుటా !

జయ సమస్త మత మానవ
జగతి కెల్ల అన్నదా !
స్వపరమ్ములు లేని దైవ
సాక్షాత్ వాత్సల్య సుధా !

వివిధ మనస్తత్వాలకు
విశ్వ రూప తత్వాలయ !
విశ్వ మానవ శ్రేయో
వీధి వీధి దీపాలయ !

# 120

## పండవే నా తల్లి

పండవే, నా తల్లి, పండవే !
నవ ధాన్యముల పంట పండవే !
పాల తల్లివి నీవు
నేల తల్లివి నీవు
పాడి పంటల కెల్ల
బంగారు తల్లివే ॥

అదనులో పడ్డాయి వానలు
పదనులో పడ్డాయి నాట్లు !
మబ్బు నీడల పైరు
దుబ్బులను పెంచవే !
పైర గాలుల వెన్ను
పాపలను సాకవే ॥

పేదలం రైతు కూలీలం, నీ వరద
పాదాల కడ పల్లె వాసులం,
దోపిడీ దొరల చీ
డా పీడలను బాపి,
మాయ మర్మం లేని
మమ్మేలవే తల్లి ॥

మా ఆశ లిందు కురిశాము
మా బ్రతుకు లిందు నాటాము,
ఈ పైరు పాదులకు
మా పిల్ల పాపలకు
పక్షపాతము లేక
ప్రాణాలు కుడిపేము ॥

# 121

## జయం జయం తల్లీ

జయం జయం తల్లీ !
తల్లీ, మా తెలుగు తల్లి !

గోదావరి, వంశధార
కృష్ణ, పెన్న, మంజీరా
జీవన పూర్ణా, అన్నపూర్ణా !
శ్రేయో మానవోదయ సువర్ణా !

నన్నయ, పోతన, వేమన
అన్నయ, త్యాగయ, జగ్గన
అమరావతి, రామప్ప, లేపాక్షి
అమృత కళల తరళాక్షీ !

విజయనగర, కాకతీయ
వీర సార్వ భౌమినీ !
అధునాతన ప్రజాస్వామ్య
అభ్యుదయ ప్రవర్ధనీ ॥

# 122

## తెగ ద్రెంచం డోయ్

తెగ ద్రెంచండోయ్,
తెగించి నడవండోయ్ !
    తర తరాల యుగ యుగాల
    దాస్యపు బంధాలను ॥

కుల భేదపు మత వాదపు
కుటిల వాగురాలను,
    భూస్వామ్యపు ధనదాహపు
    వ్యూహాలను, మోహాలను ॥

పదవీ పెత్తందారీ
పైశాచిక పంథాలను,
    పైసకు పార్టీ మార్చే
    పగటి వేష బృందాలను ॥

ఏక జాతి, ఏక నీతి
లోకైక విభూతి
    లక్ష్యంగా సాగండోయ్,
    కక్ష్య లెల్ల గడవండోయ్ ॥

## 123
## రెక్క లుండియు

రెక్క లుండియు నేలపైనే
కెక్కరించును కోళ్ళు, బాతులు !
శుక పికాదులు చెట్లపై సుఖ
సుందరముగా ఆడి పాడును !

మానసమ్ముల దేలి యాడుచు
వ్యోమసీమల బోవు హంసలు !
గరుడ గాంధర్వములు విశ్వాం
తర వినోదము లనుభవించు !

పక్షములు గల వెల్ల పక్షులె
భావ భేదము వృత్తియందే,
ప్రాభవము గల వాడవేని
బ్రతుకు బాటలు తెలుసుకో !

# 124

## ఇల లోపలి ప్రతి దేశం

ఇల లోపలి ప్రతి దేశం
ఏదో ఒక జాతిది,
నీ దేశం ఏ జాతిదో
నీకు తెలుసునా, నేస్తం ?

నీకు బలం లేకున్నా
నిర్వీర్యుడ వనుకొన్నా
జాతి లేని వాడవు కా
జాల వెన్నడును, నేస్తం !

జాతిని గుర్తించుకో, జాతి
నీతిని గుర్తించుకో !
జాతి బ్రతుకె నీ బ్రతు కను
సత్యం మరువకు, నేస్తం !

## 125
## ప్రతిభను పైదొలగ ద్రోసి

ప్రతిభను పైదొలగ ద్రోసి
పైరవీకి స్వాగతం పలుకకు !
ఆదిత్యుని మరుగు పరచు మేఘం
అతడి కంటె గొప్పది కాదు !

జాతి లోన నీ వొక వ్యక్తివి,
జాతి గౌరవం ప్రతి వ్యక్తిది !
జగతికి నీ జాతి శక్తి చూపుటలో
స్వపర భేద భావము లెంచకు !

పౌరుషముగ నీ జాతి బ్రతక గల్గినపుడె
బ్రతక గలవు సుమా నీవు కూడ,
సంకుచితపు వ్యక్తి గొప్ప కన్న
సామాజిక శ్రేయస్సే మిన్న !

# 126

## కపోతమా

కపోతమా !
ఏ కర్తవ్యంతో నీ
వెందు పోవుచున్నావో !
కపోతమా !

ప్రియురాలికి ప్రేమ సందేశమో
లోకానికి శాంతి సందేశమో
లక్ష్యం చేరే వరకైనా
రక్షణ కలదా నీకు ?

అదిగో గమనించి నావె
ఆ తాటి చెట్టు పైని
ఆకలితో చూస్తున్నది
నీ కేసే రాబందు ?

సాయుధ బల మున్నప్పుడె
సాధు రక్షణం సాధ్యం,
నీ పయనం వెనుక నిన్ను
కాపాడే బల మున్నద ?

# 127

## ఈ దేశం నీ దంటే

ఈ దేశం నీ దంటే
కాదంటావు !
ఆద్యుడ వీవే ఈ సంస్కృతి కంటే
లేదంటావు !

ఈ రాజ్యం నీ దంటే
ఎందుకు నా కంటావు !
ఈ సంపద లన్నీ నీవే అంటే
దాసుడ నేనెటు లోపుదు నంటావు !

నీ ఆస్తిని కొల్లగొట్టి
నీ మెదడును కడిగి వేసి
నిను బానిస జేసుకొన్న
నేరస్తుల కాల్మొక్కుతు ॥

వ్రాయకున్న వాల్మీకి
రాము డెందు కలడోయీ ?
వేద వ్యాసుని వారసు
డా ! దేశం నీ దంటే ॥

# 128

## నేస్తం ఆలోచించు

నేస్తం, ఆలోచించు
నీ దన్నది ఏమున్నది ?

విశ్వ చింతనా నిధిలో
విశ్వ పాలనా విధిలో
నీకును ఖ్యాతిని తెచ్చే
నీ విరాళ మే మున్నది ?

పైరవీల వలలు విసరి
పదవుల బట్టగ వచ్చు,
తప్పుడు దారులు తొక్కి
ధనమును గూర్చగ వచ్చు,
ప్రతిభా స్వార్జితమౌ నొక
పైసయైన నీ దున్నద ?

ఏకత ఉమ్మడి నిధికి
లోకాత్మ వికాసానికి
జీవకోటి శ్రేయానికి
నీ విచ్చిన దే మున్నది ?

## 129

## మానవత్వం హసించాలని

మానవత్వం హసించా లని
దానవత్వం నశించా లని
ఎవరి నుద్దేశించి ఉపదే
శించుచుంటివి, కవి కుమారా ?

మానవుడు మానవత వీడడు
దానవుడు నీ మాట వినడు,
పావురమ్ముల కేలరా? రా
బందులకు బోధించరా !

సింహమునకూ, గోవుకూ సహ
జీవనము సహజమ్ము కాదు,
గోవు నెందుకు మోసగింతువు
కూడి బ్రతక మనీ ?

# 130

## మానవ జీవిత మార్గంలో

మానవ జీవిత మార్గంలో
మధువులు చిలికేదే కవిత,
మానవ జీవన గమనంలో
మందార స్యందనమే కవిత !

మతమో, వ్యాపారమో, రాజ కీ
యమో కాదు కవిత,
జీవన గతిలో అలసిన మనసును
సేద దీర్చునదె కవిత !

ఒకే అమ్మ బిడ్డలు జను లెల్లరు
ఒకే అన్నమున బ్రతికేరు,
అందరకూ సమముగ ఆనందము
అందించే రస భాండము కవిత !

## 131
## భారతీయుడా

భారతీయుడా ! నీ
బాధ్యత విడనాడకు రా !
  గోపుర భారత్, ఉమ్మడి
  గొడ్డు కానీయకు రా !

విశ్వ జనీనత – నీ
వేద సంస్కృతి !
  సంకుచిత స్వార్థాలను
  సహించకు, క్షమించకు !

భారత్ నీ దేశం
భారత్ నీ జాతి
  భారత్ నీ సొంతం రా !
  పరులకు తల వంచకు రా !

## 132

## ఏ గ్రహ తారా సీమల

ఏ గ్రహ తారా సీమల
ఏ సేద్యం చేసేవో,
ఏ లోకాంతర వాసుల
తో స్నేహం నెరపేవో,
విజ్ఞానివి నీవు, నీ
వేమైనా చేయగలవు !

మనసును గెల్చిన వాడవు
మనో వేగ మొక లెక్కా?
కోటి కాంతి వర్షాలను
గుప్పిట గొని రాగలవు !
ప్రేమికుడవు నీవు, నీ
వెంత కైన తగుదువు !

ఒక్కటె నా చిరునామా
పెక్కులు నీ క్షేత్రాలు,
చీకటు లను సాగు చేసి
లోకాలను పండింతువు,
దోసెడు వెన్నెలను నా
కేసి విసర లేవా, ప్రభు ?

# 133
## ఎక్కడివీ భావాలు

ఎక్కడివీ భావ పరం పరలు?
ఎడ లేనివి ! కడ లేనివి !

అలలు అలలుగా నా హృద
యాంచలాలు తాకుచు,
పక్షుల వలె నా మానస
వక్షంపై వాలుచు ॥

నిఖిల విశ్వముల సమష్టి
నిధులు పొంగి వస్తున్నవో !
ఏ యోగ సమాధులు భువి
కిడుచున్న శుభాకాంక్షలో !

అక్షర కలశములు నింపి
అందిస్తున్నది నీవా ?
పద పంజరముల నిన్ను
పట్టగల్గుదున నేను ?

## 134
## నా శక్తిపై నాకు

నా శక్తిపై నాకు నమ్మకము లేకనా
నీ సాయ మడుగుచుంటి ?
    నాదైన కరసేవ నా చుట్టు లేకనా
    నీ ఆజ్ఞ గోరుచుంటి ?

నీవె నేనని నీవు నిజము చెప్పిన నాడె
నేనె నీపై పోతిని కదా ?
    మన మొక్కటేయైన, మత మొక్కటేయైన
    మనసేమొ నీ దాసియౌ సదా !

నా జీవిత క్షేత్ర నానాత్వమున కెల్ల
నేనె కర్తను, కర్షకుడను
    ఐన, నేలనొ పంటనెల్ల నీ పాదాల
    గాదెలకె తోలు చుందు !

# 135

## నా వైనం ఏకత్వం

నా వైనం ఏకత్వం స్థిరం,
నీ వైనం నానాత్వం చరం !

నీ మనసు తన తోడ
నిను కూడ గొంపోవు,
నా మనసు నను వీడి
నలు దెసల విహరించు !

నీది మనో వేగం
నాది మనో విన్యాసం,
నిఖిలాత్మక వాసం నీ లీల
నిను అన్వేషించుట నా హేల !

ఎట నీ వుంటివో ఏమో
ఇట ఉంటిని నేను,
నీ ఆత్మకు సోకునా
నీ కొరకీ నా పాటలు ?

# 136
## ఆడుచు పాడుచు

ఆడుచు పాడుచు బ్రతకాలి
అతిగా, జతగా బ్రతకాలి !
పనిలో నైనా, వనిలో నైనా
అని లోనైనా ఆనందంగా ॥

అణువైనా వెనుకకు చనలేము
క్షణమైనా ముందుకు కనలేము,
సదా వర్తమానమౌ సృష్టిలో
సమ్యక్ రమ్య మనోహరమ్ముగా ॥

విచారించుటకు సమయం లేదు
వినోదిస్తు ముందుకు పోవాలి,
అలపు లేక ఆలస్యం కాక
ఆది అంత మొకటే రసాబ్ధిగా ॥

# 137

## ఎవరవో నీవు

ఎవరవో నీవు నే
నెరుగ నను కోకుమా !
ఇల లోన నీ ఉనికి
తెలియదను కోకుమా !

అందరికి తెలుసు నీ
వందరిలొ కల వని,
ప్రతివాడు తానె నీ
వని గర్వపడు నని !

కదన రంగము లోన
కాలుడవు నీవు,
నర సమాజము నడుమ
కరుణాళు వీవు !

నా మనసులో నిరం
తరము వెన్నెల కాయు
అమృత కామన వీవు !
ఐశ్వర్య మీవు !

# 138
## ప్రేమలూ, కారుణ్యములు

ప్రేమలూ, కారుణ్యములు జీ
వితమునకు చెలులు,
ప్రగతి మార్గము లోన అవి కా
రాదు అవరోధమ్ములు !

అన్నమే పరమాత్మ, అది లే
కున్న నిలువదు జీవితం,
జీవితము నిలబడిన వెనకే
చిన్మయా నందమ్ములు !

ప్రియతమా! కర్తవ్య మొకటే
ఋతము, తక్కిన దెల్ల క్షణికం,
సాగుమా తేజో ముఖమ్ముగ !
వేగు జుక్కలు కలవు చాలా !

# 139

## ప్రకృతికి కూడా ఎన్నో

ప్రకృతికి కూడా ఎన్నో
పరిమితు లున్నవి,
ప్రాణానికి సైతం ఒక
పథక మున్నది !

మల్లె తీగ కాయునా
మామిడి కాయలు ?
పెద్ద పులికి పుట్టునా
పిరికి గొర్రెలు ?

బంగాళా ఖాతమైన
పాల సంద్రమైనా
చెలియల కట్టను దాటితె
శత్రులు కావా ?

మానవుడా ! నీకు కూడ
మార్గ మొకటి కలదు,
మర్యాదలు దాటకుండ
మానవతను నిలుపు !

# 140
## కాలం తోడిది వేగం

కాలం తోడిది వేగం, వే
గం తోడిది కాలం !
కాల వేగములు కదం ద్రొక్కుతూ
కదలడమే అభ్యుదయం !

కాలం కదలక కూర్చున్నపుడు
కాలి బాట యైనది వేగం,
కాలం లేచి పరుగిడగా, ఆ
కాశ మంటినది వేగం !

నీ వేగమె నీ జీవిత కాలం,
జీవిత మనగా వేగ ఫలం !
ప్రియతమ ! కాలమ్మును జయించు కో
రిక కలదా ? వేగమును పెంచుకో !

## 141

## తీగలో పూవుంది

తీగలో పూ వుంది
పూవులో తే నుంది
తేనెలో తీ పుంది
తీపిలో ఏముంది, మిత్రమా ?
తీపిలో-
నీవు, నేను !

మనలో మాధుర్యం
మాధుర్యంలో మధువు
మధువులో మందారం
మందారంలో చెట్టు
చెట్టులో ఏముంది ! మిత్రమా ?
చెట్టులో - మట్టి !

మట్టిలో ఏముంది?
మనసు !
మనసులో ఏముంది ?
మహస్సు !
మహస్సులో ఏముంది ?
నీవు, నేను !

# 142
## శుద్ధసత్వ గుణసిద్ధుడు

శుద్ధ సత్వ గుణ సిద్ధుడు
సుఖ సంతోష విశుద్ధుడు,
మానవతా మహనీయ బుద్ధుడు
మధు జీవన అనిరుద్ధుడు !

ఎవ రతడు ? ఆదర్శ పురుషుడు ?
నవ మానవతకు వైతాళికుడు ?
నీవే ఎందుకు కారా దతడు ?
నిర్మ లాత్మకుడు ? నిఖిల జనీనుడు ?

యువకుడా ! ఆధునికుడా !
ఓజో తేజో నిలయుడా !
ప్రాభవమున ముందుకు చనువాడే
భావి జగజ్జన నాథుడు !

## 143
## సృష్టి నీ ఆనంద లీలా

సృష్టి నీ ఆనంద లీలా
నృత్యముగ చూచితిని కనుక
వ్రాసినాడ అకాండ తాండవ
వర్ణనాత్మక గేయ కావ్యం !

మెరుపు ఉరుమై విరియునట్లే
మృదుల నృత్యం తాండవమ్మై
మంచి చెడ్డల నదుపు చేసే
మహిమగా భావించినాను !

నన్నపార్థము చేసికొంటివో
నన్నె వేదిక చేసికొంటివి !
ఆపుమా, నటరాజ ! నే నిక
ఓపలే నీ "వర్టిగో" !

# 144
## ఎక్కడా చోటు లేనట్టు

ఎక్కడా చోటు లేనట్టు
ఎక్కితివి నా నెత్తి మీదకు,
తాండవింతువు, హరహరా ! నా
తలను త్రిప్పుచు గిరగిరా !

ఆట పాటల ప్రాణమవు, నీ
పాట చాలును నాకు, దేవా !
ఆడ జాలను నీ వలె, అందుకు
ఆయు వెంతో కావలె !

సృష్టి స్థితిలయ కారకము నీ
నృత్యమే అన్నంత మాత్రన
దాని రుజువుకు నా శిరమునే
దాఖలా గొనదగునె, శంభో !

## 145
## జీవిత మొక పాట

జీవిత మొక పా టను కొన్నా,
పాట మధుర మనుకొన్నా,
పాటలలో గల స్వరములలో పలు
పశు పక్ష్యాదులు కల వన్నా !

సరిగమదని వర్ణాదుల కంటే
పంచమ వర్ణం మెరుగన్నా !
పరభృత మనియో, వగరు తిను ననియొ
ప్రణవమునకు వెలి తగదన్నా !

మానవ నైజములో పశు పక్షుల
మడి మాన్యము లుండిన వన్నా !
ముందుకు పోయే మనిషికి ఇతరుల
మ్రొక్కులు గొను హక్కులు కలవన్నా !

# 146

## ఆధారం

ఆధారం !
సంగీతానికి భావం
భావానికి సాహిత్యం
ఆధారం !

సాహిత్యానికి నీ నా
సౌహిత్యం ఆధారం,
సౌహిత్యానికి జగ దవ
గాహన ఆధారం !

జగ దవగాహనకు ఆత్మ
జాగృతి ఆధారం,
జాగృతికి స్థిత ప్రజ్ఞుల
త్యాగము ఆధారం !

త్యాగములకు హృదయార్పణ
దాస్యము ఆధారం,
దాస్యము లన్యోన్యము లా
ధారములు పరస్పరం !

# 147

## సరిగమలకు

సరిగమలకు రంగు లొసగి
స్వర పాత్రల రుచులు నింపి
చరణములకు నా హృదయ
స్పందనలే కింకిణులుగ
అవనీ నట రంగముపై
ఆరాధింతును నిన్ను !

రాజకీయములు వలదు
రాజ భోగములు వలదు
సన్మానమ్ములు వలదు
సత్కారమ్ములు వలదు
నీ చెలువము నాపై వె
న్నెల గాసిన చాలు నాకు !

నీ గాత్రము, నీ వీణ
నీ వేణువు, నీ డమరు
నిత్యము నా పూజా విధి
నృత్యము చేయుచు నుండ
పారవశ్యమున నేను
పరమాత్మయె నైపోదును !

# 148

## మానవతా

మానవతా ! మేలుకో !
మంచికి మార్గం చూపి
మానవ మహి నేలుకో ॥

పొట్టకూటికై మనిషి
పుట్టెడు పాపాలు చేసి
తట్టలతో మోసుకొంచు
గిట్టుట తప్పించుకొనగ ॥

ఒకడి బ్రతుకు కొక డడ్డం
ఒకడి స్వేచ్ఛ కొక డడ్డం
కాకుండగ నరు లెల్లరు
కలిసి బ్రతుకు గతి చూపగ ॥

శుక పిక శారికల నుంచి
సుఖశాంతులు నేర్చుకొని,
మత వైరము లార్పుకొని
మానవుడు పురోగమింప ॥

ముందుకు పోవలసిన మానవుడు
సందు గొందులకు పడిపోతున్నాడు !
విశ్వ జనోదయము చూపి
విను వీథుల నడుపుకో ॥

# 149

## తెలుగు తెలుగు

తెలుగు, తెలుగు, తెలుగు !
తీపి తీపి తెలుగు !
తెలుగు తెలిసి నపుడె
తెలివి విరిసి వెలుగు ॥

నదులు, పర్వతము, లుద్యా
నములు, పొలము, లంబుధులు
వీణ మెట్లుగా పలికే
వాణీ వదనము తెలుగు !

లోకములో ఎన్ని భాష లున్నా
వాకిటిలో ఎన్ని భోగ భాగ్యము లున్నా
పూలు, పండ్లు, తేనెలతో
పూర్ణ కుంభమీ తెలుగు !

కలరు కవులు, మహా మనీషులు,
కలరు యోధులు, కర్మ యోగులు,
విశ్వ మానవత తెలుగు !
విశ్వ మాధురిమ తెలుగు !

# 150

## ఉమ్మడి జీవితం కాదు

ఉమ్మడి జీవితము కాదు సమాజం,
ఒకే స్థాయిలో బ్రతుకుట సోషలిజం !

కూడు, గుడ్డ, కొంప సమ
కూరవలయు ఎల్లరకూ,
శాంతి సుఖా లందరకూ
సమకూడుటె సోషలిజం !

ఆర్థిక సాంఘిక సమతా
న్యాయం జనతకు చాలు,
స్వేచ్ఛ కావలయు కవులకు
చింతకులకు, ధీమతులకు !

మానవ లోకం - ధీ
మహితం కావా లంటే
గతం కాదు గమ్యం
ముందు చూపె రమ్యం !

# 151
## స్వేచ్ఛే ప్రగతి

ఉమ్మడిగా జీవించుట వేరు,
ఎల్లరు
ఒకే స్థాయిలో బ్రతుకుట వేరు !

ఉమ్మడి జీవితమున లే
దోయి స్వేచ్ఛ వ్యక్తికి,
వ్యక్తి స్వేచ్ఛ లేకుంటే
శక్తి విరియ బోదోయి !

చెట్టుకు పిట్టకు ఉమ్మడి
జీవిత ముండిన కానీ
పిట్ట కాలు చెట్టు కొమ్మ
కట్టేసుకు మన లేవోయ్ !

ప్రతిభ, ప్రాభవం గలిగిన
వాడు లేచి పరుగెత్తు !
విశ్రాంతిని గోరు వాని
విడిచిపెట్టి పోనీ వోయ్ !

## 152
## తన కాలు కోయగా

తన కాలు కోయగా తన తమ్ము డేడ్చునా
అన లేదె యోగి వేమన ?
జీవాత్మ దేని కదె, సర్వ స్వతంత్రమ్ము,
దైవ మది వ్యక్తిగతము !

ప్రకృతిలో ఎన్ని వస్తువు లుండు, అన్ని దై
వము లుండు వేరు వేరుగ !
నిను నీవు కాపాడుకొను నట్లె నీ దైవ
మును కూడ కాపాడు కోవలె !

వాస్తవమ్మునకు నీ వెవరు? నీ దైవ మె
వ్వరు ? ఇర్వురొక్కటే సుమ్మ !
నీ క్రియా శక్తియే నీ దైవము,
నీ ప్రజాసక్తియే నీ విజయము !

## 153

### నీవొక జల కలశం

నీవొక జల కలశానివి
నీ దేవుడు సూర్యుడు,
నిను బోలిన కలశాలే
నిఖిల జగాలు !

సూర్యుడొకడె అనుట వలన
సుఖ మేమిటి నీకు?
నీ వ్యక్తిత్వమె నీది
నీ జీవితమే నీది !

దేవు డొకడు కాదోయి
జీవరాశి దేని కదే !
నీవు పోవగానే, నీ
దేవుడు నీతోనే పోవు !

## 154

## ఇదియేనా నాగరిక జీవనం?

ఇదియేనా నాగరిక జీవనం ?
ఇదియేనా మానవ సంస్కారం ?
రక్తపు టేరులు, అశ్రుధారలు
రుద్ధ కంఠములు, రోదనలు !

ఏ దంతస్తుల మేడల ప్రక్క
ఏడుస్తున్న పూరి గుడిసెలు,
బీరు బ్రాందీల బొజ్జల సరస
బీద బిక్కి యెమ్ముల గూండ్లు !

లంచాలూ, కంచాలూ, మంచాల్
లావు దొరల పంచలలో సంచులు,
రౌడీలకు రాజ్యాలు కోటలు
ప్రజలకు మాత్రం మురికి పేటలు !

# 155

## వేదాంతం కాదు

వేదాంతం కాదోయి జీవితం !
విశ్వమానవత లోకి
వికసించుట జీవితం !

ఏ సమాజమున కైనా
ఏ మత వ్యవస్థ కైన
ఆచారం అలవాటుగ
అనుసరించి వస్తుందోయ్ !

శతాబ్దాల గతంలోని
శాసన శవపేటిక కాదోయి !
అధునాతన వర్తమాన
అభ్యుదయమె జీవితమోయ్ !

మౌలిక ప్రకృతి ధర్మాలు
మారవు ఏ నాటికీ,
మారే దొక జీవితమే, ఇష్ట
మార్గానికి గొనవోయీ !

## 156

## బలహీనులు సాధువు లైనప్పటికీ

బలహీనులు సాధువు లైనప్పటికీ
బలవంతుల కృపపై బ్రతికే వాళ్ళే రా !
బలవంతుల కృపపై ఆధారపడే బ్రతుకు
బంగారపు దైనా అది బానిస బ్రతుకే రా !

కురంగాలు, మయూరాలు, కపోతాలు, గోవులు
పరమ సుందరా లైనా బలహీనత వలన
క్రౌర్యం వాతను బడుట కాంచుట లేదే ?
ఋషి కైనా బలముండుట శ్రేయము రా !

ప్రేమ కైన, సౌందర్యారాధన కైనా
శ్రీ పూజల కైనా, సుఖ శాంతుల కైనా
భయ రాహిత్యమె ప్రధాన మౌరా !
బలాఢ్యుడై బ్రతుకుటె కర్తవ్యం రా !

# 157

## పశువును బ్రతక నివ్వడు

పశువును బ్రతక నివ్వడు,
పక్షిని బ్రతక నివ్వడు,
తనకు అడ్డ మనుకొంటే – తోడి
మనిషిని బ్రతక నివ్వడు !
ఎవడు వాడు ? ఎవడు వాడు ?
ఎవడా క్రూరుడు ?

అడవులు నరికేస్తాడు,
పుడమిని మాడ్చేస్తాడు,
గాలిని నీటిని కూడా
కలుషిత మొనరిస్తాడు !
ఎవడు వాడు ? ఎవడు వాడు ?
ఎవడా దుష్టుడు ?

వంచనతో ధనం గడిస్తాడు,
మంచివారి నణగ ద్రొక్కుతాడు,
స్వప్రయోజనం కోసం
సభలను రంజిస్తాడు !
ఎవడు వాడు ? ఎవడు వాడు ?
ఎవడా వంచకుడు ?

## 158

# లోకానికి దేవుడొకడు కాదురా

లోకానికి దేవుడొకడు కాదురా !
నీకు నీ దేవుడే పూజ్యుడురా !

తూరుపు కొక దేవుడూ
పడమర కొక దేవుడూ
ఇద్దరి మధ్యా ఎంతో
గుద్దులాట కలదురా ॥

కులాని కొక దేవుడు
మతాని కొక దేవుడు,
ప్రాదేశిక సమూహాల
ప్రస్థితికే దేవుడు ॥

ఆచారము ననుసరించి
అడుగులు ముందుకు వేసే
జీవ యాత్రలో దేవుడు
సేవక మాత్రుడు కదరా ॥

# 159

## దొంగ-దొంగ

తోడి మనిషిని దోచు దొంగా !
కూడు దాచే ఇంటి గొంగా !
ఇరువ దమ్మల విల్లు
నెత్తె భారత శక్తి,
అహి శాయి కడ కూడ
నహి నీకు ముక్తి ॥

మురికి వాడల నరక వాసీ !
నరక వసతియు లేని నిర్వాసీ !
పూర్వ దిక్కున పూర్వ
పుణ్యమే దిక్కుగా
ఉదయేంది రదె వెలసె !
హృదయ మర్పించరా !

అందలము దిగలేని జడుడా !
అరు గెక్కరాని యాచకుడా !
జగ దేక సమ సమా
జ విమాన మేతెంచె,
వర్గ భేదము త్రుంచి
పరుసలో నిలవరా !

వేల ఎకరాల భూజానీ ! వేన
వేల తకరాల యజమానీ !
పరిమితులు పెట్టుకొని
పరపీడ మానుకొని
గ్రామ పట్టణ సామ్య
ప్రభుత సాధించరా !

# 160

## టెర్రరిజం కాదురా, యువకుడా

టెర్రరిజం కాదురా, యువకుడా !
మిత్ర రిదే చూచుకోర నీ హృదయం !

అత్త మీద కోపం
దుత్త మీద చూపకురా !
అధము డెవడో చేసిన పాపానికి
అమాయకుల హింసించుట తగదురా !

లోకమునే బాగు చేయ దలచితివో ?
లోక మనగ నీ వొకడివే కాదు గదా ?
కాకులదే మెజారిటీ అయినప్పుడు
కోకిల గొంతుక లెవరికి వినపడురా ?

ఉద్రేకం వీరత్వం కాదురా !
ఊహ తెలిసి ఉద్యమాలు నడపరా !
టెర్రరిజం కుర్రతనం,
గొర్రె కన్న బలహీనం !

# 161

## కొక్కొరోకో

కొక్కొరో, కొక్కొరో, కో !
కోట్ల జనములు మేలు కొన్నారో !
కోట్ల జనములు మేలు
కొన్నారు, విన్నారు
కొత్త శక్తులు భువికి
కొలిశారు, నిలిశారు ॥

పాత కంబళి లోని సోమరీ !
భూత కాలము విడని తెర్వరీ !
లోక బంధువు వచ్చి
వాకిట్లో నిల్చెరా !
అంధకారము పైని
ఆహవము సాగెరా ॥

కలుపు తరుగుట లేదె, కర్షకా ?
మలుపు తిరుగుట బాధె, కార్మికా ?
కొడవళ్ళు పట్టి ది
క్కులు నిల్చె గట్లపై,
కల లెల్ల పండి కో
కిల పిల్చె చెట్లపై ॥

కను మూసి పార్లావు పిల్లీ !
పను లెల్ల చెడ బల్కు బల్లీ !
ఎంత కాలము ప్రగతి
నేడ్పింత్రు ? నవశక్తి
సెలగి మీ గుహ లెల్ల
చీల్చి చెండెడు నింక ॥

ఉగ్ర నైరాశ్య విద్యార్థీ !
వ్యగ్రాంధకార ప్రత్యర్థీ !
అరుణోదయము విరిసె
తరుణామృతము కురిసె
సర్వ సమతా మాత
స్వాగత మీ్మ వచ్చె ॥

ముందె మేల్కొన వలసిన ఋషీ ! సందు
గొందెలను దాగిన మనీషీ !
వ్యథిత మానవ హృదయ
శిథిల పాత్రిక బట్టి
అభ్యుదయ దేవి నీ
ఆతిథ్య మాశించె ॥

చొక్కి మంచము చేరు భోగీ !
చిక్కి కుంపటి కాగు మూగీ !
పల్లె పట్టున లక్ష
పనులు పడి వున్నాయి,
నవ మానవము కొరకు
నాగళ్ళు పన్నరా ! ॥

## 162

## ఎందుకు విషాదం

అరుణోదయము లోన తరుణోదయ సఖీ !
కాలాబ్దముల గూర్చి కలత పడ నేటికే ?

తల లోని నెలవంక కలకంఠ కుహూవుగా
విశ్వ నర్తకి వీవు, విశ్వగాయని వీవు !
కాకి గోలకు బెదిరి కన్నీరు తేదగునె ?
ఘూక ధాటికి లొంగి చీకాకు పడుదువే ?

ఉద్యానవనములో ఒకటొ రెండో కాదు
విరియుచుండును వేనవేలు పూల కులాలు,
ధూర్తాళి కేలనే తోటపై పెత్తనము ?
గొడ్డళ్ళ కేలనో గుత్తాధికారాలు !

నవ మాసకాల మజ్ఞాత వాసము చేసి
నవ మాసమున లేచి నాట్యామాడదె పికము ?
కాల మనుకూలమ్ము కానపుడు వగపేల ?
అవకాశమును బట్టి అడుగు ముందుకు వేయి !

రస మన్నచో అన్న రస మొక్కటే కాదు,
అభ్యుదయ మొసగునది ఆక లొకటే కాదు,
అన్న రసమును మించి అమృత మున్నదె, సఖీ !
కర్తవ్యమున్న దాకలిని మించిన దెంతొ !

కాలిలో ముల్లనుచు కూలబడి బాధతో
ఏలనే కన్నీటి ఏరుపై కరిగేవు ?
ముల్లు దీయగ వేరె ముల్లు కలుగదె, సఖీ ?
కన్నీరు మాత్రమే కరుణ రస మౌనటే ?

ఎంతొ మంచు ఎడారి నెదిరీది వచ్చితివి,
ఎన్నొ శిశిర దళాల నెదిరించి గెల్చితివి,
హింసో, అహింసో అదేమైన కానిమ్ము,
కర్మయోగమె ప్రగతి ధర్మమై వికసించె !

త్యాగాలు చేసి, సుందర వసంతా రామ
మహిత రాజ్యమును సంపాదించుకొన్నావు
నీ అభీష్టము రాల్చి నిష్ఫల మ్మొనరించు
ఆతతాయుల దుష్క్రియల పట్ల కృప యేల ?

పశ్చిమమ్మున తెల్లవారదో ? ఉత్తర
మ్మున మంచు కరగదో ? పోనిమ్ము; మధుమాస
మరుగుదెంచినది నీ అభిమతము కొరకె కద ?
అనుభవింపుము జీవితాదర్శ మది యొకటె !

కృష్ణమోహన వనప్రియ గీత సంగీత
భావ గీతల లోని దేవీ ! నమస్తుతే !
సఖి వీవు, నా ఉపాస్య ప్రకృతి వీవు, మి
ధ్యా చింత వీడి, వాస్తవ దృష్టి గొని, లెమ్మ !

అరుణోదయములోన తరుణోదయ సఖీ !
కాలాబ్దముల గూర్చి కలత పడ నేటికే ?

# 163

## పువ్వులు పువ్వులు

పువ్వులు, పువ్వులు, పువ్వులు
పూజకు పువ్వులు, పువ్వులు !
బహు రంగుల పువ్వులు,
బహు తావుల పువ్వులు ॥

తెల్ల తెల్లని మల్లెలు
నల్ల నల్లని కల్వలు
ఎఱ్ఱని మందారాలు
పచ్చని చేబంతులు ॥

నీలి పూల మబ్బుల క్రింద, వరి
చేల పూల కంబళి మీద
నీ అడు గడుగూ పువ్వులు
నీ అణు వణువూ పువ్వులు ॥

నా పని పాటుల తోటలు – నీ
పాదాంకిత హారతులు !
నా బ్రతుకు పూల దోసిళులు – శత
ఋతు చక్రాల ఉషస్సులు ॥

# 164

## ఎన్నో కోరికలు

ఎన్నో కోరికలు – ఎ
న్నెన్నో ఈరికలు !

కోరికలకు ఈరికలు
ఈరికలకు కోరికలు,
అవధి లేని బాటలలో
అంతు లేని తోటలలో ॥

సృష్టికి మూలం
ప్రేమ కోరికలు,
ఇహ జీవిత గమనానికి
ఇంధనం ఈరికలు ॥

కోరిక లీరిక లెత్తుచు
కొనసాగుటయే ప్రకృతి,
ప్రకృతి ధర్మ రథ యాత్రకు
ప్రాణశ్వాస్ కోరికలు !

# 165

## ఆనందానికి ఆకృతి

ఆనందానికి ఆకృతి
ఈ నా పాటల తోట !
అన్ని ఋతువులూ దేని కదే ఒక
అందా లొలికే బాట !

ప్రేమ యాత్రికుడవో, పుణ్య
క్షేత్రాసక్తుడవో-
అధ్యా త్మాన్వేషకుడవో, నీకు
తథ్యమైన విశ్రాంతి కేంద్ర మిది ॥

రమ్మ, ప్రియతమా ! వచ్చి, ఈ కుటీ
రముల రుచుల ననుభవించి పొమ్మ !
పుట్టినందు కీ మాత్రపు రసవత్
పూర్ణత్వమైన గ్రోలి పోవలె ॥

# 166

## సంగీతమె

సంగీతమె సుఖ జీవితము
సహజ సుందరము, శాంతి ప్రదము !
శుక పిక మధుకర శారికాదుల
సుప్రభాత గానామృత పూరము,
నిరతము హృద్వీణను పలికించే
పరమ నృత్య మంజీరము !

గళమున నిత్యము గానము మొరసే
అలవాటే ఆరోగ్యము,
జీవేశ్వర కల్యాణ ప్రగతికి
శ్రీమ న్నాద స్వరము !

సర్వ విశ్వ విశ్వాంతర బంధం
సర్వేశుని హృదయ స్పందం,
సంగీతానికి పీఠం ఈ నా
సాహిత్య వనం స్వచ్ఛందం !

# 167
## మనసా విహరించవే

మనసా ! విహరించవే !
మనసు దీర, మమత మీర ॥


తోటలోని ప్రతి ఫలమూ, పుష్పము
ప్రతి లవమూ ఒక దర్పణమ్ముగా
నిన్ను నీవు సరిదిద్దు కొనుచు రమ
ణీయముగా, వరణీయవుగా ॥

శ్రావ్యములౌ శుక పిక రవములపై
స్వారీ చేయుచు గోలోకముల
పాలను పిదికి, ప్రాణుల దనిపి
ప్రజలకు మధువులు పంచుచు ॥

పై పై కేగే మానవుడు
పట్టు తప్పి పడిపోతున్నాడు !
పట్టుకొని, నీ వెంట గొని
పర మైశ్వర్యుని జేసుకొని ॥

❋ ❋ ❋

# పాటలలో అంబేద్కర్



రచన

బోయి భీమన్న

# కృష్ణశాస్త్రి బొజ్జా

## అంకిత గేయం

గమ్యం చేరక ముందే
కర్రెంటు పోయింది,
చెలికారపు దీపాలను
చీకటి మింగేసింది ॥

అడుగడుగున పలకరించు
అలరుల దాచేసింది,
ఆశాలత కొసలు నులిమి
అశ్రువులను పిండింది ॥

కుంటువడిన నా పదముల
గొంతు నేదొ తడిపింది,
గ్రీష్మోజ్వల కృష్ణ నిశా
క్షీరోదధి పొంగింది ॥

కృష్ణశాస్త్రి బొజ్జా ! నీ
తృష్ణకు నేనే మిత్తును ?
పాటల రస కలశాలతొ
బాబానే అర్చింతును ॥

– భీమన్న

# దళిత జన శ్రుతి

స్వాతంత్ర్య పూర్వ భారతదేశానికి ప్రధాన నాయకులు ముగ్గురు. గాంధీ, జిన్నా, అంబేడ్కరు. స్వాతంత్ర్య ప్రాంగణం చివరలో దేశాన్ని నడిపించిన రాజకీయ నాయకులు ఈ ముగ్గురే.

నేతాజీ అజాద్ హింద్ ఫౌజు, భగత్‌సింగ్ లాంటి వారి టెర్రరిస్టు కార్యకలాపాలు, నౌకాదళ తిరుగుబాటు వంటి ఇతర శక్తుల ప్రమేయం ఎంత వున్నా, రాజకీయ స్వాతంత్ర్యోద్యమానికి ప్రధాన నాయకుడు గాంధీజీయే. ఆయనకు దేశమంటే ఒకే భారత జాతి. అందులో ఇతరులతో పాటు ముస్లిములూ, అంటరాని వర్గ ప్రజలూ కూడా అంతర్భాగాలే. అధిక సంఖ్యాకులైన హిందువుల నుంచి ఏ వర్గమూ విడిపోవడం గాంధీజీకి ఇష్టం కాదు. భారత దేశానికి నిజంగా అదే సరియైన విధానం కూడ.

భారతదేశం ప్రధానంగా హిందూ దేశం. బ్రిటిష్ ప్రభుత్వం రాజ్యమేలినంత కాలం ఈ దేశ చరిత్రను హిందూదేశ చరిత్ర అనే పిలిచేవాళ్ళు. మేం చిన్నప్పుడు అదే పేరుతో హిస్టరీ చదివాం. కాగా, గాంధీజీ నాయకత్వంలో హిందూ దృక్పథమూ, హిందూ మౌలికతా కనిపిస్తూ వుండేవి. అప్పటి కది తప్పనిసరే. స్వాతంత్ర్య పోరాటంలో ఎక్కువగా పాల్గొన్నవాళ్ళు హిందువులే గనుక, గాంధీజీ తన వైఖరిలో హిందుత్వం వైపు మొగ్గడం తప్పనిసరి అయింది. అది సహజమే కూడా. పారతంత్ర్య విమోచనా నంతరం స్వతంత్ర భారత రాజ్యాన్ని రామ రాజ్యంగా తీర్చిదిద్దుతానని గాంధీజీ వక్కాణిస్తూ వుండడంలో కూడా అసహజత్వం ఏమీ లేదు.

భారతదేశానికి ముస్లిం మతం వచ్చినప్పటి నుంచీ మొత్తం మీద హిందూ మతంతో ఘర్షణ పడుతూనే వుంది.

మతం అన్నప్పుడు దేవుడి ప్రమేయం వుండాలి. దేవుడొక్కడా, అనేకులా వంటి తర్కం సాగాలి. కాని, ఈ కాలంలో మతం అంటే ఆ మతస్థుల ఆచార పద్ధతులు మాత్రమే పరిగణించబడుతూ వుంది. దేవుడి ప్రసక్తే వుండడం లేదు. అట్టి పరిస్థితిలో

విరుద్ధాచారాలు గల హిందువులకూ, ముస్లిములకూ సహజీవనం ఎలా సాధ్యం కాగలదు? జిన్నా నాయకత్వం కింద ముస్లిం ప్రముఖులు ఈ విషయమై తర్కించారు.

దేశానికి స్వాతంత్ర్యం వస్తే అది మెజారిటీ హిందువుల చేతిలోకి రావడం తప్పదు కదా! వాళ్ళు హిందూ రాజ్యం నెలకొల్పడమూ తప్పదు కదా! అప్పుడు ముస్లిముల సంగతి ఏమిటి? ఈ ఆలోచనల తోనే జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, దేశ విభజనను కోరాడు. తమకు వేరే దేశం కావాలన్నాడు.

జాతీయత రీత్యా హిందువులూ, ముస్లింలూ వేరు వేరు జాతుల వాళ్ళు కాదు. మతాలు మాత్రమే వేరు. మతాలు మార్చుకోగలిగినట్టివి. వాళ్ళు ఒకళ్ళ కొకళ్ళు అంటరాని వాళ్ళు కాదు. కలిసే తిరుగుతారు. కలిసే వివిధ వ్యవహారాలలో పాల్గొంటారు. అటువంటి ముస్లింలే హిందువుల నుంచి విడిపోతామంటే, హిందూ సమాజంతో ఏ విధమైన సంబంధమూ లేని అస్పృశ్యుల సంగతేమిటి?

అస్పృశ్యుల్ని తమ మతం వాళ్ళుగా, తమ జాతి వాళ్ళుగా హిందువులు పరిగణించడం లేదు. తమ మతాచార వ్యవహారాలలో పాల్గొననివ్వడం లేదు. తమ దేవాలయాలలోకి రానివ్వడం లేదు. తమ బావులలో నీళ్ళు ముట్టుకోనివ్వడం లేదు. తమ వీధులలో కాలిడ నివ్వడం లేదు. పరపాలన లోనే ఇంత అమానుషంగా చూడబడుతున్న ఈ అంటరాని వాళ్ళు, స్వరాజ్యమే వస్తే ఇంకా ఎంత నరకాన్ని అనుభవించవలసి వుంటుందో కదా!

ఈ ఆలోచన అంటరాని వర్గాల యువకులలో వచ్చింది. అప్పటికి అంబేడ్కర్ చదువు ముగించుకొని సాంఘిక సేవా రంగం లోకి వచ్చి వున్నాడు. దేశంలో అత్యధిక సంఖ్యాకులుగా వున్న, అప్పుడప్పుడే ఆలోచనాపరులవుతూ వున్న అంటరాని కులాల యువకులకు ఆయన నాయకత్వం వహించి, త్రిజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, తమకు కూడా వేరుగా ఒక ప్రత్యేక దేశం కావాలన్నాడు.

పరిశీలించి చూస్తే, జిన్నా డిమాండులో కంటే అంబేడ్కరు చేసిన డిమాండులో ఎక్కువ ఔచిత్యం వుంది. ఎక్కువ సహజత్వం వుంది. న్యాయం వుంది. హిందూ

మెజారిటీ సరసన ముస్లిం మైనారిటీ గౌరవప్రదంగానే, వైభవోపేతంగా కూడా బ్రతకవచ్చు. కులాహంకార బధిరాంధకులైన సవర్ణ హిందూ ప్రభువుల నీడలో అస్పృశ్య కులాలు అసలు బ్రతకడమంటూ వుండదు. సర్పాల పడగల కింద కప్పల బ్రతుకే అవుతుందది. ఇది మహా భయంకరమైన దుస్థితి!

"కసరి బుసగొట్టు నాతని గాలి సోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

అంటూ జాషువాకవి వర్ణించిన భయంకర నరకం అది.

అమాయకులూ, దీనాతి దీనులూ, నిత్య దరిద్రులూ, ఊరికి దూరంగా మురికి గుడిసెల్లో బ్రతుకుతున్న వాళ్లూ అయిన కొన్ని కోట్ల మంది దళిత కులాల గొర్రెలను అధికార బలదర్పితులైన సవర్ణ హిందూ తోడేళ్లకు ఆహారంగా వదిలేయ వలసిందేనా? ఈ విషయ మేదో బ్రిటీష్ ప్రభుత్వం వుండగానే తేల్చుకోవలసి లేదా?

తన జీవిత సర్వస్వమూ అంకితం చేసి ఈ దీన ప్రజలకు సహాయపడాలనే దీక్షతో నిలబడిన వాడు అంబేడ్కరు. ఆయనే కనక ఆనాడు అట్టి నాయకత్వానికి పూనుకొనకపోతే, ఈనాటికి ఈ దేశం స్వరూపం ఎలా వుండి వుండేదో ఊహించడానికే భయంగా వుంది.

గాంధీ, జిన్నా, అంబేడ్కరూ – ఈ ముగ్గురు నాయకులలోనూ అత్యుత్తమ జాతీయ నాయకు డెవరంటే అంబేడ్కరే అని చెప్పక తప్పదు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో అంబేడ్కరు నిర్వహించిన బాధ్యత అంత గొప్పది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. జిన్నా తన ముస్లిములకు పాకిస్తానును పంచుకు పోయాడు. మరి అంబేడ్కరు ఏం చేయగలిగాడు?

తన త్రిజాతి సిద్ధాంతాన్ని వదిలేసుకొన్నాడు. తన దళిత కులాలకు ఒక ప్రత్యేక రాజ్యం కావాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకొన్నాడు. అంటరాని కులాలు అన్ని కష్టాలకూ ఓర్చుకుంటూ హిందువులుగానే బ్రతకక తప్పదన్న గాంధీజీ పట్టుదలను మన్నించాడు. పూనా ఒడంబడికపై సంతకం పెట్టాడు!

హిందూ జాతిని సర్వనాశనం నుంచి తప్పించడం కోసం షెడ్యూల్డు కులాలకు, తెగలకు ఏవో కొన్ని సౌకర్యాలు (రిజర్వేషన్లు) కలిగించడంతో తృప్తి పడ్డాడు. తాను మతం మార్చుకొన్న సందర్భంలో కూడా హిందూ మతంలో ఒక భాగమైన బౌద్ధ మతాన్నే వరించాడు. అన్ని విధాల హిందూ జాతి అభ్యుదయానికి నవ భాస్కరుడై నిలిచాడు. ఎవరు అంతటి పరమ త్యాగి? అంబేడ్కరు ఒక్కడే!

మొదటి నుంచీ కూడా అంబేడ్కరు ప్రతిభను హిందూ జాతి గుర్తించలేదు. గుర్తించ లేదు అనడం కంటే, గుర్తించి అసూయతో ఉపేక్షించిందనడం సబబు. (నా విషయంలో కూడ జరిగిందంతే కదా!)

జనాభా లెక్కలలో సంఖ్యాబలం కోసం అంటరాని వారిని హిందువులుగా నమోదు చేయించడం వరకే సవర్ణ హిందువుల లక్ష్యం. అంతకు మించి మరేమీ లేదనవచ్చు.

అంటరానివారు హిందువు లైతే, మరి హిందువులకున్న హక్కులన్నీ వాళ్ళ కెందుకు లేవు?

ఈ ప్రశ్నను వేసుకొని, దానికి సమాధానంగా అస్పృశ్యతా నిర్మూలనకూ, అస్పృశ్యుల సముద్ధరణకూ పూనుకొన్న మహనీయులు సవర్ణ హిందువులలో ఎంతో మంది వున్నారు. అయితే, అట్టివారి కృషిని మన్నించిన సామాన్య సవర్ణులు బహు తక్కువ. సామాన్య సవర్ణులంటే, సవర్ణ భూస్వాములూ, సవర్ణ సనాతన పురోహితులూను! అట్టి వాళ్ళకు ప్రాచీన వైదిక మత స్వరూపం తెలియదు. వాళ్ళు వట్టి అజ్ఞానులు, మూఢాచార దాసులు!

ఒక వేయి సంవత్సరాలుగా భారత హిందూ జాతి కొంతకాలం ముస్లిములకూ, మరికొంతకాలం క్రైస్తవులకూ దాస్యం చెయ్యవలసి వచ్చిందంటే, అందుకు కారణం స్మృతుల కాలం మొదలుగా అది కులతత్వ విచ్ఛిన్నం కావడమే. పరస్పర వైరుధ్యంగల వివిధ కులాలుగా సనాతన భారతజాతి విడిపోవడంతో ఏకజాతి భావం నశించిపోయి, స్వార్థ వైషమ్యాలు జాతిని నిర్వీర్యం చెయ్యగా, పర జాతీయుల ఖడ్గ శక్తికి తలలు వంచేశారు వైదిక మహా వీరులంతా.

"సువీరా వీరైః

సుపోషా పోషైః" అనే ఋగ్వేద ప్రబోధాన్ని మరచిపోయి, వీరుడికి పుట్టినవాడే వీరుడు అనే జన్మ కులతత్వపు మాయలో చిక్కుకొని, సనాతన పురుషోత్తమ విరాట్పురుష ప్రతిష్ఠను మంట గలిపి, తత్ఫలితమైన అసమర్థతను అహింస అనే బురఖా కింద దాచు కొంటూ, కేవల భౌతిక స్వార్థ నిష్ఠమైన అహిత ఖడ్గానికి తల ఒగ్గిన దురదృష్ట చరిత్ర ఈ వెయ్యేళ్ళ భారత చరిత్ర.

ఇప్పుడు, ఈనాడు హిందూత్వం అని పిలువబడుతున్న సనాతన వైదిక భారతీయత్వం (Indianism) ప్రపంచ మానవ జీవిత తత్వా లన్నిటిలోనూ అత్యుత్తమమూ, అత్యున్నతమూ, అత్యంత వైజ్ఞానికమూ (Scientific) అయినట్టిది. దీనిని ఎంతమంది విదేశీయులు నరికి పారెయ్యాలని ప్రయత్నించినా అది నరకబడలేదు. కాల్చి పారెయ్యాలని ప్రయత్నించినా కాల్చబడలేదు. పైపెచ్చు అది అఖండ జ్యోతిగా నిలిచి వెలుగుతూనే వచ్చింది. ఈనాటికీ నిలిచి వెలుగుతూనే వుంది.

అయినా ఇది ఏ రూపంలో వుంది?

లోకాన్ని పరిపాలించ వలసినట్టిది, లోకోత్తరంగా వైజ్ఞానిక కాంతులు వెదజల్ల వలసి నట్టిది, కేవల మాంసలమైన తామస అహంకారాలకు దాస్యం చేస్తున్నది!

ఈ దుస్థితి నుంచి వైదికతను, హిందూత్వాన్ని విమోచనం చేసి ఉద్ధరించి, ఆధునికం చేసి, పురోగమింప చేయడానికి ఈ శతాబ్దంలో హిందూ సవర్ణులకు ప్రసాదించబడిన అవకాశాలు రెండు. అవి (1) జిన్నా ద్విజాతి సిద్ధాంతం (2) అంబేడ్కరు సహజీవన సమైక్య సిద్ధాంతం.

జిన్నా అంటే నాకు గౌరవం అందుకే. సంపూర్ణ హిందూత్వ వికాసం కోసం తద్విరుద్ధమైన ముస్లిం శక్తులను ఆయన వేర్పరచి దూరంగా తీసుకుపోయాడు. హిందువుల దశావతారాలలో ఆయన పదకొండవ అవతారమేమో అనే భావం కూడ నాకు వుంది.

పన్నెండవ అవతారం డా. అంబేడ్కరు కావచ్చు, కావాలి. ఎందుకంటే, జిన్నా ముస్లిం లను భారత్ నుంచి వేరు చేసి తీసుకుపోయిన తరువాత భారతదేశం

సంపూర్ణమైన వైదిక హిందూదేశం కావడానికి సరియైన మార్గాన్ని Thoughts on Pakistanలో సూచించిన మహాఋషి అంబేడ్కరు. ఆయన సూచన పరమ దైవిక మైనట్టిది.

అయితే ఆనాడు బ్రిటీష్ ప్రభుత్వం నుంచి (ఆగస్టు 15, 1947) భారత స్వరాజ్యాన్ని అందుకొన్న నాయకులు తమ వ్యక్తిగత పదవీ దాహానికి తప్ప, మరి దేనికీ విలువ ఇచ్చి వుండలేదు. అంబేడ్కరు సలహాను పాటించలేదు. గాంధీజీ ఆక్రోశాన్ని వినిపించుకోలేదు. దేశ శ్రేయస్సును గమనించలేదు. అదొక దురదృష్టకర ముహూర్తం.

జిన్నా ద్విజాతి సిద్ధాంతం లోని భారత గమ్యాన్ని, అంబేడ్కరు జన మార్పిడి ప్రతిపాదన లోని భారత ప్రాభవాన్ని స్వాతంత్ర్యాన్ని అందుకొన్న అగ్రనాయకులు గుర్తించి వున్నట్లైతే, ఈనాడు ఈ దేశాన్ని ఇన్ని అగచాట్లు చుట్టు ముట్టేవే కాదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 44 సంవత్సరాల తర్వాత ఈనాడు మనం ఎక్క డున్నాం? 45 సంవత్సరాల క్రితం ఎక్కడున్నామో అక్కడే వున్నాం. అంతకంటే పరమ హీనమైన, ప్రపంచంలో ఏ జాతీ లేనంత దీనమైన స్థితిలో వున్నాం.

నా కనిపిస్తున్నదీ – మనం ఆనాడు అంబేడ్కరు సూచించిన మార్గంలో, అంబేడ్కరు ఆకాంక్షించిన విధానంలో, అంబేడ్కరు ప్రతిపాదించిన వ్యూహంలో ఇప్పుడు పురోగమించవలసి వున్నది అని.

అందుకే నా సాహిత్యంలో బహు విధాలైన ప్రక్రియలలో జాతి వ్యక్తిత్వాన్నీ, అస్తిత్వాన్నీ దృష్టిలో వుంచుకొని ఈ ఉద్ఘాటన చేస్తున్నాను. అంబేడ్కరు జీవితాన్ని ఒక ఉద్యమంగా పరిగణించి రకరకాల రచనలు చేశాను. ఇప్పుడు ఈ గేయ సంపుటిలో ఆయన విశ్వమానవతా మహనీయతను గానం చేస్తూ, ఓంకార నాదబ్రహ్మ (Super String)కు నివేదిస్తున్నాను.

పుట్టుకతో కులం ఏర్పడిన (స్మృతుల) కాలం నుంచీ విచ్ఛిన్నమైపోతూ, బహు విధాల కలుషితమైపోతూ, విదేశీ దండయాత్రలను తట్టుకోలేనంతగా నిర్వీర్యమై పోయిన హైందవ జాతిని మళ్ళీ సంఘటిత పరచి, పునరుజ్జీవింప చేయడానికి

దఫదఫాలుగా కృషి చేస్తూ వచ్చిన మహనీయు లెంతో మంది వున్నారు. మతపరంగా కృషి చేసిన వారిలో గురునానక్, రాజా రామమోహన రాయ్, దయానంద సరస్వతి ముఖ్యులు.

సాంఘికం గానూ, రాజకీయం గానూ అట్టి కృషిని కొనసాగించిన వారిలో ఇటీవలి మహనీయులలో నాకు నలుగురు కనిపిస్తారు - వివేకానంద, గాంధీజీ, సర్దార్ పటేల్, డాక్టర్ అంబేద్కర్ గార్లు. అట్టి కృషిని బహుముఖంగా నిర్వహించిన అత్యాధునికుడు డాక్టర్ అంబేద్కరు.

నేను నా ఇతర రచనలలో వక్కాణించి వున్నట్లు – ఏ ప్రవక్త అయినా లోకంలో అప్పటికి ఆచరణలో వున్న ఏదో ఒక మతంలో పుడతాడు. ఆ మతం వ్యవహారాలు నచ్చక, దానిని తనకు నచ్చిన విధానంలో సంస్కరించడానికి ప్రయత్నిస్తాడు. అందుకు ఉద్బోధలు చేస్తాడు. ఉద్యమాలు నడుపుతాడు. అట్టి ప్రవక్తను కొంత మంది అభిమానిస్తారు. అనుసరి స్తారు. ఆయన మరణించిన తరువాత అచిరకాలంలో గానీ, చాలా కాలానికి గానీ ఆయన చేసిన కృషి ఆధారంగా, చెప్పిన సుభాషితాలు ప్రాతిపదికగా ఆయన పేరు మీద ఒక మతం ఏర్పడుతుంది. లోకం లోని ఏ మతం చరిత్రను పరిశీలించినా, ఈ వాస్తవం స్పష్టపడుతూనే వుంటుంది.

ఆధునిక యుగంలో అంబేడ్కరు అంతటి మహనీయుడు కనుక, ఆయన ఏ లక్ష్య సాధన కోసం తన జీవిత సర్వస్వాన్నీ అంకితం చేశాడో, ఆ లక్ష్యం ప్రాతిపదికగా ఆయన పేర ఒక మతం ఏర్పడితే, అందులో అసమంజసత్వం ఏమీ వుండదు. ఆయన బౌద్ధ మతస్థుడుగా మరణించాడు కాబట్టి ఆయనను బుద్ధుని శిష్యులలో ఒకడుగా తీసి పారవేయడం న్యాయం కాదు.

వైజ్ఞానికం గానూ, ఆధ్యాత్మికం గానూ ఎంతో అభ్యుదయాన్ని సాధించిన ఈనాడు కేవలం ఊహ మీదా, విశ్వాసం మీదా ఆధారపడిన మత వ్యవస్థకు స్థానం లేదు. అవన్నీ మరణానంతర జీవితం గురించి భావుకులు చేసిన ఊహలు. ప్రచారం చేసిన విశ్వాసాలు. మృతుల స్వర్గాల కంటె జీవించి వున్న మానవుల శాంతి సౌఖ్యాలు ఎక్కువ ప్రధానం కాదా?

జీవించి వున్న మానవులలో హెచ్చుతగ్గులను తొలగించి, అగ్ర అంత్య భేదాలను నిర్మూలించి, అందరూ సమంగా, ఉమ్మడిగా, అన్యోన్యంగా బ్రతికే అవకాశాల కోసం కృషి సల్పడమే ఈనాటి ప్రధాన మానవ సేవ. ఆ విషయంలో ఈ ఆధునిక కాలంలో ఉత్తమోత్తమ కృషి సల్పినవాడు ఒక్క అంబేద్కరే. అందుకే అంబేద్కరు జీవితం నా కవితాత్మను ఆకర్షించ గలిగింది.

అంబేద్కరు భారత దేశానికి, ప్రధానంగా హిందూ జాతికి చేసిన సేవ అపార మైనట్టిది, అపూర్వ మైనట్టిది, అద్వితీయ మైనట్టిది.

అస్పృశ్యత బ్రతికి వుంటే హిందూ సమాజం చచ్చిపోతుందని గాంధీజీ పేర్కొన్నాడు. హరిజనులు ఏ పరిస్థితుల లోనూ హిందూ సమాజం నుంచి బైటికి పోగూడదన్నాడు. ఈ రెండు విషయాలలోనూ కూడా అంబేద్కరు విభేదించినవాడు కాదు. హిందూ సమాజం నుంచి అస్పృశ్యత పోయి తీరాలి. అందుకు కులవ్యవస్థ నిర్మూలించబడాలి.

హరిజనులు హిందూ సమాజ పరిధిలో వుండలేకపోతే, బౌద్ధులుగా మారాలి. మరే మతంలోనూ చేరగూడదు.

హక్కులు తమంతట తాము రావు. పోరాడి సాధించుకోవలసి నట్టివి. అందుకే ప్రజలను మేల్కొలపండి, సంఘటిత పరచండి, అధికార హక్కుల కోసం పోరాడండి అంటూ ఉద్బోధించా డాయన. అదే అంబేద్కరిజంగా అనుసరించ బడాలనేది నా లక్ష్యం. ఇందుకోసం ఇదివరలో పద్యాలలోనూ, వచనంలోనూ కూడా గ్రంథాలు వ్రాశాను. అదే విషయాన్ని ఇప్పుడు పాటలలో వ్రాస్తున్నాను.

ఈ దేశానికీ, ఈ జాతికీ అంబేద్కరిజమే తరణోపాయం అనేది నా దర్శనం. అంబేద్కరిజానికీ, మతానికీ సంబంధం వుండకూడదు.

ఆచరణలో ఒక వ్యక్తి ఏ మతం వాడైనా కావచ్చు. హిందువుడో, క్రైస్తవుడో, మహమ్మ దీయుడో, బౌద్ధుడో – ఏ మతానికి చెందినవాడైనా కావచ్చు. ప్రతి మానవుడికీ ఆర్థిక సమానత్వం, సాంఘిక న్యాయం, ఉన్నత విద్యావకాశం, అధికార పదవి లభించే

వీలు కలగాలి. అట్టి వీలును పునాదిగా తీసుకొని సర్వమానవ సంక్షేమ సాధాన్ని నిర్మించడానికి నిస్వార్థంగా, నిరంతరాయంగా పాటుపడడం అంబేడ్కరిజం.

ఈ దేశంలో అంబేడ్కరిజానికి తప్ప మరొక ఇజానికి స్థానం లేదు. ఇది నా భవిష్య ద్దర్శనం.

ప్రపంచంలో ప్రతి మతం వాడూ తన మతాన్ని నిస్సంకోచంగా చెప్పుకొంటాడు. ఒక్క హిందువుడు మాత్రమే తాను హిందువుడుగా చెప్పుకోవడానికి సిగ్గుపడతాడు. భయ పడతాడు. అది ఇన్ఫీరియారిటీ మనస్తత్వం. శిథిల వ్యవస్థకు సూచన.

ఏ దృష్టితో చూసినా – అస్పృశ్యతా, కుల వ్యవస్థా వంటి నడమంత్రపు లోపాలు తప్పితే – సనాతన భారతీయ సంస్కృతిని మించిన ఉత్తమ సంస్కృతి ప్రపంచంలో మరెక్కడా లేదు. అంబేడ్కరు భారతీయమ్మైన బౌద్ధ మతంలో చేరడంలోనే ఈ దృక్పథం కనిపిస్తుంది. ఇప్పటికైనా ఆయన సూచించిన పద్ధతిలో దేశం మొత్తానికి ఒకే కామన్ సివిల్ కోడ్‌ను రూపొందించకపోతే, ఈనాటి కష్టాల నుంచి దేశం గట్టెక్కలేదు.

స్వతంత్ర భారతదేశ పరిపాలనా వ్యవస్థ మతాతీత మైనట్టిదిగా ప్రకటించబడింది కదా, మతాతీత రాజ్యంలో మతాలకు స్థానం ఎక్కడిది? మైనారిటీ మతమనీ, మెజారిటీ మతమనీ ప్రత్యేకంగా వుండవచ్చునా? వుంటే, అది మతాతీత రాజ్యం ఎలా అవుతుంది?

మత ప్రమేయం లేకుండా ప్రతి పౌరుడూ దేశ పౌరుడై, సమాన హక్కులు కలిగి జీవించడమే మతాతీత రాజ్య పౌరసత్వం. ఈ రకమ్మైన వాస్తవమ్మైన సెక్యులరిజం దేశంలో నెలకొల్ప బడవలసి వుంది. మెజారిటీ శాసనాలకు ప్రతి పౌరుడూ తల ఒగ్గవలసి వుంది. అటువంటి వ్యవస్థను నెలకొల్ప వలసిందిగా చివరగా కోరినవాడు అంబేడ్కరు. ఆయన ఆకాంక్ష ఫలించాలి. దేశం ఏకజాతిగా సర్వజన భద్రం కావాలి.

ఇక్కడ నే నొక విషయాన్ని స్పష్టం చేయవలసి వుంది–

షెడ్యూల్డు కులాలను హరిజనులు అనీ, షెడ్యూల్డు తెగలను గిరిజనులు అనీ పిలవడం నాకు అలవాటు. నాకు ఇష్టం. అయితే, షెడ్యూల్డు కులాలను, అంటే

అంటరాని వాళ్ళుగా సవర్ణ హిందువుల చేత పరిగణించబడుతున్న కులాలను, అంబేడ్కరు "broken people" అన్నాడు. "Broken" అనే మాటను విడిపోయిన, తెగిపోయిన, వేరు పడిపోయిన, వెనకబడిపోయిన అనే విధంగా తెలుగులో అనవచ్చు. సంస్కృతంలో ''దళిత'' అనే పదానికి పడిపోయిన, రాలిపోయిన, పతనమైపోయిన అనేవి సరైన అర్థాలు. నా దృష్టిలో 'broken' అనే మాటకు 'దళిత' అనే మాట సిసలైన అర్థం కాదు. మరి దళిత అనే పదం ఎందుకు ఎవరి చేత ప్రచారం లోకి తేబడిందో తెలీదు. అయితే అది ప్రచారంలోకి తేబడింది కనుక, అంగీకరించక తప్పని సరి పరిస్థితి ఏర్పడింది. అయితే, "broken people" అన్నప్పుడు దళిత' జనం అనవలసి వుంటుంది. వట్టి 'దళితులు' అనడం సరికాదు.

మరి, broken people అనే రెండు మాటలకూ కలిపి 'దళితులు' అనే ఒక్క మాటను వాడడమే ఈనాడు పరిపాటి అయింది. దీనితో సమాధానపడడం ఎలా? సమాధానపడ్డాను. ఎలా అంటే – వైదిక భారతీయులను ''హిందువులు'' అనడం ఎలాగో, అలాగే.

'హిందూ' అనేది భారతీయ పదం కాదు. అదొక విదేశీ పదం. దానికి మంచి అర్థాలు లేవు. అయినా అది ప్రచారం లోకి వచ్చింది. ఎంతటి సనాతన వేద పండితుడైనా ఆ మ్లేచ్ఛ పదాన్ని వాడక తప్పడం లేదు. మొత్తం పవిత్ర భారతజాతినే హిందూ జాతి అంటున్నాం కదా! అలాగే broken people ని దళితులు అనడంలో తప్పేముంది? అందరూ అంటున్నారు కనుక నేనూ అంటున్నాను.

అయితే దళితులు శాశ్వతంగా దళితులు గానే వుండకూడదనీ, వాళ్ళు ప్రస్తుతానికి దళిత జనులుగా వున్నా, సవర్ణ హిందువులతో సమాన స్థాయికి ఎదిగి హరిజనులుగా విశ్వ మానవులు కావాలనీ కోరుకుంటున్నాను.

హిందూ సమాజం నుంచి కుల వ్యవస్థ పూర్తిగా నిర్మూలించ బడాలని అంబేడ్కరు ప్రకటించిన లక్ష్యం ఎంత కాలానికి సఫల మవుతుందో తెలీదు. అంత వరకూ ప్రపంచ మానవు లలో వర్గాలున్నట్టే భారతీయ హైందవులలో కులాలూ

వుంటాయి. నా దృష్టిలో కులానికి ప్రాధాన్యం లేదు. కులం వున్నా కుల తత్వం లేకుండా వుండాలి. అన్ని కులాలూ సమానత్వ ప్రాతిపదిక మీదే బ్రతకాలి. హిందూ సమాజంలో బ్రాహ్మణుడికి ఎలాంటి గౌరవ మర్యాద లున్నాయో హరిజనుడికి కూడా అలాంటి గౌరవ మర్యాదలే వుండాలి.

హిందూత్వం అంటే 'ఇండియనిజం' (Indianism) ఒక సంపూర్ణ జాతిగా వికసించాలి. ఏ రంగం లోనూ, ఏ దేశ మానవుల కంటేనూ హైందవులు లొసుగు (Inferior)గా వుండకూడదు. తొడగొట్టి సవాలు చేయగల పూర్ణ మానవులుగా మూర్తీభవించాలి.

ఇంత గొప్ప ఆశతో నేను ఈ అంబేడ్కరు పాటలను సృష్టించి ప్రకటిస్తున్నాను.

"It is foolish to suppose that in the event of our conversion to Islam everybody from amongst us would be a Nawab, or would become the Pope if we went over to Christianity."

(మనం ఇస్లాం మతం లోకి మారితే ఏదో నవాబుల మైపోతామనో, క్రైస్తవ మతం లోకి మారితే పోప్‌ల మైపోతామనో అనుకొంటే, అది మన తెలివి తక్కువతనమే అవుతుంది.)

హిందూ మతంలో ఇక కొనసాగగూడదనే నిర్ణయం తీసుకొన్న తరువాత అన్ని మతాల గురించీ క్షుణ్ణంగా పరిశీలించి డా. అంబేడ్కర్ చెప్పిన మాట లివి. ఏ మతమూ ఆచరణలో దళితుల్ని ఉద్ధరించజాలదనే నిర్ణయానికి వచ్చాడాయన.

నిజానికి ఆయన హిందూ మతాన్ని వదిలేయా లనుకోవడానికి ప్రధాన కారణం ఏమిటి? ప్రధాన కారణం కులవ్యవస్థ కాదు. అది మొత్తం హిందువులకు సంబంధించి నట్టిది. ఆయన ఒక హిందూ మేధావిగా, హిందూ సమాజాన్ని సంస్కరించి, హిందూత్వాన్ని ఏక జాతిగా రూపొందించా లనుకొన్న సంస్కర్తగా ఆ రోజులలో చేసిన ప్రతిపాదన ''కుల నిర్మూలన''.

అయితే, ఏ దళిత వర్గానికి ఆయన నాయకత్వం వహిస్తున్నాడో, ఆ దళిత వర్గానికి సంబంధించిన సమస్య అస్పృశ్యత. అస్పృశ్యత పూర్తిగా తొలగిపోయి,

దళితులు శూద్ర కులాల స్థాయిలో అయినా బ్రతక గలిగితే, అంబేడ్కరును బాధిస్తున్న సమస్య తీరిపోయేదే. కాగా అంబేడ్కరు మతం మార్చాలనే నిర్ణయానికి రావడం హిందూ సమాజం నుంచి అస్పృశ్యత ఇంతలో తొలగిపోదన్న నిరాశతో మాత్రమే అనుకోవాలి.

హిందూ సమాజం నుంచి అస్పృశ్యత తొలగి పోతుందేమో అనే ఆశతో ఆయన "హిందువుగా చావను" అని శపథం చేసిన తరువాత 21 సంవత్సరాల పాటు హిందువుడు గానే వుంటూ వేచి చూశాడు. ఇక లాభం లేదనుకొన్న తర్వాతనే మతం మార్పిడిని ఆచరణలో పెట్టాడు.

హిందూ మతంలో ఎన్ని మూఢ విశ్వాసాలు, కుల సంక్షోభాలు ఉన్నప్పటికీ ఆ ఇరవై ఒక్క సంవత్సరాల వ్యవధి లోనూ అస్పృశ్యత రూపుమాసి పోయి ఉన్నట్లైతే, అంబేడ్కరు హిందూమతం నుంచి వైదొలగిపోయేవాడు కాడనే నా దృఢ విశ్వాసం.

అంబేడ్కరు మతం మారుస్తానని ప్రకటించినప్పుడు, ప్రపంచం లోని అన్ని ముఖ్య మతాలూ తమ మతం లోకి మారవలసిందిగా ఆయన వెంటపడినై. అన్ని మతాల, మత సమాజాల మంచి చెడ్డలను గురించీ ఆయన క్షుణ్ణంగా పరిశీలించాడు. చివరకు బౌద్ధ మతాన్ని ఎన్నుకొన్నాడు. అత్యాధునికమైన మార్క్సిజం కంటె కూడా బుద్ధిజం ఉత్తమోత్తమ మైనట్టిదిగా ఆయన అనేక కోణాల నుంచి పరిశీలించి ధృవపరిచాడు.

అంబేడ్కరు మతం మార్చడానికి మరీ తొందర పడలేదనే వాస్తవాన్ని మనం గుర్తించాలి. సుమారు పాతిక సంవత్సరాలు ఆయన తన నిర్ణయాన్ని పరిశీలనలో పెట్టి వుంచాడు. అది తక్కువ కాలమేమీ కాదు. దానిపై కూలంకష పరిశోధన జరిగిం దన్నమాట.

ఆయన తన ఆలోచనను అలానే మరికొంత కాలం వాయిదా వేస్తే బాగుండేది కాదా అనే ఆలోచన నాకు వచ్చింది. బాగుండేది కాదనే నాకు తట్టింది. ఎందుకంటే స్వతంత్ర భారతదేశం లోని సామాజిక పరిస్థితి, ముఖ్యంగా కులభేదాలు బ్రిటీషు

పాలనలో కంటే దిగజారి పోయాయి. అనైక్యత ప్రబలిపోతూ వుంది. సవర్ణ కులాలే తమలో తాము కొట్టుకు చస్తున్న ప్పుడు, అవర్ణులైన దళితుల యోగక్షేమాలను చూసే దెవరు?

వాళ్ళ అసహాయతను, దిక్కు లేనితనాన్ని, పేదరికాన్ని, అవజ్ఞతను ఆసరాగా తీసుకొని ఇతర మతాలు, ముఖ్యంగా డాలర్ల ధన రాశులతో మత్తెక్కిపోయి వున్న హిందూ వ్యతిరేక మతాలు తన దళిత వర్గాలను కొని వెయ్యగలవనే భయం అంబేడ్కరును బాధించిం దనవచ్చు. అలా జరగగూడదనేది అంబేడ్కరు ఆకాంక్ష. తన కారణంగా తన ప్రజలు పరమతాల పాలు కాగూడదు. తన కారణంగా హిందూ జాతి దెబ్బ తినగూడదు.

హిందూ మూఢాచారాలను తాను ఎంత అసహ్యించుకొంటున్నాడో, అంతగా వైదిక భారతీయతను ఆయన గౌరవిస్తున్నాడనే నా నమ్మకం. పైగా, తన ఆరోగ్యం కూడా బాగుండడం లేదు. తాను జీవించి వుండగానే ఒక నిర్ణయం తీసుకొనకపోతే, ఏ దీనుల కోసం తన జీవిత మంతా అంకితం చేశాడో ఆ దీనులు దిక్కు లేనివారై పోతారు. పొంచి వున్న పర మతాలు వాళ్ళను బహువిధాలా చీల్చి పారేస్తాయి. తమ జాతి శ్రేయస్సును గూర్చి అసలు పట్టించుకోని హిందూ కులతత్వ మూర్ఖులు జడులై వుండిపోతారు.

అంబేడ్కరు తాను బౌద్ధ మతాన్ని స్వీకరించడంలో దళిత జనాలకూ, హిందుజాతికీ, భారతదేశానికీ ఎంతటి ప్రమాదాన్ని తప్పించాడో ఆలోచించే కొలదీ అద్భుతం అనిపించడం లేదా?

అంబేడ్కరు వ్యక్తి పూజ (Hero Worship)ను నిరసించాడు. వీర పూజను కాదు. ఈనాడు మనకు వీరులు లేరు. హీరోలు వున్నారు. ఈనాటి రాజకీయ రంగంలో హీరోలు అంటే రౌడీలూ, గూండాలు మాత్రమే. కోట్లకు పడగ లెత్తడం వంటిదే వోట్లకు పడగ లెత్తడం. వోటు బ్యాంకులు అంటే అదే. వోట్లు వేస్తున్నది ప్రజలు కాదు. ప్రజల వోట్లను ముఠా నాయకులు తమకు తామే గుద్దేసుకొంటున్నారు (రిగ్గింగ్).

సినిమా హీరోల గురించి మనందరకూ తెలుసు. హీరో వర్షిప్ వద్దు అని అంబేడ్కరు అన్నాడంటే ఈ రకమైన హీరో లను పూజించవద్దని. రణడే, ఫూలే వంటి మహనీయులను ఆదర్శంగా స్వీకరించి గౌరవించ డంలో తప్పు లేదన్నాడాయన.

## అంకితం గురించి

నా అంకితాల చరిత్రలు నాటకీయంగా వుంటై. అందులో కామెడీలూ, ట్రాజెడీలూ కూడా వున్నై. అంటే అంకితాలు పొందిన వారిలో నన్ను సదా అభిమానిస్తున్న వాళ్ళూ వున్నారు. నన్ను ఏ విధం గానూ గుర్తు పెట్టుకోని వాళ్ళూ వున్నారు. అపకారాలు చేసిన వాళ్ళూ వున్నారు. అసలు ఈ లోకమే మంచి చెడ్డల మిశ్రమం. విచారించ వలసిందేమీ లేదు.

మరణించిన వారికి అంకిత మిచ్చిన ఉదంతాలు మూడు. సోదరి ఆదిలక్ష్మికి ''చిత్రకళా ప్రదర్శనం'', డా. అంబేడ్కరుకు ''ధర్మం కోసం పోరాటం'', మా అమ్మ నాన్నలకు ''గీతా భాష్యం''.

''చిత్రకళా ప్రదర్శనం'' పది నాటికల సంపుటి. 1963లో అది ముద్రణలో వుండగా సోదరి ఆదిలక్ష్మి మరణించిన వార్తను పత్రికలలో చూశాను. దుఃఖించాను. ఆమె ఒక బ్రాహ్మణ విదుషీమణి. మద్రాసు యూనివర్సిటీలో విద్యారత్న డా. నిడదవోలు వెంకటరావుగారి గైడెన్సులో ఎమ్.లిట్ చేసింది. నన్ను సోదరుడిగా స్వీకరించింది. సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత డి.ఆంజనేయులు గారిని వివాహ మాడింది. రష్యాకు తెలుగు ప్రొఫెసరుగా వెళ్ళింది. అక్కడ ఆమె బాలింతగా మరణించిం దన్న వార్త హృదయాన్ని భేదించగా, అప్పుడు ముద్రణలో వున్న గ్రంథాన్ని ఆమెకు అంకితంగా ప్రకటించాను.

మళ్ళీ 28 వత్సరాల తర్వాత, 1991లో ఇప్పుడు అదే విధమైన సంఘటన జరిగింది.

అంబేడ్కరును, ఆయన జీవితాన్ని, సందేశాన్ని వస్తువుగా గ్రహించి పాటలు వ్రాస్తూ, ఈ పాటల గ్రంథాన్ని ఎవరికి అంకిత మివ్వాలా అని ఆలోచిస్తూ వున్నాను.

నూరు పాటలు వ్రాసి ఆయన శత జయంతి ఉత్సవాలకు కానుకగా అర్పిద్దామను కొన్నాను. భారతీయ చరిత్రలో అంబేడ్కరు శత జయంతికి ఎంత జాతీయ ప్రాముఖ్యం వున్నదో, నా అభిమాన పాత్రుడైన అంతటి గొప్ప వ్యక్తికే ఈ విశిష్ట గేయ సంపుటిని అంకిత మిద్దామనుకొన్నాను. మనస్సు అన్వేషణలో పడింది. నలుగురైదుగురు మనీషులు ఊహ కందారు కూడా.

అట్టి తరుణంలో అర్ధరాత్రి సమయంలో "నేను లేనా?" అంటూ ముందుకు తోసుకువచ్చి మనోరంగంపై నిలిచా డొక యువ మిత్రుడు, ప్రాణ సమానుడు.

"నీకా?" అన్నది నా మనస్సు.

"అవును! నాకే! ఏం? నేను పనికిరానా?" అన్నా డతడు.

అతడు బొజ్జా కృష్ణశాస్త్రి.

నా ఆలోచన విపరీతంగా వుంది. కృష్ణశాస్త్రి నాకు అత్యంత ఆత్మీయుడు కావడం నిజమే. అతడికి నా కావ్యాలలో ఒకదానిని, స్వచ్ఛమైన కవితను అంకిత మివ్వడం కూడా ఖాయమే. అయితే, అది మరెప్పుడో తరువాత జరగవలసిన పని. నా దృష్టిలో అతడింకా కుర్రవాడు. నాతో ఆడుతూ, పాడుతూ, తాగుతూ, తిట్టుకొంటూ, కొట్టుకొంటూ వుంటున్న అల్లరి పిల్లవాడు. అట్టివాడికి ఇప్పుడు ఇంతటి గేయ సంపుటిని అంకిత మివ్వడం అనే ఆలోచనే రాకూడనిది, ఎందుకు వచ్చింది?

ఎందుకు వచ్చిందో ఆ విషాద హేతువు ఆ మరునాడు తెలిసింది, అతడిక భౌతికంగా లేడని! విశాఖలో ఆ ముందు రాత్రే స్కూటర్ ఆక్సిడెంటులో పోయాడని!

## బాలసరస్వతి బొజ్జా కృష్ణశాస్త్రి

"గుండె నెవరో ఉండి ఉండి
పండు వెన్నెల కాతురు,
పండు వెన్నెల పరుపు మీద
పారిజాతము లుంతురు" (రాఖీలు)

ఒక రోజున ఈ పాటను లోలోపలే గొణుగుకొంటూ వచ్చిన శాస్త్రి నా ముందు నిలబడి అన్నాడు, ''నువ్వు వాడిలాగే పరమ దుర్మార్గుడివి'' అని!

''ఎవడి లాగ?''

''అదే, దేవులపల్లి కృష్ణశాస్త్రి అని ఒక డుండే వాడులే. ఆయనగారు కూడా పాటలు గొప్పగానే వ్రాస్తారు. ట్యూనుకు మాత్రం కుదరవు. ఇది చూడు 'గుండె నెవరో వుండి వుండి' ఎంత మంచి పాటో! కాని చచ్చినా ట్యూను కుదరడం లేదు. నాకే కాదు, ఇక్క డెవ్వరికీ కుదరడం లేదు.''

మేమిద్దరమూ కలుసు కొన్నప్పుడెల్లా మా మధ్య నడిచే తతంగం ఇలా వుండేది. నన్ను ''ఒరే'' అనేవాడు. ఆనాడు కళా వెంకట్రావుగారి తరువాత ఈనాడు బొజ్జా కృష్ణశాస్త్రి ప్రేమనూ, గౌరవాన్నీ, భక్తినీ కూడా వ్యక్తం చేసే పద్ధతి ఇది. 'ఒరే, గిరే' అంటూ తిట్టడం, విమర్శించడం. ఇది చాలా కాలం నాటి మాట.

పాటలు వ్రాయడంలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిని మించిన వాళ్ళు మరిలే రనవచ్చు. ఆయన తన పాటలకు తానే ట్యూను కట్టుకొని తానే పాడేవాడు. సీతా అనసూయల చేత పాడించేవాడు. ఆ సమావేశాలు నాద బ్రహ్మ దర్బారులుగా ఆనందమయంగా వుండేవి. ఆయన పాటలకు ట్యూను కట్టగల సంగీతవేత్తలు ఈనాడు లేకపోతే, ఆయనదా తప్పు?

ఇక్కడ నుంచి నేను శాస్త్రి అనేది బొజ్జా కృష్ణశాస్త్రిని గురించే. శాస్త్రి నాకంటే పాతికేళ్ళు చిన్నవాడు. అయినా, నా సమక్షంలో నాకంటే చాలా పెద్దవాడుగా ప్రవర్తించే వాడు. నన్ను నఖ ముఖ పర్యంతం పరిశీలించేవాడు. ప్రతిసారీ అదే పరిశీలన. అదే వంకలు పెట్టడం. రకరకాల పోలికలు తేవడం. నాతో సమానంగా కాదు, ఎక్కువగానే తాగేవాడు. ఏవేవో కవితలు ఉదహరించేవాడు. ఎందరెందరి కావ్యాల నుంచో, నా కావ్యాల నుంచి కూడా. నేనేనాడో వ్రాసి మరచిపోయిన కవితా పంక్తులను తాను ఉదహరిస్తూ వుంటే ఎంతో ఆశ్చర్యపోయేవాడిని. ఇంకా ఎక్కువగా తాగేవాళ్ళం. ఒక స్థితిలో చక్కని ట్యూన్స్‌తో పాడేవాడు.

''నీవు సొంతంగా వ్రాయకపోతే మానే, ఇన్నిన్ని కవితలను నీవు ఉదాహరిస్తున్నావు కదా! వీటన్నిటినీ వ్రాసిపెట్టు. నోటికి వచ్చిన వాటినే వ్రాయి. ఒక మంచి కవితా సంకలనం నీ పేర ప్రకటిద్దాం'' అంటూ ప్రతిసారీ సలహా చెప్పేవాడిని. ''వ్రాయడం నా వల్లకాదు'' అనేవాడు.

వ్రాసే అలవాటు శాస్త్రికి లేదు. ఉత్తరాలు వ్రాసే అలవాటు కూడా లేదు. తప్పనిసరి అయితే తంతి ఇచ్చేవాడు. తనలో గూడు కట్టుకొన్న సంగీత సాహిత్య సరస్వతి తనతోనే గూడు వదిలి పోయిందనవచ్చు. మనకు మిగిల్చిందేమీ వుండి వుండదు. ఈనాటి వాళ్ళు అందుకు అర్హులు కాదనుకొన్నదో యేమో!

శాస్త్రి ఆపాద మస్తకం ఒక సంగీత సాహిత్యాల సంపుటి. తాకితే తీగలా కదిలేవాడు. కదిపితే కవితలే వాగేవాడు. ఆప్యాయత అనే మాటకు మూర్తీభావం బొజ్జా కృష్ణశాస్త్రి. అనేక సందర్భాలలో, సన్నివేశాలలో అతడిచ్చిన భావావేశాలే పాటలుగా మ్రోగాయి నా నోట. 'మణి మానసం' కావ్యానికి కేంద్ర వస్తువు శాస్త్రి ఇచ్చిందే. 'రాభీ' పాటలను తాను ఎంతగా మెచ్చు కొన్నాడంటే, తన మూడవ కూతురు పేరు 'రాభీ' అనే పెట్టుకొన్నాడు. ఒకసారి అన్నాడు, ''నిన్నెప్పుడూ తిట్టాలని వుంటుంది. అందుకే నా కూతురికి ఆ పేరు పెట్టాను'' అని. నా కావ్యాలలో ''మధుబాల'' పేరును మా సోదరి సరస్వతి తన కూతురికి పెట్టుకొంది.

ఆకాశవాణిలో అధికారి అయిన శాస్త్రి తాను ఏ శాఖలో వున్నా, ఏ స్టేషనులో వున్నా ఆ ప్రాంతంలోని గాయకుల చేత 'రాభీ'లలోని అనేక గేయాలను లలిత సంగీత కార్యక్రమాలలో పాడించాడు. అలాంటి కొన్ని పాటలను ఒక కాసెట్‌లోకి ఎక్కించి 1990 సెప్టెంబరు 19న విశాఖలో జరిగిన నా 80వ జన్మదినోత్సవ సందర్భంలో ఆ కాసెట్టును నాకు బహూకరించాడు.

''పని చేసే ప్రతి మనిషీ పారిజాత సుమమేనే'' అనే నా ''పైరు పాట''లోని వాక్యాన్ని తీసుకొని ఆ పేరుతో ఆకాశవాణి కార్మికుల కార్యక్రమంలో ఒక శీర్షికను నిర్వహించడానికి సిద్ధపడుతూ వున్నాడట. ఆ తరువాత తెలిసింది నాకా విషయం. కన్నీటిలో కలిసి కొట్టుకు పోయిందది.

భూలోక నందనంగా ప్రసిద్ధి కెక్కిన కోనసీమ లోని కందికుప్ప గ్రామం శాస్త్రి స్వస్థలం. ప్రసిద్ధ హరిజన నాయకుడుగా, అంబేడ్కరు అనుయాయిగా, శాసన సభ్యుడిగా కీర్తి గడించిన బొజ్జా అప్పలస్వామిగారి పెద్ద కొడుకు. సుప్రసిద్ధ దళిత జనోద్యమ నాయకుడు బొజ్జా తారకం గారి అన్న. మా కుటుంబానికి అనురాగ సర్వస్వం, ఆత్మీయుడు బొజ్జా కృష్ణశాస్త్రి.

బ్రహ్మ సమాజంలో పుట్టి పెరిగిన అప్పల స్వామిగారు ఆ మతానికి ఆస్థాన కవి వంటి వాడైన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పేరును తన పెద్ద కొడుక్కి పెట్టుకొన్నారు. సారస్వత పరంగా సంగీత సాహిత్య సారాంశంగా ఎదిగిన వాడు ఈ బొజ్జా కృష్ణశాస్త్రి.

అట్టి కృష్ణశాస్త్రికి, "ఓ కవీ, కవి గనుక రవీ, నా ఎదలో మెదిలే దివీ" అంటూ 1959 నాటి అఖిల భారత తెలుగు రచయితల మహాసభలో తొలిసారిగా నన్ను చూచి, కౌగలించుకొని ఆనందబాష్పాలు రాల్చిన కృష్ణశాస్త్రికి, 1967 ప్రాంతంలో దామోదరం సంజీవయ్య గారి పార్లమెంటు ఎన్నికల కోసం కర్నూలు జిల్లాలో నాకు తోడుగా పర్యటించిన కృష్ణశాస్త్రికి ఈ గేయ కావ్య సంపుటిని అంకితం చేస్తున్నాను - ఆనంద బాష్పాలతో కాదు, ఆరని ఆర్తి అశ్రువులతో.

1991 జులై 1వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో విశాఖలో స్కూటర్ ప్రమాదంలో ఆకస్మికంగా శాస్త్రి పోవడం - అదే రాత్రి 12-1 గం. ప్రాంతంలో నేను అంకితం గురించి ఆలోచిస్తూ ఈ పీఠిక వ్రాసుకొంటున్నప్పుడు తన గురించిన ఆలోచన రావడం నన్ను చాలా ఆశ్చర్య చకితుణ్ని చేసింది. ఇలాంటి అనుభవాలే గతంలో నాకు కొన్ని వున్నై. మా అమ్మ పోయినప్పుడు కూడా నాకు ఇలాగే జరిగింది.

శరీరం పోతే దానితో పాటు ఆత్మ కూడా పోతుందనీ, అది పరమాత్మలో కలిసిపోతుం దనీ సిద్ధాంతం చేసుకొన్న నాకు, ఇలాంటి అనుభవాలు మనస్సే పరమాత్మ అనే విషయంలో పరిశోధిస్తూ ఇంకా కొంచెం ముందుకు పోయే అవకాశం కలిగిస్తున్నై.

ఈ సందర్భంలో శాస్త్రి తల్లిదండ్రులు బొజ్జా మావుళ్ళమ్మ అప్పలస్వామిగార్లు, భార్య రాజేశ్వరి, సంతానం మమత, పావని, రాభీ, రోహిత్‌లు, చెల్లెలు ఝాన్సీ, బావ

వెంకటేశ్వర్లు, తమ్ముడు తారకం, మరదలు డా. విజయభారతి – వీరందరి దుఃఖం లోనూ మా కుటుంబం కూడా పాలు పంచుకుంది.

శాస్త్రి ఒక మధు ఫలం. తాను ఎక్కడుంటే అక్కడ ఎంతో మంది మిత్రులు స్నేహ రసాస్వాదన చేస్తూ చుట్టూ మూగి వుండేవాళ్ళు. ఎంతో మందికి సహాయం చేసేవాడు. సలహా లిచ్చేవాడు. ఆకాశవాణిలో సంగీత సాహిత్య కార్యక్రమాలకు అవకాశాలు కల్పించేవాడు. విశాఖలోని సంగీత సాహిత్య సరస్వతులైన అంధ సోదరీమణులు సత్యవాడ సిస్టర్స్‌ను ప్రోత్సహించిన పద్ధతి చూస్తే శాస్త్రి ఒక దివ్యమూర్తి అనిపించక తప్పదు.

– బోయి భీమన్న

# జయ జయ జయ

జయ జయ జయ అంబేద్కర !
జయ దళిత జన స్వరా !
జయ మానవ మందారా !
జయ భారత భాస్కరా !

నవ భారత సంవిధాన
ధర్మ పథక నిర్మాతా !
భువి సమస్త పీడిత జన
దుఃఖశాంతి తథాగతా !

వేదాలను శోధించి
వేదాంతము నధిగమించి
మనిషి మనిషిగా బ్రతుకుటె
మహిత మన్న మహాశయా ॥

అస్పృశ్యత రూపుమాపి
అగ్ర అంత్య భేద ముడిపి !
నిష్కల భారత జాతికి
నీడయైన బోధిప్రియ ॥

జాతీయ సమైక్యానికి
మతాతీత రాజ్యానికి
ప్రజాస్వామ్య ధర్మానికి
ప్రాణమైన సంఘర్షీ ॥

జగతికి స్వేచ్ఛా సమతా
సౌభ్రాత్రములను కూర్పగ
జన్మ మెల్ల పోరాడిన
జనగణ విప్లవ యోద్ధా ॥

అంధకారమున పుట్టి
అవనికి దీపము పెట్టి
పంకమును మథించి మహికి
పరిమళ మొసగిన సూరీ ॥

రాళ్ళకు జీవము పోసి
మోళ్ళను చిగురింప జేసి,
మట్టి నుండి మానవులను
మలచిన కారణజన్మా ॥

## 2. అంబేడ్కరా, నీవు

అంబేడ్కరా, నీవు అవతరించిన నూరు
వత్సరాలకు వచ్చె నవకాంతి !
ఏమిటా కాంతి ? ఏమా నవోదయం ?
అందర కొకే న్యాయ మన్న జ్ఞానోదయం !

న్యాయ మన నేమి ? మానవు లందరును సమా
నముగ బ్రతికే జన్మహక్కు !
జన్మహ క్కన నేమి ? శాంతి సౌఖ్యము లంద
రకు పంచి యిడు వేద బుక్కు !

దేశమున కొక జాతి, జాతి కొకటే నీతి,
నీతి అందరి కొక్కటే ;
ఒకడి కొక నీతి, మరియొకడికి మరొక నీతి
తగ దన్న మేధావి మేటీ !

ఏక భారత పూర్ణ జాతిని అ
నేక వర్ణాలుగా చీల్చి
వర్ణమున కొక న్యాయమని, న్యాయమును కూడ
వ్రయ్యలుగ జేసి రానాటి దుశ్శాసకులు !

నవ్య భారత రాజ్య రాజ్యాంగమును వ్రాసి,
న్యాయ దేవత నుద్ధరించిన సువీరా !
సాంఘిక న్యాయమే న్యాయమని చెప్పి, వి
శ్వ శ్రేయసుడవైన అంబేద్కరా !

కుల మతమ్ముల భేదములు వద్దు, దేశ పౌ
రుల కెల్ల న్యాయ మొకటే అంటివి !
అందర కొకే న్యాయ మమలు పరచుటె బాధ
లన్నిటికి దివ్యౌషధ మ్మంటివి !

దళితులకు, బడుగు వర్గాలకే కాదు
మహిళలకు కూడ న్యాయము పంచి ఇచ్చితివి !
ఆధునిక ధర్మ స్వరూపా ! నవ భార
తాభ్యుదయ జాతి ప్రదీపా !

## 3. పాడుకొందు నీ

పాడుకొందు నీ సాహస విజయాలను
పరవశింతు నీ లక్ష్య పదాలను ॥

నీ మూర్తిని ఎదలో దాచుకొని
నీ మూర్తిని కనుల కద్దుకొని
నీ మూర్తిని ఎదుట నిల్పుకొని
నీ మూర్తికి దీపం పెట్టుకొని ॥

గుండ్రబల్ల సభలో నీ
గుండె చీల్చి చూపావు,
పూనా ఒప్పందంలో
పురుషోత్తము డైనావు ॥

నీటి కొరకు, నేల కొరకు
నీటుగ బ్రతుకుట కొరకు
దళిత జనోన్నతి కొరకు
ధర్మాభ్యుదయం కొరకు ॥

## 4. గొంతెత్తి నీ పాట

గొంతెత్తి నీ పాట వినిపింతునా ?
గంతేసి నీ బాట నడిపింతునా ?

భరత భూమికి సుప్ర
భాత మైనావు,
దళిత జాతికి వసం
త స్వామి వైనావు ॥

అంటరాని తనంపు
కంటక వ్యథ లోర్చి,
మా గుండె గాయాలు
మాన్పి రక్షించావు ॥

విజ్ఞాన పథములో
వేగు జుక్కవు నీవు,
అభ్యుదయ యాత్రలో
ఆదర్శ రవి నీవు ॥

## 5. వాల్మీకికి వారసుడా

వాల్మీకికి వారసుడా !
వ్యాసుడి వంశం వాడా !
అభినుతింతు నిను, ధీరా !
అన్నా, అంబేడ్కరా !

భారత రామాయణాలు
ప్రస్థాన త్రయం వంటి
రచనలతో పోల్చదగిన
రాజ్యాంగం నిర్మించిన ॥

జాతిని శిథిలం చేసే
నీతులను నిరోధించి
సర్వుల కొకటే న్యాయం
చట్టబద్ధ మొనరించిన ॥

ప్రాచీన సనాతన భా
రత సంస్కృతి సర్వం ఏ
కైక ప్రతినిధిగా నిను
మా కొసగిన మహనీయుడ ॥

## 6. మనసు నిండా

మనసు నిండా స్వజనమే
మమత నిండ స్వదేశమే !
అమెరికాలో చదివినా
ఆంగ్ల భూమిలో విరిసినా
ఎన్ని రచనలు చేసినా
ఎంత పరిశోధించినా ॥

శూద్రు లెవ రంటివి ! అస్పృ
శ్యులకు గతమే దంటివి !
కుల మతాలకు హేతువైన
కుట్రలను పట్టి చూపితివి ॥

రక్త పరీక్షల ద్వారా
వ్యక్తమైన సత్య మిదే-
బ్రేమ్మడికీ, దళితుడికీ
భేదం లే దంటివి ॥

పాకిస్తాన్ గ్రంథ రచన చేసి
భారత్ కొక లక్ష్య మొసగినావు,
కుల నిర్మూలన గ్రంథం వ్రాసి
కువల యాధిపత్యమె ఇడినావు ॥

స్వతంత్ర భారత మాతను
స్వరాజ్యాంగ రథ నేతను జేసి,
జాతిని సమైక్య పరచిన వీరా !
జయ భీమా, అంబేద్కరా ! ॥

# 7. నమస్తే మహావీర

నమస్తే మహావీర, అంబేడ్కరా !
నమస్తే, నమస్తే, నమస్తే !
నమస్తే ప్రజా నాయ కాగ్రేసరా !
నమస్తే, నమస్తే, నమస్తే ॥

దళిత జాతులలో జనించి, సర్వ
ధర్మ శాస్త్రము లభ్యసించి,
అంత్యాగ్ర జన భేద మన్యాయ మన్నావు
న్యాయ మేదో తెలిపినావు ॥

ఐకమత్యము లేక, అక్షరాస్యత లేక
మేక మందగ నున్న జాతిని
పులి పిల్లలుగ తీర్చి వెలుగు చూపిన ధీర !
పూరుషోత్తమ శక్తి ధారా ॥

## 8. తాక రాకు

తాక రాకు, తాక రాకు
తాక రాకు రా !
　　అంటరాని వాడవురా,
　　ఆ మాత్రం తెలియదురా ?

బడిలో కొత్తగా చేరిన
బడుగా ! దూరం, దూరం !
　　పై కులాల అబ్బాయిల
　　బెంచీ లవి, ముట్టబోకు !

వెలిగా అట కూర్చో, మహా
వేదాలను చదివేవా ?
　　మహా రంటె మహా హరుడా ?
　　అహం బుద్ధ సిద్ధార్థుడ ?

## 9. చదువుతా, చదువుతా

చదువుతా ! చదువుతా ! చదువుతా !
జగతిని గల చదువు లెల్ల చదువుతా !

అంటరాని అ ఆ లను
చదవరాని శాస్త్రాలను
వినగూడని వేదాలను
కనగూడని కావ్యాలను ॥

అంతేనా? ఈ చదువుల
అంతం చూస్తా, నేస్తం !
భారతీయతనె కాదు
ప్రపంచాన్నె చదివేస్తా ॥

నను దూరంగా నెట్టే
నిను దూరంగా తరుముత !
మనుజుని వెలిబెట్టే నీ
దనుజుని నిర్మూలిస్తా ॥

# 10. నిన్ను కొట్టినారా

నిన్ను కొట్టినారా ?
చిన్నారి పనియు తలపక ॥

నోరెండుక పోయి బావి
నీరు చేదుకొన్నావని,
నీరు పోయు వా డొకడే
నిఖి లేశ్వరు డని తెలియక ॥

నీరు, నిప్పు, నేల, గాలి
నింగి ఎల్ల దేవతలుగ
కొలచే హైందవికి వార
సుల మను జ్ఞానము లేక ॥

మనిషిని వెలిబెట్టుట దే
వుని వెలిబెట్టుటే యని
బోధించే ధర్మ శాస్త్ర
ముల నెరుగని కుల మూర్ఖులు ॥

# 11. బాబూ అంబేడ్కరా

బాబూ, అంబేడ్కరా !
బాధపడకురా !
ఎచ్చట కూర్చున్న నేమి
అచ్చర మొకటే కదరా ? ॥

సర్వులు సములై జీవిం
చా లన్నది మన మతము,
మతమును తన స్వార్థానికి
మలిపె నేటి కులతత్వము ॥

రాజస తామస గుణ వా
రసులు నేటి సవర్ణులు,
ఋషివై ఈ దళితుల ర
క్షింతువులే చింతించకు ॥

## 12. నీ నామము

నీ నామము
నిఖిల జనోద్ధారకము ॥

పతిత జనావళిని – పై
పైకెత్తే యంత్రము,
దరిద్ర నారాయణులకు
తారక మంత్రము ॥

అసమత్వం తొలగించే
ఆకలి నిర్మూలించే
సాహస కరవాలము,
సమైక్యతా పటాలము ॥

జాతి దాస్య తమో హరా !
జ్ఞానాంకుర సుధాకరా !
బహుజన సంక్షేమ కరా !
భారత భాస్కరా ॥

## 13. ఐన వాడికి

ఐనవాడికి చింపిరాకు
కాని వాడికి పసిడి రేకు
వేసి వడ్డించు రా
కాసి కాలము వచ్చె -
స్వాతంత్ర్య భారతీ !
సహనావ వతు !

ఎంత కాలం సహన ముందువా ?
చింత ఎన్నడు తీరు నందువా ?
కాల కర్మలు కూడి
కలిసి వచ్చేదాక
ఉద్విగ్న భారతీ !
ఓర్చుకోవమ్మా !

వోట్ల సంతకు నిన్ను తోలేరా ?
నోట్ల కట్లకు అమ్మ జూపేరా ?
పోదురు దురోదరులు
నీదె విజయము తుదకు,
ఆత్మ విద్యకు నీవె మాతవు, విలువ
లన్నిటికి నీవే ప్రదాతవు !

## 14. లేవండి లేవండి

లేవండి, లేవండి అన్నదమ్ముల్లార !
రారండి, రారండి అక్క చెల్లెళ్ళార ॥

అంటరాని తనాన్ని
అంత మొనరిద్దాము,
కుల భేద రాక్షసిని
కూల్చి పారేద్దాము ॥

ఒక దేశ మొక జాతి
ఒక న్యాయ మొక నీతి
అమలు జరిగే దాక
సమర మొనరిద్దాము ॥

మనుషు లెవ రెవరైన
మట్టి ఒకటే నుండీ,
మట్టి మర్యాదకై
మన మందరేకమై ॥

మట్టిలో పుట్టాము
మట్టికై బ్రతికేము,
మన మట్టె మన దేశ
మాతయౌ నుండీ ॥

డబ్బుకో డాబుకో
అధికార పదవికో
దేశమును దోచుకొను
ఆశ పోతుల నణచ ॥

## 15. వదులుకోము

వదులుకోము, వదులుకోము,
మా హక్కులు వదులుకోము !
భూమి పుత్రులము మేము
భీమ సేనులము మేము ॥

అంటరాని తన మింకా
ఉంటే, అది తొలగాలి,
కులతత్వం సమసిపోయి
కలిసి బ్రతకగలగాలి ॥

పిరికితనం వదలాలి
పురుషత్వం ఎదగాలి,
భయం లేని అంబేడ్కరు
బాటసారులం మేము ॥

సమ సమాజ నిర్మాణ
శ్రామికులం మేము,
నవ భారత విజయోత్సవ
నాయకులం మేము ॥

## 16. ఎడ్యుకేట్

ఎడ్యుకేట్, ఆర్గనైజ్, ఏజిటేట్
ఎరుక పరచు, ఏక పరచు, ఎదిరించు
బోధించు, సంఘటించు, పోరాడు
పోరాడక తెగవురా సంకెళ్ళు !
ఎవరా పలికేవారు?
ఇంకెవ్వరు? అంబేడ్కరు ॥

మేకనైతే చంపుకు తింటారు, అదే
సింహమైతె వినయంతో పూజిస్తారు !
మనిషి స్వభావం తెలిసి మసులుకో,
మగటిమితో మును ముందుకు సాగిపో !
ఎవరా పలికేవారు ?
ఇంకెవ్వరు, అంబేడ్కరు !

అడుక్కుంటె దొరికేది ఎంగిలి
అదలిస్తే లభించేది అధికారం,
పదవులలో ఏముంటది మిగిలి?
పవర్ కొరకు పోరాడర, నేస్తం !
ఎవరా పలికేవారు ?
ఇంకెవ్వరు, అంబేడ్కరు !

నీ ఆదర్శమె నీ వ్యక్తిత్వం
నీ గమ్యమె నీ జీవిత విజయం,
పదవుల రంభలను లక్ష్యపెట్టకు !
ప్రజాసేవలో వెనకడుగేయకు !
ఎవరా పలికేవారు ?
ఇంకెవ్వరు, అంబేడ్కరు !

అందరితో సమానంగ బ్రతుకుట నీ హక్కు
హక్కెంతటి చిన్నదైన గాని వదులుకోకు,
ఆత్మ గౌరవం కోసం అసువులైన పోనీ
అవినీతిని నరికేదే అమృత కహాని !
ఎవరా పలికేవారు ?
ఇంకెవ్వరు, అంబేడ్కరు !

# 17. పితరులు

పితరులు భీమా బాయీ, రాంజీ
మీరా బాయీ మేనత్త,
అన్నలు బలరాం, ఆనంద్రావు
అక్కలు మంజుల, లక్ష్మి

మాన్యులు కేలూస్కరు, కేటాస్కరు
విద్యా దాత బరోడా నేత,
ప్రేమ సతులు ఆదర్శ గృహిణులు
రమా బాయి, సబితా

అభిమానులు, మిత్రులు, బాంధవులు
అసంఖ్యాకుల శుభాకాంక్షలతో
ధర్మం కోసం పోరాడితివి !
దళిత జనోద్ధారకుడ వైతివి !

త్రిస్థాయికి నా గొంతు పెంచి కీ
ర్తింతు నిన్ను పాటలతో,
పూర్ణ భారత విరాట్ అవతారా !
పురుషోత్తమ అంబేడ్కరా !

# 18. అంబేడ్కరా నీవు

అంబేడ్కరా, నీవు
అవతరించక పోతె
ఈ మూగ జీవాలు
ఏ నీడ చేరేను ?

అంబేడ్కరా, నీవు
అవతరించక పోతె
మంటి పెల్లల మేము
మణులు కాగలిగేమ ?

అంబేడ్కరా, నీవు
అవతరించక పోతె
ఎద్దులము మే మెట్లు
పెద్ద పులు లయ్యేము ?

అంబేడ్కరా, నీవు
అవతరించక పోతె
మము మేము తెలుసుకొని
మనుషులై బ్రతికేమ ?

# 19. శిష్టు లనీ

శిష్టు లనీ - దుష్టు లనీ
జీవులు రెండే వర్గములు,
శిష్టుల రక్షించుట దైవీయం
దుష్టుల దండించుట కర్తవ్యం

క్రూర జంతువులు దురాక్రమణాకై
గోముఖములతో వస్తారు,
భుజ బలమున్నా లేకున్నా
బుద్ధి బలం నీ కుండా లన్నా !

బ్రతుకుటకై పోరాడక తప్పదు,
బలాధిక్యుడే బ్రతికేను,
సహజ సత్యమిది, సమర కేళిలో
స్వంత శక్తి చూపా లన్నా !

దుష్టుల ద్రుంచి, శిష్టుల బెంచి
కష్ట నష్టముల నధిగమించుచు
మానవతకు మాన్యత కల్పించే
మానవుడే పురుషోత్తము డన్నా !

# 20. తన దన్నది లేనివాడు

తన దన్నది లేనివాడు
మనుజులలో లెక్క కాడు !

ఎంత చిన్నదైనా, అది
గృహ మైనా గుడిసె యైన,
సొంత మైన దేదో వి
శ్రాంతి కొరకు కావలయును !!

మానవ ప్రగతికి స్వేచ్ఛే
మార్గ దర్శి, నేస్తం !
స్వేచ్ఛకు మూలం తన యజ
మాని తానె అను భావం !!

తన సొంతం తన బ్రతుకు
తన ఇష్టం తన కదలిక,
తనకు తానె దేవుడ నను
తలపే పరమానందం !!

# 21. లోకజ్ఞత

లోకజ్ఞత ఎంతున్నా
లోపల వెలు గుండాలి,
పాల రాతి మేడైనా
వాకిట లైటుండాలి ॥

భారత రత్నమె యైనా
హారతి వెలు గివ్వాలి,
పాల కడలి పడక గదియు
ప్రాణ రుచిర మవ్వాలి ॥

దేశ నేతొ, లోక దూతొ
తిరిపె మెత్తు విశ్వదాతొ
గుండె గుడిని దీప మిడక
గుడ్డి బ్రతుకె బ్రతకాలి ॥

## 22. అఖిల భారత

అఖిల భారత శరీరపు
ఆత్మ ఒక్కటే,
        అవయవ లోపము లుంటే
        ఔషధాలు కల వెన్నో !

అస్పృశ్యత క్షయ రోగం
కుల విభజన కేన్సరు,
        వీటిని నిర్మూలింప
        వెలసిన డాక్టరు వీవు !

డాక్టరు చేతిని కొరికే
మూర్ఖ రోగి మా జాతి !
        ఆపరేషనుకె పూని
        అసువులు నిల్పితి వందుకె ॥

# 23. పదునాలుగు

పదు నాలుగు గుండెలతో
పదు నాలుగు పుట్టెనే !
తేదీతో భుజం కలిపి
మేధావి జనించెనే !

ఏప్రెలు పదునాలుగు
ఇను డుదయించిన రోజు,
సౌరమాన సంవత్సర
సంపద కతడే రాజు !

పరమ శివుడు పుట్టిన దది
పదునాలుగు శివరాత్రి,
నరహింసకు తుది రోజది
నరక చతుర్దశి !

పదు నాలుగు లోకాలకు
పండితు డంబేడ్కరు,
సర్వ మానవుల సమతా
శాసకు డంబేడ్కరు !

## 24. సాంఘిక న్యాయం

సాంఘిక న్యాయం,
సంస్కృతీ ప్రబుద్ధత్వం,
ఆర్థిక సమత, ప్రభు
త్వాధికార ఘనత-
అవని కెల్ల ఇవి నాలుగె
అంబేద్కరిజం !

ఏ జాతికి ఆ జాతే
ఇష్టం తన ఇష్టం,
మా భారత జాతి విశ్వ
మనీషకే అదృష్టం !
బుద్ధం శరణం అంటే
బుద్ధికి శరణం, అంతే !

దళితులార ! స్మృతి పన్నగ
దష్టులార ! జడులారా !
మేల్కొండిర ! మీరు గనక
మేల్కొంటే, భువియే దివి !
ఆ పలికే దెవరు ?
అంబేద్కరు ! అంబేద్కరు !

## 25. భీమం శరణం

భీమం శరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి ॥

భీమం అంటే అంబేడ్కరిజం
బుద్ధం అంటే జ్ఞానోదయం
ధర్మం అంటే సహజాభ్యుదయం
త్రిపదా గాయత్రియె మానవత ॥

సూర్య తేజమున, సూర్య శక్తి గల
ధైర్య వీర్య మానవతే భీమం,
తీవ్ర మౌఢ్యమును నిర్మూలించే
తీక్ష్ణ జ్యోతియె బుద్ధం ॥

దేశ పౌరు లందరికీ ఒకటే
శాసన ముండుట ధర్మం,
మతాతీత రాజ్యములో మతముల
మతలబు లుండుట స్వార్థం ॥

## 26. దేవు డెవరైన నేమి

దేవు డెవరైన నేమీ ? దేవ మం
దిర మెవరిదైన నేమీ ?

దేవు డున్నా డన్న
భావమే నీకుంటె,
పరమేశ్వరుని పట్ల
భక్తి నీ కుంటే ?

ఏ భాష వాడవో
ఏ పేర పిలిచినా,
ఏ దేశ వాసివో
ఎటుకేసి మొక్కినా ॥

మత బోధ లెన్నైన
మనిషి మనుగడకే,
మనుగడకు తుది విందు
మందార మధువే ॥

## 27. అధునాతన

అధునాతన భరత జాతి త్రిమూర్తులు
అంబేడ్కరు, పటేలు, గాంధీజీలు ॥

స్వాతంత్ర్యం తెచ్చె నొకరు,
సమగ్రతను నిల్పె నొకరు,
అస్తిత్వం చెడకుండా
ఆత్మను కాపాడె నొకరు ॥

సమ కాలీనులు కనుక
సంప్రదించు కోవచ్చు,
దారులు వేర్వేరు కనుక
తగాదాలు పడవచ్చు ॥

అందరిలో అంబేడ్కరె
ఆర్త జనావనుడు,
అందరికీ వందన మిడి
అనుసరిస్త మంబేడ్కరు ॥

## 28. ఇటు రండిటు రండి

ఇటు రం డిటు రండి !
ఇదిగో అంబేడ్కరిజం !
మానవతా మత మండి,
మహి కంతకు హిత మండి ॥

అస్పృశ్యత తొలగ కుండ
హైందవ మిల నిలవదండి,
సడల దేని కుల తత్వం
జాతీయత వెలయ దండి ॥

ఒక దేశం, ఒక జాతి
ఒక నీతి, ఒక నియమం,
అందర కొకటే న్యాయం
అమలు జరగ వలెనండి ॥

దేశ మంటె మనుషులె కాదండీ,
దేశ మంటె పుట్టిన మట్టి సుమండీ !
పుట్టు మట్టి ఫలితార్థమె
పురుషోత్తమ తత్వ మండి ॥

సమ సమాజ నిర్మాణమె
సర్వ జన శ్రేయం,
శ్రేయో రాజ్యమే శాంత
జీవన సుఖ నిలయ మండి ॥

## 29. నీ ప్రతిభా

నీ ప్రతిభా సర్వ సమగ్రత
నిఖిలోర్విని అద్భుతం,
నీ దేశ భవిష్య దివ్య దృష్టి
వేదోత్తర పర్యాప్తం ॥

ఏది నిన్ను వెలివేసిన దౌష్ట్యమో – అది
హిందూత్వం కాబోదు, కాబోదు !
అస్పృశ్యత బ్రతికి వుంటె దేశంలో
హైందవం నశించు ననడె గాంధీజీ ?

హిందూ కులతత్వ రాక్షసత్వంపై – దం
డెత్తిన ఏకైక యోధుడవు,
భారత అస్తిత్వం కాపాడగా
బౌద్ధం గైకొన్న ప్రవక్తవు ॥

## 30. సంస్కృతమును

సంస్కృతమును చదివితివి, వైదిక
సత్తా గుర్తించితివి,
స్మృతులు మొదలు హైందవ సంస్కృతిలో
పతనము గమనించితివి !

కుల రోగము మాన్పుకొని, స్వ
స్థులు కండని బోధించితివి !
దేశాభ్యున్నతికై బుద్ధుని వలె
తిరుగుబాటు చేసితివి !

కర్కశమతులను లెక్క చేయక
కాంగ్రెసు పిలుపును మన్నించితివి !
రాజ్యాంగము నిర్మించితివి, భా
రత రత్నమువై వెల్గితివి !

## 31. ఆధునాతన

అధునాతన భారతీయ చరిత్రలో
అంబేద్కర ! నీ వొక్కడివే !
మానవులకు ఆదర్శ మూర్తివి
మార్గ దర్శకుడ వొక్కడివే ॥

అవసరమున అధికార పీఠమును
అధిరోహించిన శక్తి శాలివి,
నీ ఇష్టం సాగని తక్షణం – పదవికి
నీళ్ళు వదలి బైటపడిన త్యాగశీలివి ॥

హేతు బద్ధములు కాని
హిందూ కుల భేదాలను
మార్చలేని నిరాశతో
మతం మార్చుకోవలసిన ॥

స్వమత ద్వేషము, పరమత
సహనము గల హిందూత్వం
మతమా అని ప్రశ్నించిన
మానవతా ప్రవక్తవు ॥

## 32. బ్రతకడమే ముఖ్యమా

బ్రతకడమే ముఖ్యమా
బానిస బ్రతుకైన గాని ?
మేక బ్రతుకు బ్రతుకేనా ?
మృగరాజువు కాలేవా ?

సృష్టికి మకుట ప్రాయం
మృగరాజే, మేక కాదు,
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతొ
శిర మెత్తుక బ్రతకాలి ॥

కాల్మొక్కే బాంచగ బహు
కాలం బతికే కంటే
క్షణమైనను అరుణోదయ
కళికగ వికసించాలి ॥

## 33. శాంతి భద్రతలె

శాంతి భద్రతలె మనిషికి
సర్వస్వం అనుకొంటే-
బానిసత్వమే భద్రత,
బాధ్యత లేమియె శాంతి ॥

ప్రతి మనిషీ ఏదో ఒక
ప్రతిభ కలిగి పుడతాడు,
ప్రాణాలను వెచ్చిస్తూ
ప్రతిభను పండిస్తాడు ॥

శాంతి భద్రతలు కాదోయ్ !
శౌర్య వీర్యములు ముఖ్యం,
నిద్ర కాదు సౌఖ్యం, నీ
ముద్ర పడా లన్నింటా ॥

# 34. చవుక దుకాణాలు

చవుక దుకాణాలలో
స్వాతంత్ర్యం లభించదు,
నిశ్శంకా సుఖ శాంతులు
నిరంత రాహత ఫలములు ॥

సాటి మనిషి కపకారం
చైడం అది హింస,
క్రౌర్యానికి తలవంచుట
కాదు అహింస ॥

దుష్టుల నిర్మూలించి
శిష్టుల రక్షించాలి,
"అసతో మా సద్గమయ"
అనే సూక్తి కర్థ మదే ॥

## 35. నీ దేవాలయములు

నీ దేవాలయములు
గ్రంథాలయములు,
నీవు కూర్చుకొనే సంపదలు
రక రకాల గ్రంథాలు ॥

నీ యజ్ఞం గ్రంథాలు
నీ దానం గ్రంథాలు
నీ తపస్సు గ్రంథాలయ
నిర్మాణ మధూషస్సు ॥

కొత్త కొత్త గ్రంథాలను
కొని చదువుట జ్ఞానం,
జ్ఞాన పథికుడవు నీవు
జ్ఞానేశ్వరుడవు నీవు ॥

# 36. ఏ చదువు

ఏ చదువు చదివినా
ఏ వృత్తి చేసినా,
ఎంత పై కెదిగినా
ఎంత ఆర్జించినా,
అందులో నీ జాతి
కర్ధ భాగం కలదు,
మరచి పోకోయీ ! పౌర
మర్యాద తెలుసుకోవోయీ !

నీ దేశ పౌరులు
నీ జాతి సోదరులు
నీ దోపిడీ వలన
నిరు పేద లవుతుంటె,
అందులో నీ పాప
మధిక భాగం కలదు,
మరచి పోకోయీ ! జాతి
మనుగడకు పీడ కాకోయీ !

తన దెల్ల నీ కొరకు
త్యాగ మొనరించిన
అంబేడ్కరుని పేరు
అతి పవిత్రము కదా ?
ఆ పేరు సంగడిలో
అమ్ముకొని బ్రతికేవ ?
మరచిపోకోయీ ! అరుంధతీ
మనుమడా ! మనిషి వగుమోయీ !

ధన కనకముల బరువు
తల మీద కెత్తుకొని
స్వర్గాని కెక్కుదువొ ?
నరకాన కూలుదువొ ?

మరచిపోకోయీ ! తగు మార్గ
మరసి ముందుకు సాగుమోయీ !

# 37. ఎవ రవయ్యా నీవు

ఎవరవయ్యా నీవు ? అంబేడ్కర !
ఎందుకు పుట్టా వీ దేశంలో ?

వేల మంది సంస్కర్తలు పుట్టి
విఫలులైన ఈ దేశంలో
సఫల యత్నుడవు కాగల ననియే
జన్మించితివా, మహానుభావా ?

ఋగ్వేదంలో లేని కులాలను
ఋషు లొప్పని తరతమ భేదాలను
నిర్మూలించి భారత జాతిని
నిర్మల మొనరింపగ వచ్చితివా ?

వీర వంద్యము నీ సాహసము
తీరును గాక నీ అభిలాష,
ఎంత గాఢ తామసమ్మైనా నీ
కాంతి ముందు మనలేదు కదయ్యా !

## 38. తెలుసుకో

తెలుసుకో, తెలుసుకో
తెలుసుకొని మసులుకో !

మెదడు గల వారలే
పదవి గల వారలై
దేశ కాలాలకు అ
ధీశ్వరులు కాగలరు ॥

కండ గల వారలే
దండ ధరులై నేల
పండిన సమస్తమును
దండుకొని తినగలరు ॥

మెదడు నుపయోగించి
పదవి సంపాదించు,
దండ కౌశలముతో
పండగలు చేసుకో ॥

# 39. ఎంత ఉన్నతి

ఎంత ఉన్నతి కెదిగినా వయ్యా !
అంబేద్కరా,
ఎంత క్రిందిని బ్రోచినా వయ్యా !

ఎంత ఉన్నతి కెదిగినావు
ఎంత క్రిందిని బ్రోచినావు !
సూర్య చంద్రుల ఎత్తు నుంచి
సుప్త జీవుల లేపినావు ॥

హిమ గిరీశ్వర శిఖర మీవు
ఇందు శీతల కరుణ వీవు,
దిక్కు మాలిన బక్క ప్రాణుల
చక్క దిద్దిన గంగ వీవు ॥

కాసు విలువయు లేని మేము
కళ్లు సెత్తిన పెట్టుకొందుము,
ధర్మ సంస్థాపకుడ వీవు
దళిత జన సేవకుడ వైతివి ॥

# 40. ఏమనెనే

ఏ మనెనే ? ఏ మనెనే
అంబేద్కరు డే మనెనే ?
జాతి సమైక్యం గురించి,
శాంతి సౌఖ్యముల గురించి ॥

అస్పృశ్యత పాటించుట
అవమానము మానవతకు,
ఎంత త్యాగమైన చేసి
అంతు తేల్చుకొం డనెనే ॥

కుల నిర్మూలన చేసి
బలవంతులు కండనెనే,
విషమమైన దెల్ల తుడిచి
పృథివి గెలుచుకొం డనెనే ॥

ఆర్థిక పుష్టిని మించి
అధికా రోద్ధతి మించి
ఆత్మజ్ఞానం గొప్పది
ఆదిత్యులు కండనెనే ॥

చదువుకొండి, అందరొకే
జట్టుగ నడవండీ,
విడిపోకండీ, మీదే
విజయం సుండీ అనెనే ॥

చీకటి నెదిరించ లేక
లోకము నని లాభ మేమి ?
సామర్థ్యమె జీవిత మను
సత్యము గుర్తించు డనెనే ॥

బలవంతు లదే రాజ్యం
బలహీనులు బానిస లగు,
బానిసలుగ బ్రతకనేల
బలవంతులె కండనెనే ॥

సోమరులకు లభించవు
సుఖ శాంతులు లోకములో
నిర్విరామ కృషి లోనే
సర్వస్వము కలదనెనే ॥

# 41. దాహముతో

దాహముతో నీళ్ళడిగిన మనిషికి
మురికి గుంట చూపిన సంస్కారం,
తొందరతో బండెక్కిన ఆర్తుని
కులము తెలిసి పడద్రోసిన శౌర్యం
నాదని నే నన గలనా ?
నాదని, మనిషిగ మనగలనా ?

నా దేవతలను చూడరాదని
నా మత గ్రంథము ముట్టరాదని
అక్షరాలనే నేర్వరాదని
నన్ను నిషేధించే గురువర్యులు
నా వారని నే నన గలనా ?
అని, నే మనిషిగ మనగలనా ?

నన్ను మనిషిగా చూడని మతము
నా దెట్లవుతది ? అది నా కెందుకు ?
నను తనలో చేర్చుకోని సంఘం
నన్నే రీతిగ ఉద్ధరిస్తది ?
నా కొక వ్యక్తిత్వం లేదా ?
నా అంతట నే మనలేనా ?

# 42. విశ్వాసం

విశ్వాసం మతం
విజ్ఞానం ఋతం,
విశ్వాసం ఊహోభయ జనితం
విజ్ఞానం వాస్తవాభ్యుదయం ॥

మతాచారములకు
మంత్రాంగం స్వార్థం,
స్వార్థాలకు మూలం అవిశ్వాసం
సైతానుకు దాసోహం ॥

దైవంపై విశ్వాసం గలవాడు
ధనముల నెందుకు దోచుకొంటాడు ?
ఏకేశ్వర తత్వము నమ్మిన వాడు
ఇతరుల నెందుకు ద్వేషిస్తాడు ?

హిందూ మతమే కాదు
ఏ మతమైనా ఒకటే,
మేకల మందల నేలే
మృగరాజుల దర్బారది ॥

## 43. నీ ఊహలు

నీ – ఊహలు అర్థం కావు
నీ – చేతలు వ్యర్థం కావు,
కాకా రవముల కాకులకు
ఆకటి కేకల మూకలకు ॥

దేశానికి స్వాతంత్ర్యం కోసం
తెల్ల దొరలతో పోరాడావు,
దీన దళిత జన హక్కుల కోసం
దేశి దొరల నెదిరించావు ॥

నమ్మ గూడదని తెలిసియు పూనా
సమ్మతి కొడబడినావు,
సాహసించి భారత రాజ్యాంగపు
సారథివై నిలిచావు ॥

పాడై పోయిన హిందూ మతమును
వీడిపోదు నన్నావు,
ఆ కుటుంబమే యౌ బౌద్ధానికి
ఆహ్వానము పలికావు ॥

కులాలు పోవాలంటూ పీడిత
కులాల జాగృతి కోరావు,
బ్రాహ్మణత్వమును ఖండిస్తూనే
బ్రహ్మ జ్ఞానిగ వెలిగావు ॥

## 44. నాద బిందు

నాద బిందు కలనా కలితము ఈ
నానా ప్రాణమయీ ప్రపంచము ॥

వేణు నాదమో, వీణా వాదము
పిక కూజితమో, ప్రియగళ రవమో
భిదురమైన కళ బిందురూపమై
విరిసినదే ఈ విశ్వానందము ॥

మృదు కలాపులకు నృత్యము నేర్పే
మేఘ దుందుభులు చాలవా?
సింహ గర్జనలు, జీవనార్తులు
చేతో ధర్మము లగునా ?॥

సృష్టి కోరికలు సౌఖ్య శాంతులు
ప్రకృతి ప్రణాళిక పరము వికాసం,
అందుకె అంబేడ్కర నీ మూర్తిని
ఆలపింతు నొక నాద వేదముగ ॥

# 45. అంబేడ్కర నీ

అంబేడ్కర ! నీ అంతటి వాడు
పుట్టలేదు, మరి పుట్టగబోడు,
నీ సంకల్పము నెరవేరినదో
మానవత్వమే మాధవత్వమౌ ॥

ఏమిటి నీ సంకల్పం ?
ఇలలో మానవు లంద రొక్కటే
ఏ జాతైనా, ఏ మతమైనా
ఏ రంగైనా, ఏ వృత్తైనా ॥

సాంఘిక భేదము లుండ గూడదు,
సమానావకాశము లుండాలి,
ప్రతి పౌరుడికీ కూడు కొంప ని
ర్బంధంగా సమకూర్చాలి ॥

మనిషి మనిషిగా జీవించాలి
మనసు స్వేచ్ఛగా విహరించాలి
అభ్యున్నతి ఫల మెవరి కందినా
అనుభవ మందరిదీ కావాలి ॥

# 46. వ్యాసుని వంశం వాడా

వ్యాసుని వంశం వాడా
శ్రీ శుకు సంతతి వాడా,
        పీడిత జను లే దిక్కున
        పిలిచిన పలికే వాడా ॥

సత్యాగ్రహములు నడిపి
జడులకు చేతన మొసగి,
        పౌరహక్కుల నిమిత్తం
        పోరాడిన వీరుడా ॥

నిద్ర మాని చదువుటలో
నిష్ఠ పూని కదులుటలో
        అందరి కాదర్శంగా
        అందల మెక్కిన వాడా ॥

వేదాలను మధించి
విలువలు గ్రంథాల కెత్తి
        మూక నాయకత్వం గొని
        శోకం బాపిన రేడా ॥

# 47. నిను తలచి నంతనే

నిను తలచి నంతనే
నీరసము తొలగు,
నిను పిలిచి నంతనే
నిబ్బరము కలుగు ॥

నీ వ్రాత లొకటైన
నీ మాట లొకటైన
నోట నుంటే చాలు
ఓటమే లే దింక ॥

నీ ప్రతిమ నింటిలో
నీ మూర్తి నెడదలో
నిలుపు కొన్న నరుండు
నిర్భయుం డేనాడు ॥

దళితులకు నీ విడిన
ధైర్య మంతటిది
అజ్ఞులకు నీ విడిన
ప్రజ్ఞాన మంతటిది ॥

## 48. నిన్ను దేవుని జేసి

నిన్ను దేవుని జేసి
సన్నుతించుట కాదు,
నీవు చేసిన సేవె
నిన్ను నిత్యుని జేసె,
    నీవు గా కెవరయ్య, అంబేడ్కరా !
    నిన్ను లోకోద్ధర్త, అంబేడ్కరా ॥

ప్రతి నోట నీ పేరు
పా టగుట కాదు,
నీవు మీటిన ప్రజల
జీవాత్మ నాడి అది,
    నీవు గా కెవరయ్య, అంబేడ్కరా !
    నిన్ను లోకోద్ధర్త, అంబేడ్కరా ॥

నీ మూర్తి నింటింట
నిల్పి కొల్చుట కాదు,
నీ లక్ష్య ధర్మమే
బాలలై ప్రభవించె
నీవు గా కెవరయ్య, అంబేడ్కరా !
నిమ్న లోకోద్ధర్త, అంబేడ్కరా ॥

జై భీము లతో మేము
జగము నేలుట కాదు,
జగ మెల్ల నీ సర్వ
సమతయే వికసించె
నీవు గా కెవరయ్య, అంబేడ్కరా !
నిమ్న లోకోద్ధర్త, అంబేడ్కరా ॥

## 49. మతము మారి నంతనే

మతము మారి నంతనే
వెతలు తీరిపోవునా ?
    ఆత్మ బలము చూపక
    ఆర్తి తొలగి పోవునా ?

గుడిని మార్చినంతనే, దే
వుడును మారిపోవునా ?
    దొరకు పేరు మారినా, భ
    క్తునికి భజన తప్పునా ?

దిక్కు మాలి వేడక, ఏ
దేవుడైన కరుగునా ?
    మత గురువుకు మొక్కక, తన
    మడి దేవుడి కందునా ?

దేవుడు గల ప్రతి మతముకు
దేవాలయ ముండదా ?
సేవించక మనగలిగే
స్వేచ్ఛ మనిషి కున్నదా ?

మత మేదైనా గానీ
గత మేదైనా గానీ
మనో బలము లేకుండా
మనిషి తరించునా ?

## 50. బ్రతక గల్గిన చాలు

బ్రతక గల్గిన చాలు మనిషి, లోక
బాంధవుడె అవుతాడు మనిషి ॥

ఒకరి నొక్కరు గిల్లి కజ్జాలు పడకుండ
ఒకరి నొక్కరు దోచుకోకుండా,
ఒకరి నొక్కరు త్రోచుకొని బోర్ల పడకుండ
ఒకరి నొక్కరు చంపుకోకుండా ॥

మనిషి మనిషిని చేరి వంచించకుండా
మనిషి మనిషిని నమ్మి చెడకుండా,
మనిషి మనిషితొ కూటికై పోటి పడకుండ
మనిషి దారికి మనిషి అడ్డుపడకుండా ॥

స్వర్ణ మొకటే, భూషణము లనేకములన్న
వాస్తవమ్మును మరచిపోకుండా,
స్వార్థ వాగుర లోన పడకుండా,
స్వపర భేదము లసలు లేకుండా ॥

# 51. యజమానులు మారినా

యజమానులు మారినా
నజరానా తప్పదురా,
ప్రభుత్వాలు మారినా
పన్నులు తప్పవురా ॥

పన్నులు తన్నులు తప్పుట
ప్రజలు మారినపుడేరా,
నిద్ర మునిగి ప్రజ లుంటే
నిశా చరులె రాజులురా ॥

నల్లమందు గంజాయిల
కల్లు తాగి అమ్ముకొన్న
వోట్ల మీద ఏముందీ ?
వొల్లకాటి గుర్తుందిర ॥

మనుగడ సుఖ శాంతులతో
కొనసాగా లని వుంటే
అడుగడుగున వికసిస్తూ
అభ్యుదయం నడవాలిర ॥

## 52. భారతీయుడ వీవు

భారతీయుడ వీవు, అంబేద్కరా ! పూర్ణ
భరత వీరుడ వీవు, అంబేద్కరా !

భారతీయుడ నేను, ఆద్యంతములు నేనె
భారతీయుడ నన్న వాడవు,
భారతీయుడు కాని వాడెవ్వ డీ దేశ
వాసి కా దగడన్న వాడవు ॥

కుల మతా తీతమౌ రాజ్యాన కులమతా
లకు తావు లేదన్న వాడవు,
మతమునే పట్టుకొని ప్రేలాడు వారలీ
క్షితి నుండ వలదన్న వాడవు ॥

నిమ్నోన్నత కులాల సమతయే జాతీయ
నిర్మాణ మగు నన్న వాడవు,
దళిత దీన ప్రజోద్ధరణమే ధర్మ సం
స్థాపన మ్మగు నన్నవాడవు ॥

## 53. పంచ భూతముల

పంచ భూతముల లోన
పృథివీ తత్వం నీవు,
పంచ ప్రాణముల లోన
ప్రాణ వాయువే నీవు ॥

పృధివే ఆధారం ఈ సృష్టికి,
పృధివికి ఆధారం పండించే వాడు,
పండించే దళితులకు ప్రాణం నీవు,
బ్రతికించే విలువలకు ప్రమాణం నీవు ॥

వర్ణ భేద దురాచార
పరిధికి వెలుపలి వాడవు,
పరిధిని చీల్చగల శక్తి
పరుడవు నీ వొక్కడివే ॥

బౌద్ధుడ వైనా గాని
భారతీయుడవె నీవు,
సమగ్రైక భరత జాతి
జనకుడ వౌదువు నీవు ॥

## 54. గట్టి వాడవు నీవు

గట్టివాడవు నీవు, అంబేద్కరా !
కార్యవాదివి నీవు, అంబేద్కరా !

వట్టి వాగ్దానాలు
వద్దు పొమ్మన్నావు,
ప్రగతి పథకా లములు
పరచ రమ్మన్నావు ॥

దేశ మనగా ఏక జాతీయులు
జాతి అనగా ఏక మార్గీయులు,
మార్గ మనగా ఏక
మర్యాద అన్నావు ॥

తొలి యుగాలలో భారతీయు లొక జాతి,
కులములుగ చీలీ శిథిల మైపోయారు,
కుల భేదములను నిర్మూలించక
తొలినాటి వైభవము రాదు సుమ్మన్నావు ॥

## 55. పుట్టిన ప్రతి మనిషి

పుట్టిన ప్రతి మనిషీ భూమి పుత్రుడే,
భూమాతను సేవించే మహిత విత్తుడే ॥

భూగోళం ఒకటే,
భూలోకం ఒకటే,
భూమిని సేవించి పెంచు
బుద్ధి జీవు డొకడే ॥

దేవు డొకడె జీవేశ్వరు డంటూనే
జీవులు తినివేయు తమను తామే,
నరులు తాము బుద్ధి జీవులైతే
నరుకు కొందు రేలా తమలో తామే ? ॥

అవసరమును మించి సేకరించుట అన్యాయం
అంతా తమకే కావలె ననుకొనుట అధర్మం,
కర్షకుడే భూమాతకు ప్రథమ సేవకుడు
కృషి ఫలమున తొలి వాటా అతడిదే ॥

# 56. ఏదో ఒక కులం

ఏదో ఒక కులం రాజ్య
మేల జాల దిక,
అన్ని కులా లందలి మేధావి వీరులూ
ఐక్యమై సాగుదు రిక !

భుజ బలమూ, బుద్ధి బలం
భుజం భుజం కలుపుకొని
కుల శృంఖల త్రెంచుకొని
కోరికలను సాధించుట తప్ప దిక !

కోరిక లన నేమిటి ? ప్రజల
కోరిక లెటువంటివి ?
అందరికీ సమానంగ
అన్నం దొరకాలి మొదట ॥

అన్న కోశ మున్న ప్రాణు లందరికీ
అన్నమే ప్రధాన జన్మహక్కు,
అడ్డం వచ్చే వాడే కులమైనా
అంతరించి పోవుట తథ్యం ఇక ॥

# 57. ఎన్ని ముడులను విప్పినావు

ఎన్ని ముడులను విప్పినావు, నీవు
ఎన్ని దారులు తెరచినావు !

వేద భారత జాతి
మేధా ప్రవృత్తిలో
సరళ గమనము కొరకు
సమ జీవనము కొరకు ॥

సస్య భేదము లుండవచ్చు, అన్ని
సస్యముల బోషించు నీరొక్కటే,
ఆత్మ ఒకటే నన్న అమృత సూక్తిని మరచి
కుల వాగురల జిక్కుకొన్న మూర్ఖుల బ్రోవ ॥

జాతి మనుగడ ప్రధానమురా
స్వార్థ బుద్ధిని విడుచుకోరా
బోధిల్లరా అంచు
బోధి సత్వుని గూడి ॥

## 58. అంబేద్కర

అంబేద్కర, అంబేద్కర
అంబేద్కర అను, మనసా !
అగ్ర అంత్య భేద ముడిపి
అగ్ర గామి వగుము, మనస ॥

కుల తత్వం తొలగించి
కుల పోరాటములు మాన్పి
ఏక జాతి భారతులని
లోకానికి చూపు, మనస ॥

వృత్తి భేదములె కాని
వివిధ కులము లొకే జాతి,
స్వార్థ రాజకీయాలతొ
చంపకు జాతిని, మనసా ॥

మంచి చెడ్డ లన్నిటికీ
మనసే మూలం కనుక
ద్వేషాలను తుడిచి, ప్రేమ
ధీశాలివి కావె, మనస ॥

# 59. బ్రహ్మజ్ఞానం

బ్రహ్మ జ్ఞానం కలవాడేరా
బ్రాహ్మణు డంటే,
జ్ఞాన దీప మెపు డారినదో ఆ
క్షణమే పుట్టెను కులభేదాలు ॥

బ్రాహ్మణ మత మన్నది లే దిపుడు,
భారత మంతా హైందవమే,
పెత్తనాలకై పల్లెటూళ్ళలో
పీడింతురు దళితులను శూద్రులే ॥

కలిమి లేములే, గత గర్వాలే
కుల కలహాలకు హేతువులు,
కొట్టు కొంద్రు తములో తామే కడ
గొట్టు రెండు వర్గాల బానిసలు ॥

సర్వ మతాలూ సమానమే అ
జ్ఞానంలో, మోసంలో ;
మానవ లక్ష్యం మతం కాదురా,
మానవత్వమే కర్తవ్యంరా !

# 60. మత విశ్వాసాలు లేని

మత విశ్వాసాలు లేని హేతువాదివి, మరి
మత మెందుకు మార్చావు ?
మట్టిని మార్చా లనుకొన్న రైతువు,
మళ్ళీ మన మట్టే ఎందుకు కావా లన్నావు ?

పూల చెట్లు, ముళ్ళ పొదలు – మన
నేలలోనె కల వంటివి,
నేల విడిచి సామేలా ?
నిలిచి గెలుచుకో మంటివి ॥

నీతులు ఎక్కడ లేవు ?
నియమా లెవరికి లేవు?
మత పుష్పా లేవైనా
మన సాకటే సూత్రధారి ॥

మతం మార్పులో కూడా – దేశ
హితం మరువలేదు నీవు !
పుట్టిన మతమేదో అదే
మెట్టిన మతమూ కూడా ॥

# 61. అంబేడ్కరిజం అంటే

అంబేడ్కరిజం అంటే
ఇండియనిజమే,
ఇండియనిజ మంటె పౌరు
లెల్ల రొకటె అను నిజమే ॥

ఇండియాలొ పుట్టి పెరుగు
ఎల్లరు ఇండియనులే,
కులం మతం పేరు చెప్పు
కొని బ్రతుకుట నేరం ॥

హిందూ మత మన్నది కుల
కండూతికి నిలయ మైతె,
మతం వద్దు, కులం వద్దు
మనుషులు కండని చెప్పే ॥

కుల పోరాటాలు వద్దు
కులములె వద్దు,
స్వచ్ఛమైన మానవ సౌ
జన్యమె అంబేడ్కరిజం ॥

# 62. భారతీయం

భారతీయం, భారతీయం
ప్రాణ ధర్మం భారతీయం ॥

బుద్ధ తత్వం భారతీయం
బుద్ధి సంస్కృతి భారతీయం
బుద్ధ చేతన, బుద్ధి వికాస
బోధి సత్వం భారతీయం ॥

వేద బుక్కుల విశ్వశక్తి
ఉపనిషత్తుల ఉజ్వలాత్మ
కావ్యముల రసరాగ దీప్తి
కలిసి పారే భారతీయం ॥

కులములుగ విడిపోక ముందు
కువలయాశ్వమె యైన శ్రేయం,
సమ సమాజ వ్యవస్థను ధ్యే
యముగ చూపిన భారతీయం ॥

## 63. కుల భేదములు

కుల భేదము లున్నంత కాలము
కుల పోరాటాల్ తప్పవురా !
కుల పోరాటాల్ తప్పాలంటే
కుల నిర్మూలనె మార్గంరా ॥

కుల నిర్మూలన హిందూ మతమున
కలలో మాటనుకొంటే
భారతీయు లందరును మొత్తముగ
బౌద్ధు లగుట క్షేమమురా ॥

ఒకటే జాతిగ కలిసి భారతీ
యులు సమైక్యమై నిలవక పోతే
జాతికి ఉనికే వుండదురా ! ఈ
సత్య మెరిగి వర్తించుమురా ॥

ఎపుడో బుద్ధుడు చెప్పిన మాటిది,
ఇపు డంబేడ్కరు మరల చెప్పెరా !
సంకుచితత్వము విడిచి పెట్టరా !
సమ సమాజమై నిలిచి నడవరా ॥

## 64. నెనరున నిను

నెనరున నిను తలచే కొలదీ
నిను గూరిచి పాటలు వస్తున్నవి,
నిను గూరిచి పాడే కొలదీ
నిర్భయ చేతన వికసిస్తున్నది ॥

దళిత జనోద్ధారణకై వెలసిన
ధర్మ దేవతవు నీవు,
నిను గూరిచి పాడనిచో మానవ
నిర్వేదానికి ఫలమేదీ ?

కరుణారస పూరము నీ హృదయము
పురుషోత్తముడవు నీవు,
సర్వ సమత్వ నియంతవు నీవు
సౌజన్య ప్రకృతివి నీవు ॥

శాంతి భద్రతలు ధనికుల కేనా ?
శ్రమ జీవులు పౌరులు కారా ?
సమతా గీతాచార్యుడ వీవు,
స్వస్తిశ్రీ గాయకుడను నేను ॥

## 65. అట్టడుగుకు నెట్టబడిన

అట్టడుగుకు నెట్టబడిన వాళ్లు
అహింస ద్వారా పైకొస్తారా ?
పై కొస్తారని నమ్మావు,
ప్రజ్ఞానులు కమ్మన్నావు ॥

కలహ హేతువులు కులములె కనుక
కుల రహితులు కమ్మన్నావు,
హిందువు లంతా బౌద్ధు లైతె, లో
కేశ్వరత్వమే మన దన్నావు ॥

మతా తీతముగ బ్రతుకుట భువిలో
మనిషికి సాధ్యము కాదన్నావు,
బుద్ధి మంతమౌ మానవత్వమే
బౌద్ధ ధర్మ మన్నావు ॥

# 66. విశ్వశ్రేయం గోరిన

విశ్వ శ్రేయం గోరిన
వేద మతంరా మనది,
విశ్వైక్యం బోధించిన
విశ్వ మానవులం మనం ॥

పర మతాల నన్నిటినీ పరిశోధించిన అంబే
డ్కరు బౌద్ధమునే ఎన్నిక చేసెను,
అంబేడ్కరు కంటే మన
కధికం తెలుసా, సోదర ?

మతం దేనికైనా తన
మతస్థులే సోదరులు,
హిందువులకు మాత్రం నరు
లెల్లరు పరమాత్మీయులె ॥

అస్పృశ్యత, కుల జాడ్యం
అంతరించి పోతె – భా
రతీయమే ప్రబుద్ధమై
క్షితినే పాలించ దటర ?

# 67. ఘుజనీలకు

ఘుజనీలకు, ఘోరీలకు
కాల్మొక్కిన నిర్వీర్యులు
స్వమత దళిత సోదరులను
చంపుక తిను పులు లగుటకు
హేతు వేమి, సోదరా ?
హేతి చేత లేకరా !

శాంతి నినాదములు సాధు
జంతు ఆర్తనాదములు,
గోవ్యాఘ్ర కథానికలు
కుక్షింభర కవులవిరా !
పరువుగ బ్రతకా లంటే
పౌరుషమే మార్గంరా !

బ్రతుకు తెరువు ఏదైనా
పౌరుడ వందరి వలెనే,
పరువెత్తిన తరుమువాడె
తిరుగబడిన పారిపోవు,
మానవ స్వభావ మెరిగి
మంచిగ జీవించరా !

# 68. మత మేదో ఉంటుంది

మత మేదో వుంటుంది మనిషికి, ఏ
మత మైనా ఒకటేరా మనీషికి,
మత మేదైనా గానీ
మంచి చెడ్డ లొకటేరా ॥

ఎవడో ఊహిస్తా డొక దేవుడిని
ఎందరొ వట్టిసె నమ్ముదు రతడిని,
ఆ అందరు కూడినదే మతంరా
అదే వారి సామూహిక రక్షణరా ॥

దళిత జనుల కంబేడ్కరు
ధర్మమె మత మన్నాడు,
బౌద్ధ ధర్మ మొకటేరా
భారతీయ మన్నాడు ॥

## 69. అద్వితీయ మనీషి

అద్వితీయ మనీషి వయ్యా !
అంబేడ్కర ! నీ నుంచి అంబేడ్కర శక మయ్యా ॥

రాజ గృహం వీడిన సిద్ధార్థుడు, నీ
రాజ గృహం చేరిన శరణార్థుడు !
త్రి శరణముల నుద్ధరించి
త్రికాలముల నలరించిన ॥

సిద్ధార్థుడి కంటే నీ
సిద్ధి గొప్పదయ్యా,
దళిత జనుల నుద్ధరించి
దారి చూపిన ప్రవక్తవు ॥

ఆత్మహత్యకు పాల్పడిన
హైందవమును కాపాడగ
చివరి దాక పోరాడిన
శ్రీమత్ భారత రత్నా ॥

## 70. ఎలా సహించాలి

ఎలా సహించాలి, ఈ
నేరాలు, ఘోరాలు ?
ఎందుకు సహించాలి ?

ప్రజ్ఞా, కరుణా, సమతా
పాటించా లన్నావు,
పాటించే వారి బట్టి
ప్రాణం దీసే దుష్టుల ?

కుల నిర్మూలన కోసం
దళితోద్ధారణ కోసం
నీవు చేసిన కృషి ఎల్ల
నిష్ఫలమై పోతుంటే ॥

అహింసతో పెద్ద పులుల
ఆదరించు మన్నావు,
బలులు గొనుచు రోజు రోజు
పులులు బలిసి పోతుంటే ॥

# 71. డబ్బు డబ్బు డబ్బు

డబ్బు డబ్బు డబ్బు, ఎవ
డబ్బ సొమ్ము డబ్బు ?
కార్మికులది డబ్బు,
కర్షకులది డబ్బు !

కార్మికులకు కాకుండా
కర్షకులకు లేకుండా
అధికంగా ఎవడి వద్ద డబ్బుంటే
ఆతడు ఆర్థిక దొంగ !

లంచాలూ, దొంగ
లాభాలూ
వ్యాపారపు మాఫియాలు
హత్యా రాజకీయాలు
డబ్బా అది ? కాదయ్యా !
జబ్బయ్యా జాతికి !

# 72. న్యాయం కావాలి

న్యాయం కావాలి మాకు
న్యాయం కావాలి,
 అంబేద్కరు సాక్షిగా
 అన్యాయం తొలగాలి ॥

నా నీ భేదాలు లేక
నరు లందరు బ్రతకాలి
 కులభేదపు విషనాగుల
 కోరలు పీకెయ్యాలి ॥

తెలివితేట లెవ్వరికీ
కులము జూచి రావని
 రుజు వవుతున్నా చూడని
 గ్రుడ్డితనం పోవాలి ॥

భారత్ వ్యక్తిత్వముకై
బాబాసా బంబేద్కరు
 చేసిన త్యాగం యువజన
 మీసం నవరించాలి ॥

# 73. ఎవరయ్యా హీరోలు

ఎవ రయ్యా హీరోలు ?
ఎందుకు హీరో పూజలు ?

ఏ అన్యాయము నెదిరించారు ?
ఏ దుర్మార్గము నదలించారు ?
ఏ విలువలు నిలబెట్టారు ?
ఏ విజయము సాధించారు ?

నాటకాలలో, వెండి తెరలపై
నాయక వేషులు హీరోలా ?
రాజకీయ రిగ్గింగులు చేసే
రౌడీ మూకలు హీరోలా ?

బస్సులు కాల్చి, రైళ్ళను కూల్చి
ప్రజలను దోచుకొనే తుంటరులా ?
తెల్లని వన్నీ పాలని నమ్మే
తెలిసీ తెలియని టీనేజరులా ?

కూటి కోసమై తోటి మానవుల
గొంతులు కోసే నాయకులా ?
పదవి కోసమై బడుగు వోటులను
బలి గొని బలిసే పెద్ద మనుషులా ?

నేల దున్ని తిండిని పండించే
హాలికులే హీరోలు,
జగతి కెల్ల సుఖశాంతులు గూర్చే
శ్రామికులే హీరోలు ॥

# 74. వినరా భారత వీరా

వినరా భారత వీరా !
విజయం మనదేరా !

భారత జాత్యాకాశం లోకి
బాబ సాహె బుదయించిన దాది
అంటరాని తన మంత రించెరా !
అందరి గుండెల వెలుగు నిండెరా ॥

బడిలో చదివే హక్కుకై
గుడిలో ఇచ్చే మొక్కుకై
అంబేద్కరు పోరాడెరా !
అన్ని చిక్కులూ విచ్చెరా ॥

విదేశాలలో చదివెరా
విద్యల అవధులు చూచెరా
తిరిగి వచ్చి తన ప్రజల కష్టములు
తీర్పగ నడుము బిగించెరా ॥

లండను సభలో గుండ్రబల్ల కడ,
పూనా పేక్టుకు పూనుకొన్న యెడ,
గాంధిజీని గడగడ లాడించి
దళితుల పాలిటి దైవ మాయెరా ॥

ఆత్మోద్ధర్త వివేకానందుడు
స్వాతంత్ర్యోదయ భానుడు గాంధీ
ఏక దేశ నిర్మాత పటేలు
జాతి ఉనికికే పిత అంబేద్కరు ॥

ఈ మహనీయులు నలుగురు లోన
హిందు జాతి అస్తిత్వం నిల్పిన
పురుషోత్తము డంబేద్కరురా
బుద్ధ మాన్యు డంబేద్కరురా ॥

అస్పృశ్యుడుగా పుట్టి
అస్పృశ్యత తలగొట్టి
విశ్వ మానవత పాద పీఠిపై
పెట్టిన వీరాంబేద్కరు చరిత ॥

# 75. చదువుకో

చదువుకో, చదువుకో, చదువుకో !
చదువు కొన్న వాడె మనిషి ॥

మనిషి కనులు రెండైనా
మనసుకు చదువే కన్ను,
చదువు లేని వా డెంతటి
స్వామి యైన గుడ్డి వాడె ॥

చదువుకు సార్థక్యం కూర్చిన వా డంబేడ్కరు
చదువుకు దర్పణమై నిల్చిన వా డంబేడ్కరు
చదు వంటే డిగ్రీలే కాదోయీ !
చదు వంటే సంస్కారం, త్యాగం, మానవ సేవ ॥

మత మంటే పర లోకానికి మార్గం,
మనిషికి వలసిన దిక్కడి అస్తిత్వం,
ఇక్కడ నీ అస్తిత్వం నిలుపుకో !
అక్కడ నీ స్థానం నీ కుండునులే ॥

## 76. ప్రభుతా వృత్తీ

ప్రభుతా, వృత్తీ, ప్రమోదమూ
బ్రతుకు వెలుగులీ మూడూ ॥

ప్రభుత లేనిచో భద్రత లేదు
వృత్తి లేక అస్తిత్వమె లేదు,
ఎన్ని కల్గినా వెన్నెల లేక
వృత్తి భద్రతల కర్థము లేదు ॥

ఆర్థిక సమత, సాంఘిక న్యాయం
అందించేదే ప్రభుత,
అన్న పానములు వృత్తి తోడివి,
ఆనందం మానసిక స్వేచ్ఛ ॥

ఎన్నుకొన్న దే ప్రభుతైనా
ఇష్టమైన దే వృత్తైనా
పరమార్థం ఆనందం మనిషికి !
ప్రాణాయామమె పూర్ణానందం ॥

ఈ వెలుగులు నీలో వికసింప
ఈ దారిని మనిషిని నడిపింప
పాడుచుంటి నీ శతజయంతిలో
పంచమమున, అంబేద్కర ! కొనుమా ॥

# 77. నీ వొసగిన

నీ వొసగిన జాతీయ సమైక్యం
నిఖిల భారతీయం,
కుల మతాల కంటక కుటజాలకు
కుఠార సమవాయం ॥

అందరికీ నీ వొసగిన వోటు
అఖిల భారతీయతలో చోటు,
పూనా ఒప్పందంపై నీ వ్రాలు
మా నెలవుకు నీ విచ్చిన డాలు ॥

కాంగ్రెసుకు నీ వొసగిన సహకారం
చీకటిలో వెలిగించిన కర దీపం,
స్వతంత్ర భారత జాతికి నీ కానుక
సమగ్ర జాతీయతాభ్యుదయ నౌక ॥

# 78. ఎన్ని చట్టములు

ఎన్ని చట్టములు చేసెను లోక్‌సభ ?
ఎన్ని చట్టములు చేసె అసెంబ్లీల్ ?
అమలు జరిగినవి ఎన్ని ?
ఆరిపోయినవి ఎన్ని ?

మా పేరున కలవు రిజర్వేషనులు, కా
మందుల కడ కలవు వాటి తాళాలు !
మేకల గొర్రెల మందకు
మృగరాజులె కామందులు ॥

బ్రతుకు తెరువు పోరాటం సహజం,
బలమే పోరాటంలో విజయం !
విజయం కావాలంటే
వీరవహ్నిరగలాలి ॥

# 79. కులముల పేరున

కులముల పేరున విడిపోకు,
కుక్కలు చింపిన విస్తరి కాకు ॥

వృత్తుల పేరున వర్ణము లేర్పడి
విస్తరించినవి వందలుగా ;
వృత్తులు జాతికి బలవర్ధకములు
విచ్చు కత్తులుగ మార్చబోకు ॥

ఏక జాతి వాడవురా, నీ
దే కులమైనా ఒకటేరా !
వృక్ష లతాదు లనేకము లుండక
హృద్య మగునె రాజోద్యాన మైన ?

వ్యక్తుల విలువలు సరి సమానమే
వ్యక్తిత్వములే వేరు,
ఐకమత్యమే ఐశ్వర్యమురా !
ఐశ్వర్యమె లోకేశత్వమురా !

## 80. నీ కంటే చదువు కొన్న

నీ కంటే చదువు కొన్న
వారెందరు లేరు ?
నీవు కోరితే, ఉన్నత
పద వెందుకు రాదు ?

అన్నీ మా కోసం త్యా
గం చేసిన వీరా !
అందుకె మా ఈ అంజలి
గైకొను మంబేడ్కరా !

ఓజో వంతుడవు, లో
కోత్తర విద్వాంసుడవు,
ఆంగ్ల ప్రభుత నాశ్రయిస్తె
అందల మెక్కించేది !

దళితుల కోసం అంతా
త్యాగం చేసిన వీరా !
అందుకె మా ఈ అంజలి
అందుకో అంబేద్కర !

గాంధీతో పోరాడి
ఘన విజయం పొందావు,
అబలుల బ్రతుకుల కోసం
హక్కులు సాధించావు !

మన ప్రజల విముక్తి కొరకు
మత మార్గం చూపావు !
అందుకె మా భక్త్యంజలి
అందుకో, అంబేద్కర ॥

## 81. దళితుల నుద్ధరించని

దళితుల నుద్ధరించని
ధర్మం కుంటిది,
సమ ధర్మం పాటించని
సంఘం గుడ్డిది ॥

దళితుల శ్రమ శక్తి పిండి
తాగుతాడు పైవాడు,
కుంటి గుర్ర మెక్కి-
గుడ్డి స్వారి చేస్తాడు ॥

దేశానికి దళితులే
దిక్కౌదురు తుదకు,
దళితుల నవమానించుట
తగదు జాతి మనుగడకు ॥

# 82. ధనం, పదవి

ధనం, పదవి, అధికారం
ఘన సంపద లెన్నున్నా
సుఖ శాంతులు లేకుంటే
శూన్యం నర జీవితం ॥

కష్టార్జితమే సౌఖ్యం
కలిసి బ్రతుకుటే శాంతి,
శాంతి సౌఖ్యములె పౌరుష
జన జాతికి పరమార్థం ॥

విషముల విరుచుటకే ఏ
వీరు డవతరించినా,
ధర్మం నిలుపుటకే ఏ
ధమ్మ పదం వెలసినా ॥

## 83. నీవు చేసిన సూచన

నీవు చేసిన సూచన
జాతి దాస్య విమోచన ॥

చెరువు నీటికి పరిఖ లేదని
శివుని గూటికి పరిధి లేదని
ప్రతిఘటనతో రుజువు చేసి
ప్రజల శక్తికి పదును పెట్టి ॥

గుండ్రబల్లపై లండను సభలో
గుద్ది నీవు చేసిన సూచన,
ఎఱ్ఱ వాడ జైలు నుంచి గాంధిని
హృదయ మిచ్చి రక్షించిన యోచన ॥

ప్రకృతి పురుష విశిష్టమతిపై
పడతులకు సమ హక్కు లొసగుచు
వేద భారతి నుద్ధరించగ
మోద ఖేదము లనుభవించుచు ॥

అందరి దొకే దేశ మైనప్పుడు
అందరి కొకే న్యాయ మమలు జరగాలని
వాదించి, కాదన్న వారి నెదిరించి
అధికార పదవినే వదలి వేసిన త్యాగి ॥

అట నుంచి హిందువు నిటకు రప్పించుమని
ఇట నుంచి ముస్లిముల నటకు పంపించుమని
కాకుంటె నేల రక్తపు మడుగు లగుననీ
ఉభయులకు శాంతి లేకుండ పోయేననీ ॥

దేశ దాస్యం, జాతి దాస్యం
వర్గ దాస్యం, తొలగి పోవగ,
సర్వ తంత్ర స్వతంత్రంగా
జాతి ముందుకు సాగిపోవగా ॥

స్వతంత్ర భారత శక్తి ముద్రగా
సాధు సింహ సూచన,
ధీర శూర జాతీయ పతాకకు
ధర్మ చక్ర సూచన ॥

## 84. డప్పు కొడుతూ

డప్పు కొడుతూ, డాలు పడుతూ
నిప్పు గుండం తొక్కుకొంటూ
చిందు లేసీ, శిలువ మోసీ
చేర వస్తున్నాం బాబా !
చేర వస్తున్నాం !

సాంఘిక న్యాయం కోసం
సంపదలో సమభాగం కోసం
రాజకీయ అధికారం కోసం
రాజీ లేని పోరు సల్పుతూ ॥

ఊరి వెలుపలి, పూరి గుడిసెల
మారుమూలల బ్రతుకు లీడ్చే
బీద బిక్కల మెల్ల కలిసి
భీమ సేనగ మోహరించి
సాగి వస్తున్నాం, బాబా !
జయము తెస్తున్నాం !

# 85. దళితులపై

దళితులపై కులము పేర
దండెత్తకురా,
నిదురించే సింహాలను
కదిలించకురా !

దళితు లనగ నెవరు ? నీ
దాయాదులురా,
విడిపోయిన వారు
వెనుక బడిన వారు ॥

జాతికి సంపద కూర్చే
శ్రమ జీవులు దళితులు,
దేశ సమగ్రతకు జీవ
దీపాలే దళితులు ॥

దీపాలను ఆర్పుకోకురా, వేద
దేవి బ్రతుకు చీకటి చేయకురా !
బహుజనులను వెలిబెట్టి
బ్రతక జాల దే జాతీ ॥

## 86. అందరకూ

అందరకూ అందవలసినది అన్నం,
అన్నం వంటిది మనిషికి న్యాయం !

అన్నం అందించుటలో
అన్యాయం తగ దన్నా !
అందరికీ జఠర మొకటె
ఆకలి ఒకటే నన్నా !

కుల భేదాలను బట్టి
కూడు కొలత లుంటాయా ?
నోరు లేని సోదరులకు
నూకల గంజే ప్రాప్తమ ?

అక్రమ బల దర్పాలను పెంచుకొని
అజ్ఞానుల వోట్లు గుంజుకొని
పదవులలో కొలువు దీరి
ప్రజల దినుట తగ దన్నా !

## 87. మతాతీత రాజ్యంలో

మతాతీత రాజ్యంలో – మత
మైనార్టీలకు తావేదీ ?
మెజారిటీతో పౌరులందరూ
మేళవించి నడవాలి ॥

అధునాతన విజ్ఞానంలో – మూ
ఢాచారాలకు తావేదీ ?
ఎరగని స్వర్గం కోసం భూమిని
నరకం చేయుట మానాలి ॥

పుడమి కొకడె పోషకు డైనప్పుడు
పోరాటాలకు తావేదీ ?
అహంకారమును వీడి మానవుడు
అందరు తానై మెలగాలి ॥

## 88. అందరకు వోట్లిచ్చి

అందరకు వోట్లిచ్చినావు, రాజ్య
మఖిల జన భోజ్య మన్నావు !
కూరగాయల వోలె
బేరాలు సాగించి,
వోట్లమ్ముకొని బ్రతుకు
కోట్లాది గొర్రెలకు ॥

తెలివి కలిమీ లేని
దీనులకు వోట్లిచ్చి,
కామందు గద్దలను
గద్దె లెక్కించావు ॥

ఎడ్యుకేటెడ్ దళితు
లే పదవు లందున్న
అజ్ఞులౌ తమ ప్రజల
నాదుకోగల రని ॥

కోట్లు గల ప్రభువులే
వోట్లు కొనగల రనే
ఆధునిక రాజకీ
యము నూహ చేయవో ?

వోట్లిచ్చి సంతలో
వొదిలితే నేమౌను ?
తగిన ఆర్థిక స్థిర
త్వము నీయవలె కాదె ?

## 89. అంబేడ్కరా క్షమించు

అంబేడ్కరా, క్షమించు ! నీ
అడుగు దమ్ములు మేము, కరుణించు !

వయసొచ్చినట్టి ప్రతి వ్యక్తికీ వోట్లిచ్చి
మీ ఏలికల మీరె ఎన్నుకోండన్నావు !
నాయకుల పంచలలో నాటు సారా తాగి
వొళ్ళు మరచితిమి, వోట్లు అమ్మితిమి !

సారాయి మడుగులో ముంచి, మమ్ము
చచ్చినోళ్ళతొ సమానించి,
రిగ్గింగుతో దొరలు
గద్దె లెక్కిరు !

బుద్ధి మాలిన దుక్కిటెడ్లను - ఎంత
బుద్ధుడైనా మార్చగలడా ?
నీ ఆశ పేరాశ కాగూడ దన్నా,
నా తప స్సందుకే నన్నా !

# 90. సంఘంలో దుష్టులు

సంఘంలో దుష్టులు ఉన్నంత కాలం – దాని
శాఖల్లో కూడా వుంటారు,
కాలుష్యం నదిలో ఉన్నంత కాలం – దాని
కాలువలకు కూడా అది పారును !

సస్యానికి తెగులు పట్టకుండ – దాని
సంరక్షణ బాధ్యత రైతుది,
రైతే బాధ్యతా రహితుడైతే – జాతి
రాతే తలక్రిందు లౌతది !

ఆతతాయిలను క్షమించ కోయీ !
అవినీతికి బలి కాకోయీ !
రాజకీయ రంభల కోసం – నీ
తేజ మార్పు కోకోయీ !

## 91. ఊరూరా

ఊరూరా నీ విగ్రహాలే ! జనత
నోరారా నీ కీర్తి గానాలే !
నీ ఉద్యమ గీతాలే
నీ త్యాగ నినాదాలే ॥

గుండ్రబల్ల ప్రతిఘటనము
కొలను నీటి పోరాటము
దీన జనుల హక్కులకై
దీక్షా నిర్దేశంతో ॥

పరమోత్తమ సంవిధానముతో
భరతమాత కలంకారముగా
ఘన పరిశోధన పాండితితో – దళిత
జన సాహితి కాకృతిగా ॥

పట్టణాల నిండా, మా
పల్లెల నిండా
వీధి వీధి నింటింటా
విశ్వైక్యం బోధిస్తూ ॥

## 92. అక్షరాలు

అక్షరాలు తేవయ్యా – మాలో
అభిమానము వెలిగించుమయా !
దళిత జనోద్ధారక అంబేడ్కర
ధర్మ జ్యోతివి నీ వయ్యా !

ఏండ్ల కొలది బీండ్లై మా బ్రతుకులు
ఎదురు చూచుచున్నవి నీ కోసం,
దివ్యములౌ నీ హిత బోధలతో
ధీ శ్రీ పంటలు పండించు మయా !

చదువు కొండి ! సంఘటితులు కండి
స్వామ్యమ్ములకై పోరాడండి
లేవండీ అని ప్రతి నిత్యము మము
లేపే జీవన కోకిల వయ్యా !

## 93. సాంఘిక న్యాయం

సాంఘిక న్యాయం కావాలి
సములై యెల్లరు మెలగాలి,
తోటలోని ప్రతి మానవ వృక్షం
తోడు నీడగా యెదగాలి !

ఆర్థిక దాస్యం తొలగాలి
అందరు స్వేచ్ఛగ బ్రతకాలి,
అధికారంలో ఆధిక్యతలో
అందరికీ హక్కుండాలి ॥

భారత జనతోద్ధారణకై
విశ్వ ప్రజా సమైక్యతకై
అంబేద్కరు చేసిన ఉద్బోధలు
ఆమని పూలై విరియాలి ॥

## 94. నీవు చేయని

నీవు చేయని త్యాగ మేదయ్యా ?
అంబేడ్కరయ్యా !
నీవు వ్రాయని జ్ఞాన మేదయ్యా ?

అంటరాని తనమ్ము బాపుడు
అగ్ర అంత్య విభేద ముడుపుడు
కుల వ్యవస్థను రూపుమాపుడు
కూర్మితో జీవించు డంటూ ॥

తెల్ల దొరలకు నచ్చజెప్పి
తెచ్చితివి ప్రత్యేక హక్కులు
హిందు సంఘ సమైక్య మెంచి
ఎఱ్ఱవాడకు ధారపోస్తివి ॥

ధర్మ వీరము బోధ చేసి
దళితులకు గమ్యమును చూపి
సర్వ సమతా రాజ్య రమ్మకై
శక్తి యుక్తులు పిండి పోసి ॥

## 95. దళిత భారత జనా

దళిత భారత జనావళి కేనా ?
ధాత్రి లోని దళితుల కందరకూ
మార్గ దర్శకుడ వీవయ్యా !
మాన్య శ్రీ అంబేద్కరా !

ఎక్కడ సాంఘిక న్యాయం లోపించెనో
ఎక్కడ ఆర్థిక దాస్యం తెగించెనో
అక్కడ నీ నామమె తారక మంత్రం !
అక్కడ నీ విధానమే నిదానం !

దళితులు పూర్వం – దుష్టుల
దాడికి బెదిరి పోయేరు,
ఇపుడు నీ పతాక కింద
ఎదిరించే యోధు లైరి !

# 96. ఎన్ని చదువులు

ఎన్ని చదువులు చదివినావు,
అంబేద్కరా, నీవు
ఎన్ని రచనలు చేసినావు ॥

ఇలలోన గల చదువు
లెల్ల చదివావు
ఎల్లెడల మానవుని
హితమె కనినావు ॥

దళితు లని, ద్రవిడు లని
ఆర్యులు అనార్యులని
మక్తాలు లేవు అన్నావు, నరుల
రక్తాలు పోల్చి చూపావు ॥

మనిషి మనిషికి నడుమ
మత భేద మేమిరా ?
మూఢ విశ్వాసాలు
వీడరా అన్నావు ॥

## 97. కూడు గుడ్డ కొంప

కూడు గుడ్డ కొంప – ఈ
మూడే మా కోరికలు,
ఇవి కూడా తీరకుంటె
ఎట్లా చచ్చేది రా ?

హృదయం తెలిపే పాటి
చదువైనా రాకుండా
తల నొప్పిని తొలగించే
తైలమైన లేకుండా
హీనంగా దీనంగా
ఎట్లా చచ్చేది రా ?

రక్తం పీల్చుక పోయే
రాడీ నెదిరించ లేక
పేవుమెంటుపై కుమిలే
జీవిని పై కెత్త లేక
ఏ విలువకు నోచుకోక
ఎట్లా చచ్చేది రా ?

## 98. నా కొక దేశం కావాలి

నా కొక దేశం కావాలి
నా దొక జాతిగ నిలవాలి !
ఆది మానవుని వేద కాశ్యపిలో
నాది నాకు రావాలి !

బౌద్ధ, క్రైస్తవ, ముస్లిం తెగలకు
సొంత దేశములు లేవా ?
హిందూ దేశము నా దంటే
ఎందుకు నాతో పేచీలు ?

నేను మనిషిగా బ్రతకాలంటే
నిలువ నీడ దొరకాలి !
నానా జాతుల సమ్మేళనలో
నా అస్మిత నా కుండాలి !

## 99. నిరు పేదల మయ్యా

నిరు పేదల మయ్యా, బాబా
నిను వెదకుచు వచ్చితి మయ్యా ॥

పల్లెల నుంచీ, పొలముల నుంచీ
పేటల నుంచీ, ఫేక్టరీల నుంచీ
న్యాయం దొరకని వాళ్ళం, నీ
సాయం కోరిన వాళ్ళం !

తమ కడుపే తమ లోకముగా, మా
ప్రతినిధులే మా వంక చూడరు,
నీ వున్నావని గంపెడాశతో
నీ ఆశ్రమముకు వచ్చితి మయ్యా ॥

ఇలలో నీవే లేనప్పుడు మా
కెవ రున్నా రిక, బాబా ?
నీ రచనలలో నిన్ను విందుమా ?
నీ ప్రతిమలలో నిన్ను చూతుమా ?

## 100. ఏమిటి ఆలోచన

ఏమిటి ఆలోచిస్తున్నావు ?
ఎందు కలా వున్నావు ?
అంబేడ్కరు మహాశయా !
అంతా ఒకటే నయ్యా !

ఎల్లరు నరు లొక టైతే
ఇన్ని మతా లెందుకు ?
మహి కొకడే ప్రభు వైతే
మత కలహా లెందుకు ?

నీతులు నియమా లొకటే
జాతి మనుగడే ముఖ్యం,
జాతీయతలో బౌద్ధమె
సౌఖ్య ప్రద మౌనయ్యా !

దేవు డొకడె కావచ్చు
దేశం ఎవరిది వారిదె,
ఏక జాతి నిర్మాతవు
నీకు సాటి ఎవరయ్యా ?

## 101. ఎంత మథన పడి

ఎంత మథన పడితివో
సొంత మతము ఏడిపోవ ॥

మత మూఢాచార పరుల
మతి మాలిన ఛాందసుల
నెత్తురు కోరల నుంచి
నిమ్నార్తుల నుద్ధరింప ॥

అస్పృశ్యత, కుల పద్ధతి,
ప్రారబ్ధము వంటి స్వార్థ
గత చింతా చితుల నుండి
మతము నుద్ధరించగా ॥

జననీ ! ఓ జన్మభూమి !
జాగృత వగుమా ! యనుచు
మౌనాక్రందనతో వేద
మాత నెంత పిలిచితివో ॥

# 102. నీ వొసగిన సౌకర్యాలు

నీ వొసగిన సౌకర్యాలను పొంది
నీ పేరున పదవులు సంపాదించి
నీ ఆదర్శము మరచిన
నీచుల గని దురపిల్లే
నీ వేదన చూచి నేను
నిర్విణ్ణుడ నైనాను ॥

దళితుల గుడిసెల నుంచి బైటపడి
దళితుల కోటాలు గొని బాగుపడి
దళితుల మని చెప్పుకోని
దద్దమ్మల గని వగచే
నీ దుఃఖము చూచి నేను
నిర్విణ్ణుడ నైనాను ॥

నిర్భాగ్యుల నుద్ధరింపు మని
నీ విచ్చిన నిధుల నెల్ల గొని
తామే తిను నాయకులను
ఏమీ చేయగ లేని
నీ కోపము చూచి నేను
నిర్విణ్ణుడ నైనాను ॥

## 103. గాయాలను మాన్పవచ్చి

గాయాలను మాన్ప వచ్చి
గాయ పడితివా నీవే ॥

సహ జన్మల శ్రమ జీవన
సంపదలను దోచుకొనుచు,
ధర్మము నకు నీళ్లు వదలి
దాయాదులు చేసిన పలు ॥

అంటరాని తన మను నొక
తుంటరి శాసనము చేసి,
వెట్టి చాకిరీ బాంచల
జుట్టు పట్టి కొట్టిన పలు ॥

మానవతకు అడ్డముగా
మాయ గోడలను కట్టి,
ఎదిరించిన మేధావుల
హృదయాలను చీల్చిన పలు ॥

# 104. నీ విక లేవా మాకు

నీ విక లేవా మాకు ?
నీ దర్శన మిక లేదా మాకు ?

జీవిత మంతా మా దళితుల సం
క్షేమం కోసం పోరాడిన బా
బా సాహే బంబేద్కరా – నీ
పలుకులు వినబడవా ఇక మాకు ?

బౌద్ధము కుల దుష్టము కాదని మము
పరమ సాధువుల జేశావు,
పడగ లెత్తి దండెత్తే కుల స
ర్పాలకు బదులే మిచ్చావు ?

కులము పోనిచో భారత జాతికి
విలయ మొకటె దిక్కన్నావు,
జాత్యైక్యత సాధించక ముందే
జన్మను చాలించావు ॥

## 105. నిష్కుల సమాజ

నిష్కుల సమాజ ప్రవక్తా !
నీకు జయ మగు గాక,
నీకు శుభ మగు గాక ॥

కుల చిహ్నములు వదులుకోలేని నరులు
కూపస్థ మండూకములు,
తమ కూపమే గొప్ప దనుకొందురు
తమ గొప్పలే లోక మనుకొందురు ॥

ఏక దేశపు పౌరు లందరూ
ఏ కుమ్మడిగ బ్రతక లేకుంటే
లోక మానవు డెట్లు రూపొందును?
ఏకేశ్వరత్వ మెటు రుజువౌను ?

శిష్ట జగమును పెంచి పోషింప
దుష్ట నిర్మూలనము తప్పదు,
దయకు విలువేమున్న దీనాడు ? నరుడు
దండ నీతిని తప్ప గుర్తించడు ॥

# 106. అన్యాయము నెదిరించని

అన్యాయము నెదిరించని
ఆతడు నిర్వీర్యుడు,
హక్కులకై పోరాడని
ఆతడు పశు తుల్యుడు ॥

ఎంతటి ధనవంతుడైన
ఎంతటి అధికారియైన
జాతి స్పృహ లేనివాడు
చచ్చిన వాడితొ సముడు ॥

తనకు నేర్పిన విద్యలో
తనకు దక్కిన సుఖములో
సంఘ నిధికి వంతొసగని
జనుడు చోరుడు క్రూరుడు ॥

## 107. సూర్యు డుదయిస్తాడు

సూర్యు డుదయిస్తాడు, అస్తమిస్తాడు
అస్తమించిన వాడు వస్తాడు తిరిగి,
ధర్మ సూర్యుడ వీవు అంబేడ్కరా !
తరలి రావా మరల అంబేడ్కరా !

ఎపుడు ధర్మగ్లాని ఏర్పడునో అపుడెల్ల
అవతరిస్తా నన్న యతడు మోసము చేసె,
అదను మించక ముందె అంబేడ్కరా !
అవని గావగ వలదె అంబేడ్కరా !

పులుల పంచల నుండి పాడి యావుల మంద
ఆర్తితో అరచు చున్నది విడుదలను గోరి,
దుష్ట శిక్షణ లేక అంబేడ్కరా !
శిష్ట రక్షణ ఎట్లు అంబేడ్కరా !

# 108. ఆకాశంలో తారకలు

ఆకాశంలో తారకలు
లోక బాంధవుల మెదడులు,
అదిగో అదిగో చూడండి
అంబేడ్కరు ఆత్మ జ్యోతి !

శ్రవణం కంటే, శతభిష్ కంటే
సప్తర్షుల వేదిక కంటే-
మానవతా కరుణా ప్రదీప్తితో
మన కేసే చూస్తున్న కన్నదే !

పైకి చూడండి, సోదరులారా !
పాడు స్వార్థాలు వీడండి !
అంబేడ్కరు ఆదర్శం చేగొని
అభ్యుదయం కేసి పదండి !

విశాల దృష్టీ, వివేక పుష్టీ
విజ్ఞానాత్మక వాగ్ధాటీ,
త్రికరణ శుద్ధీ, సమ బుద్ధీ మన
దేశ నైజమని తెలియండి ॥

## 109. వ్యక్తి కంటె దేశం

వ్యక్తి కంటె దేశం గొప్పదిరా
వ్యక్తి కంటె జాతి ప్రధానంరా ॥

వ్యక్తి ఒక్కడే ఎంతటి
శక్తి మంతుడైనా,
వ్యక్తులు కోటాను కోట్ల
వ్యక్తిత్వంరా దేశం ॥

మానవుడి వ్యక్తిత్వ మంతా
మాతృదేశ ప్రసాదమేరా !
మానవుడి సుఖ శాంతు లన్నీ
మాతృభూమి సుభిక్షమేరా

జగతి లోన ప్రతి జాతికి
స్వదేశ మొక టుండాలి,
దేశ భక్తితో జాతి
స్థితి మంతం కావాలి ॥

## 110. అంటరాని తన మొకటే

అంటరాని తన మొకటే
ఆటంకము ఎస్సీలకు,
అది పోతే దేశంలో
అందర మొకటే జాతి ॥

కుల మతాల భేదాలు
నలుపు తెలుపు తేడాలు
స్వార్థ విభజనలె తప్ప
భరత రక్త మొకటే కద ॥

స్మృతుల నెల్ల రద్దు చేసి
శ్రుతుల కేసి పయనిస్తే
ఏక జాతిగా భారత్
ఏల గలదు సకల జగత్ ॥

# 111. జాతి విద్వేషములు

జాతి విద్వేషములు వల దన్నా !
లోకమున మానవ
జాతు లన్నియు ఒక్కటే నన్నా ॥
జాతి విద్వేషములు వలదు
సర్వ జాతులు భూమి పుత్రులె,
భూమి పైగల జీవ కోటికి
భూమి మొత్తం ఉమ్మడాస్తి ॥

ఎవరి దేశం వారిదే నన్నా !
ఆ పరిధి లోన
ఎల్ల రొకటే జాతియౌ నన్నా !
ఒకటె దేశం, ఒకటె జాతి
ఒకటె నీతిగ బ్రతక వలయును,
భేదములు కల్పించుకొనుట
బాధలను కొని తెచ్చుకొనుటె ॥

సమత ఒకటే ధర్మ మగు నన్నా !
దేశస్థు లొకటే
సంఘముగ జీవించ వలె నన్నా !
ఎవ్వ రెక్కడి నుంచి వచ్చిన
ఎల్లరొక యెడ చేరి నప్పుడు
వ్యష్టి ధోరణి కట్టిపెట్టి, స
మష్టిగా బ్రతక వలె నన్నా ॥

## 112. ఏదో ఒక మతము

ఏదో ఒక మతము లేక
ఏ నరుడును బ్రతక లేడు,
దుష్టు డైన, శిష్టు డైన
దొర యైనను, దళితు డైన ॥

సృష్టి లోని ప్రతి అణువుకు
స్వీయ నైజమే మతము,
నైజానికి దూరమైన
నమ్మకమే నరుడి మతం ॥

మత మందుకె వద్దంటివి,
మంచి తనం చాలంటివి,
బుద్ధికి త్యాగం నేర్పి
బుద్ధాత్ములు కమ్మంటివి ॥

# 113. హిందువుడుగ చావ

హిందువుడుగ చావ నంటివి, మరి
ఎందుకు బౌద్ధమును గొంటివి ?
హిందూ బౌద్ధముల నడుమ
ఏ భేదం కనుగొంటివి ?

నాలుగు ఆశ్రమములలో
నాలుగవది సన్యాసం,
సన్యాసం పూర్ణ జీవి
త న్యాసం కల దెట్లగు ?

హిందూ బౌద్ధములు రెండు
ఏక వాహినీ శాఖలు,
మూలము చెడకుండా ని
ర్మూలింతువె కాలుష్యము ?

ఒక దేశం, ఒక జాతి
ఒక న్యాయం, ఒక బ్రతుకు !
సిద్ధించును నీ లక్ష్యం,
సిద్ధార్థుడ, వంబేడ్కర ॥

# 114. ఇదే వీడి పోవు చుంటి

ఇదే వీడి పోవు చుంటిమి,
హిందూ మత మాతా నిను ॥

కన్న తల్లి వై యుండీ
చిన్న బిడ్డలైన మమ్మ
క్రూరంగా హింస పెట్టి
దూరంగా తరిమిన నిను ॥

భూము లాక్రమించుకొని
పురము లెల్ల దోచుకొని
పేదలుగా మార్చి మమ్మ
పెంటల పాల్జేసిన నిను ॥

మా కన్నీటిని తుడిచి
మా కన్నులు తెరిపించి
అభ్యుదయము చూపించిన
అంబేడ్కరు మార్గంలో ॥

# 115. దారి చూపినావు

దారి చూపినావు
ధర్మ జ్యోతిని బట్టి ॥

ధర్మ జ్యోతిని బట్టి
ధన కామిత సౌఖ్యాలకు,
జవ సత్వాలను తట్టి
నవ మానవ హక్కులకు ॥

ఏక జాతి, ఏక నీతి
ఏక లక్ష్య మన్నావు,
సొంత శక్తి తెలుసుకొని
అంతు తేల్చ మన్నావు ॥

ఎవడైతే ఆత్మీయత గల హితుడో
ఎవడైతే ఆపద్బాంధవుడో,
అతడేరా సిద్ధు డనీ
ఆతడేరా బుద్ధు డనీ ॥

గతి చిక్కని చీకటిలో
మతి కలచే మిణుగురులను
పారదోలినావు, మా
పాలి దైవ మైనావు ॥

# 116. పూజింతుము నిన్ను

పూజింతుము నిన్ను
పురుషోత్తమ, అంబేద్కర ॥

రంగులలో, రేఖలలో
రమ్య శిలా శిల్పాలలో
నీ ప్రతిమలు తీర్చి దిద్ది
మా ప్రాణము పోసి నిల్పి ॥

ఎడ్యుకేటు, ఆర్గనైజు,
ఏజిటేటు, హక్కులకై,
పోరాడుం డనుచు సతము
బోధ చేయు గురుదేవా ॥

నీ వొసగిన ఈ విద్యలె
నీరాజన దీపాలుగ,
ఈ శక్తులు, ఆసక్తులు
ఇష్టాంకిత ధూపాలుగ ॥

బోధి సత్వ విజయాత్మకు
బుద్ధుడె దేవు డైనట్టు
అట్టడుగు జనాళి కెల్ల
అంబేద్కరె దేవుడుగా ॥

# 117. నీ యాకృతి గీయుట

నీ యాకృతి గీయుట – చిత్ర కళ
నీ ప్రతిమను మలచుట – శిల్ప కళ
నీ కృతులను నిర్మించుట – కావ్య కళ
నీ కీర్తిని పాడుట – గాన కళ ॥

నా ఎదలో ఇన్ని కళలు
నన లెత్తిన దెందుకు ?
విశ్వ మానవత నీలో
విరచించే టందుకు ॥

క్రియా శక్తి వీవు, స
ర్వేశ్వర సమ స్రష్ట వీవు !
ఇచ్ఛా శక్తిని నేను
ఈ నా దెల్లను నీదే ॥

నా కృతి కొక వస్తువై
నా కళ కొక కావ్యమై,
దీన జనావనుడవై
దేవుడవై వెలసిన నీ ॥

## 118. వీ రెవరు, వా రెవరు

వీ రెవరు, వా రెవరు  జ్ఞానేశ్వరా
ఇన్ని
వేల మం దొచ్చారు, జ్ఞానేశ్వరా !
దండుగా వచ్చారు, జ్ఞానేశ్వరా
పూల
దండలై విచ్చారు, జ్ఞానేశ్వరా ॥

* * *

వీరు కాంగ్రెసు వారు, అంబేడ్కరా
వారు
బీజేపి వారండి, అంబేడ్కరా !
కమ్యూనిస్ట్ పార్టీలు, అంబేడ్కరా
వివిధ
కార్మికుల సంఘాలు, అంబేడ్కరా ॥

* * *

దళితులే కాదండి, అంబేడ్కరా
ఎల్ల
కులములూ వచ్చారు, అంబేడ్కరా !
బస్తీలు కదిలాయి, అంబేడ్కరా
పల్లె
పట్నాలె లేచాయి, అంబేడ్కరా ॥

* * *

గద్ద రొచ్చాడండి, అంబేడ్కరా
సభకె
గజ్జె కడతా డింక, అంబేడ్కరా !
తారకం వచ్చాడు, అంబేడ్కరా
మంచి
ఆరేష నిస్తాడు, అంబేడ్కరా ॥

* * *

మాష్టర్జి వచ్చాడు, అంబేడ్కరా
గేయ
మాల లందిస్తాడు, అంబేడ్కరా ॥
ప్రతి ఏడు ఏప్రెల్‌లో, అంబేడ్కరా
నీకు
పండగలు చేసేరు, అంబేడ్కరా ॥

* * *

వాణితో శృతి కలిపి, అంబేద్కరా
అశోక్
కోనాడ పాడేడు, అంబేద్కరా,
విన్సెంటు బండారు, అంబేద్కరా
నిన్ను
విన్పించు గొంతెత్తి, అంబేద్కరా ॥

* * *

వారెవరు, వారెవరు ? జ్ఞానేశ్వరా
వోట్ల
వర్తకుల వలె నుండ్రి, జ్ఞానేశ్వరా ॥
తెలివిగా నా పేర, జ్ఞానేశ్వరా
ఎన్ని
కలు దోచుకోగలరు, జ్ఞానేశ్వరా ॥

* * *

ఆ భయము లేదిపుడు, అంబేద్కరా
ప్రజలు
ఆర్గనైజయ్యారు, అంబేద్కరా !
అఖిల భారత జనులు, అంబేద్కరా
ఇపుడు
అంబేద్కరిస్టులే, అంబేద్కరా ॥

❋ ❋ ❋


అకాండ
తాండవం
బోయి భీమన్న

# పూర్వరంగం

''ఈ కావ్యానికి ఏం పేరు పెట్టారు, మాష్టారూ?'' అన్నారు పండితారాధ్యుల నాగభూషణం గారు – నా చేతి లోని వ్రాత పుస్తకాన్ని తీసుకొని, అక్కడక్కడ చదువుతూ, ఓ పది నిమిషాల పాటు పేజీలు తిరగవేసి.

అంతలో వచ్చా రక్కడికి, ఇలపకుర్తి గవర్రాజు గారు! విభూతి, చందనం ఇత్యాదులతో, సాక్షాత్తు గౌరీ రాజు ఇలానే ఉంటాడన్నంత ఉగ్రలలితంగా ఉండే వారాయన!

వస్తూనే – పుస్తకాన్ని తీసుకొని, నా ముఖంలోకి ఒక క్రేగంటి విదియ వెన్నెల తుపర్ని విసిరి, గొంతెత్తి పాడసాగారు – అందులోని గేయాలను, రాగ మధురంగా!

ఎంత తపస్సు చేస్తే అంత శ్రావ్యంగా పాడడం అబ్బుతుందో!

''ఇంకా పేరేం పెట్టలేదండీ!'' అన్నాను నేను, నాగభూషణంగారి ప్రశ్నకు సమాధానంగా.

''అయితే, నేనొక పేరు సజెస్టు చెయ్యనా?''

''ఓ!''

''అకాండ తాండవం – అని పెట్టండి!''

''బాగుంది!''

ఆ విధంగా, నాగభూషణం గారిచే సూచించబడి, గవర్రాజు గారిచే ఆశీర్వదించ బడ్డ ఆ పేరే ఈ కావ్యానికి మకుటం అయింది.

ఇది జరుగుత 1940లో – ముమ్మిడివరంలో. బాలయోగి రూపంలో ఒక యోగి పరమాద్భుతాన్ని నేటి భౌతిక మానవుడికి ప్రదర్శించి చూపుతున్న ఆ ముమ్మిడివరంలో!

ఈ కావ్యాన్ని వ్రాయడం నేను ప్రారంభిస్త కూడ అప్పుడే, అక్కడే. నేడు ఆ మహా యోగికి ఆశ్రమ క్షేత్రమైన ఆ కొబ్బరి తోట కాలవ గట్టు మీదే!

నేను కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన తొలిరోజులవి. నాగభూషణం గారూ, గవర్రాజు గారూ అక్కడ నాకు సహోపాధ్యాయులు, వయో వృద్ధులే కాదు, జ్ఞానవృద్ధులు వారు. సర్వజన శ్రేయో విభూతి యోగులు, శివ స్వరూపులు!

ఆ తర్వాత – తోచినప్పుడెల్లా ఒకొక గేయం చొప్పున చేరుస్తూ వచ్చాను ఈ కావ్యానికి – మానవ స్వభావంలోని ఒకో గుణ లేశానికి ఒకో పుష్పార్చనంగా!

ఒకొక గేయంలో ఎనిమిదేసి చరణాల చొప్పున 189 గేయాలున్నై ఈ అకాండ తాండవంలో. శివతాండవంలో ప్రతి గేయమూ ఘల్లుమనే ఒక గజ్జె కనుక, ఈ గేయాలకు "గజ్జెలు" అని పేరు పెట్టాను.

ఈ గజ్జెలు అన్నీ ఒకే ఛందస్సులో వ్రాయబడినై. ఆటకూ, పాటకూ కూడ అందంగా ఒదుగుతై. ఒకొక చరణంలో 3+4+3+4=14 మాత్రలు ఉంటై. అది చరణం గరిష్ఠ పరిమాణం. భావ రాగ తాళ గతుల్ని బట్టి ఒకొక చరణంలో అంతకంటె తక్కువ మాత్రలు ఉండవచ్చు. వ్యావహారిక భాషా సంప్రదాయంలో హ్రస్వదీర్ఘ శబ్దాల మధ్య సర్దుబాట్లు కూడ చేసుకోగలరు – సహృదయ గాయక గాయనీ సఖులు.

ఈ గజ్జెలు ఏ క్షణంలో, ఏ ప్రయోజనం కోసం నా హృదయ వేదికపై ఘల్లు మన్నాయో తెలియదు. ఈ నాడు మాత్రం – శివాద్వైత పరమానంద పారమ్యం మాత్రమే ఇవి నా కివ్వగల సారస్వత శ్రీకైవల్య సిద్ధి.

ఇది ఈ కావ్యారంభం గాథ.

❋ ❋ ❋

ఇక్కడ నాకు పూర్తిగా వ్యక్తిగతమైన ఒక చిన్న తమాషా:

ఈ కావ్యాన్ని ప్రారంభించి ఇరవై ఆరు సంవత్సరా లయిందనీ, ఇప్పటి దాకా – అచ్చులో ప్రూఫులు దిద్దు కొంటున్నప్పటిదాకా కూడ – దీనిని వ్రాస్తూనే ఉన్నాననీ, నేను సత్యం బైటికి చెప్పాననుకోండి! దానితో, ఈ కావ్యాన్ని తిట్టాలనుకొనే మహాశయుడికి ముఖం చేటంత అవుద్ది! భీష్ముడి లాంటి, ద్రోణుడి లాంటి ఒక మహాయోధుడు తాను ఎలా చస్తాడో రహస్యం తానే చెప్పినప్పుడు – ధర్మరాజు ముఖమో, అర్జునుడి ముఖమో ఎంత అయి ఉండి ఉంటుందో – అంత చేటంత!

నూట ఎనభై తొమ్మిది గజ్జెల్ని వ్రాయడానికి ఇరవై ఆరు సంవత్సరాలు - సుమారు తొమ్మిది వేల మూడు వందల అరవై రోజులు - పట్టిందన్న సాంఖ్య సూత్రంతో, సదరు మహాశయుడు అమాంతం ఒక్కసారిగా కపిల మహర్షే అయి పోతాడు. అప్పుడే అతడికి నా కులమూ, సమాజంలో దాని దిక్కు లేని తనమూ, ములుగర్రతో పొడిచినట్టు జ్ఞాపకం వస్తై. వెంటనే వ్రాసేస్తుం దతడి కలం, ''ఇందులో సమాధి లోపించిం''దనో, మరోటనో!

ఋషి కాక కవి కాడనీ, కవి అయిన వాడు కులమతాలకు అతీతుడనీ ఎరగడతడు. వ్యాస వాల్మీ కాదుల్ని చూచి కూడ గ్రహించలేడు!

ఇంతకూ - నాపై విసరగల ఆయుధాలలో ఒకటి ఇప్పుడు నేనే అతడికి అందిచ్చా నన్నమాట!

''త్రిపదలు'', ''మానవుని మరొక మజిలీ'' కావ్యాల పీఠికలలో నేను చెప్పుకొన్న కొన్ని అంశాలు - కొందరు కువిమర్శకులకు అంకుశాలుగా ఉపయోగపడినై - తిరిగి నా మీదకు విసరడానికి. అందుకే ఈ మాట అనవలసి వచ్చింది - అసందర్భమే అయినా.

నేడు సాహిత్య రంగంలో ఉన్న అందరూ అలాంటి మహాశయులే కాదు. కుల ద్వేష పాప పంకిలానికి అతీతులైన, సర్వజనసములైన మేటి కవులు, పండితులు దేశంలో చాల మందే ఉన్నారు. అది కొంత అదృష్టం. వారికి నా జోహారులు.

''ఈ కథంతా ఎందుకు చెప్పుకోవాలి? అంతగా చెప్పుకోవాలని ఉంటే - కావ్యం మొత్తం ఏక బిగిని రెండు రోజుల్లో వ్రాసేశాననో, సరస్వతే ఒక రాత్రి వచ్చేసి వ్రాసి పోయిందనో చెప్పుకో వచ్చుగా?'' అనవచ్చు కొందరు - నా మిత్రుడు శాస్త్రి అన్నట్లు, ''నేను అబద్ధం ఆడలేను'' అన్నదే అందుకు నా జవాబు.

ఆ తర్వాత ఈ మధ్య కాలంలో - నా జీవితం లోను, ఈ కావ్య నిర్మాణం లోను ఎన్నో మార్పులు జరిగినై. ఎన్నో పుటలు తిరిగినై. గోదావరి నుంచి మద్రాసుకు, మద్రాసు నుంచి హైదరాబాదుకు మారింది రంగం.

1960లో - వాఙ్మయ మహాధ్యక్ష వడ్లమూడి గోపాలకృష్ణయ్య గారు ఆరాధన పత్రికకు సంపాదకులుగా ఉన్నప్పుడు - ఈ అకాండ తాండవం అందులో సీరియలుగా

ప్రకటించబడింది. మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి, కావ్యతీర్థ డాక్టర్ అరిపిరాల విశ్వంగార్ల వంటి ఆధునిక సాహితీ తత్త్వవేత్తల, మహా విమర్శక ఆచార్య నిడదవోలు వెంకటరావుగారి వంటి మహామాహేశ్వరుల పొగడికల్నీ కూడ గడించుకొన్నదిది అప్పుడు.

ఇది ఈ కావ్యం చరిత్ర.

❊ ❊ ❊

శైవ మతంలోని శివుడికీ, ఈ నా కావ్య తత్త్వంలోని శివుడికీ సాదృశ్యం ఉండవచ్చు. ఎవరి, ఎప్పటి, ఏలాంటి శివుడైనా – ఒక్కడేగా? అయినా, ఈ నా కావ్యంలోని శివుడు మాత్రం పూర్తిగా నా హృదయ పద్మస్థుడు. నా మనోరంగంలో నిరంతరంగా ఆడుతూ, పాడుతూ ఉన్న ఒక నాద నర్తకుడు. నా భావనా శిల్పం యధేచ్ఛగా తీర్చిదిద్దుకొన్న మూల చైతన్యమూర్తి. అందువల్ల, ఈ కావ్యంలోని నటరాజును దర్శించాలంటే – సంప్రదాయాన్ని కాక, నా భావలయను అనుసరించవలసి ఉంటుంది ఆనంద కళాసాధకుడు!

ఈ దృశ్యాదృశ్య ప్రకృతి సమస్తమూ మహాశివుని తాండవ కళా ప్రదర్శనమే. ఆవేశ స్థాయిని బట్టి ఉంటుంది దాని రసవిక్షేపం.

నృత్తం, లాస్యం, నర్తనం వంటి వన్నీ తాండవం నుంచి పుట్టిన జన్య కళలే. వాటి రస భావ వృత్తులు, శతకోటి అనువృత్తులు, ఏతద్విక్షేప వ్యంజక ప్రవృత్తులు, అభివ్యక్తులు – ఈ మొత్తం అన్నీ రాగ లయాత్మకంగా కలిసిన శివుని సమగ్ర నాట్య క్రీడే – అంతటి వైవిధ్యం తోనూ క్రీడిస్తూ ఉన్న ఈ ప్రకృతి!

శివుడు నర్తకుడు. నర్తకుడు కనిపించడం లేదు. అతడి నృత్యం మాత్రమే కనిపిస్తున్నది.

తాను కనిపించక, తన నృత్యం మాత్రమే కనిపించేటంత వేగంగా, కళాత్మకంగా, తన కళలో తాను లీనమై తాండవిస్తున్నాడు శివుడు. అతడి కళాకాంతులే, విలాస విభ్రమాదులే ప్రకృతిలోని చరాచర చేతనాచేతన వర్గం అంతా. అదంతా అతడి నుంచి పుడుతూ, పెరుగుతూ, తిరిగి అతడిలోనే లయిస్తూ, అతడి చుట్టూ పరిభ్రమిస్తున్నది.

నర్తకుడి నుంచి అభివ్యక్తమైన కళా విశేషం. అది తిరిగి అతడిలో లయమై పోయేదాకా, పరమ శివమైన స్వేచ్ఛా ప్రవృత్తి కలిగినట్టిదే. దానికున్నది క్షతమాత్ర జీవితంలో లేశమాత్ర స్వేచ్ఛే అయినా, దానిని అది మొత్తం సృష్టి యొక్క సముదాయక శ్రేయస్సు కోసం వినియోగించవచ్చు. అలా వినియోగించడమే నిజమైన సత్యం, శివం, సుందరం. అదే దాని జీవిత సాఫల్యం కూడ!

శివుడు కూడ తన తాండవ కళా ప్రయోగోపసంహార విధానంలో కించిత్తు మార్పు చేసుకోవచ్చు. ఇప్పటి సృష్టిలోని మంచి చెడ్డల నుంచి చెడ్డను పూర్తిగా తొలగించివేసే రీతిలో తన నాట్య స్థాయిని అతడు పెంచుకోవచ్చు. పరిష్కరించు కోవచ్చు.

కవి సృష్టించిన పాత్ర సజీవమైన దైనప్పుడు, ఆ పాత్రే కవిని ఉత్తేజపరచి, ముందుకు నడిపిస్తుంది. శిల్పి ద్వారా కళ, కళ ద్వారా శిల్పి పరస్పరం సృష్టి పొందుతూ, ముందుకు పోతూ ఉంటారు. అలానే – శివుడు కళను సృష్టించి నప్పుడు, ఏ తత్కాళ శివుణ్నే ఇతోధిక జీవన కళా శిల్పిగా సృష్టించడంలో వింత ఏముంది?

ప్రకృతి పురుషులు పరస్ప రాధా రాధేయ శక్తులు.

నర్తకుడు నిరాకార బ్రహ్మ. నృత్యం సాకార ప్రకృతి. అట్టి ప్రకృతే ఈ కావ్యంలోని ఉమ! దాని కళా విన్యాసమే రమ!

శివుడు, ఉమ, రమ – ఈ ముగ్గురూ చైతన్యం, చేతనం, వికాసం.

నాదం, బిందువు, కళ.

ఆకాశం, మేఘం, వర్షం.

బీజం, ఫలం, రసం.

ఈ త్రిపుటీ భంగ సముద్భూత రస భాండం – ఈ అకాండ సుందర లీలా తాండవం.

నిత్య నిరంతర జీవన సుధాలహరి – ఇది.

ఇది ఈ కావ్యంలోని మూల సూత్రం.

❋ ❋ ❋

భాష విషయంలో సర్వ స్వతంత్రంగా వ్యవహరించే స్వభావం నాది. ఇష్టం వచ్చినట్టు పదాలను వాడతాను. ఇందులో మాత్రం అలాంటి స్వతంత్ర ప్రయోగాలు చాల తక్కువ.

శివ, సరస్వతి, హైమవతి, పార్వతి, ఉమ, రమ – ఇవన్నీ పర్యాయ పదాలుగానే, కించిత్తు అర్థభేదంతో వాడాను.

అందులో ఉమ, రమ పదాలను నాట్యానికీ, నాట్యకళా విక్షేపానికీ సాంకేతికాలుగా ప్రయోగించాను. కళా విక్షేపంలో గీతం, గానం, ఆతోద్యం, ఆహార్యం, రంగాలంకృతి, భావ శాబల్యం, రసాభిరుచి, అభినయ విభూతి, తన్మయతారేఖ వంటి మానవ పరమైశ్వర్యాలన్నీ ఉన్నై.

రమ అంటే లక్ష్మి కాక, కుండలిని కూడా కనుక, ఆమెను శివ శక్తిగా పేర్కొనడంలో వైరుధ్యం ఏం లేదుగా?

తాజమహలు పదాన్ని సమాసంలో వాడాను – "భగ్న మాధుర్య తాజ్మహలుడు" అంటూ. ఇలాంటి ప్రయోగాలు ఎన్నో లేవు.

ప్రాణ భూతం చేయు లేక ప్రాణీకరించు అనడానికి ప్రాణించు అన్నాను.

"రాభీ" అనే ఒక కొత్తమాట కనిపిస్తుం దీ కావ్యంలో. ఇది నా ప్రణయ గేయాలకు నేను పెట్టుకొన్న పేరు. సంగీత సాహిత్యాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ, ప్రకృతి పురుష పరంగా, ఆధ్యాత్మిక స్థాయిలో నేను వ్రాసుకొన్న గేయాలు వందల కొలదీ ఉన్నై. వాటిని 'భీమన్న రాభీలు' అనే పేరుతో, స్వర సహితంగా ప్రకటించడానికి కొందరు మిత్రులు కృషి చేస్తున్నారు. అదెప్పటికి ఫలిస్తుందో.

ఇదే కృషిలో కర్ణాటక సంగీతాన్ని సర్వజనీకరించాలన్న కోరిక ఉంది నాకు. సిద్ధి శివసరస్వతుల సమ్యగ్వీక్షతోడిది. గాత్ర సంగీత రాగ దైవతం అయిన ఆ శ్రీమహాలక్ష్మి కటాక్షం తోడిది.

ప్రయోగం, ప్రదర్శనం, ఉప సంహారం – ఇలా మూడు భాగాలుగా ఉన్నదీ కావ్యం. ప్రదర్శనంలో రకరకాల విమర్శలున్నై. నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న చెడ్డను గర్హించడం జరిగింది. అన్ని దాస్యాలతోపాటు ప్రాచ్య పాశ్చాత్య దేశాలకు భావదాస్యం కూడ చేస్తున్న మనకు ఇందులో కొన్ని గజ్జెలు రుచించక పోవచ్చు. అది సహృదయుల సంస్కారానికి వదిలి వేస్తున్నాను.

మానవుడికి ఉన్నత పదవిని సమకూర్చి పెట్టే సప్త సంతానాలలో కావ్యం మకుటాయ మానం. కర్తకు, స్వీకర్తకు, సహృదయులకు కూడా అమృత పదవిని అందివ్వగలది కావ్యం.

కావ్యాన్ని ఇష్టమైన వారికి అంకితం ఇచ్చుకొనే ఆచారం మనకు ఆది నుంచీ ఉంది. కృతి భర్త భగవంతుడు కావచ్చు, మహారాజు కావచ్చు, మిత్రుడు కావచ్చు. పోతరాజు, త్యాగరాజు వంటి కొద్ది మంది భక్త కవులు తప్ప, తక్కిన వారందరూ - నన్నయాదులు, శ్రీనాథాదులు, పెద్దనాదులు అందరూ - మహారాజులకే తమ కావ్యాలను అంకితం చేశారు. వారు సామాన్యులేం కాదు!

ఈనాడు ప్రజలే పాలకులు. వారి ప్రతినిధులే రాజులూ, మహారాజులూ, చక్రవర్తులూ. ఆనాటి ఒక చక్రవర్తి కంటె, ఈనాటి ఒక ముఖ్య మంత్రి అధికతర ప్రాభవం కలవాడు. ప్రజామోదం పొందిన ఉత్తమ నాయకుడు.

సాహితీ చక్రవర్తి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారితో ప్రారంభించి, ఆంధ్ర రాజ్య ముఖ్యమంత్రు లందరికీ నేను ఒకో కావ్యాన్ని అంకితం చేస్తూ వచ్చాను. రాజ్య ప్రజలలో ఒకడిగా, అంతకు మించి కవిగా, వారి పట్ల నాకు అధికతర భక్తి విధేయత లున్నై. పరమాత్మ కరుణ లేనిదే ప్రజా నాయకత్వం సిద్ధించదు. ప్రజలే పరమాత్మ. ప్రజా ప్రతినిధే ప్రజాపతి.

ఆంధ్రప్రదేశ రాజ్యపు నేటి ముఖ్యమంత్రి మాన్యశ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డిగారు చతుర్విధ పురుషార్థాలూ పేరులోనే మూర్తీభవించిన మహావ్యక్తి. ప్రజా ప్రేమ ధని, పరిపాలనా దక్షుడు. ఆయనకు ఈ కావ్యాన్ని అంకితం ఇవ్వగలగడం నా పుణ్యవిశేషం.

చేతనా ముద్రణాలయం హైదరాబాదులో కొత్తగా నెలకొల్పబడిన సంస్థ. అందులో ముద్రించబడ్డ తొలి గ్రంథం ఇదే. అయినా, ఎంతో ముచ్చటగా ముద్రించి ఇవ్వగలిగిన ముద్రణాలయం యజమాని శ్రీ గుత్తా రామచంద్రరావుగారికి నా అభినందనలు.

ఈ కావ్యం వెలుగు చూడడానికి రకరకాలుగా తోడ్పడిన మిత్రులు జె. బాపురెడ్డి, పి. బాలకృష్ణ, వై. శ్రీనివాసరావు గార్లకు, సుఖేలా నికేతన్ వారికి కృతజ్ఞతలు.

ముఖ చిత్రం నిర్మించి ఇచ్చిన చిత్ర శిల్పి పి. ఆర్. రాజుగారికి నమస్సులు.

రసాలిని, — బోయి భీమన్న

అశోక్‌నగర్. హైదరాబాద్

# అంకితం

ఆంధ్రప్రదేశ ముఖ్యామాత్యులు మాన్యశ్రీ

## శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి గారికి

కాసు అర్థము, బ్రహ్మ మోక్షము,
కామమది ఆనందము,
రెడ్డి ధర్మము – ఇట్లు నిన్ను వ
రించినవి పురుషార్థముల్ !

సరసమతిపై నీవు కారణ
జన్మనందిన యపుడె వేడ్కతొ
వేసినది మారాకు ఆంధ్రం !
కాసు బ్రహ్మానంద రెడ్డీ !

నీవు కళ్లెము పుచ్చుకొని, సమ
భావ వర్ధన హర్షమున్ గొన-
హర్షవర్ధన భావ వేగము
నందుకొనె ఆంధ్ర రాజ్య రథం !

అంధతమములు తరిగి విరుగ,
అభ్యుదయములు తొలకరించ,
వేసినది మారాకు జనత !
కాసు బ్రహ్మానందరెడ్డీ !

రాజు - పేద విభేదముడిగి
రాజ్యమున గల జనత మొత్తం
రాఘవాంబా పతివి నీకు
రామరాజ్య నమస్సు లీయ-

సర్వ భూమిని నీవు శ్రేయ
స్స్వామివై పాలనము చేయ-
వేసినది మారాకు విశ్వం !
కాసు బ్రహ్మానంద రెడ్డీ !

❋ ❋ ❋

## 1

అక్ష రాక్షర పర బ్రహ్మ !
అమృత జీవన రసబ్రహ్మ !
అర్ధనారీశ్వర స్వామీ !
ఆత్మ కల్పక బీజ భూమీ !
ప్రణవ నాదానంద లయలో
ప్రణయ వేదానంత దయతో
కాలు కదుపుమ ! మువ్వ మెదుపుమ !
ఘల్లు ఘల్లున ఆడుమా !

## 2

విశ్వ కావ్య మహా ప్రణేతా !
విషయ భావ రసాధి నేతా !
లోక నాట్య కళా విహారీ !
ఏక జీవన సూత్ర ధారీ !
కాలు కదుపుమ ! మువ్వ మెదుపుమ !
ఘల్లు ఘల్లున ఆడుమా !
అసమ తమసులు అడగి పోగా,
రస పయోధులు విరియగా !

## 3

కథక కథిత జగ ద్రహస్యా !

మథిత మధు జీవిత వయస్యా !

కాలు కదుపుమ ! మువ్వ మెదుపుమ !

ఘల్లు ఘల్లున ఆడుమా !

నీ కళా చలన వలనములే

ఏక రస సంధాన ధనలై

భావముల సృజియించగా,

భవములను నిర్మించగా !

## 4

కాలు కదుపుమ ! మువ్వ మెదుపుమ !

ఘల్లు ఘల్లున ఆడుమా !

నీ నిరంతర నృత్తములె ఈ

నిఖిల జగ దితివృత్తములు గా

తాండవింపు మఖండ గతిని, అ

కాండ తాండవ రాగ మతిని !

నింపు కొందును నేను గుండియ

నిండుగా నీ పద మధూళిని !

## 5

నీవు లింగాకృతివి ! కృతివి !
నీ వసంగాధృతివి ! ధృతివి !
నీ వసంత నిరంత రేచ్ఛా
భావలీలారతివి ! రతివి !
సరిగ సరిగము రిగము రిగమప
సనిద సనిదప నిదప నిదపమ !
తకిట తకతం ధిమిత ధింధిం !
తధిమితం ఉద్ధతం ఊర్ధ్వం !

## 6

ఓహో ! ఓహోహో ! ప్రభో ! నీ
ఉజ్వలోజ్వల జగన్నృత్తం
అచల పూర్ణ మహార్ణవంలో
అమృత మంథర మహిత మైనది !
సరస భావ సరస్వతీ మృదు
చరణ చారణ సుభగమైనది !
ఏక తాళోత్తాండవంలో
ఏక భావ విలాస లాస్యం !

## 7

ఎపుడు పుట్టితివయ్య అభవా ?
ఎపుడు కట్టితివయ్య గజ్జె ?
ఎపుడు నీ విలయోగ్రతకు తన
ఎదను చేర్చినదయ్య అంబ ?
ఏది మంద్ర గభీర ఘంటిక ?
ఏది తారా మసృణ కింకిణి ?
మరచిపోతివొ నిన్ను నీవే !
మరచిపోతివొ నన్నును !

## 8

అప్రవీక్ష్య మభార్య ముగ్రం
అప్రకార మరూప మగు నీ
ఘోర నృత్తం కైశికీ సుకు
మారమ్మైన చరిత్ర వింటిని !
నిజ మటయ్యా ? ఏది మరి త
న్నిజ నిసర్గ మనోజ్ఞ తత్వం ?
జ్ఞాన దీప్తుడు మనుజుడు, తన
మేను మరచుట కేది హేతువు ?

## 9

మేఘ నిర్ఘోష ప్రభుత్వం
మించు తీగకు కట్టు పడెనా ?
ఆత్మ మూలక జీవ తేజం
హైమవతితో తృప్తి పడెనా ?
ప్రగతి జీవన పరమ నృత్తం
పరవశమ్మై విశ్రమించెన ?
ఎపుడొ కదిలిన మువ్వ మ్రోతే
ఇపుడునున్ బ్రతు కయ్యెనా ?

## 10

అనను శివు నేమియును అనను,
అనను పార్వతి నన్ను అనను,
అనను శివ పార్వతుల నేమియు,
అఖిలమును తమ క్రీడయే !
నృత్త గీతాతోద్య పునరా
వృత్తి ఈ జగ మెల్ల తమదే !
ప్రవర్తించుట పుణ్యమైతే,
నివర్తించుట పాప మగునా ?

## 11

సంతతముగ, నిరంతరముగా
ఎంత కాలము ఆడినా-
ఆట అనునది కలిగి నప్పుడు
అలసటే లేకుండునా ?
ఆడి ఆడీ, ఆటలోనే
అర్థ నారీశ్వరత నొంది,
సర్వ సృష్టికి ప్రాణమై, వి
శ్రాంతి కోరుట నేరమౌనా ?

## 12

పాఠ గా నాభినయ రసయుత
పరమ వేదానంద రూపా !
వేదముల వేదాంతములపై
విశ్రమించు వసంత భూపా !
ఒడలు బడలెనొ ! యుగము ముగిసెనొ ?
ఉమను గొని పవళింప బోదువొ !
నిన్ను ఏమనగలను ? కానీ-
నేను ఏమై పోవలె ?

## 13

నీ నటోద్ధత ధూత ధూళీ
రేణు పటలానంత సృష్టిని-
పరమ రేణువు నేను నీ ఒక
అరుణ సంధ్యా చరణ గతిలో !
అయిన గానీ, నాకు గల విలు
వంత మాత్రమె అయిన గానీ,
నీ రజోరాగాంకి తాహం
కార మది నను విడుచునా ?

## 14

నేను శివుడే, సత్యమే !
నేను శివయే, సత్యమే !
నేను ఉభయాద్వైత తత్వం,
నేనె బ్రహ్మం, సత్యమే !
సత్య మంతయు నీవె నేనను
జ్ఞాన కుండిని భస్మమైనది !
భస్మరాశులు చిమ్ముకొనుచు
భవుని నృత్యం భీమ మైనది !

## 15

తెలిసినది లేవయ్యి, దేవా !
తెలిసినదిలే నీ రహస్యం !
నాకు సత్యం నీకు భస్మం,
నీకు సత్యం నాకు భస్మం !
నేను దేనిని సత్య మనుకొని
ప్రాణములతో కొల్చు కొందునొ
దాని నంతయు కాల జిమ్ముక
తాండ వింతువు నీ వహో !

## 16

నీ క్వణ క్వణ కింకిణులతో
నీ ఝునక్ ఝున ఘంటికలతో
రేగి ఉద్గమ మైన ఒక్కొక
రేణు వొక్కొక లోకమే !
రసము మారిన రంగు మారుచు,
రంగు మారిన రచన మారుచు
మనోవర్తనతొ నీ చుట్టూ
పునః పున రావర్తితము లౌ !

## 17

ఎందుకయ్యా, ఒడలు మరచిన
ఈ నిరంతర తాండవం ?
మధురతా వేగమున నీవు
మరచినది నిను నీవె అయినా-
తన్ను, తన మూలమును మరచి
కన్ను గానదు లోక వృత్తం !
లోక వృత్త ప్రవృత్తి మరచి
లోభి ఆయెను మనుజుడు !

## 18

సృష్టి స్థితి గతి మేళ నాత్మక
వృత్తిలో నీ నృత్య ఖేలన
శిఖర శిఖరీ స్థాయి నంది
చిత్ర వైచిత్ర్యములు చింది,
జీవ రూప తరంగ హిత గం
గావతరణ మ్మైన నాడు-
శిరము వంచెను లోకము, నీ
చరణ యుగమే నాకము !

## 19

సృష్టి జరిగెను, స్థితియు పెరిగెను,
జీవుడే దేవుడుగ మారెను !
    నేనె ఉంటిని, నీవు లేవని
    ప్రాణి నిన్ను సవాలు చేసెను !
లయ ముహూర్తం సమీపించెనో !
లాస్యమును ఉమ మానెనో !
    దేవ ! నిను నీ పాద రేణువు
    ధిక్కరించిన హేతు వేదో !

## 20

నీవు తాండవ చక్రవర్తివి !
నీవు జీవన చక్రవర్తివి !
    ఎంత కాలము నీవు మాత్రం
    ఏలగల వీ చక్రము ?
నీవు తగ్గిన కొలది మనుజుడు
నింగి మీదికి పొంగ సాగెను !
    అణువులే అస్త్రములుగా బ్ర
    హ్మాండములనే పేల్చబూనెను !

## 21

ఆది మధ్యాంతములు కల్గని
ఆత్మ నిర్జర నిర్ఝరీ ;
అనురతానందములు వాడని
అమృత జీవన వల్లరీ !
ప్రతి నవోర్మియు నీ సుఖేలా
ప్రగతిలో ఘల్లు మననిమ్మా !
ప్రతి నవాంకురమును నా మధు
పాత్రలో జల్లు లిడనిమ్మా !

## 22

అదిగో, వదనాంబుజము విరిసె !
ఇదిగో, చరణాంబుజము మొరసె !
పరమ పరితోషముగ నా యెద
భ్రమర కామోదములు కురిసె !
తాండవింపు ముకాండముగ, స్వే
దాంబు కణములె ఉడు గణములుగ,
ఘల్లు మను నీ అడుగులోన జ
గత్పదస్సులె ఝల్లు మనగా !

## 23

ప్రణవ మూర్తీ! నీ సదస్సున
పరవశులమై ఉన్న ఇప్పుడు
తోడి మానవు డేల గోలగ
దూకుచున్నా డాహవ స్థలి ?
నీ లసద్ఘన నాట్య నాటక
లీలలో రస డోలికలమై
విశ్రమించే సమయ మందు
విలయ సంక్షోభ మ్మిదేమో !

## 24

అదిగో, అక్కడ ఢాం ఢఢాం ఢాం !
ఇదిగో, ఇక్కడ భాం భభాం భాం !
అవి శతఘ్నుల అగ్ని గుండ్లు,
ఇవి పిశాచుల వంట ఇండ్లు !
రుద్ర వీణలు పగిలెనో ! శివ
భద్ర ఘంటలు చిట్లెనో !
క్రూరములు ఈ అపశ్రుతులు !
ఘోరములు ఈ ఘోషలు !

## 25

మనిషి! ఓ మనిషీ! విమూఢుడ!
మంచి చెడు కనలేని జడుడా!
    అమృత మనుకొనుచుంటి, వది నీ
    అన్నదమ్ముల దుఃఖ మేరా!
నెత్తు కొరకా ఈ శతఘ్నులు?
నీ మహా విజ్ఞాన మణులు?
    ఆగు మాగుము! అయ్యయో! నువు
    త్రాగునది నీ నెత్తురే రా!

## 26

నీవు పుట్టిన యటులె పుట్టెను
నీ సహోదర మనుజుడు!
    నీ తృషా హిత భోగ గతిలో
    ఆతడును సమ భాగుడు!
మనిషి; ఓ మనిషీ! విమూఢుడ!
మంచి చెడు కనలేని జడుడా!
    నీవు ధ్వంసము చేయదలచిన
    నిలయ మది నీ ఆత్మ దేరా!

## 27

విసృత మసృణ మణీ ఘృణీ సం
భృత విభాత మనోజ్ఞ వన మిది !
ఇడకు మిందో యుద్ధ వాదీ !
ఇనుప నాడపు బూటు కాళులు !
ప్రణయ జీవన రాగమోహన
పరమ నట దానంద చేతన
మంజు మంజీరమున నేలా
మందు దట్టించెదవు ? బేలా !

## 28

ఘల్లు ఘల్లున మ్రోయ వలసిన
గజ్జెవే ! పాదమ్ము కరతువె ?
రింగు రింగున ఎగుర వలసిన
కొంగువే ! గొంతుక బిగింతువె ?
ప్రణయవల్లభు డీశ్వరుడు తన
ప్రకృతి నర్తన శాలలో – నీ
వర్తనమును సహించ గలడా !
వైర గుణము భరించ గలడా !

## 29

మనము పసిపాపల మటోయీ ?
మహేశుడు వత్సలత చూపగ ?
　　పాప లైనను తండ్రి యొడిలో
　　పాడు పనులను చేతురా !
అర్ధ నారీశ్వరుడు తన స
ర్వార్ధ సృజనోన్నాట్య కళలో
　　ఓర్వగలడా ? రణోద్యోగీ !
　　ఓ నియంతా ! నీ దురంతం !

## 30

భుజ బలమ్మా? అడవి దున్నకు
బోలె డున్నది కాదటయ్యా ?
　　భూత బల మొక అడవిరా !
　　బుద్ధి బలమొక పువ్వురా !
కమల మెంతో, తుమ్మెదకు చిరు
గడ్డి పువ్వును అంతెనోయీ !
　　మధువు జీవిత ధర్మము ! పరి
　　మళము దానికి మార్గము !

## 31

యుద్ధమని నీ తోడి వానిసె
యోధుడా ! తెగటార్తు వటరా ?
సింహమైనను సింహమును హిం
సించి చంపునె ? మూఢుడా !
గుండె గల వాడెవ్వడైనా
గుండె గల నీ కెట్లు శత్రువు ?
నీకు పెరవా డెవ్వడోయీ ?
నీకు నీవే శత్రువోయీ !

## 32

కలము పట్టే చేతి తోనే
కత్తి పట్టెద వెవరిపై ?
పాట పాడే నోటి తోనే
పళ్లు కొరికెద వెవరిపై ?
ఎవరిపై కా పోటు పోకడ ?
ఎవరిపై పగ తీర్చుకొందువు ?
పగకు తొంబై పగలు నీపై
పడగ విప్పుట లేదటో ?

## 33

కత్తి పట్టితి వేల బేలా ?
గాలి మంపల నరుక గలవా ?
    తరులతాదుల నరికి పోసిన
    తగ్గునా ఝుంఝూ మహోద్ధృతి ?
గుప్పెళులుగా ఇసుక పోతువు
కప్పగలవా పాల కడలిని ?
    భుజగ భూషణు భూషణము లవె
    బుసలు కొట్టుచు లేచెరా !

## 34

మానవుని చంపగల, వాతని
మానసము ఖండించ గలవా ?
    రక్తమును చిందించ గలవు,
    రక్తిమను భ్రమించ గలవా ?
ప్రళయ భీకర భీమ భీషణ
ప్రాణ చలనా స్ఖాలనములో
    మిత్తితో చెర్లాడు నీ పెను
    కత్తి నీ మెడపైనె పడునో !

## 35

రాతి కోటలు కట్టు కొంటివి !
రాజునని ప్రకటించు కొంటివి !
బాంబులను నిర్మించి ధాత్రిని
బానిసనుగా జేసుకొంటివి !
కాని - కల్గె నటోయి తృప్తి ?
కట్టు పడిన దటోయి తృష్ణ ?
రుద్రవాటికి తరిమి కొట్టే
క్షుద్ర వాంఛలు తీరిన వటోయ్ ?

## 36

నాటు చుంటివి జయ పతాకలు
నేటి రణ నిహతుల సమాధుల ?
రే పెవండో నాటు నీ గో
రీ పయిన్ తన గెలుపు జెండా !
గోతి కేగును జయము, జెండా
గుడ్డ చిన్గును, బూది మిగులును,
నీవు తీసిన ఉసురు మాత్రము
నిరయమున నిను త్రోయును !

## 37

యోధుడా ! నీ ప్రే టొకొక్కటి
ఒకొక పుణ్య సతీ ముఖాన
పసుపు కుంకుమ తుడిచెరా ! సౌ
భాగ్య సూత్రము త్రెంచెరా !
బుర్ర లేదో ? ఏల లేదు?
బుద్ధి మాత్రము లేదు లోపల !
భాగ్యరేఖలు చెరిపి, నీవే
బ్రతుకు బ్రతికిన నెవరికోయ్ ?

## 38

తమ్మి తోటల నిప్పు కణములు
చిమ్మ బోకుము, క్రూరుడా !
మృదు విహంగము మధుర గళములు
చిదుమ బోకుము, మూర్ఖుడా !
రసములను నీ కొసగు కోమల
రాగ లత కది ప్రతిఫలమ్మా ?
సుఖములను నీ కొసగు సుందర
శోభ కది బహుమానమా ?

## 39

ఆత్మ గృహముకు అగ్ని నిడుకొని,
ఆద మరచెద వెంత కాలం ?
నావ చిల్లులు పొడుచుకొని, పై
నమ్మి చేసెద వెంత దూరం ?
మంటి బుర్రా ! విశ్వ చోదక
మహిత విధితో పందె మటరా ?
నారికేళము కన్న నీ అణు
మారణాస్త్రం గొప్పదటరా ?

## 40

రాజ్యమేలే వాంఛ నిన్నొక
రాక్షసుని జేసిన దటో ?
స్వర్గమున కని, నరక పథమున
స్వారి కదలిన బ్రతు కటో ?
ఆగు మాగుము, వేగ కళ్లెము
లాగి నిల్పుము, నీ జిగీషను !
పెనగ లేవోయ్ అఘముతో, నీ
పీకపై ఎన్ని తల లున్నా !

## 41

భూమి రాజ్య మదేల ? నీ కిదె
ప్రేమ రాజ్యము, ఏలు కోవోయ్ !
మేర కల్గను భూమి శక్తికి,
మేర లేదీ ప్రేమ శక్తికి !
పడగ లెత్తిన పగల నడుమ
ప్రణయ సుఖములు సాధ్యమా ?
సత్య సుందర మనుజ జన్మకు
మృత్యు వొకటే లక్ష్యమా ?

## 42

రమ్ము, రమ్మిటు రమ్ము, వీరా !
కొమ్ము నా ఆతిథ్యము !
పూల పాన్పున విశ్రమింపుము,
పుష్ప రసములు గ్రోలుము !
వీరుడవుగా కత్తి గొంటివి,
ధీరుడవుగా కత్తి విడువుము !
మిత్తి కన్నెర్ర జేసినచో
కత్తి నిను కాపాడు నటరా ?

## 43

నీవు నావలె ఏల సుఖపడ
లేవురా, ప్రేమోపరతిలో ?
  నీవు సుఖ పడ గలవురా !
  నీకు హృదయము కలదురా !
హృదయ మన్నది నీకు లేదని-
కదన మొకటే నీకు బ్రతుకని-
  నీకు చెప్పిన దెవడురా ?
  నిన్ను ముంచిన దెవడురా ?

## 44

సీత కొరకే కాదె రాముడు
చేసినాడు మహా రణమ్ము ?
  ద్రుపద సుతకై కాదె భీముడు
  త్రుంచినాడు కురూరవు ?
రాజశేఖరు రమ్య తాండవ
రంగ రంగ దనంగ భూమికి
  రంగులను, హంగులను కూర్చే
  రమలు, రసములు నీవి కావా ?

## 45

సుమము వరియించును సుమమ్మును,
సుమము లన్నియు నిను వరించును ;
ఈసు లే, దొక దాని నొక్కటి
మోసగించు తలంపు లేదు ;
మధుప దేవుడవై సమస్త సు
మాలకును నీ ప్రేమ పంచుము !
సర్వ కుసుమ నివేదితాత్మ ర
సమ్ము గ్రోలి తరించుము !

## 46

మనుజ సంఘము నొక్క సుందర
మధు వన మ్మొనరించ లేవా ?
మనుజుడా ! ఆ మలిన రుధి రో
న్మత్త పాత్రను వీడ లేవా ?
పచ్చి నెత్తురు పోసి పెంచిన
పిచ్చుకయు రాబందె అవురా !
రక్త యాతన పొంది రతియు
రావణానుజె యౌనురా !

## 47

రక్త మిచ్చిన, దేవు డైనను
రాక్షసత్వము తాల్చి పై బడు ;
  మధు వొసంగిన, మెచ్చి ఆతడె
  మాధవుడుగా వచ్చి ప్రియ మిడు ;
సచ్చి దానందము నొసంగెడి
సత్వ రూప వదాన్య దేవుని
  విడిచి, రాక్షస తమో రూపుని
  అడుగు లొత్తెద వేల నయ్యో !

## 48

రుధిర పాత్రను పగుల గొట్టుము,
మధుర మధు పాత్రము లభించు !
  పార వేయుము కదన ఖడ్గము,
  పద్మ మంజరి వరించు !
పూల తోటల నాడు కొనుచు,
పూల పాటలు పాడు కొనుచు,
  పూల సెజ్జల విశ్రమించక
  భూతమై క్రుమ్మరుట బ్రతుకా ?

## 49

వికృత షట్పదమునకు, అందపు
విరికి స్నేహము కుదరదా ?
ఉజ్వల మీ్మ ప్రేమ బంధం
యుగ యుగమ్ములు సాగదా ?
ముళ్ల తీగలో, మోడు రోజులో,
పుష్ప హృదయము మార నీకుము !
గొంగలీ పురుగునను సీతా
కోక చిలుకనె చూడుము !

## 50

తపము చేయక తమము తొలగదు,
తమము తొలగక దారి తెలియదు ;
దారి తెలియని నీకు వేదాం
త ప్రియుడు కనిపించడు !
తపము చేయర, మనుజుడా ! ఆ
త్మ ప్రకాశము పెంచుకోరా !
మెతుకె బ్రతు కనుకోకురా ! నీ
బ్రతుకె భరతము కాదురా !

## 51

జీవ కణములు, ప్రాణ కణములు
చేరినదియే నీవు కాదా ?
　　దేని కదియే ప్రతి కణమ్మును
　　దివ్య చేతన కలదె కాదా ?
నీవు నంతే ; విశ్వ వృత్తీ
నృత్త మందొక భంగిమవురా !
　　ఉద్భ వింతువు, ఉప శమింతువు
　　ఉన్న మన సన్న మన గతిలో !

## 52

తపముతో నీ ఆత్మ రక్తులు
తలిరు మొగ్గలు తొడిగి విడుగు,
　　ఊర్ధ్వ గము నోద్గీథ శక్తులు
　　ఉమను రమ నేకీకరించు ;
రాజె పింఛము, ఉమయె రమ, నట
రాజె తాండవ కృష్ణుడు !
　　నృత్తమున నీ వృత్తి లోనే
　　నీ స్వరూపము స్థిరపడు !

## 53

జన్మ కలదు, శతాధికమ్ముగ
జన్మ లెన్నో కలవు నీకు ;
నాట్య భంగిమె జన్మ, తద్వి
న్యాస భంగులె పునర్జన్మలు !
శివుని తాండవ కేళి నెపుడే
శిఖరమును చేరేది ఏదో !
మూల మేదో ! కాండ మేదో !
పుష్ప మేదో ! ఫల మెదో !

## 54

ప్రాణ నాథుని ప్రకృతి రచనా
పరమ తాండవ కేళిలో
ఏ చలనమవొ ? ఏ వలనమవొ ?
ఏదొ నీ స్థానము ? రసస్థితి ?
చూసి నిన్ను శమింప జేయునొ ;
చూపరులకై పెంచునో !
ప్రాణ నాథుడు శివుడురా ! మన
ప్రాణములు శివ రతులురా !

## 55

సాధుశక్తులు ప్రజ్వరిల్లిన
శంభు శిరమున చంద్ర కళవు,
అసుర శక్తులు పొగలు గ్రక్కిన
హరుని పదముల నీడవు ;
విశ్వమున గల ప్రతి లవమ్మును
విశ్వ నటనాంగికమె అయినా
అమిత్రత్వము వీడకే, వి
శ్వ మిత్రత్వము లేదురా !

## 56

సత్య మిదిగో వినుము, మానవ
సంఘ మూలము సాధువు ;
సాధు మూలము కానిచో ఏ
సంఘమును నొక స్థాణువు !
సాధు నిర్మిత మెల్ల సంస్కృతి,
సాధు చోదిత మెల్ల ప్రగతి,
సాధు జీవన సాధనమె శివ
సన్నిధికి నిను చేర్చు తెరువు !

## 57

ఏమిటోయ్, విజ్ఞాని ? ఏదోయ్
ఇలకు నీ విచ్చిన బహూకృతి ?
గాలి బుడగలు పేల్చి, చేతులు
కాల్చుకొనుచుంటివి కదయ్యా !
చేసితిని రాకెట్ల నందువు,
చేయగలవా చిన్న చీమను ?
బొమ్మరిండ్లను గట్టి, నేనే
బ్రహ్మ ననుకొను టేమి లాభం ?

## 58

వెదకి చూచే కొలది నైజము
వెలుగు లోనికి వచ్చు చుండును,
రక్తి చూపే కొలది భౌతిక
శక్తి కైవస మగుచు నుండును ;
ప్రాణి సుఖమే కాని ముఖ్యము
ప్రకృతి పై విజయమ్ము కాదోయ్ !
ఆది మానవ జీవి కంటే
ఆధునికు డె ట్లధికుడోయ్ ?

## 59

ఎగురుచున్నది పక్షి మింట,
ఈదుచున్నది చేప నీట !
ప్రతీ ప్రాణికి కైవసములే
ప్రకృతి శక్తులు కొద్దో, గొప్పో !
రాతి యుగమున కన్న ఈ నవ
నూతన యుగ మ్మెందు మిన్న ?
తిండి తిప్పలు తప్పెనా ? శాం
తి ప్రసాదము దొరికెనా ?

## 60

శిలా యుగమున శిలలు గైకొని
తలలు బ్రద్దలు కొట్టినాడవు,
నేడు సీసపు గుండ్ల తోనే
నిండు ప్రాణము లూడ్చుచుంటివి ;
రేపు మొత్తము సమాజమునే
రూపు మాపెద వొక్క అణువున !
సమర కళ పెంచినదె కానీ
సౌఖ్యమును తెచ్చినదె శాస్త్రం ?

## 61

కుర్ర కుంకలు బడికి డుమ్మా
కొట్టి, గోళీ లాడు నట్లే-
కృతక గోళము చేసి, రోదసి
కుహరమందున త్రిప్పు చుంటివి !
సౌర శక్తిని వశము చేసుక
చంద్ర లోకము సాగు చేతువా ?
మానవుని ప్రాణేంధనము తో
మర మనుష్యుని నడిపెదో ?

## 62

రాగి సంగటె లేని మాకీ
రాగి యంత్రము లెందు కోయీ ?
ఏ విధమ్మున మానవున కవి
ఈయగల వానందము ?
గాలి యోడల నుంచి ఇంచుక
కాంచినావా క్రింది మనిషిని ?
నేల విడిచిన సాముురా ! నీ
నేల తిండికి లేదురా !

## 63

కాలి నడకను సాగినా
గగన నౌకల నేగినా
పంట భూములు దున్నినా
మింట చంద్రుని తన్నినా
బ్రతుకు కొకటే లక్ష్యము, అది
ప్రణయ సుఖ సామ్రాజ్యము !
పామరున కది లేదటోయ్ ? నీ
ప్రకృతి విజయము దేనికోయ్ ?

## 64

ప్రకృతి శాస్త్ర మదెంత దైనా
బ్రతుకు దాటి పురోగ మించునె ?
బ్రతుక దెంతటి దైన, అది తన
ప్రకృతి నెట్లు తరించ గలదోయ్ ?
మెదడు తోడిదె శాస్త్ర మంతయు,
మెదడు మనుజుని మించగలదా ?
మనుజు డంటే ఎవడురా ? బ్ర
హ్మా కా మాంగిక లవము రా !

## 65

ఒకరి తలలో నుండి పేను మ
రొకరి తలలో కెక్కదా ?
అంత కంటెను నీ గ్రహాంతర
యాత్ర కధికత ఉన్నదా ?
జనము నెత్తురు పిండి తెచ్చిన
ధనము నేల వృధా యొనర్తువు ?
చద్ది యన్నపు ముద్దరా !
చంద్రు డధికము కాదురా !

## 66

తరుణుడా ! నీ కాల రథమును
తరుము చుంటివి, ఎచటకోయీ ?
అమృత భాండము నింపు కొనకే
అందుకొనుచున్నావె పెదవికి ?
దిక్కు తోచక ప్రక్క దారులు
తొక్కుచుంటివె పట్టి చేతుల ?
దూర మెంతో తెలియునా ? నీ
దారి బత్తెము చాలునా ?

## 67

నవ్య జీవన యాత్రకై స
న్నాహమే తారుణ్య మంటే,
తరుణ మందే నింపు కోవలె
తగిన సంపద తోడ బ్రతుకును ;
నింపుకొను మోయ్, బ్రతుకు నిండా
నిఖిల విద్యలు, కళలు, కాంతులు !
ఎంత సంపద దగ్గరుంటే
అంత దివ్యము జీవయాత్ర !

## 68

తరుమబడు చుండిన కురంగము !
మరచి గరికను మేయు చుంటివొ ?
స్వారి కదిలిన గుఱ్ఱమా ! నీ
దారి నరకము కేసి కాదో ?
మూర్ఖుడా ! నీ పురోగతిలో
ముందు జూచుక పర్వులెత్తుము !
కళ్లు మూసుక పోవుచో, అది
కాశ్శికైనా–కాటికేసే !

## 69

ప్రాణమును కాపాడు కొనగా
పర్వు లెత్తెద, వెచటి కోయీ ?
కండువాయే త్రాచు పామై
కరచు, కాలము దాపురించిన !
త్రాచు పామునె కండువాగా
తాల్చడా నటరాజు నిత్యము ?
సత్త్వ మూర్తిగ బ్రతకరా !
సత్య లోకమె నీదిరా !

## 70

పారి పోకుము, ఎవ్వరును నిను
పట్ట దరుముట లేదు, చూడుము !
నిన్ను బోలిన మనుజుడే, ని
న్నెట్లు తరుమును, మూఢుడా ?
అడుగు నిలుపుము, ఎదురు తిరుగుము,
ఆశతో జీవింపు మన్నా !
పారి పోయిన తరుము వాడే
పారి పోవును తరుమబడుచో !

## 71

చూడు వెనుకకు, వేటగాడో ?
చూడు ముందుకు, ముళ్ల తెరువో ?
దేవు డిచ్చిన కొమ్మ్మలే నీ
జీవనమ్మును తీయ నుండిన
పరువు లెత్తెద వెటకు ? లేడీ !
శిరము పై మృత్యువును పెట్టుక ?
చావు కలుగని తావు కల దది
దేవ దేవుని చరణమే !

## 72

తీరుబడిగా ఏడ్చు చుంటివి,
దీనుడా ! నీ వెందు కోసం ?
ముష్టి తేగల దేమొ కాని
పుష్టి తేలేదోయి ఏడ్పు ;
అభ్యుదయ మది మానసిక మోయ్ ;
ఆత్మ శక్తిని పెంచుకోవోయ్ !
ఏడ్పి సాధించేది లేదోయ్ !
ఇహము పరమును శక్తి యేనోయ్ !

## 73

పేదవాడా ! ఎందుకోయీ
మీది మీదికి కేలు మోడ్తువు ?
మింట నెవ రున్నారు ? చిచ్చర
కంటి వెలు గొక్కటియె తప్ప
క్రింద చూడుము, శివుని తాండవ
కేళి రేగిన రాగ రజము !
ఎత్తుకోవోయ్ రెండు చేతుల
ఈశ్వరుని కరుణామృతం !

## 74

తనను తానే మరచి, గంగా
ధరుడు నాట్యము చేయు చుండెను ;
చినుకు చినుకున రాలు చున్నవి
జీవ ధనము లభిజ్ఞముల్ !
పుష్పములు, ఫలములు, రసమ్ములు,
పూర్ణ జీవన రాగ రసములు !
ఈశ్వరుడు నీ కీయ నట్టిది
ఏమి కలదోయ్ ? తీసుకోవోయ్ !

## 75

లెమ్ము, లెమ్మో కష్ట జీవీ !
లేచి నడువుము ముందు ముందుకు !
కష్టమేదీ కాదురా, నీ
ఇష్టమే పరమాత్మరా !
కాయ కష్టమె కనక దుర్గ,
కష్ట పడుటే దుర్గ పూజ ;
కష్ట ఫలమే ముక్తిరా ! ఒక
కబళమైనా చాలురా !

## 76

పేదతన మొక వైతరణి, అది
ఈదరానిది, పడకు ముందు !
కర్మ వశమున పడితివా? శ్రీ
కంఠునికి అందిమ్ము చేతులు !
అంత రంగములోన శివు డు
న్నంత కాలము లేదు భయము,
శివుడు మృత్యుంజయుడురా ! శివ
చింతనమె శ్రీలక్ష్మిరా !

## 77

శివుడు బ్రహ్మ, శివ సరస్వతి,
శివుడె శాంతి, శివయె కాంతి,
 శాంతి పదవిని కోరి నీవు
 కాంతిపై ప్రసరించరా !
మేని సగము జగాన కిడి, సో
మేశ్వరుడవై బ్రతకరా !
 సర్వ దారిద్ర్యములు తొలగి
 శాంతి సౌఖ్యము లందరా !

## 78

పుట్టినా వానంద ముందు,
పుట్టినా వానందమునకై,
 చిద్విలాసిగ ముందు కేగక
 శివుని పదమె ట్లంద గలవు ?
శివుడె ఆనందమ్మురా !
చిత్తమే అమృతమ్మురా !
 సాగరా శివు నట్లు, ప్రకృతి
 స్వామివై, సర్వాధి పతివై !

## 79

భాగ్యశాలీ ! కోటి కెత్తిన
పడగ లీశ్వరున కర్పింపుము !
    పడగలను భరియించ గల్గిన
    వా డొకండే నీలకంఠుడు !
ధనము సంపాదించుటొక కళ,
ధన మదృష్ట విశేష ఫలము,
    ధనము కల్గిన వాడు ధరణికి
    ధర్మ కర్తగ నుండ వలెరా !

## 80

జలము సంపాదించు నైజము
కలది జలధర మొక్కటే ;
    జలధరము జలదమ్ము కానిచో
    జగము మాడి నశించదే ?
మనసు తీరగ సేకరించుము
ధనము, ధాన్యము, మడులు, మణులు !
    సేకరించిన దానితో జన
    సేవ చేసి తరించుము !

## 81

వర్ష జల ధారలను గైకొని
వాహినిగ ప్రవహించు గౌతమి
ఆనకట్టలు త్రెంచు కొనుచో
ఆయకట్టులు పండునా ?
చినుకు చినుకుగ, ధార ధారగ
చేర్చుకొన్న మహాంబు రాశిని
పంచ దటరా, నది పొలాలకు ?
పెంచదటరా జనతను ?

## 82

యుద్ధములు, దారిద్ర్యములు, గ
ర్వోద్ధతులు, దుఃఖమ్ము లన్నీ
నిను వరించిన స్వార్థ బుద్ధి
మనిషి కిచ్చిన దుష్ట ఫలములె !
శక్తి కొలదిగ కష్టపడుచు,
చాలినంతగ అనుభవించుచు,
ఎవని మట్టుకు వాడు బ్రతికిన
ఇలకు స్వర్గమె దిగదటోయ్ ?

## 83

రోగి ! వైద్యుని వేడు చుంటివె ?
త్రాగు చుంటివె చేదు మందులు ?
సూక్ష్మ జీవుల వలన రోగము
సోకె ననుకొను చుంటి వటరా ?
కాదు కాదవి సూక్ష్మజీవులు,
గతములో నీ క్షుద్ర కర్మలె !
బ్రతుకు వెన్కకు చూచుకోవోయ్ !
గతములను విదిలించుకోవోయ్ !

## 84

గుండెలో ఒక ఇనుప గుండై
గొంతులో ఒక కరకు ముల్లై
నేడు నిను వేధించునది ఏ
నాడు చేసిన పాపమో !
మరచిపోతివి, కొంచె మాగి
మనసు లోనికి చూచుకోరా !
ఏదొ లోతున బైటపడు నీ
వేదనకు నిజ హేతువు !

## 85

ఆగు మోయి ! అసత్య వాదీ !
అమృత మని విష మిత్తు వటరా ?
దప్పిగొని నిను చేరినది నీ
ధర్మ సోదరుడే కదయ్యా ?
అన్నమని నీ గొంతు నిండా
సున్నమును దట్టించి, పువ్వుల
పాను పని నిను కాటి కర్రల
పండ బెట్టున దా విషమ్మే !

## 86

మిత్రుడవుగా నీకు చేసిన
మేలు మరచిన ఓ కృతఘ్నుడ !
పాలు పోసిన చేతి వ్రేలినే
పట్టి కరచుచు నుంటి వటరా ?
ఎన్ని మేళ్లను మరవ గలవు ?
ఎన్ని వ్రేళ్లను కరవ గలవు ?
నరకమే నిను కరచు నప్పుడు
మరచురా ఈశ్వరుడు నిన్ను !

## 87

జలము తృప్తిగ త్రాగి సరసిని
కలచి పోయెడి అడవి దున్నా !
  దాటి పోయిన మీద నావను
  తగుల బెట్టెడి స్వార్థపరుడా !
హాల హలమును మ్రింగి శంకరు
డగ్ని ద్రేన్చిన ధూమ కణమువో ?
  మనుజ రూపము లోన అంతటి
  దనుజ హృదయము దేనికో ?

## 88

సోమనాథుని రొమ్ము పైని
సుఖముగా నిద్రించు జగమును
  చూరగొనగా నక్కినాడవు !
  చోరుడా ! నీ వెవడ వోయీ ?
పుడమిలో గల పీడ లన్నీ
పిడచ గట్టిన రక్కసుడవో ?
  ముల్లు బ్రతుకున కేడ్వవో ? ఒక
  పువ్వు వగుటను కోరవో ?

## 89

జార చోరుల పీడయే కద
కారణము భువిలో అశాంతికి ?
ధనము దోచును చోరుడు, ఆ
త్మనే దోచును జారుడు !
ద్యుమణి బోలు వివేక శాలివి
దొంగ వెట్లైనాడ వయ్యో?
చోరుడా ! ఇక ముసుగు తీయర !
జారుడా ! ఇక బట్ట కట్టర !

## 90

నీవు చేయు ఒకొక్క దోపిడి
నిన్నె దోఫిడి చేయు చున్నది !
ఆత్మయే కొల్లపడు చున్నది !
అంధుడా ! జాగ్రత్త పడరా !
పని యొనర్పక, తేర తేరగ
పరుల సంపద దోచువాడు
ఆత్మ కాంతులు ఆరిపోయి
అంధ భూతమె అవునురా !

## 91

ఓయి ! మూఢ మతావలంబీ !

ఉన్న దేవుం డొకడె కాడా ?

ఇన్ని మతములు, ఇన్ని కులములు

ఎందుకని కల్పించినావో ?

నీవె దేవుని స్థానమున్ గొని

నిరయ నృత్యము చేయు చుంటివె ?

స్రష్ట నిద్దుర పోయెనో ? నీ

ద్రుష్టి ధర్మము తప్పెనో ?

## 92

ఓ మత ద్వేషీ! కుల ద్వే

షీ ! మనుష్య ద్వేష మటరా !

ఈశ్వరుడు నీ కొకడికేనా

ఇచ్చినాడు వివేకము ?

మానవుని ద్వేషించు టనగా

మాధవుని ద్వేషించుటేరా !

అగ్ని కణమురా ద్వేషము ! అది

ఆత్మ నాశం కరమురా !

## 93

నీ వొంకడవె కావు, శివునకు
జీవు లెల్లను ప్రియ తనూజులె !
మత కులాదులు దేశ కాలో
చితములౌ అంగహారములే !
ఘనత కోసము ప్రాకులాడెదొ ?
ఘనత కాటిని దాట గలదే ?
సుస్థిర స్థితి కేగు తెరు వొక
సుకృతమే, అది నీకు కలదా ?

## 94

ఓయి ! దైవద్వేషి ! దూషణ
చేయ బోకుము దేవ దేవుని !
నాట్యముగ్ధుం డతడు, నీకు
నష్ట మేమిటి చేసినాడు ?
దొంగ కమ్మని నాడె ? ఆత్మ
ద్రోహి వగుమని నాడె ? మూఢా !
తేనెటీగలు కుట్టినందుకు
తేనెనా పార్వోసు కొందువు ?

## 95

మొగ్గ చిదిపి, పువ్వు నలిపి,
మొదలె పెరికి, పరీక్షింతువు !
అడుగు త్రవ్వి, అణువు పేల్చి,
అంతరార్థము చూతువు !
ఏమిటో తెలుసు కొన్నావు,
ఎందుకో తెలుసు కొన్నావే ?
హేతు వెరుగని నీవు శివుని వి
భూతిని ప్రశ్నింతు వకటా !

## 96

ఎందు కలడోయ్ దేవు డని ప్ర
శ్నించు చుంటివి ! నాస్తికుడవా ?
దేవుడే లేక నీ ప్రశ్నకు
జీవ మెది ? ప్రాణ మెది నీకు ?
ఒక్క యెడ కన్పడని మాత్రన
ధిక్కరింతువె ప్రభుత లేదని ?
ఎట్లు తలలో పేనువై ఊ
హింప నేర్తువు తలను, వ్యక్తిని ?

## 97

ప్రభుత వంటిది బ్రహ్మ ; అది నీ
పనిని బట్టి ప్రదర్శితమ్మగు ;
ధ్యానమో, ప్రార్థనమొ, విధియో,
తత్స్వరూపము నిర్ణయించు ;
ఏది ముఖ్యమొ నీకు దానిని
ఎప్పటికి అప్పుడు అమర్చుచు,
నిత్యమును నిన్నంటి యుండిన
సత్యమును లేదందు వకటా !

## 98

పండితుడ నని గర్వ పడుదువు
ప్రజను తేలిక చేతు వన్నా !
పరమ శివుని ప్రబంధమం దొక
పదము నైన గ్రహించ గలవే ?
ఋషిని కంఠస్థమ్ము చేతువు,
ఋషభమునకు వ్యంగ్యార్థ మేమోయ్ ?
పండితుడు శివు డొక్కడే, నీ
బ్రతుకు విలు వొక గ్రుక్కెడే !

## 99

పరభృత మదే పాడు చున్నది
బధిరుడా ! నీ తోటలోనే !
అంబుజ మదే విరిసి యున్నది
అంధుడా ! నీ ఇంటి ముందే !
మందుడా ! నీ చుట్టు ఇదిగో
మధుర నృత్య వసంత కేళి !
నీవు నొక భంగిమమురా, నీ
జీవితము విరియించుకోరా !

## 100

ఓ మహాకవి సార్వ భౌమా !
ఒక జవాబును చెప్పి పొమ్మా !
తేనె కల్గిన చంపకము నొక
దాని నైన సృజించినావా ?
తెలుగు ఎల్లలు దాటగల ఒక
దివ్వె నేన్ వెలిగించి నావా ?
లోక శాంతి పథమ్ములో ఒక
కేక నైనను వేసినావా ?

## 101

వ్రాయు చుంటివి శతాధికముగ,
మోయు చుంటివి బిరుదు లెన్నో !
అందులో నీ సొంత మెంత ?
అమృత పదవికి మెట్లు ఎన్ని ?
సొంత మక్కర లేదు, పోనీ-
సృజన చేతే కాదు, పోనీ-
అది మధ్యాంత ప్రకేలికి
అర్థ మైనను చెప్పినావా ?

## 102

సృష్టి చేయక ఋషివి కావు ;
ఋషివి కాక - కవివి కావు ;
కవివి కాక కవీంద్ర వేషము
గట్టి చిందులు ద్రొక్కు చుంటివా ?
కాగితములను నలుపు చేసి
కవిలె కట్టలు కట్టు చుంటివా ?
ప్రేమ పూతము కాని కవిత
పాముతో చెలగాట మోయ్ !

## 103

నిరుద్యోగ మటంచు ఏడ్చుచు
నిరర్థకముగ వీధులం బడి
    తిరుగు చుంటివి ఎవడవోయీ ?
    తిండి మాత్రమె బ్రతుకటోయీ ?
తిండి కేవో కంద మూలాలము
లుండి, తీరిక కల్గి నతడే
    నరదనమ్ములు పెంచె నోయ్ !
    నవరసము లందించె నోయ్ !

## 104

లంచగొండీ ! ఏమిటోయ్ తెగ
పంచు కొందువు గొంతులోకి ?
    లంచమా అది ? తోడి మనుజుని
    పంచ ప్రాణ కషాయ మౌరా !
తోడి మనుజుని కాయ కష్టపు
వేడి చెమ్మట విష కషాయము !
    క్రోల బోకుము మూఢుడా ! బలి
    గోరురా అది నిన్ను నిన్నే !

## 105

ఆగినా వెందు కోయ్ ? ముందుకు
సాగుమోయ్ ! మెట్ట వేదాంతీ !
నిర్విరామముగా మహేశుడు
నీ కొరకు శ్రమపడుచు నుండ
గట్టు పై కూర్చుండి మిధ్యా
ఘాస లవములు త్రుంతు వేలా ?
శివుని గూడి శ్రమించకే
శివాద్వైతము లభ్యమా ?

## 106

ఏ క్షణమ్మున కా క్షణమ్మే,
ఏ స్థలమ్మున కా స్థలమ్మే,
గతముపై నిలబడి భవిష్య
ద్గతిని నిర్దేశించు చుండును ;
పోయెరా భూతమ్ము, దానికి
పోయ జాలవు తిరిగి ప్రాణము ;
ప్రస్తుతమ్మును వశము చేసుక
ప్రగతి గామివి కమ్ము ! సఖుడా !

## 107

మనుజుడా ! ప్రేమించ లేవా
మంచి పువ్వొక దాని నైనా ?
ఒక చక్కని చుక్క నైనా
ఉల్లమున నిల్పుకొన లేవా ?
భువికి చెందిన దొక సువాసన
దివికి చెందిన దొక వికాసము
తాల్చ లేవా ? అంత మాత్రము
తావు లేదా నీ బ్రతుకులో ?

## 108

ప్రేమించు మా, ప్రేమించుమా,
ప్రేమించుమా, మనుజుడా – అని
ఆది కాలము నుండి యెంతో
అరచి చచ్చిరి మన మహర్షులు !
మహర్షుల అస్థిలకపై గో
మాయువై కూర్చుండి నేడు
ప్రేమ గల ప్రతి వీణ ప్రాణము
పీల్చి చంపుచు నుంటి వయ్యో !

## 109

సర్వ భూతము లాత్మవ త్తని
సర్వ జనముల శ్రేయ మొక టని
నీవె ఆ పరతత్వ లవ మని
నిన్ను నీ వెరుగుటయె శివు డని-
ఏక కంఠము తోడ వేదము
లోక మంతయు చాటు చుండ-
వేద దాసుడ ననెడి నీ కీ
వెర్రి తల లెటు మొలిచెనో !

## 110

మల్లె పందిరి చూచి నీవు
ముళ్ల తీగా ! ఏడ్చు చుంటివె ?
ఆమ్రు ఫలమును కాంచి నీవు
అత్తి పండా ! కుళ్లు చుంటివె ?
ఎవరి సుకృతము వారిదోయ్, నీ
వెంత ఏడ్చిన మారదోయ్ !
నీ అసూయా ద్వేష వహ్నులు
నిన్నె కాలిచి చంపునోయ్ !

## 111

ముసుగు మనిషీ! పొంచి యుంటివి,
ఉసురు తీతువొ ఎవరిదైనా ?
అన్నమున సున్నమును కలిపి
హత్య చేతువొ జాతి జవమును ?
చిమ్మ చీకటి వర్తకములో
అమ్మి వేతువొ జాతి నీతిని ?
కోటి హత్యల దురిత మంతా
కూటి కొరకే కాదె, హంతా ?

## 112

ఏమిటో కావా లటంచు
ఏమిటో పోవా లటంచు
నినాదములను చేతు వెన్నో !
నీతులను బోధింతు వెన్నో !
నీతి నియమ నినాద రీతులు
నిమిష నిమిషము మారు చుండు,
మానవతయే నీతిరా !
మారనిది శివభూతిరా !

## 113

జిహ్వ కొక రుచి-పరమ సత్యం,
జిహ్వ లటులే రుచు లనంతం,
ఒకని రుచికి మరొకని అభిరుచి
ఓర్మి నెరుగని నిత్య సమరం !
ఎల్ల జిహ్వల కేక వదనం
ఎల్ల రుచులకు ఏక హృదయం
ఏక తాళోద్రాగ వేగో
ల్లోకమతి ఎల్లరకు పతిరా !

## 114

రాగశాలీ ! ఏడ్చు చుంటివి !
రాలి పోయిన పూవు కొరకా ?
అదిగో, కను మా కొమ్మపై, ఇపు
డంకు రించిన దదియె కాదా ?
నేటి కక్కర లేని తనువును
నేల రాల్చి, సమాధి జేసి-
రేపు పూజలు పొందు మొగ్గగ
రూపు తాల్చిన దదియె నోయీ !

## 115

నాట్య రంగము నుండి గిట్టి
నాట్య రంగము మీద పుట్టే
    వేష ధారుల కందరకు నొక
    వేషముల గది లేదె వెనుక ?
పోయె నని నీ వేడ్చు చుండిన
పువ్వు వేషము మార్చు కొన్నది !
    చూడు మదిగో, కొత్త నాట్యం !
    సుందరం ! రస బంధురం !

## 116

ఎందుకోయీ, దుఃఖ పడుదువు ?
ఎందుకా కన్నీటి ధారలు ?
    సంత కేగి, అదంతయును నీ
    సొంత మనుకొని భంగ పడితివో ?
చేతి కందిన పాత్ర మేదో
మూతి కందక జారి పోయెనో ?
    తొలకరించిన మెరుపు తీగలు
    కలల పంటలు పండ లేదో ?

## 117

అద్దె కొంపను మార్చుటకునే
ఆత్మ యెంతో బాధ పడును,
దూర యాత్రకు కదలు నప్పుడు
భారమై క్రుంగును మనస్సు ;
ప్రాత దెంతటి పాడు దైనా
పట్టుకొని వ్రేలాడు మనిషిని !
పండు టాకులు రాలకే
పల్లవమ్ములు పుట్టవోయ్ !

## 118

మృత్యువును బహు భీకరముగా
క్రూరముగ చిత్రించి రజ్ఞులు !
మాసి పోయిన పాత దుస్తులు
మార్చుకొను టొక నేరమా ?
కొరవి దయ్యము కాదు మృత్యువు,
పరమ సుందర సత్స్వరూపిణి !
ప్రతీ మార్పును మృత్యువే, అది
ప్రగతి కవసర వస్తువే !

## 119

బాధ కలదా ? బెంగ లున్నవె ?
పడగ లెత్తెనె ఇడుమ లెన్నో ?
దుర్విమర్శల విషపు దోములు
దూకు చున్నవె బ్రతుకు మీదికి ?
భయము లేదోయ్ ! చంద్రచూడుడు
పట్టినా డదె అభయ ముద్ర !
అభయ మభయం ! అభయ మభయం
అభయదం ఆనంద నృత్యం !

## 120

నేటి బెంగ, నేటి బాధ,
నేటి లేమి, నేటి ఆకలి
నిలువదోయ్ రేపటికి – శివుని
నీడ దొరికిన ధన్యజీవికి !
నీడ గలుగని శివుని కాతని
క్రీడలే నీడలు కదయ్యా ?
ఉన్న మన లీలాంశవై, శ్రీ
మన్న వోజ్వల మూర్తి వగుమా !

## 121

కర్మ మని కూర్చోకురా !
కర్మ శీలుడ వగుమురా !
కర్మ మనునది లేదురా ! నీ
ధర్మమే నీ జీవితమురా !
చెడ్డ విత్తనములను చల్లి
దొడ్డ ఫలమును కోరు నెవ్వడు?
కర్మ శూరుడ వైనపుడె నీ
కాంక్ష లన్నియు తీరురా !

## 122

కువలయమ్మున నెవరి కైనా
కోరి నట్లుగ జరుగు చున్నదె ?
జీవిత మ్మొక స్వప్నమోయ్ !
స్వేచ్ఛ దానికి స్వల్పమోయ్ !
రెండు గంటల స్వప్నమును, నూ
రేండ్ల బ్రతుకును ఒక్కటేనోయ్ !
కలకు బ్రతుకుకు నడుమ భేదం
కాల కుశలత మాత్రమేనోయ్ !

## 123

కలను కల, ఆ కలను కలగా
కాల మంతయు కలల అలలే !
　అలల పై లీలా విహారము
　సలుపు బుడగలె బ్రతుకులు !
పార్వతీశుని ప్రణయ తాండవ
పరమ వేగమె సుమ్ము కాలము !
　వేగ మాగిన కాల మాగును,
　ఆగు నెంతటి కలలును !

## 124

శివయె కాల ప్రవాహ మైతే,
శివుడు కాలాతీతు డగునా ?
　శివుడు కాలా తీతుడే, తన
　శివ స్వయంకృత నాట్య కళయే !
అఖిల దృశ్యా దృశ్య విశ్వము
నంతనున్ కనుచు పెంచుచు భవు
　నభవు జేసే జగన్మాతకు
　హైమవతికి నమస్సు లిడుమా !

## 125

ప్రణయ మేమో బోధ చేసెద
పాంథుడా ! ఇటు కూరుచుండుము !
హరిణ బాలిక చేర వచ్చిన
గరిక పోచలు మేపగలవా ?
మంచి పువ్వుల మనసు లెరిగి
తుంచు కొని తలదాల్చ గలవా ?
కామవర్ధని రాగ రమలను
గాలి గొంతున పట్ట గలవా ?

## 126

హేతు బద్ధము కాని దేదో
హృదయ మాకర్షించు చున్నదె ?
ఊహ కందని దేదొ ఆపి
ఉల్లమును రంజించు చున్నదె ?
పాంచ భౌతిక చిత్తు పైన
పాల వెన్నెల మత్తు లోన
పరమ భావ లతాంత మేదో
పారవశ్యము కూర్చు చున్నదె ?

## 127

సుఖము దుఃఖము కాని జీవన
సుభగ పథమున పైనమై-
    లోభమోహ వికల్ప తీరము
    లుత్తరించి, తరించి, మించి-
మీది మిన్నుల మించు తారల
మేరలన్ ప్రవహించి పోయి-
    సంగమింపు మనంత గంగా
    స్వామి యైన మహా శివున్ !

## 128

ఒకొక అడుగున కొకొక కిరణము
ఒకొక మజిలీ కొకొక దీపము
    చాలురా నీ బ్రతుకునకు, అది
    సర్వహిత సంహితయె అగుచో !
గ్రుడ్డి వానికి చూడ జాలదు
కోటి సూర్యుల కాంతి, అయినా-
    గ్రుడ్డి దీపమె చాలురా, శత
    కోటి సూర్యే శ్వరుని కనగా !

## 129

దీపమును ప్రేమించి, నీ వా
దీప గృహమును చేర వలెరా !
దీపరశ్మిని గలిసి, నీ వా
దీప గృహమును మరువ వలెరా !
ప్రణయ శాలీ ! నీవె అప్పుడు
ప్రకాశింతువు దీప కళవై !
అపుడు నిన్నే లక్ష్యముగ గొని
యాత్ర మలుచుకొనున్ జగాలు !

## 130

కాశి కేగ ప్రయాణ మగుచో
కాశి కేగుదు, వాగి పోదువు ;
మానసమ్మును చేర దలచిన
మానసముతో అలిసి పోదువు !
ఆశయమ్మును మించి ఒక అడు
గైన ముందుకు వేయలేవోయ్ !
అమృత జీవన యాత్రికుని కొక
అభవుడే భవుడే ధవుడురా !

## 131

ఎచట నుండి ప్రయాణ మైతివొ
అచటి కేసే తిరిగి చూడకు !
భూత జాలము నిన్ను ముందుకు
ప్రోత్సహించునొ లేదొ తెలియదు !
ఎందుకో ఎచటికో తెలిసి
ముందు ముందుకె సాగిపోవోయ్ !
ప్రకృతమే జీవితమురా ! తత్
సుకృతమే ప్రాభవమురా !

## 132

శివుడు శివుడే, శివుని తాండవ
సిద్ధమైన జగత్తు శివుడే ;
మిథ్య కాదోయ్ జగము, అది శివ
మేఘ జనిత శివా తటిల్లత !
చీకటిని వెలుగట్లు విశ్వము
శివునిలో లయమౌ, ప్రభవమౌ !
ముగ్ధ ముద్రవుగా జనించి
ముందు కేగగ జంక నేల ?

## 133

అవస్థాంతర మందు బ్రహ్మ ప
దార్థమే భాసించు ప్రకృతిగ,
బ్రహ్మ మెట్టి పదార్థమో
ప్రకృతి అట్టి పదార్థమే !
తనువు బాహ్యార్థమ్ము ప్రకృతిగ
తాండవించును ప్రకృతి పురుషుడు-
అర్ధ నారీశ్వరుడుగా !
ఐందవీ సుందరుడుగా !

## 134

భాసురమ్మగు ప్రకృతి నూతన
భావనను సృష్టించును,
భావనా ప్రాభావితమ్మై
ప్రకృతి పరివర్తించును ;
ప్రకృతి నిన్నును, నీవు ప్రకృతిని
ప్రగతిలో నడిపించు నపుడే
ప్రకృతె పార్వతి యౌనురా !
పరమ శివుడే నీవురా !

## 135

ఎవరి ప్రేమకు, సానుభూతికి
ఎదురు చూడకు మోయి నీవు !
    పరుల ప్రేమయు, సానుభూతియు
    బల విహీనుని జేయు నిన్ను !
నీవె ప్రేమింపుము జగమ్మును,
నీవె చూపుము సానుభూతిని !
    శివుడ వగుదువు నీవు, జగతికి
    శ్రేయ మిడుదువు అప్పుడే !

## 136

ప్రియతమా ! నీ హృదయమే ఒక
ప్రేమ పూర్ణ సుధాహ్రదమ్ము,
    సుధలతో లోకములు దున్ని
    సుఖములను పండించవోయీ !
ధరణి గుండెలు సాగు చేయుచు
తిరిగి చూడక నీవు సాగగ-
    నీ సుధాహ్రద మెపటి కప్పుడు
    నింపు చుండు మహేశుడు !

## 137

ఎచట సంపాదించు చున్నది
ఎర్ర తామర పూలు సరసి ?
కోకిల మ్మెట తెచ్చు చున్నది
లోక మోహన గీతుల ?
ప్రకృతి పురుషుల లీలగా నీ
ప్రాణములు వికసించి నప్పుడు
నీవె పూవు, నీవె ఫలము
నీవె ఆట, నీవె పాట !

## 138

కోకిలము వలె పాడుమోయీ !
కుసుమమై వికసించుమోయీ !
జీవితము నొక చైత్ర కలశము
జేసికొని మనవోయి ! సఖుడా !
ప్రేమ మధువును దాచుకొనకుము,
హృదయ కమలము మొగియ నీకుము !
ఎపుడు ప్రియ మధుపాయి వచ్చునో !
ఎపుడు నీపై వ్రాలునో !

## 139

కళయె సుమి ఏ జాతి కైనను
కాంతి నొసగే దివ్య శారద !
శ్రావ్య కంఠము కల్గు పికముకు
జగము సర్వము ప్రేమ మయమే !
కరకు నఖములు గ్రుచ్చు డేగకు
కాల మంతయు యుద్ధ రంగమె !
కళా హృదయము నందవోయ్ !
కాలమును నిర్జించవోయ్ !

## 140

శివ చరణమే విశ్వవేదిక,
శివ సరస్వతు లేక పాత్ర ;
భావ మతడు, విభావ సముదయ
జీవ లీలావతి సరస్వతి ;
శివ సరస్వతు లెవరొ కాదోయ్,
చిత్కళా నైపుణ్యమేనోయ్ !
ఏక పాత్రాభినయ మిది, సో
మేశ్వ రా కృతె లోకమోయ్ !

## 141

శివుడు – ఆతని శివమె శక్తి
శివుడు – ఆతని భవమె భక్తి
శివుడు – అతని రిరంసె రక్తి
శివుడు – అతని సుషుప్సె ముక్తి,
శక్తి రక్తుల, భక్తి ముక్తుల
సహజ కుశలతయే సరస్వతి !
అంబ సాక్షాత్కార యౌ నీ
ఆత్మ కృషి కౌశలము లోనే !

## 142

జగతి-దీపము కొలది కాంతి,
శక్తి కొలదీ ఆధిపత్యము,
కళగ హృదయము పరిణతమ్మగు
కొలది ఆనం దానుభూతి ;
భూతి దాలిచి ఘల్లు ఘల్లున
భూత తతి నాడించు శివుడు-
నీ స్వభావము విరియు కొలదీ
నీపె తానై ఆడును !

## 143

నీ మనోగత ప్రేమ విశ్వజ
నీనమై వికసించు కొలదీ,
అగ్ర సరమై తత్పరీమళ
మందుకొను విశ్వేశు డెందము ;
అపుడు తానే అగ్ర సరుడై
అవతరించును స్వామి నీలో !
సగము నీ వటు కేసి పోగా
సగము అత డిటు కేసి వచ్చు !

## 144

శివుడు లోక శివంకరుడు, ని
శ్రేయ సానంద స్వరూపుడు,
అతడు నీలో తనకు తానై
అవతరించుట సాధ్యమేనా ?
సాధ్య మేనోయ్ ! గాజు పెంకున
సౌర వహ్నులు సాధ్యమే నోయ్ !
వీణ మీటిన కళలు తిరిగి
వాణి జేరుట సాధ్యమే నోయ్ !

## 145

విరిసి, విశ్వ వ్యాప్తమై, నీ
వెలుగుతో దివిని లోగొందువా ?
మొగిచి, నీలో నీవెయ్యై, చి
న్ముద్రతో భువి నుద్ధరింతువా ?
పైకి క్రిందికి మార్గ మొకటే-
పైన మగు మెటొ, ఎక్కడో !
శివుడవై నీ వరిగెదో ?
శివుడె నీపై వచ్చెదో ?

## 146

వివశుడై తాండవము చేయుచు
శివుడు చిమ్మె వివిధ కళలే
విన్యసించును విశ్వములుగా,
సన్యసించును తిరిగి తనలో ;
రాత్రి పగలున, పగలు రాత్రిని
రహిత మగుచు గమించు జగ మిది !
సత్య మెరిగియు ఏల జీవిత
సరళి గని భీతిల్లెదు ?

## 147

గతము మృత, మది లక్ష్య మెన్నడు
కాదు చైతన్య స్రవంతికి ;
నిల్చి వెనుకకు చూచు టది ఒక
నిమిష మైనను వ్యర్థమే !
మదిని ముందుకు త్రోయు ఒత్తిడి
మాత్రమేనోయ్ గతము సతము !
ప్రగతి కాకర్షించునది ఒక
ప్రణయ దివ్య భవిష్యమే !

## 148

ప్రొద్దు పొడిచిన గాని నిద్రా
ముద్ర వీడవె ? సోమరీ !
మనసు విరిసిన రాజసమ్మో ?
మధువు త్రాగిన తామసమ్మో ?
సూర్య తిలకము తాల్చి లక్ష్మి
సుప్రభాతపు పళ్లెరములో
జీవ రసములు తెచ్చెరా !
భావ రంజని పాడెరా !

## 149

రాగమే ఉమ, దాని సౌంద
ర్య ప్రకాశనమే రమ !
పరము పురుషుని ప్రణయ విక్షే
ప క్రియా కళె జీవరాశి !
కళ కళగ దీపించు కారణ
కాలమే జీవుని యథేచ్ఛ !
స్వేచ్ఛ గల ఆ నిమిష మ్మైనా
శివుని జూచి తరించ వేలా ?

## 150

అయ్యయో ! జీవిత వసంతో
ద్యానమున గూర్చుండి, మధువులు
గ్రోల జాలక, ఎవడవోయీ ?
క్రుంకి యుంటివి అశ్రుజలముల ?
ఏ మనోరమ దూర మయ్యెనో ?
ఏ కళా రమ చేర దయ్యెనో ?
ఆత్మ ఆత్మను గలిసి లేదా ?
ఆత్మరతి కెడబాటు కలదా ?

## 151

పూల తోటకు చుట్టు నాటిన
ముళ్ల కంపలు పెచ్చు పెరిగి,
తామె తోటగ మారిపోయె !
తలిరు మొక్కలు మాయమయ్యె !
కంచె చేనును మేసి, ఠీవిగ
మంచెపై కూర్చున్న దొరా !
తోటమాలీ ! నిదుర లేవోయ్ !
తొల్లికను చేపట్టవోయ్ !

## 152

పూల మడిలో దూలగొండిని
పుడికి వేయక విడువ దగునా ?
తోటలో రక్కీస కంపల
దున్ని వేయుట మరువ దగునా ?
తోటమాలీ ! బద్ధకింతువొ ?
చేటు తెత్తువొ రమ్య సృష్టికి ?
చీడలను తొలగించి తోటకు
శ్రేయములు సమకూర్చవోయ్ !

## 153

నిష్పరిధి, నిష్కేంద్ర మిది, ఈ
నృత్య కేళీ రంగము !
కేంద్రమే నేనైన వేళ
చంద్రచూడుడ నేనె కానీ-
పరిధి నేనై నపుడు లోనికి
తెరువె కన్పడ దేమి చిత్రము !
ఇన్ని వెలుగుల నీడలతొ ఈ
సున్న చుట్టిన దెవ్వరో ?

## 154

సాగ వలసినదేన ఈ రా
క్షస దురాక్రమణం ? ప్రభూ ?
నరుని తలలో కుటిల నాట్యం
నడుపు అఘముల కాజ్జ లేదా ?
స్త్వైర తాండవ ధాటి సైనా
వైర ముద్రలు కలియవా ?
కాల కమనీ యాభినయమున
కలల మొగ్గలు విరియవా ?

## 155

అమావస్య తమస్సు వాకిట
సుమారామ మదృశ్య మైనది !
పాలకడలికి పైన మైనది
పూలతావుల అలల కదలిక !
కాలకంఠుని డమరులో కల
కంఠనాదము మూర్ఛ గొన్నది !
ఉమాపతి నిజ తాండవ కళా
రమను లోనికి లాగుకొనెనో !

## 156

నృత్య వేగము ముదిరి ముదిరి
నిబిడతమమై నిండె జగముల !
వేగ వశమున చుక్క చుక్కలు
గాగ శశికళ చెదరె మిన్నుల !
వేగ గతి స్తంభించె, భోగా
భోగరతి తమి నధిగమించె !
పారవశ్య స్థాయిలో ఆ
పాద మస్తము నేనె శివుడు !

## 157

నగ్న సౌందర్య కోణార్కుడు,
భగ్న మాధుర్య తాజ్మహలుడు,
చైత్ర వనిని, శ్మశానమును సమ
శక్తితో పోషించు నటుడు-
ఎవరి నే రూపమున వేయునో !
ఎవరి నే దీపమున తీయునో !
తనను తా నెరిగినది రక్తి !
తనను తా మరచినది ముక్తి !

## 158

రమ్య సంధ్యారాగ పద్మ ప
రాగ రంజిత పద సరోజా !
అందు కొమ్ము మదీయ సంధ్యా
వందన మ్మిదె, నాట్యరాజా !
పవలో, రేయో, జాగృతియొ, స్వ
ప్నమ్మొ తెలియని నీ మనోహర
నృత్య రమ కిదె పట్టితిని నా
హృదయ వేదిక, ఆడుకొనుమా !

## 159

నీ మహా సృజనోత్సవ కళా
రామకామన నెవరో నేను ?
మూలమో, కాండమో, ముల్లో ?
పువ్వో, మధువో, మధుపమో ?
నీ యడుగు వడిలోన పల్లెరు
కాయనో, మృదు తోయజమునో ?
సుస్వరమునో ? దుస్స్వరమునో ?
చోద్యములు ఈ అదృష్టములు !

## 160

వెనుక చీకటి, ముందు వెలుగుగ
వెడలు నదె అభ్యుదయ మార్గం !
వెలుగు ముందున్నంత సేపే
ఫలయుత మ్మగు జీవితం !
గమన గమ్యము లున్న నేను
గతము పై బ్రతకలే నోయీ !
నిత్య నవ నైపుణ్య శిఖ రా
దిత్య చేతన నొసగు మోయీ !

## 161

ఎంత కాలము, ఈశ్వరా ! నా
కీ పరీక్షలు ఎంత కాలం ?
గడ్డిలో పండుకొని, గోవుల
అడ్డగించెడి కాల్ల కుక్కలు-
విభుని గుడిలో చేరి, భక్తుల
వెలికి గొట్టెడి గబ్బిలాయలు-
మత్సర స్వార్థము లివన్నీ
మంట గలిసే దెపుడు ? దేవా !

## 162

తెలుసు లే వయ్యా, ప్రభూ ! నీ
వలపు వేడ్కల చిలిపి చేష్టలు !
మంచి చెడుగుల, కష్టసుఖముల
మర్మములు తెలుసు లేవయ్యా !
వెలుగు సరసను నీడ లేక
విలువె వెలుగుకు లేదటయ్యా ?
వెలుగు నీడల సరసమే ఈ
విశ్వ శృంగారము కదయ్యా !

## 163

సుఖము కల్గిన నాడు నిన్ను
సుందరేశ్వరు డని నుతింతు,
దుఃఖ మేదో కల్గి నప్పుడు
దుర్విధీ అని నింద చేతు !
భూషణమ్మను నాది నాకే,
దూషణమ్మను నాది నాకే !
శిల్పి ఇష్టము ననుసరించక
శిల్ప మేమిటి చేయ గలదు ?

## 164

లేదు కష్టము, లేదు సుఖము,
లేదు పాపము, లేదు పుణ్యము,
లేదు నరకము, లేదు స్వర్గము,
నీ దయామృత భూమిలో !
నీ విలాసము నుండి ఎగసి
నిన్ను చేరుటె జీవ ధర్మము !
పూర్ణ జీవిత మనగ నీలో
పూర్ణ వికసితమైన కళయే !

## 165

నాకు తెలియదె నన్ను గూర్చి
లోక మే మనుకొనుచు నున్నదొ ?
గుడ్ల గూబకు పగలు నేను !
కోకిలకు మధుమాస మేను !
ద్వేషముకు విషమంత్ర మేను !
ప్రేమముకు శ్రీకార మేను !
లోక మే మనుకొన్న నేమీ ?
నాకు నా మనసె నీవు !

## 166

అంధకారము కంటికే, ప్ర
త్యణువు తేజస్కాంత మేనోయ్ !
గాఢతిమిరం బనగ, కన్నులు
కాంచ లేని మహా ప్రకాశం !
కంటి వెలుపలి వెలుగు, దీపపు
కాంతి మాత్రమె అన్నచో-
కంటి లోపలి జ్యోతి, లక్ష్మీ
గాన భాస్వత్తాండవ కళే !

## 167

ప్రమిదె దీపము చేత బట్టుక
పరంజ్యోతిని వెదకు చుంటినె ?
అమృత సకలానంత జలధుల
అంగుటికి పడి పంచుకొందునె ?
పెర్రి వాడను కాను నేను !
విజయమును సాధించ గలను !
వెనుకనున్, ముందునున్ ఒకటే
వెలుగుపై నను నడుపుమా !

## 168

ఎన్ని పేరులు పెట్టినారో
ఈశ్వరా ! నీ కీ మనుష్యులు !
ఎంత వాదము పెంచుకొన్నా
రెంద రసువులు విడిరి నీకై !
భావ రాగ లయాన్వితముగ, వి
భావ సత్వరజ స్తమో రతి
మూడు పూటలు తమను తనిపే
మూర్తి దే పేరైన నేమో !

## 169

నీవె నే నని తెలుసు కోనా ?
నీవె నేనై మసలు కోనా ?
ఏల మరి నిను చేరు దారిలో
ఇన్ని బాధలు ? భయములు ?
మెరిసి కురిసే మృదు విలాసం
ఉరిమి తరిమే ఉగ్ర వర్తన
తప్పదా ? నీ నాట్య మింకను
తప్పటడుగులు దాట లేదా ?

## 170

సరస కళలో నీవు నింకా
సాధకుడ వేనా, ప్రభూ ?
కానిచో – ఈ దుర్విమర్శల
గ్లాని ఏమిటి సృష్టి కర్తకు ?
నీ కళా పరిపక్వ కేళి
నిపుణి కావలసిన మనుష్యుడు
విరసుడై, రసరాజ్య పథమున
విరథుడై పడియుండు టేలో ?

## 171

ప్రభుతలో అధికారికిని, సి
బ్బందికిని సంబంధ మేదో-
    నాకు, నా ఇంద్రియములకును
    నడుమ అదియే బంధము !
ఉభయులకు జీవనము ఆ పై
నుండియే లభియించు ! ఐనన్-
    నేనె ఈ విధి కంతకును యజ
    మానిగా గర్జింతును !

## 172

గొప్ప నా దేవుండు, నేను ను
గొప్పయే - అని విర్ర వీగుచు
    ఒకని దైవము నొకడు నిందిం
    చుకొను మనిషి మనీషియా ?
మనిషి మనిషికి మనసు వేరు !
మనసు మనసుకు మతము వేరు !
    అన్నియును నీ శిల్ప కళలే !
    అందరును నీ శిల్పులే !

## 173

జీవులా ? లక్షోపలక్షలు !
దేవుడా ? మాయా నటశ్రీ !
మనుజుడా ? నీ ఇష్ట శిల్పం !
మహిమలా ? నీ ఉలి చమక్కులు !
నీ వొసంగిన బొమ్మలన్ గొని
నేను ఆడుచు పాడు చుంటిని !
ఆట పాటల లోన నిన్నే
ఆద మరతునొ ! కోపగింతువొ !

## 174

అమ్మ ఇచ్చిన బొమ్మలను గొని
ఆట మున్గిన చంటి వాడు
ఆడుకొను చున్నంత సేపు
అమ్మ మాటే మరచిపోడా ?
ఆట తమిలో అమ్మ జోక్యము
నైన గాని సహించ గలడా ?
అంత మాత్రము చేత బొమ్మే
అమ్మ కంటెను గొప్ప దౌనా ?

## 175

ఆట పాటలు కలిసి వెలసిన
అర్ధనారీశ్వర విభూ !
ఉమను రమ నేకీకరించిన
ఉన్మనీ ప్రణయాత్మభూ !
ఆడుకొనుచున్నాడు మనుజుడు
అణువు లతుకుచు, చితుక గొట్టుచు !
ఆడుకోనీ వయ్య, పోనీ !
ఆత్మ కామన తీర్చుకోనీ !

## 176

జీవన పతీ ! జీవనములకు
భావనా తీరముల వెంట
స్వేచ్ఛగా విహరించు కంటే
విశ్రమించుటయే సుఖమ్మా ?
విశ్రమించి, సుషుప్తిగని, ని
ర్వి కల్పమ్మును పొందుటే ఆ
నందమా ? అట్లైనచో – ఈ
నందనమ్ముల కేది విలువ ?

## 177

రత్న మాణిక్య ప్రభలు, పూ
ర్ణ వైశాఖీ రాగ రసములు-
నను వరించిన అందములు, ఆ
నందములు బహు ముఖములు !
ప్రతి ముఖమ్మును నీ కళా కో
రకము విరిసిన కమలము !
ప్రతి కమలమును నీ దయా సా
రములు పొంగిన కలశము !

## 178

నృత్యమో, సంగీతమో, సా
హిత్యమో, ఆలేఖ్యమో-
ప్రతి కళయు నీ దీపమే, నీ
స్పందనకు ప్రతి రూపమే !
ప్రకృతి గల సర్వాత్మ సౌంద
ర్యములు నీ అర్థాంగ లక్ష్మిలె-
నీవె నేను, మనిద్దరము ఒక
త్రోవలో ఇరు కొసలము !

## 179

అభవునకు, భవునకును గల మ
ధ్య దూరమె మన మధ్య దూరము-
నీ కళా విన్యాస మీ కొస,
నీవు ఆ కొస-నృత్యగతిలో !
రెండు కొసలును కలిసినదె బ్ర
హ్మాండ వృత్తా వృత్త పరిధి !
పరిధిలో ప్రతి బిందువును మన
పరమ సంయోగ ప్రపత్తే !

•

## 180

తల్లి తండ్రి లేని వాడవు,
ఇల్లు వాకిలి లేని వాడవు,
రూపు రేఖలు లేని వాడవు,
రేపు మాపును లేని వాడవు-
లేని వాడవె అయిన గాని-
లేని వారికి ఉన్న వాడవు !
ఏ అభిధ నిను చూపగలదు ?
ఏ మహా ధ్వని పట్టగలదు ?

## 181

పూవుగా నిను దాల్చి, నే నొక
తీవనై నర్తింతు, దేవా !
భ్రమరముగ నిను బిల్చి, నే నొక
పద్మమై వికసింతునోయీ !
ఇష్టతకు నిను మలచుకొని, నా
ఇచ్ఛ కొలది రమింతు నిన్ను !
క్రియకు నే నేమైన, నీ కొర
కే సుమీ !

## 182

పైనమై, నీ మార్గ మందే
పడుచు లేచుచు వచ్చు చుంటిని !
పూవు దొరికిన నీ గురించే,
ముల్లు విరిగిన నీ గురించే !
ఎవరు నా కెదు రేగు దెంచిన
నీవ యని పూజింతు, దేవా !
ఎవరు నీ కెదు రేగు దెంచిన
నేనె యని కరుణించుమా !

## 183

అమృత మూర్తీ ! నీ విధమ్మున
ఆడు చుంటిని, పాడు చుంటిని,
దారిలో - నీ హృదయ బిందువు
చేరు లోపల - స్వేచ్ఛగా !
గజ్జె విప్పకు, కాంతి తీయకు,
గాన మాపకు బ్రతుకు పొడవున !
ఆటగా-ఒక పాటగా-నా
బాట నీతో చేరిపోనీ !

## 184

పువ్వు పువ్వున నీకు లేవో
పుణ్య పూజా మందిరమ్ములు ?
గొంతు గొంతున విరియవో వే
దాంత వేద్యుని రాగమాలలు ?
ప్రతి దరస్మిత రేఖ లోన
పరమ సుఖములు అలలు వేయవో ?
అన్నియును నీ రమతలే ! నా
ఆత్మ వీణా మమతలే !

## 185

పూవు పూవున దిద్దబడినది
దేవ ! నీ నట వేద వేదిక !
తీవ తీవను చూపబడినది
దేవ ! నీ ప్రణ యాంగ హారము !
త్రోవ త్రోవను మీటబడినది
దేవ ! నీ మధు జీవ వీణ !
భ్రమర డమరువు సొంజ్ఞగా, నీ
పాద సన్నిధి చేరినాను !

## 186

ఓం అనే ఒక నాదమే నా
ఉల్లమును ప్రాణించు చున్నది !
నాదలయు నిను గొల్వగా నా
నరము లన్నియు స్వరము లైనవి !
నేను నే నొక వీణనై నీ
నృత్త పదములు హత్తగా-
జగతియే నీ చుట్టు తా నొక
శంఖమై నిను మింటి కొత్తె !

## 187

ఎంత చక్కని దోయి, నీ వా
సంత నృత్య, ముమాపతీ !
పద్మ వేదిక నలిగి, పదముల
ప్రణయ కళలు పరీమళింప !
విశ్వ మోహిని తనువు ధనువై,
విరిసి రమ రాభీలు విసర !
మూల వీణయె మ్రోయ ! ఊర్ధ్వ
శ్రీలు రసవర్షములు కురియ !

## 188

ప్రణవ మూలై కైక నటరాట్ !
ప్రణయ లీలై కైక రసరాట్ !
ప్రాణ చాలన ఖేలన విరాట్ !
ప్రాణి దర్శన సూత్ర సమ్రాట్ !
కాలు కదుపుమ ! మువ్వ మెదుపుమ !
ఘల్లు ఘల్లున ఆడుమా !
మహియె కైలాసముగ విరియ !
మనుజుడే శివుడై ఫలింప !

## 189

సర్వ భావ రసావతారా !

సర్వ భవ చైతన్య ధారా !

సర్వ హృద యామోద భోగీ !

సర్వ ధర్మాద్వైత యోగీ !

ఉమయె రమగా, రమయె ఉమగా-

ఉర్వి సర్వానంద కళగా-

కాలు కదుపుమ ! మువ్వ మెదుపుమ !

ఘల్లు ఘల్లున ఆడుమా !

ఇతి శివమ్

❋ ❋ ❋

## డా॥ బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు

| | | | |
|---|---|---|---|
| 1. | సంపుటి 1 | - | గేయ కావ్యాలు : భాగం 1, 2 |
| 2. | సంపుటి 2 | - | పద్య కావ్యాలు : భాగం 1, 2 |
| 3. | సంపుటి 3 | - | వచన కవిత్వం : భాగం 1, 2 |
| 4. | సంపుటి 4 | - | వచనం |
| 5. | సంపుటి 5 | - | నాటకాలు : భాగం 1, 2 |
| 6. | సంపుటి 6 | - | Works of Boyi Bheemanna |
| 7. | సంపుటి 7 | - | భీమన్న అముద్రిత రచనలు |
| 8. | సంపుటి 8 | - | భీమన్న పీఠికలు : భాగం 1, 2 |

## ఇతర రచనలు:

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - శ్రీమతి హైమవతీ భీమన్న
2. భీమన్న సాహితీ షష్టి పూర్తి సంచిక - సంపాదకుడు: శ్రీ గనుమల జ్ఞానేశ్వర్
3. బోయి భీమన్న రచనలు - దళితదృక్పథం - (సదస్సు పత్రాలు)
4. బోయి భీమన్న నాటకాలు - సార్వజనీనత - (సదస్సు పత్రాలు)
5. బోయి భీమన్న సాహిత్యం - వర్తమాన సమాజానికి సందేశం (సదస్సు పత్రాలు)
6. బోయి భీమన్న రచనలు - కావ్యతత్వ వివేచన (సదస్సు పత్రాలు)